
'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 186


గురువారం 26-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'మీ ప్రదర్శన అద్భుతం'

చెస్ ఒలింపియాడ్‌లో తొలిసారి స్వర్ణ పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన భారత పురుషుల, మహిళల జట్ల సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. పతక విజేతలను ఆయన అభినందించారు. -14లో



కాంగ్రెస్ వస్తే విధ్వంసమే

కాంగ్రెస్ పార్టీ హరియాణాలో పొరపాటున అధికారంలోకి వస్తే విధ్వంసం తప్పదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు.
- వివరాలు 6లో



ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు

'బద్లాపూర్' ఘటనలో నిందితుడు అక్షయ్ షిండేను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడంపై బాంబే హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.
- వివరాలు 6లో



ఇజ్రాయెల్ దాడి.. 51 మంది మృతి

లెబనాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణుల దాడి మూడోరోజు బుధవారం కూడా కొనసాగింది. ఈ దాడుల్లో 51 మంది చనిపోయారు.
- వివరాలు 6లో



పారాసిటమాల్ నాసిరకం

పారాసిటమాల్ సహా దాదాపు 53 ఔషధాల నాణ్యత ప్రమాణాల మేరకు లేదని సీడీఎస్‌సీఓ ప్రకటించింది.
- వివరాలు 6లో

బాబు కుట్రకు పోలీసు వత్తాసు

వేధించి తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే కుతంత్రం

- లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో చంద్రబాబు పన్నాగం
- వీర విధేయ పోలీసు అధికారులతో 'సిట్'
- సిట్ ఏర్పాటు తర్వాత కూడా పోలీసులకు ఫిర్యాదు
- తమ కుట్రను ప్రశ్నిస్తున్న వారిని వేధించేందుకు బాబు వ్యూహం

27న తిరుమలకు జగన్

చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న ఆలయాల్లో పూజలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ పిలుపు

- వివరాలు 12లో

'కిమ్స్' బొల్లినేని కృష్ణయ్యపై క్రిమినల్ కేసు

- టీడీపీ నేతపై రెండో భార్య కృష్ణవేణి ఫిర్యాదు - 2లో
- కేసు హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ



ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో సీట్ల సంఖ్యకు అనుగుణంగా లేని ఫ్యాకల్టీ, సిబ్బంది

కొన్ని కాలేజీలు సగం మంది బోధనా సిబ్బందితోనే నడిపిస్తున్న వైనం

విద్యార్థులకు సదుపాయాల కల్పనలోనూ నిర్లక్ష్యం

ఫలితంగా రాణించని విద్యార్థులు

నేషనల్ మెడికల్ కమిషన్ తనిఖీల్లో బయటపడిన వాస్తవాలు

తనిఖీల్లో ఏం తేలింది..?

పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 50% వరకు అధ్యాపకులు లేరు. ఓ కాలేజీలో 50.47%, మరో కాలేజీలో 59.3% మేరకు కొరత ఉంది.

ఒక కాలేజీలో రెసిడెంట్లు, ట్యూటర్ల కొరత 66.31% వరకు ఉంది.

150 మంది విద్యార్థులుండే కాలేజీ అనుబంధ ఆసుపత్రిలో రోజూ 1,200 మంది ఓపీ ఉండాలి. ఒక చోట 849, మరో చోట 650 మందే వస్తున్నారు. ఓ కాలేజీ ఆసుపత్రిలో 650కి 542 పడకలే ఉన్నాయి.

రెండు కాలేజీల ఆసుపత్రుల్లో బెడ్ ఆక్యుపెన్సీ 9.38%, 11.97% చొప్పునే ఉంది.

పలుచోట్ల లెక్చర్ హాళ్లు, పరీక్షా కేంద్రాలు సరిపడా లేవు.

ఒకే ప్రొఫెసర్‌ను రెండు కాలేజీల్లో చూపించారు.

ప్రైవేట్ వైద్య 'మిథ్య'

అధ్యాపకులు లేరు.. సదుపాయాల్లేవు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. కొన్ని కళాశాలల్లో ఉండాల్సిన సంఖ్యలో సగం మంది కూడా లేరు. మరోవైపు విద్యార్థులకు అవసరమైన స్థాయిలో మౌలిక సదుపాయాలు కూడా లేవు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఇటీవలి తనిఖీల్లో ఈ అంశాలు బహిర్గతమయ్యాయి. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తగిన సంఖ్యలో లేకపోవడం, ల్యాబ్‌ల వంటి మౌలిక వసతుల కొరతతో అనేక ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో వైద్య విద్య అత్యంత నాసిరకంగా తయారవుతోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఆయా కాలేజీల్లో వైద్య విద్య పూర్తి చేసుకున్న చాలామంది తగిన సామర్థ్యం, నైపుణ్యం లేక వృత్తిలో రాణించలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండేళ్ల క్రితం మూడు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో లేనందుకు విద్యార్థుల అడ్మిషన్లను కమిషన్ రద్దు చేసింది. తర్వాత వారిని ఇతర కాలేజీల్లో సర్దుబాటు చేసింది. ఎన్ఎంసీ కఠిన చర్యలు తీసుకుంటున్నా, చాలా మెడికల్ కాలేజీలు ఇప్పటికీ అధ్యాపకులను నియమించుకోవడంలో, మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడే ఉంటున్నాయని, వైద్య విద్యపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆసక్తిని సొమ్ము చేసుకుంటున్న కాలేజీలు నాణ్యమైన విద్య అందించడంలో మాత్రం

మిగతా 2వ పేజీలో ▶

త్వరలో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ!



- మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సర్కారు కసరత్తు
- జాతీయ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఫ్యాకల్టీ ఉండేలా చర్యలు - 16లో

యువతకు నైపుణ్యమే లక్ష్యం

బీఎఫ్ఎస్ఐ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి

- గత పదేళ్లలో ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టలేదు
- ఉపాధి లేక కొందరు నిరుద్యోగులు డ్రగ్స్‌కు బానిసలుగా మారారు
- పట్టభద్రులు డ్రగ్ పెడ్లర్లుగా మారడం ఆందోళన కలిగిస్తోంది
- వారిని సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకే స్కిల్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువతను తయారు చేసి పరిశ్రమలకు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించామని వివరించారు. పరిశ్రమల డిమాండ్‌కు తగినట్టుగా అభ్యర్థులను తయారు చేసేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తుందని మిగతా 2వ పేజీలో ▶

హైడ్రా పేరుతో హైడ్రామాలు

రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?
- బుల్డోజర్లకు అడ్డం పడైనా పేదలకు న్యాయం చేస్తాం
- 'మూసీ' పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపారు



కూకట్‌పల్లి (హైదరాబాద్)/సాక్షి, హైదరాబాద్: హైడ్రా పేరుతో ప్రభుత్వం హైడ్రామాలు ఆడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు మండిపడ్డారు. సామాన్యులకు అన్యాయం జరిగే పక్షంలో బుల్డోజర్లకు అడ్డం పడన్నా న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆక్రమణలకు తప్పుడు అనుమతులు ఇచ్చింది కాంగ్రెస్ వారేనని చెప్పారు. బ్లాక్ లిస్టు అయిన పాకిస్తాన్ కంపెనీకి మూసీ సుందరీకరణ కాంట్రాక్టు ఇచ్చి భారీ కుంభకోణానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణానికి తెర లేపిన పెద్దల బాగోతాలను బయటకు తీస్తామని అన్నారు. బుధవారం ఫతేనగర్, ఖాజాకుంటలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను (ఎస్‌టీపీలు)

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

'ఆయిల్‌పాం' పనులను వేగవంతం చేయండి

గోద్రెజ్ బృందంతో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పాం ప్రాసెసింగ్ మిల్లు స్థాపన పనులను వేగవంతం చేయాలని 'గోద్రెజ్ ఇండస్ట్రీస్'గ్రూప్‌నకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విన్నవించారు. బుధవారం సచివాలయంలో మంత్రి తుమ్మలను గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్‌స్వామి, గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్ ఎండీ బలరాంసింగ్ యాదవ్, ఆయిల్‌పాం సీఈఓ సౌగత నియోగి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ సంవత్సరంలో కనీసం 15 వేల ఎకరాలకుపైగా పామాయిల్ సాగు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. తమ కంపెనీ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఖమ్మంలోని 6 మండలాలు, కొత్తగూడంలోని 4 మండలాలు, సంగారెడ్డి జిల్లాలో ఆయిల్‌పాం విస్తరణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 2023–24 వరకు 13,869 ఎకరాల్లో పామాయిల్ సాగు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో 9 వేల ఎకరాల సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1,800 ఎకరాల్లో సాగు చేపట్టినట్టు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

కవిత కేసులో సీబీఐ పిటిషన్‌పై విచారణ

అక్టోబర్ 4కు వాయిదా వేసిన రౌజ్ అవెన్యూ కోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు లో సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మరో నలుగురిపై అభియోగాలు మోపుతూ సీబీఐ జూన్ 7న సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. ఆ చార్జిషీట్‌ను జూలై 22న కోర్టు పరిగణనలోకి తీసుకోగా ప్రస్తుతం ఇరుపక్షాల వాదనలు జరుగుతున్నాయి. బుధవారం రౌజ్ అవె న్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా చార్జిషీట్‌పై విచారణ నిర్వహించారు. చార్జి షీట్‌లో పేజీలు సరిగా లేవని, కొన్ని పేజీలు అక్షరాలు కనిపించకుండా నల్లగా ఉన్నాయని, మరికొన్ని పేజీల్లో అక్షరాల సైజు చాలా చిన్న గా ఉందంటూ కవిత తరఫు న్యాయవాది మో హిత్‌రావు న్యాయమూర్తికి తెలిపారు. చార్జిషీట్ చదివేందుకు ఇబ్బందిగా ఉందని, సరిచేసి ఇచ్చేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. మోహిత్‌రావుతో ఏకీభవించిన న్యాయమూర్తి కావేరి బవేజా చార్జిషీట్‌ను సరైన పద్ధతిలో ఫైల్ చేసి కాపీని అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను అక్టోబర్ 4కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.

కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి కేటీఆర్.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తు న్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మంచి ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించి, మంచి పనులు చేస్తే ప్రజలు గుర్తిస్తారని బుధవారం ఒక ప్రకటనలో ఆయన హితవు పలికారు. కేటీఆర్ మాట్లాడే అమృత్ 2.0 కాంట్రాక్టు 2023 సెప్టెంబర్‌లో జరిగిందన్న విషయం తెలుసుకోవాలని సూచించారు.

'కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం'



నిర్మల్ చైన్‌గేట్: ప్రజలకు ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 30న రైతులతో కలిసి హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో రైతు హామీల సాధనకు 24 గంటలపాటు దీక్ష చేస్తామన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.



పాఠాలే కాలేదు.. పోటీ పరీక్షల శిక్షణా?



ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో నీట్, జేఈఈకి అదనపు తరగతులు తీసుకోవాలని ఆదేశం

అన్నిచోట్లా అధ్యాపకుల కొరత.. గెస్ట్ లెక్చరర్లకు లభించని మోక్షం

మ్యాథ్స్, సైన్స్‌లో కదలని సిలబస్

సాక్షి, హైదరాబాద్ : ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో నీట్, జేఈఈ, ఈఏపీసెట్‌పై ప్రత్యేక కోచింగ్ ఇవ్వనున్నారు. రోజువారీ క్లాసులు పూర్తయ్యాక పోటీ పరీక్షలపై శిక్షణ ఇవ్వాలంటూ అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లను విద్యాశాఖ తాజాగా ఆదేశించింది. వాస్తవానికి ఏటా కాలేజీకి కొంతమందిని ఎంపిక చేసి, జిల్లా కేంద్రంలో పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ఈసారి అన్ని ప్రభుత్వ కాలేజీల్లోనూ దీనిని అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 4,64,892 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులున్నారు. వీరిలో 2.85 లక్షల మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులుంటారు. వీరిలో 80 వేల మంది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్నారు. వీరంతా ఇంటర్ తర్వాత ఏదో ఒక పోటీ పరీక్ష రాయాల్సినవారే.

సిలబస్ పూర్తవ్వకుండా ఎలా?

రాష్ట్రవ్యాప్తంగా 422 ప్రభుత్వ ఇంటర్ కాలేజీలున్నాయి. ఇప్పటికీ ఈ కాలేజీల్లో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు కొనసాగుతున్నాయి. దాదాపు 120 కాలేజీల్లో ఇంటర్ సెకండియర్ పాఠాలు ఇంకా మొదలవ్వలేదు. ప్రతీచోట అధ్యాపకుల కొరత వేధిస్తోంది. 1,654 మంది అతిథి అధ్యాపకులతో ఏటా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈసారి గెస్ట్ లెక్చరర్లకు ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. రెగ్యులర్ అధ్యాపకుల్లో కొంతమందే సబ్జెక్టు లెక్చరర్లు. ఎక్కువమంది భాషాపండితులే ఉన్నారు. ఈ కారణంగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ క్లాసులు ఇంకా మొదలవ్వలేదు. గత ఏడాది నుంచి ఇంగ్లిష్‌లోనూ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. మొదటి నుంచి ఇంగ్లిష్‌లో మాట్లాడటం, సెమినార్లు నిర్వహించడం చేయాలి. ఇవి ఎక్కడా నిర్వహించడం లేదని విద్యార్థులు అంటున్నారు. సైన్స్ ప్రాక్టికల్స్ గురించి ఏ కాలేజీ పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ కాలేజీల్లో అసలు ప్రాక్టికల్స్ ఊసే ఉండటం లేదని, అలాంటప్పుడు ప్రభుత్వ కాలేజీలపై ఒత్తిడి పెంచలేమని అధ్యాపకులు అంటున్నారు. వాస్తవానికి దసరా నాటికి సగానికిపైగా సిలబస్, సంక్రాంతి నాటికి మొత్తం సిలబస్ పూర్తవ్వాలి. ఆ తర్వాత రివిజన్ చేయాలి. 220 కాలేజీల్లో ఇప్పటికీ ఒక్క చాప్టర్ కూడా మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో పూర్తవ్వలేదని ఇటీవల ఇంటర్ బోర్డు సమీక్షల్లో తేలినట్టు అధికారవర్గాల సమాచారం. గత ఏడాది ఫస్టియర్ సిలబస్‌ను హడావుడిగా పూర్తి చేశారని విద్యార్థులు చెబుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో తప్పలేదని అధ్యాపకులూ అంటున్నారు.

పోటీ పరీక్షలెలా..?

నవంబర్‌లో జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ వెలువడుతుంది. జనవరిలో తొలివిడత, ఏప్రిల్, మేలో రెండోవిడత మెయిన్ పరీక్షలు జరుగుతాయి. నీట్ కూడా ఏప్రిల్‌లోనే జరుగుతుంది. రాష్ట్ర ఇంజనీరింగ్ సెట్ కూడా మేలో చేపట్టొచ్చు. ఇంత వరకూ సిలబస్ పూర్తవ్వకపోవడంతో పోటీ పరీక్షలకు క్లాసులు నిర్వహించినా పెద్దగా ప్రయోజనం ఉండదని అధ్యాపకులు అంటున్నారు. పైగా ఇంటర్ బోర్డు నుంచి ఈనాటి వరకూ జేఈఈ, నీట్ పోటీ పరీక్షల మెటీరియల్ రాలేదు. ఇంటర్ సెకండియర్ సిలబస్ డిసెంబర్ నాటికి పూర్తయితే, ఇంటర్ పరీక్షలకు మాత్రమే విద్యార్థులు సన్నద్ధమవుతారని అధ్యాపకులు అంటున్నారు. పోటీ పరీక్షల కోసం కనీసం 90 రోజుల ప్రిపరేషన్ అవసరమని, పరీక్షల సమయంలో జేఈఈ, నీట్ సన్నద్ధత సాధ్యం కాదని చెబుతున్నారు. ఏదేమైనా ప్రణాళికాబద్ధంగా పోటీ పరీక్షలకు షెడ్యూల్ ఇచ్చి ఉండాల్సిందని అధ్యాపక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఒక్కసారిగా క్లాసులు పెంచడం వల్ల కూడా విద్యార్థులు ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉందని అధ్యాపకులు తెలిపారు.

బొల్లినేని కృష్ణయ్యపై క్రిమినల్ కేసు

టీడీపీ నేతపై రెండో భార్య కృష్ణవేణి ఫిర్యాదు

- మొదటి భార్యకు పిల్లలు పుట్టే అవకాశం లేదంటూ కృష్ణవేణితో పెళ్లి
- పిల్లలు పుట్టాక ఆమెను నిర్లక్ష్యం చేసిన బొల్లినేని
- కేసు హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ


కృష్ణయ్య


హేమ


ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: టీడీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్యే, కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్యపై క్రిమినల్ కేసు నమోదైంది. రెండో భార్యకు పుట్టిన సంతానం మొదటి భార్య, సమీప బంధువులకు జన్మించినట్లు నకిలీ పత్రాలు సృష్టించారన్నది ఆరోపణ. వీటి ఆధారంగా బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు కూడా తీసుకున్నారు. విషయం తెలుసుకున్న రెండో భార్య కృష్ణవేణి రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేశారు. బొల్లినేని కృష్ణయ్య, లోటస్ హాస్పిటల్ యజమానులు హేమ, ప్రసాద్‌లపై కేసు నమోదైంది. నేరం మొత్తం నగరంలో జరిగినట్లు దర్యాప్తులో తేలడంతో కేసును దర్యాప్తు నిమిత్తం హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. విశాఖపట్నానికి చెందిన కృష్ణవేణి 2003లో నాంపల్లిలోని మెడ్విన్ ఆస్పత్రిలో పనిచేస్తుండగా కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్‌గా ఉన్న కృష్ణయ్యతో పరిచయమైంది. తన భార్యకు పిల్లలు పుట్టే అవకాశం లేదంటూ కృష్ణవేణిని నమ్మించిన కృష్ణయ్య 2004 ఫిబ్రవరిలో ఆమెను వివాహం చేసుకొని బంజారాహిల్స్‌లో కాపురం పెట్టారు. కొన్ని రోజుల తర్వాత బంధువులకూ భార్యగా పరిచయం చేస్తానంటూ నమ్మబలికారు. వీరికి 2004లో కుమారుడు అర్జున్ జన్మించాడు. కృష్ణయ్య, కృష్ణవేణి తల్లిదండ్రులుగా బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నారు. 2006లో అనారోగ్య కారణాలు చెప్పిన కృష్ణయ్య తన కుమారుడిని తనతో తీసుకెళ్లారు.

తర్వాత ఇద్దరు కుమార్తెలు...

2006లో కృష్ణవేణి కుమార్తె కృష్ణ వైష్ణవికి జన్మనిచ్చింది. రెండేళ్ల తర్వాత వివిధ కారణాలు చెప్పిన కృష్ణయ్య వైష్ణవినీ తీసుకెళ్లిపోయారు. వీరికి 2011లో రెండో కుమార్తె శ్రీనిక పుట్టింది. ఆ తర్వాత నుంచి కృష్ణయ్య... కృష్ణవేణి వద్దకు రావడం మానేశారు. ఎన్నిసార్లు కోరినా అర్జున్, వైష్ణవిలను చూపించడానికి సుముఖత చూపలేదు. ప్రతి నెలా కృష్ణవేణికి నిర్ణీత మొత్తం చెల్లిస్తూ వచ్చారు. 2016లో ఆమెను ఖాజా గూడలో ఉన్న తన విల్లాలోకి మార్చారు. తనతోపాటు తన పిల్లల భవిష్యత్తుకు గ్యారంటీ ఇవ్వాలని కృష్ణవేణి కోరారు. దీంతో ఆయన వీళ్లు నివసిస్తున్న విల్లాను మాత్రం శ్రీనిక పేరుతో బదిలీ చేశారు. ఆ తర్వాత నుంచి కృష్ణవేణిని పట్టించుకోవడం మానేశారు. తన కుమారుడిని కలవడానికి అనేక ప్రయత్నాలు చేసిన కృష్ణవేణి ఎట్టకేలకు 2021లో కలవగలిగారు. ఆమె తన తల్లి అని తెలుసుకున్న అర్జున్ షాక్ అవడంతో పాటు తండ్రి కృష్ణయ్య తన మొదటి భార్యనే తన తల్లిగా నమ్మించినట్లు చెప్పాడు. ఈమె అర్జున్‌ను కలుస్తున్న విషయం తెలుసుకున్న కృష్ణయ్య మానుకోవాలని బెదిరించారు.

నకిలీ పత్రాలు సృష్టించి..

2022లో విదేశాలకు వెళ్లిన అర్జున్ ఇక్కడకు వచ్చినప్పుడు తల్లిని కలిసేవారు. ఓ సందర్భంలో వైష్ణవి తన సోదరి అని తల్లి కృష్ణవేణి ద్వారా తెలుసుకున్నాడు. ఆమె కృష్ణయ్య సమీప బంధువులైన హేమ, ప్రసాద్‌ల కుమార్తెగా పెరుగుతున్నట్లు చెప్పాడు. కృష్ణయ్య తదితరులు అర్జున్, వైష్ణవిలకు సంబంధించి కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ధ్రువీకరణలు పొందినట్లు కృష్ణవేణి గుర్తించారు. వీటి ఆధారంగానే బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు పొందినట్లు తెలుసుకున్నారు. ఈ ఆధారాలన్నీ పొందుపరుస్తూ రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసు కొట్టేయాలంటూ కృష్ణయ్య కోర్టుకు వెళ్లినా ఫలితం దక్కలేదు. తొలుత చీటింగ్, ఆపై అదనపు ఆధారాలతో ఫోర్జరీ కేసుగా మారింది.

ప్రైవేట్ వైద్య 'మిథ్య'

▶ మొదటి పేజీ తరువాయి

నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఏ కాలేజీ..ఎలా ఉండాలి: ఎంబీబీఎస్ సీట్లు 150 ఉన్న మెడికల్ కాలేజీలో 600 పడకలు ఉండాలి. 116 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 76 మంది రెసిడెంట్లు ఉండాలి. ఐదు పడకల ఐసీయూ, పీఐసీయూ వేర్వేరుగా ఉండాలి. ఫిజికల్ మెడికల్ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి. స్కిల్ లేబొరేటరీ ఉండాలి. ఇలా ఉన్న సీట్లను బట్టి బోధనా సిబ్బంది, వసతులు ఉండాలి. అన్ని మెడికల్ కాలేజీల్లో తప్పనిసరిగా ఆర్‌టీ-పీసీఆర్ పరీక్షలు చేసే లేబొరేటరీ ఉండాలి. లైబ్రరీలో 4,500 పుస్తకాలుండాలి. 100 సీట్లున్న మెడికల్ కాలేజీ అయితే 3 వేల పుస్తకాలు, 200 సీట్లుంటే 6 వేలు, 250 సీట్లయితే 7 వేల పుస్తకాలు ఉండాలి. లైబ్రరీ వైశాల్యం కూడా సీట్ల సంఖ్యకు అనుగుణంగా ఉండాలి. 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చదివే మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రికి రోజుకు 1,200 మంది ఔట్ పేషెంట్లు అవసరం. ఆ మేరకు తప్పనిసరిగా రోగులు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ చాలా కాలేజీలు వసతులు సరిగ్గా లేకుండానే, బోధనా సిబ్బంది తగిన సంఖ్యలో లేకుండానే నడుస్తున్నట్లు తేలింది.

తనిఖీల సమయంలో 'సర్దుబాట్లు'

రాష్ట్రంలో 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీలుండగా, కాగా, 4,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఈ కాలేజీల్లో మౌలిక వసతులు, అధ్యాపకులు, రోగుల వివరాలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. వసతులు లేవని విద్యార్థులు బయటకు చెప్పలేని పరిస్థితి ఉందని, ఒకవేళ అలా చెబితే, నిరసన వ్యక్తం చేస్తే ప్రాక్టికల్స్‌లో తక్కువ మార్కులు వేస్తారన్న భయం వారిలో ఉంటోందని చెబుతున్నారు. కాగా ఎన్‌ఎంసీ తనిఖీలకు వచ్చే సమయానికి కాలేజీలు సర్దుబాట్లు చేస్తున్నాయి. నకిలీ బోధనా సిబ్బందితో ప్రైవేటు యాజమాన్యాలు నెట్టుకొస్తున్నాయి. అనేక కాలేజీలు సింథటిక్ బయోమెట్రిక్ ద్వారా ఒకరికి బదులు మరొకరితో హాజరు నమోదు చేయిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

యువతకు నైపుణ్యమే లక్ష్యం

▶ మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. బుధవారం జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన 'బీఎఫ్ఎస్ఐ స్కిల్ డెవలప్‌మెంట్'కార్యక్రమ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. బీఎఫ్ఎస్ఐ వెబ్‌సైట్‌ను ప్రారంభించి, కోర్సులతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రేవంత్ ప్రసంగించారు. 'రాష్ట్రంలో ప్రతి విద్యా సంవత్సరం సగటున లక్ష మంది ఇంజనీర్లు, రెండు లక్షల మంది డిగ్రీ కోర్సులు పూర్తి చేసి పట్టా పొందుతున్నారు. పదేళ్లలో ముప్పై లక్షల మంది గ్రాడ్యుయేట్లుగా అర్హత సాధించినా, మెజార్టీ పిల్లలు ఇప్పటికీ ఉద్యోగాలు సాధించలేదు. ఇందుకు కారణం వారికి పరిజ్ఞానం ఉన్నా సరైన నైపుణ్యం లేకపోవడమే. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో నిరుద్యోగం పెరిగింది. మా ప్రభుత్వం ఈ అంశంపై చొరవ తీసుకుని వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకొచ్చింది..''అని రేవంత్ చెప్పారు.

డిమాండ్‌కు తగినట్టుగా..

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించి వాటి భర్తీకి చర్యలు వేగవంతం చేశామని సీఎం రేవంత్ చెప్పారు. 'ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేసినంత మాత్రాన నిరుద్యోగం తొలగిపోదు. ప్రైవేటు మార్కెట్‌లో డిమాండ్‌కు తగినట్టుగా అభ్యర్థులను తీర్చిదిద్దే బాధ్యతను స్కిల్ యూనివర్సిటీకి అప్పగించాం. ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలను ఈ వర్సిటీ పాలకమండలిలో భాగస్వామ్యం చేశాం. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఈ రంగంలో నైపుణ్యం ఉన్న అభ్యర్థుల తయారీ కోసం బీఎఫ్ఎస్ఐని సంప్రదించాం. బీఎఫ్ఎస్ఐ ఇచ్చిన ప్రతిపాదనలతో ఒక ప్రణాళిక రూపొందించాం. డిగ్రీ లేదా ఇంజనీరింగ్ పట్టా పొందేనాటికి విద్యార్థులకు నైపుణ్యాన్ని అందించేలా కోర్సును ప్రారంభించాం'అని తెలిపారు. పదివేల మంది అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి అవసరమైన నిధులను సీఎస్ఆర్ కింద పారిశ్రామికవేత్తలే సమకూర్చినందుకు అభినందిస్తున్నానని చెప్పారు.

ఫ్యాకల్టీ లేకుంటే కాలేజీల అనుమతులు రద్దు

కొన్ని వృత్తి విద్యా కాలేజీల్లో సరైన ఫ్యాకల్టీ లేకపోవడంతో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని సీఎం రేవంత్ చెప్పారు. 'ఇకపై పూర్తిస్థాయి ఫ్యాకల్టీ లేకుండా కాలేజీలను నిర్వహిస్తే అనుమతులు రద్దు చేసేందుకు వెనుకాడం. 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా అప్‌గ్రేడ్ చేశాం. వాటి ఆధునీకరణ కోసం టాటా సంస్థ ముందుకు రావడం శుభ పరిణామం. ఏటీసీల్లో శిక్షణ పొందిన వారికి పక్కాగా ఉద్యోగాలు కల్పిస్తాం. అదేవిధంగా బీఎఫ్ఎస్ఐ కోర్సులు అమలు చేస్తున్న 38 కాలేజీల్లో శిక్షణ పొందిన వారికి తప్పకుండా ఉద్యోగం ఇవ్వాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం''అని పేర్కొన్నారు.

కోర్సు ముగిసిన వెంటనే ఆరు నెలల ఇంటర్న్‌షిప్: మంత్రి శ్రీధర్‌బాబు

బీఎఫ్ఎస్ఐ కోర్సు ముగిసిన వెంటనే అభ్యర్థులకు ఆరు నెలలపాటు వివిధ సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇంటర్న్‌షిప్‌లో చూపిన నైపుణ్యానికి అనుగుణంగా వారికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని చెప్పారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఒక్కో అభ్యర్థికి కనిష్టంగా రూ.25 వేల వరకు వేతనం అందుతుందన్నారు. బీఎఫ్ఎస్ఐ కోర్సు నేర్చుకోవాలంటే బహిరంగ మార్కెట్లో వేల రూపాయలను ఫీజులుగా చెల్లించాల్సి ఉంటుందని.. రాష్ట్ర ప్రభుత్వం ఇక్విప్ సంస్థ సహకారంతో పదివేల మంది అభ్యర్థులకు ఉచితంగా కోర్సును అందిస్తోందని చెప్పారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఆ సంస్థ రూ.2.5 కోట్లు ఇచ్చినట్లు వెల్లడించారు. దేశంలోనే మొదటిసారిగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వమేనని చెప్పారు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, శ్రీధర్‌బాబు, మాజిద్, నరేందర్‌రెడ్డి, వెంకటేశం తదితరులు

డ్రగ్ పెడ్లర్లుగా మారడం ఆందోళనకరం

డ్రగ్స్ సంస్కృతి పెరగడం ఆందోళనకరమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 'రాష్ట్రం ఏర్పాటైన పదేళ్లలో ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టలేదు. ఉపాధి అవకాశాలు దక్కని కొందరు నిరుద్యోగులు మాదకద్రవ్యాలకు బానిసలయ్యారు. ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన పట్టభద్రులు కొంతమంది డ్రగ్ పెడ్లర్లుగా మారడం బాధాకరం. డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. నార్కోటిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేసులు, పట్టుబడుతున్నవారి సమాచారాన్ని వింటున్నప్పుడు ఎక్కువగా యువత ఉండటం కలిచివేస్తోంది..' అని సీఎం అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడంతోపాటు ఐటీకి డెస్టినీగా అభివృద్ధి చేస్తామని.. వచ్చే ఏడాది కాలంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ప్రపంచబ్యాంకు చైర్మన్ అజయ్‌బంగా, శంతను నారాయణన్, సత్య నాదెళ్ల, అజీమ్ ప్రేమ్‌జీ వంటి ప్రముఖులతో డిసెంబర్‌లో ప్రత్యేక సదస్సును హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కాగా.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాజిద్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఉన్నతాధికారులు బుర్రా వెంకటేశం, దేవసేన, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌కు కిమ్స్ రూ.కోటి విరాళం


సీఎం రేవంత్‌రెడ్డికి రూ.కోటి చెక్ ఇస్తున్న కిమ్స్ ఆస్పత్రి ఎండీ భాస్కర్‌రావు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధికి కిమ్స్ ఆస్పత్రి రూ.కోటి విరాళాన్ని అందజేసింది. ఆస్పత్రి ఎండీ భాస్కర్ రావు బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు.

సీఎంను కలిసిన చంద్రబోస్

సినీ గేయ రచయిత చంద్రబోస్ సచివాలయంలో సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటునాటు'గీతానికి ఆస్కార్ అవార్డును అందుకున్నందుకు సీఎం ఆయన్ను అభినందించారు.

పరువునష్టం కేసు విచారణకు గైర్హాజరైన సీఎం రేవంత్

తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా

హైదరాబాద్ సిటీ కోర్టులు: పరువు నష్టం కేసులో రెండు రూ.15 వేల పూచీకత్తులు సమర్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని నాంపల్లి కోర్టు ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై దాఖలైన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జరిగింది. రేవంత్ ముందస్తు సమావేశాలతో బిజీగా ఉన్నందున ఆయన కోర్టుకు రాలేకపోయారని సీఎం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో రెండు రూ.15 వేల పూచీకత్తులతోపాటు వ్యక్తిగత బాండ్‌ను తదుపరి విచారణలోగా కోర్టులో సమర్పించాలని సీఎం తరఫు న్యాయవాదిని నాంపల్లి కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 16కు వాయిదా వేసింది.

ఇదీ కేసు వివరాలు: లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా మే, 4న భద్రాద్రి కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ బహిరంగసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేశారు.

16న సీఎం హాజరుకావాల్సిందే

పార్లమెంట్ ఎన్నికలప్పుడు బీజేపీని, ప్రధాని మోదీని అప్రతిష్టపాలు చేసేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశించిందని బీజేపీ ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారం అంశాన్ని విడిచిపెట్టే ప్రసక్తేలేదన్నారు.

ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

అమెరికన్ కంపెనీలకు భట్టి విక్రమార్క పిలుపు

- హైదరాబాద్ పెట్టుబడులకు ఎంతో అనువైన ప్రాంతమని వెల్లడి


బీకేటీ టైర్స్ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రొనాల్డ్ రాస్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫోర్త్ సిటీ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పెట్టుబడులు పెట్టాలని అమెరికన్ పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. అమెరికాలోని లాస్ వేగాస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ గనుల సదస్సు (మైనెక్స్)–2024 సదస్సు సందర్భంగా బుధవారం పలు అమెరికన్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతమని, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోందని చెప్పారు. నగరంలో ఇప్పటికే ఉన్న అమెరికన్ కంపెనీలు ఎంతో సౌకర్యవంతంగా తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నాయని, ఇంకా వివిధ రంగాలకు చెందిన పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఖనిజ రంగ పరిశ్రమలకు విస్తృత అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని కోరారు. ఖనిజ నిక్షేపాల వెలికితీతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థకు క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

భారీ యంత్రాలతో 1900 కంపెనీల స్టాల్స్

నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ మైనెక్స్ ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 1,900 యంత్ర ఉత్పత్తి సంస్థలు తమ స్టాల్స్ ఏర్పాటు చేశాయి. భారీ మైనింగ్ తవ్వకాల యంత్రాలు, ఖనిజ రవాణా వాహనాలు, రక్షణ సేవలు, అనుబంధ యంత్ర విభాగాలను ప్రదర్శనకు ఉంచారు. కొమాట్సు, క్యాటర్ పిల్లర్, బీకేటీ టైర్స్ తదితర కంపెనీల స్టాల్స్‌ను భట్టి విక్రమార్క సందర్శించారు. అత్యాధునిక కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, లోడ్ హాల్ డంపర్లు, మైనింగ్ డోజర్లు, బ్లాస్ట్ హోల్ డ్రిల్స్, ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్, అత్యాధునిక టైర్లు, స్పేర్లను పరిశీలించారు. భట్టి వెంట ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ ఉన్నారు.

ఈనెల 27న ప్రవాసీ ప్రజావాణి

ప్రజాభవన్‌లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ప్రత్యేక కౌంటర్

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మికులు, ఎన్నారై కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27వ తేదీ నుంచి ప్రవాసీ ప్రజావాణి పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ డాక్టర్ బి.ఎం.వినోద్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఈ ప్రజావాణిని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమన్వయంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సమక్షంలో 'ప్రవాసీ ప్రజావాణి'కౌంటర్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ ప్రజావాణికి గల్ఫ్ కార్మికుల కుటుంబాలు, సంఘాల ప్రతినిధులందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణలో భాగంగా ప్రవాసుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఆ ప్రకటనలో వినోద్‌కుమార్ వెల్లడించారు.

మరో రెండ్రోజులు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతంలోని వాయవ్య బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం బలహీనపడింది. దీనికి అనుబంధ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ప్రస్తుత నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 71.73 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 94.82 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 32 శాతం అధికంగా నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ అధికారులు చెబుతున్నారు. ములుగు జిల్లాలో బుధవారం అత్యధికంగా 12.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో బుధవారం నమోదైన సగటు వర్షపాతం 1.42 సెంటీమీటర్లు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికంగా వర్షాలు కురిశాయి.

క్లుప్తంగా...

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి: ఎంపీ ఈటల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గతంలో పీసీసీ చీఫ్‌గా ఉన్నపుడు కేసీఆర్ సర్కార్ సర్పంచ్‌లను, పంచాయతీలను విస్మరిస్తోందని విమర్శించారని, అయితే అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌లను ఆదుకోలేదని విమర్శించారు. బిల్లులు రాక 60 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి, సీఎం అయ్యాక ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. బుధవారం ఈటల మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక మాజీ సర్పంచ్‌లతో పాటు గ్రామాల్లో పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లుగా తయారైందని మండిపడ్డారు. గతంలో పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి చెప్పిన మాట ప్రకారం.. మాజీసర్పంచ్‌లు ఎక్కడికక్కడ సీఎం, మంత్రులను అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

హరియాణాలోనూ మోసానికి కాంగ్రెస్ సిద్ధమైంది: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: హరియాణా ఎన్నికల్లో ఏడు గ్యారంటీల పేరుతో అక్కడి ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ విమర్శించారు. కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య పేదల భూములను కాజేయడంపై హైకోర్టు సైతం ఫిర్యాదును స్వీకరించినా... నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాల్సింది పోయి అవినీతిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కూడా మంత్రులు, ప్రభుత్వంలోని కొందరు తమంది పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు మోసపూరితమని, ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణలో కూడా అదే పరిస్థితి అని ఇప్పటికే స్పష్టమైందన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు అందాలని కోరుకున్న వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని పేర్కొన్నారు.

ప్రభుత్వ దౌర్జన్యాలు పెరిగాయి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ దౌర్జన్యాలు పెరిగిపోయాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు పెడుతున్న వారిని భవిష్యత్తులో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని మరుపల్లిలో దళితులైన పార్టీ కార్యకర్తలు నవీన్, ప్రవీణ్‌లపై స్థానిక ఎస్సై, ఇతర పోలీసులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. దాడికి గురైన బాధితులు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పార్టీ నేత శుభప్రద్ పటేల్‌తో కలసి బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పోలీసుల చేతిలో దాడికి గురైన బాధితులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ లీగల్ సెల్ ద్వారా బాధితులకు న్యాయపరమైన సాయం అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు వెళ్లి ఈ దాడిపై ఫిర్యాదు చేస్తామన్నారు. స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో జరిగిన ఘటనపై స్పీకర్, డీజీపీతో మాట్లాడుతానని కేటీఆర్ చెప్పారు.

'పార్ట్–బీ'పై ప్రత్యేక సదస్సులు!

- 18 లక్షల ఎకరాల్లో భూమి సమస్యల పరిష్కారానికి ధరణి కమిటీ సిఫారసు
- రెవెన్యూతో పాటు ఇతర శాఖల అధికారులతో కలిపి ప్రతి మండలంలో 2–3 కమిటీలు చేయాలి
- అసైన్డ్, ఇనాం, భూదాన్, వక్ఫ్, దేవాదాయ, అటవీ శాఖల భూములకు ప్రత్యేక కసరత్తు చేయాలి
- 32 కేటగిరీల్లో 13.38 లక్షలు, ఏ కారణం లేకుండా 5 లక్షల ఎకరాలు పార్ట్–బీలో పెట్టారని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను చిన్నచిన్న కారణాలు, కోర్టు కేసులు, ఆధార్‌కార్డు రికార్డుల ఆధారంగా పార్ట్–బీలో పెట్టారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో పార్ట్–బీలో చేరిన ఈ భూములకు ఇప్పటివరకు మోక్షం కలగలేదు. తమ పట్టా భూములను అకారణంగా పార్ట్–బీలో చేర్చారని, ఆ కేటగిరీ నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ సదరు భూముల యజమానులు కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. అసలు ధరణి పోర్టల్‌లోని ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలో చాలామందికి తెలియదు, తెలిసి కొందరు దరఖాస్తు చేసుకున్నా, సమస్య పరిష్కారం కాక, కొన్ని సందర్భాల్లో దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో పార్ట్–బీ భూములు రెవెన్యూ వర్గాలకు పెద్ద తలనొప్పిగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షలకు పైగా ఎకరాలు పార్ట్–బీలో ఉన్నాయని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ ఇచ్చిన నివేదికలో సిఫారసు చేసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రివర్గ సభ్యులందరికీ ఇచ్చిన ఈ నివేదికలో ప్రత్యేక కార్యాచరణను ప్రతిపాదించింది. ధరణి కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పార్ట్–బీ భూముల గురించి గణాంకాలతో సహా వివరించింది. ఏ కారణంతో ఎన్ని ఎకరాల భూమిని పార్ట్–బీలో చేర్చారో లెక్కలు వెల్లడించిన ధరణి కమిటీ ఎలాంటి కారణాలు లేకుండానే 5,07,091 ఎకరాల భూములను పార్ట్–బీలో పెట్టారని, ఈ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేసింది.

కమిటీ చేసిన సిఫారసులివే

- ➤ పార్ట్–బీ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ప్రతి మండలానికి 2–3 బృందాలు ఏర్పాటు చేయాలి. ➤ ఈ బృందాల్లో రెవెన్యూ సిబ్బందితో పాటు డీఆర్‌డీఏల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ సర్వేయర్లు, పారా లీగల్ కార్యకర్తలు, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులను నియమించి శిక్షణ ఇవ్వాలి.
- ➤ అవసరమైనప్పుడు అటవీ, దేవాదాయ, వక్ఫ్ శాఖల అధికారులను కూడా చేర్చాలి. ఈ బృందాలు క్షేత్రస్థాయికి వెళ్లి అన్ని వివరాలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలి. ➤ ఈ నివేదికల ప్రకారం సర్వే నంబర్ లేదా ఖాతానంబర్ వారీగా రైతులకు నోటీసులివ్వాలి. సేత్వార్, ఖాస్రా పహాణీ, సెస్లా పహాణీ, పాత పహాణీలు, 1బీ రిజిస్టర్, ధరణి పోర్టల్‌లోని వివరాలను పరిశీలించాలి. ఆ భూములు అసైన్డ్, ఇనాం, భూబదలాయింపు నిషేధ పట్టిక, భూదాన్, వక్ఫ్, దేవాదాయ, అటవీ భూముల జాబితాలో ఉన్నాయో లేవో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. ➤ గ్రామాల వారీగా పార్ట్–బీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక రెవెన్యూ సదస్సులు నిర్వహించి, అక్కడే తుది నిర్ణయం తీసుకోవాలి.

పార్ట్–బీ భూముల లెక్కలివే

కారణం	విస్తీర్ణం (ఎకరాల్లో)	కారణం	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఆధార్ ఉన్నా బయోమెట్రిక్ వీలుకానివి	24,942	వారసత్వ వివాదాలు	29,651
ఆధార్‌లో తప్పులు	29,712	ఎల్‌టీఆర్ కేసులు	31,155
ఆధార్ వివరాలు ఇవ్వనివి	2,59,515	పీవోటీ కేసులు	78,543
ఆధార్ లేనివి	28,392	పీవోటీ–5 కిలోమీటర్ల నిషేధం	8,789
విస్తీర్ణంలో తేడాలు	49,328	రెవెన్యూ కోర్టు కేసులు	27,880
పరిష్కారం కాని ఇనాం	14,619	సాదాబైనామా	1,04,859
భూదాన్ భూములు	2,987	విక్రయాలు జరిగిన భూములు	1,37,475
వక్ఫ్ భూములు	9,632	కల్పిత సర్వే నంబర్లు	47,172
దేవాదాయ భూములు	15,994	నానావిధ ఖాతాలు	4,439
అటవీ భూములు	34,612	సర్వే నంబర్ల అతివ్యాప్తి	8,769
అటవీ–రెవెన్యూ వివాదాలు	21,673	సర్వేనంబర్ పూర్తిగా నాలా అయిన భూములు	1,38,139
ప్రభుత్వ భూములు	93,308	పాక్షిక నాలా మార్పిడి భూములు	45,694
సర్వే నంబర్ పూర్తిగా ఉన్న ప్రభుత్వ భూములు	8,018	నాలా మార్పిడి తర్వాత కొంత వ్యవసాయమున్న భూములు	7,054
సర్వే నంబర్‌లో పాక్షికంగా ఉన్న ప్రభుత్వ భూములు	4,381	ఎవరూ క్లెయిమ్ చేయని బ్యాలెన్స్ భూములు	11,516
భూసేకరణ పూర్తిగా జరిపిన సర్వే నంబర్లు	4,447	కారణాలేవీ చెప్పకుండానే పార్ట్–బీలో పెట్టినవి	5,07,091
భూసేకరణ పాక్షికంగా జరిపిన సర్వే నంబర్లు	1,822		
శివాయి జమేదార్	16,879		
సివిల్ కోర్టు కేసులు	34,755		

ఈ టర్మ్‌లోనే అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.27,500 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకూ సాగు నీరందించలేదు : మంత్రి ఉత్తమ్
- మరోమంత్రి జూపల్లితో కలిసి పాలమూరు ప్రాజెక్టుల సందర్శన



ఉదండాపూర్ హెలిప్యాడ్ వద్ద బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఉత్తమ్, జూపల్లి. చిత్రంలో చిన్నారెడ్డి, అనిరుధ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లురవి తదితరులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'దశాబ్దాల తరబడి కరువు, వలసల జిల్లాగా ఖ్యాతికెక్కిన ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీడు భూములకు సాగు నీరందించి సస్యశ్యామలం చేస్తాం. ఇదే శాసనసభ కాలంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు జిల్లాలోని కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను సంపూర్ణంగా పూర్తిచేసి సాగు నీరందిస్తాం'అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు–రంగారెడ్డితోపాటు పలు ప్రాజెక్టులను మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం నాగర్‌కర్నూల్‌లోని కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని భావించినట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ పెద్ద మనిషి ఇటీవల పాలమూరు ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామని గొప్పలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రూ.27,500 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకూ సాగు నీరివ్వలేక పోయారన్నారు. ఈ ప్రాజెక్టును నూటికి నూరు శాతం పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగు నీరందించే విధంగా చిత్తశుద్ధితో ముందుకెళుతున్నామని చెప్పారు. రెండు నెలలకోసారి ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

కృష్ణా నీటిని ఇప్పటికీ వినియోగించుకోలేక పోతున్నాం..: జూపల్లి

కృష్ణా నీటి కేటాయింపులున్నా, వాటిని ఇప్పటికీ వినియోగించుకోలేక పోతున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 18 టీఎంసీల కృష్ణా నీటిని వాడుకోవాల్సి ఉండగా, ఇప్పటిదాకా కేవలం ఆరు టీఎంసీల నీటిని మాత్రమే వాడుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాగా తమ సమస్యలను విన్నవించుకునేందుకు వస్తే.. తమకు అవకాశం ఇవ్వలేదంటూ ఉదండాపూర్ నిర్వాసితులతోపాటు కానాయపల్లి నిర్వాసితులు మంత్రులు వెళ్లిన తర్వాత అసంతృప్తి వ్యక్తం చేస్తూ విమర్శలు గుప్పించారు.

నేడు తమిళనాడుకు బీఆర్‌ఎస్ బీసీ నేతలు

- 25 మంది ప్రతినిధులు.. రెండు రోజుల పర్యటన
- బీసీ రిజర్వేషన్ల అమలు తీరుతెన్నులపై అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ల అమలు తీరును అధ్యయనం చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రతినిధి బృందం రెండు రోజుల తమిళనాడు పర్యటనకు వెళుతోంది. శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత ఎస్.మధుసూదనాచారి నేతృత్వంలో 25 మంది సభ్యులతో కూడిన ఈ ప్రతినిధి బృందం గురువారం ఉదయం ఆరు గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి ఉదయం 8 గంటలకు చెన్నైకి చేరుకుంటుంది. ఉదయం 10 గంటలకు తమిళనాడు బీసీ సంక్షేమశాఖ మంత్రితో సచివాలయంలో బీఆర్‌ఎస్ బీసీ నేతల ప్రతినిధి బృందం భేటీ అవుతుంది. మధ్యాహ్నం తమిళనాడు బీసీ కమిషన్‌తోనూ బీఆర్‌ఎస్ నేతలు సమావేశమవుతారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలవుతున్న తీరు, గతంలో ఈ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు జరిగిన ప్రయత్నాలు తదితరాలపై చర్చిస్తారు. తమిళనాడు ప్రభుత్వం బీసీ సామాజిక వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల తీరుతెన్నులను కూడా ఈ బృందం అధ్యయనం చేస్తుంది.

➤ రెండోరోజు పర్యటనలో భాగంగా చెన్నైలోని డీఎంకే కార్యాలయం 'అన్నా అరివాలయం'ను శుక్రవారం బీఆర్‌ఎస్ బీసీ నేతల ప్రతినిధి బృందం సందర్శిస్తుంది. డీఎంకే పార్టీ సంస్థాగత నిర్మాణం, అందులో అంతర్గతంగా సామాజిక న్యాయం వంటి అంశాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. డీఎంకే కార్యాలయంలోనే బీసీ నేతలకు మధ్యాహ్న భోజనం చేసి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. ఈ బృందం తన నివేదికను పార్టీ అధినేత కేసీఆర్‌కు సమర్పించనుంది. ఇదిలా ఉంటే నవంబర్ పదో తేదీలోగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై స్పందించకుంటే అనుసరించాల్సిన ఉద్యమ కార్యాచరణపైనా నిర్ణయం తీసుకుంటారు.

తొలిరోజు 285 దరఖాస్తులు... 30 పరిష్కారం

గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం ప్రారంభం

- ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు తీసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్‌లకు ఫోన్లు చేసి పలు సమస్యల పరిష్కారం
- మంత్రులతో ముఖాముఖి నిరంతరం ఉంటుంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



గాంధీభవన్‌లో వినతులు స్వీకరిస్తున్న దామోదర రాజనర్సింహ. చిత్రంలో మహేశ్ గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: పార్టీ కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం 'మంత్రులతో ముఖాముఖి'కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమానికి హాజరైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజల నుంచి 4 గంటల పాటు దరఖాస్తులు తీసుకున్నారు. దాదాపు 285 దరఖాస్తులు రాగా, అందులో 30కి పైగా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. ఇందుకోసం బాధితుల సమక్షంలోనే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతోపాటు పోలీస్ స్టేషన్లకు ఫోన్లు చేసిన దామోదర.. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్యంగా 317 జీవో కారణంగా ఇబ్బందులు పడుతున్న గురుకుల ఉపాధ్యాయులు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు వచ్చి తమ అర్జీలను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు కావాలని, వ్యక్తిగత ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని, రేషన్‌కార్డులు కావాలని, ఉపాధి కల్పించాలని, చిన్నారుల ఆరోగ్య సమస్యలకు సాయం చేయాలని, 108 సిబ్బందికి ఏఎన్ఎం ఉద్యోగ నోటిఫికేషన్లలో వెయిటేజీ ఇవ్వాలని కోరుతూ పలువురు దరఖాస్తులు సమర్పించారు. గత పదేళ్లలో తమపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయించాలని మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. తొలిరోజు వచ్చిన దరఖాస్తులన్నింటినీ కంప్యూటరీకరించామని, ఎప్పటికప్పుడు ఈ సమస్యల పరిష్కార దశలను తెలుసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెప్పాయి.

అద్భుత ఆలోచన: మంత్రి దామోదర

గాంధీభవన్‌లో ప్రజావాణి చేపట్టడం అద్భుతమైన ఆలోచన అని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజల సమస్యలను పరిష్కరించే మాట అటుంచితే కనీసం వారి గోడు వినేవారు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు తాము ప్రజల సమస్యలు విని పరిష్కరించే దిశలో అడుగులు వేస్తున్నామని చెప్పారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆయా శాఖలకు పంపుతామని, వీలున్న దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీకి ప్రజలు, కార్యకర్తలంటే ఎంతో గౌరవమని, అందుకే వారి సమస్యల పరిష్కారం కోసం గాంధీభవన్‌లో ప్రజావాణి లాంటి కార్యక్రమాన్ని చేపట్టామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. వారంలో రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చి ప్రజలు, కార్యకర్తలతో మమేకమవుతారని, వారి సమస్యలపై అర్జీలు తీసుకుంటారని చెప్పారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ అని ఆయన కార్యక్రమ ప్రారంభ సభలో చెప్పారు.

హైడ్రా పేరుతో హైడ్రామాలు



ఫతేనగర్, ఖాజీకుంట వద్ద నిర్మించిన ఎస్టీపీలను పరిశీలిస్తున్న కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

కోర్టులను అపహాస్యం చేస్తున్నారు

'హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదలకు ఓ న్యాయం, పెద్దలకు ఓ న్యాయం జరుగుతోంది. వేదశ్రీ అనే ఏడేళ్ల పాప తన పాఠ్య పుస్తకాలు తీసుకోవటానికి కూడా సమయం ఇవ్వకుండా ఇల్లు కూల్చివేశారు. కస్తూరి అనే మహిళ చెప్పుల దుకాణాన్ని కూడా కూల్చివేశారు. కోర్టు సెలవు దినాన కావాలని ఉదయమే వచ్చి అభాగ్యుల ఇళ్లను కూల్చివేస్తూ కోర్టులను అపహాస్యం చేస్తున్నారు. బఫర్ జోన్‌లో అనుమతులు ఇచ్చిన వారిని వదిలేసి, పేదల ఇళ్లను కూల్చివేయటం ఎంతవరకు సబబు? తమ ప్రభుత్వ హయాంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మించి ఇచ్చాం. మీకు చిత్తశుద్ధి ఉంటే పేదవారికి ఇళ్లు నిర్మించి ఇవ్వండి. మీ దౌర్జన్యాలను, దాష్టీకాలను ఇలాగే కొనసాగిస్తే ప్రజలు బుద్ధి చెబుతారు.

మీ ఫాంహౌస్‌ల వీడియోలు బయటపెడతాం

జీహెచ్‌ఎంసీ, హైడ్రా ఆఫీసు, నీ అన్న ఇళ్లు బఫర్ జోన్‌లోనే ఉన్నాయి. మీ మంత్రుల ఫాంహౌస్‌లు కూడా బఫర్ జోన్‌లోనే ఉన్నాయి. అవసరమైతే ఫాంహౌస్‌ల వీడియోలు బయట పెడతాం. ముందు వాటిని కూలగొట్టి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో రియల్ ఎస్టేట్ వ్యాపారం 42 శాతానికి పడిపోయింది. ఎంతోమంది కార్మికులు ఉపాధి దొరకక ఖాళీగా ఉంటున్నారు. హైడ్రా బాధితులందరికీ మేం అండగా ఉంటాం. ప్రజలు తెలంగాణ భవన్‌కు కూడా వచ్చి ఫిర్యాదులు ఇవ్వొచ్చు..'అని కేటీఆర్ తెలిపారు.

కేసీఆర్ సంకల్పం తీసుకుని 'మురుగునీటి' పనులు పూర్తి చేశారు

'మా ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నాలాల పరిరక్షణతో పాటు రూ.4 వేల కోట్లతో 31 ఎస్టీపీలను నిర్మించాం. కేవలం కూకట్‌పల్లిలో నియోజకవర్గంలోనే రూ.350 కోట్లు ఖర్చు పెట్టాం. దక్షిణాసియాలోనే 100% మురుగునీటి శుద్ధి నగరంగా హైదరాబాద్ చరిత్ర సృష్టించబోతోంది. కేసీఆర్ సంకల్పం తీసుకుని ఈ పనులు పూర్తి చేశారు. గత 10 నెలల్లో ఈ ప్రభుత్వం ఏ ఒక్క మంచి పని కూడా చేపట్టలేదు..'అని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ ప్రజలు సంపూర్ణ ఆశీర్వాదం ఇచ్చి బీఆర్‌ఎస్‌ను గెలిపించినందుకు వారికి రుణపడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మనం సంధికాలంలో ఉన్నాం

మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకోవాలి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ఉద్యమ పార్టీగా అనేక ఆటుపోట్లు ఎదుర్కొని తెలంగాణ సాధించిన మనం ఇప్పుడు సంధి కాలంలో ఉన్నాం. 14 ఏళ్లు ఉద్యమ పార్టీ, పదేళ్లు అధికార పార్టీగా ఉన్న మనం ఇప్పుడు పోషిస్తున్న ప్రతిపక్ష పాత్ర కొత్తది. ఈ సమయంలో పార్టీని బలోపేతం చేసుకోవాలి. గాడిద ఉంటేనే గుర్రం విలువ తెలుస్తుంది అన్నట్లు చిట్టి నాయుడు (రేవంత్‌రెడ్డి) ఉంటేనే కేసీఆర్ విలువ తెలుస్తుంది. ఈ ప్రభుత్వం తీరు చూసి మళ్లీ కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. మళ్లీ నాలుగేళ్లలో కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకోవాలి..'అని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు.

స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థిగా రాజయ్య..

'తమిళనాడులో డీఎంకే పార్టీ 76 ఏళ్లుగా రాజకీయాలను శాసిస్తోంది. 24 ఏళ్ల మన పార్టీ మరో వందేళ్ల పాటు దృఢంగా ఉండేలా పార్టీ నిర్మాణంపై దృష్టి పెడదాం. శిక్షణ శిబిరాలు ఏర్పాటుతో పాటు గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకుందాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం షాడో గవర్నమెంట్ మాదిరిగా పనిచేసేందుకు కమిటీలు వేస్తాం' అని చెప్పారు. 'కొందరు పెద్ద నాయకులు పదవులు అనుభవించి పార్టీని వదిలివెళ్లారు. ఫిరాయింపులపై నెలలోగా నిర్ణయం తీసుకోవాలనే కోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది. స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థిగా మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యను నిలబెడతాం..'అని కేటీఆర్ ప్రకటించారు.

మంత్రుల అరాచకాలను ఎండగడదాం..

ఉమ్మడి నల్లగొండ నుంచి మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డిల అరాచకాలను ఎండగడతా మని కేటీఆర్ అన్నారు. బుధవారం ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రుల ఆధ్వర్యంలో పార్టీ నేతలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పార్టీ నేతలు చెప్పారు. 'జిల్లా మంత్రులు అహంకారంతో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. వారి అవినీతి, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా నియోజకవర్గాల్లో పర్యటిద్దాం' అని చెప్పారు.



మిమ్మల్ని మెరుగుపరిచేవారి సాంగత్యంలో ఉండండి.
– సెనెకా

సాక్షి
గురువారం, 26 సెప్టెంబర్ 2024

బాలలకు సుప్రీమ్ రక్షణ!

భారత సర్వోన్నత న్యాయస్థానం సోమవారం చరిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. మద్రాస్ హైకోర్ట్ గతంలో చేసిన తప్పును సరిదిద్దింది. బాలలపై లైంగిక అకృత్య, అశ్లీల దృశ్యాల వీడియోలను డౌన్‌లోడ్ చేసినా, కలిగివున్నా, చివరకు చూసినా, సదరు అంశాలపై నిర్ణీత అధికారులకు ఫిర్యాదు చేయకున్నా కూడా పోక్సో, ఐటీ చట్టాల కింద నేరమేనని కుండబద్దలు కొట్టింది. దాదాపు 200 పేజీల తాజా తీర్పుతో బాలలపై లైంగిక అత్యాచారాలను నిరోధించేలా 'లైంగిక అకృత్యాల నుంచి బాలలకు రక్షణ' (పోక్సో) చట్టానికి పదును పెట్టింది. పసిపాపల నుంచి ఎదిగిన మైనర్ల వరకు బాలలందరి పైనా దేశంలో అంతకంతకూ అఘాయిత్యాలు పెరుగుతున్న వేళ రానున్న రోజుల్లో ఈ తీర్పు బలమైన ప్రభావం చూపనుంది. ఇంటా బయటా ప్రతిచోటా కామాంధుల బెడద పెచ్చరిల్లిన సమయంలో ఈ సుప్రీమ్ తీర్పు భారతదేశంలోని బాలబాలికలకు భారీ ఊరట, బలమైన అండ.

తాజా సుప్రీమ్ కోర్ట్ ఆదేశంతో చైల్డ్ పోర్నోగ్రఫీ సమాచారాన్ని 'కలిగి ఉండడం' అనే పదం తాలూకు నిర్వచన పరిధి పెరిగింది. అలాంటి దృశ్యాలను డౌన్‌లోడ్ చేయకున్నా, పరికరంలో పదిలపరుచుకోకపోయినా... కేవలం చూసినా సరే ఇప్పుడది పోక్సోలోని సెక్షన్ 15 కింద నేరమే అవుతుంది. ఇది కేవలం సాంకేతికపరమైన అంశం కానే కాదు... తీవ్రమైన నేరం. నిజానికి, చైల్డ్ పోర్న్ దృశ్యాల తయారీ, పంపిణీయే నేరమనీ, ఎలక్ట్రానిక్ పరికరాల్లో డౌన్‌లోడ్ చేసి ప్రైవేటుగా చూసినంత మాత్రాన అది నేరం కిందకు రాదనీ ఆ మధ్య మద్రాస్ హైకోర్ట్ తీర్పునిచ్చింది. మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసి చూసిన ఓ చెన్నై కుర్రాడిపై నేర విచారణను జనవరి 11న రద్దు చేసింది. దీని వల్ల బాలల సంక్షేమంపై దుష్ప్రభావం పడుతుందని తప్పుబడుతూ వివిధ స్వచ్ఛంద సంస్థల సమాహారమైన 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' సుప్రీమ్ గడప తొక్కింది. సింగిల్ జడ్జి ఇచ్చిన సదరు తీర్పు 'ఘోరమైనది' అంటూ మార్చిలోనే సుప్రీమ్ తప్పుబట్టింది. మద్రాస్ హైకోర్ట్ తీర్పు 'అసాధారణ తప్పు' అని సుప్రీమ్ తన తాజా ఆదేశంలో వ్యాఖ్యానించడం గమనార్హం.

సుప్రీమ్ తన తాజా ఆదేశంతో ఆ పాత మద్రాస్ హైకోర్ట్ తీర్పును తోసిపుచ్చినట్టయింది. అదే సమయంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదం నేరాన్ని తేలిక చేస్తున్నట్టు ఉందని భావించింది. ఆ పదాన్ని పరిహరించి, దాని బదులు 'బాలలపై లైంగిక అకృత్యాలు, దాడుల సమాచారం' (సీఎస్ఈఏఎమ్) అనే పదాన్ని సంబంధిత చట్టాలన్నిటిలో వాడేలా పార్లమెంట్ ఆర్డినెన్స్ తీసుకురావాలని అభ్యర్థించడం విశేషం. ఇకపై న్యాయస్థానాలన్నీ తమ ఆదేశాలు, తీర్పుల్లో ఈ పదాన్నే వాడాలని కూడా సుప్రీమ్ పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, మరో న్యాయమూర్తి జస్టిస్ పార్దీవాలాలతో కూడిన సుప్రీమ్ ధర్మాసనం ఇచ్చిన ఆదేశం, చేసిన అభ్యర్థన ఆలోచించదగినది, స్వాగతించవలసినది. గమనిస్తే, సమస్యంతా చట్టాలలోని అంశాలకు కొన్ని కోర్టులు సంకుచిత అంతరార్థాలు తీయడంతో వస్తోంది. మద్రాస్ హైకోర్ట్‌లోనూ జరిగింది అదే. తద్వారా బాలలపై సైబర్ నేరాలకు పాల్పడినవారిని శిక్షించడానికి ఉద్దేశించిన చట్టాల ప్రయోజనమే దెబ్బతింటోంది. అందుకే, ఈ విషయంలో కోర్టులు జాగరూకతతో ఉండాలని సుప్రీమ్ ఇప్పుడు చెప్పాల్సి వచ్చింది.

గణాంకాలు గమనిస్తే, దేశంలో బాలలపై అకృత్యాలు అంతకంతకూ అధికమవుతున్నాయి. ఒక్క 2022లోనే వాటి సంఖ్య 8.7 శాతం పెరిగింది. అలాంటి ఘటనలు 1.68 లక్షలకు చేరినట్టు జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్సీఆర్బీ) మాట. పసివారిపై అఘాయిత్యాలు జరిగినప్పటికీ భయం, సమాజంలో పడే కళంకం, అవగాహన లేమితో ఇంకా అనేక కేసులు వెలుగులోకి రావట్లేదు. పైగా, ఇంట్లో అయినవాళ్ళు, బడిలో ఉద్యోగులు సైతం సాగిస్తున్న ఈ అమానుషాలు పిల్లల మనసులపై జీవితాంతం ప్రభావం చూపుతున్నాయి. పెరిగి పెద్దయినా సరే వారిని ఆ చేదు అనుభవాల నుంచి మానసికంగా బయట పడనీయకుండా చేస్తున్నాయి. వీటన్నిటినీ అరికట్టడానికే 2012లోనే పోక్సో లాంటి కఠినచట్టాలు వచ్చాయి. అయినా, బాలలపై అత్యాచారాలు ఆగక పోవడం విషాదం. సదరు కేసులు పెరుగుతున్నందున ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెట్టాలంటూ అయిదేళ్ళ క్రితమే సుప్రీమ్ ఆదేశించింది. అయితే, రెగ్యులర్ కోర్ట్‌లకే జడ్జీలు కరవైన పరిస్థితుల్లో ఇక ఈ ఫాస్ట్‌ట్రాక్‌ల కథేమిటో ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. దానికి తోడు చట్టంలోని కఠిన అంశాలకు ఒక్కో హైకోర్ట్ ఒక్కో రకం అర్థం చెబుతూ, వ్యాఖ్యానం చెప్పడం పెను సమస్యయి కూర్చుంది.

తాజా తీర్పుతో ఆ పరిస్థితులు కొంతవరకు మారతాయని ఆశించాలి. చట్టాన్ని అతిక్రమిస్తున్న వారికి మేలుకొలుపు. అదే సమయంలో అది అందరికీ స్పష్టమైన సందేశం ఇస్తోంది. అదేమిటంటే – బాలల భద్రత అతి ముఖ్యమైనది! వారి భద్రత కోసమే కోర్టు చట్టానికి మరింత కఠినమైన, కట్టుదిట్టమైన వ్యాఖ్యానం అందించింది. ఇక యూ ట్యూబ్ – గూగుల్ లాంటి వేదికలు, చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలు, నిత్యం ఇంటర్నెట్ వాడేవారు అప్రమత్తంగా ఉండక తప్పదు. అలాంటి కంటెంట్‌ను తక్షణం తొలగించడం, పోలీసులకు ఫిర్యాదు చేయడమే మార్గం. అదే సమయంలో విద్యాలయాల్లో లైంగిక విజ్ఞానాన్ని సమగ్రంగా బోధించి, పిల్లల్లో అవగాహన కల్పించాలంటూ ప్రభుత్వానికి సుప్రీమ్ చేసిన సూచన విలువైనది. బిడియపడకుండా తల్లితండ్రులు, గురువులు పిల్లలకు విషయాలను వివరించడం మేలు. శారీరకంగా, సామాజికంగా, చట్టపరంగా అవగాహన పెరిగితే అకృత్యాల్ని అడ్డుకోవడం సులభమవుతుంది. ఇలాంటి కేసులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్న సంకేతం సుప్రీమ్ తాజా తీర్పు అందించడం అన్ని విధాలా ఆహ్వానించదగ్గ పరిణామం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.నవమి సా.4.20 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పునర్వసు రా.3.48 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.3.41 నుండి 5.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.41 వరకు, తదుపరి ప.2.42 నుండి 3.30 వరకు, **అమృత ఘడియలు:** రా.1.32 నుండి 3.10 వరకు.


సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

చంద్రబాబు 'లడ్డూ' నాటకం సాగదు!

తిరుమల తిరుపతి దేవస్థానపు 'లడ్డూ' ప్రసాదం కేంద్రంగా ఆడుతున్న నాటకం చంద్రబాబు నాయుడు ప్రజా జీవితంలో అత్యంత నికృష్టమైన చేష్ట. కల్తీ జరిగిందని భావిస్తున్న నెయ్యి తిరుమల దేవస్థానానికి వచ్చింది చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన తరువాతే! దాన్ని లడ్డూ ప్రసాదం తయారీలో వాడనేలేదని టీటీడీ ఈవో విస్పష్టంగా ప్రకటించారు కూడా! అయినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు హేయం, గర్హనీయం, అత్యంత ప్రమాదకరం.

రాజకీయాల్లోకి మతాన్ని లాగడమా?

అభిప్రాయం



కపిల్ కొమిరెడ్డి

రాజకీయ నాయకులు సుద్దపూసలు కారు. నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన చంద్రబాబు నాయుడు చేయగలిగినన్ని పాపాలు చేశాడు. కానీ, తిరుమల తిరుపతి దేవస్థానపు 'లడ్డూ' ప్రసాదం కేంద్రంగా ఆడుతున్న నాటకం మాత్రం ఆయన ప్రజా జీవితంలో అత్యంత నికృష్టమైన చేష్ట. దైవ దూషణ, నిరాధార ఆరోపణలతో కూడి ఉందీ రాజకీయం. ఒక వర్గంలో విపరీతమైన ద్వేషం, ఉన్మాదాన్ని రేకెత్తించేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమిది. దేవుడి పేరుతో జరుగుతున్న ఆటవిక రాజకీయం. చంద్రబాబు గురించి తెలిసిన వాళ్లు కూడా ఊహించని విధంగా ఆయన దక్షిణాదిలో మతోన్మాదాన్ని వేగంగా వ్యాపింపజేసేందుకు కంకణం కట్టుకున్నాడని అనిపిస్తోంది.

లడ్డూ ప్రసాదంపై వచ్చిన ఆరోపణలు ఏవీ నిలిచేవి కావు. ఎందుకంటే అన్నీ పరస్పర విరుద్ధమైనవి. 'ద ప్రింట్'కు చెందిన నిచ్చెనమెట్ల ప్రసాద్ సెప్టెంబరు 21న రాసిన కథనం ప్రకారం... కల్తీ జరిగిందని భావిస్తున్న నెయ్యి దేవస్థానానికి జూలై 6 నుంచి 12 తేదీల మధ్య వచ్చింది. అంటే చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన తరువాత! దేవస్థానం వ్యవహారాల్లో అత్యంత శక్తిమంతుడైన ఎగ్జిక్యూటివ్ అధికారి శ్యామల రావును నియమించింది కూడా చంద్రబాబే. లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ జరిగిందని అనుమానిస్తున్న నెయ్యిని వాడనే లేదని ఆయన విస్పష్టంగా ప్రకటించాడు.

వాస్తవానికి జరిగిందేమిటంటే... నాణ్యత పరీక్షల్లో విఫలమైన కారణంగా కల్తీ జరిగిందని అనుమానించిన నెయ్యి ట్యాంకర్లను సరఫరాదారుకు తిప్పి పంపారు. ఈ ట్యాంకర్ల నుంచి సేకరించిన నమూనాలను తనిఖీల కోసం ప్రత్యేకమైన పరిశోధన సంస్థలకు పంపారు. ఈ సంస్థలు ఇచ్చిన నివేదికల ఆధారంగానే బాబు కుమారుడు లోకేశ్ కూడా "జగన్ ప్రభుత్వం తిరుపతి ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వును వాడింది. జగన్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ విషయమై సిగ్గుపడాలి. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లను గౌరవించలేకపోయారు" అని మాట్లాడాడు. జరిగిన పరిణామాలు, అందుబాటులో ఉన్న అరకొర సాక్ష్యాలను బట్టి చూస్తే అత్యంత మూర్ఖులు మాత్రమే ఈ రకమైన పైత్యాన్ని నమ్ముతారు.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహజంగానే ఈ ఉచ్చులో పడిపోయాడు. వాస్తవాలను పరిశీలించాలన్న ఆలోచన కూడా లేకుండా లడ్డూ ప్రసాదం 'అపవిత్రమై'పోయిందన్నాడు. ఈవో శ్యామలరావు స్వయంగా అలాంటిదేమీ జరగలేదని ప్రకటించిన విషయాన్నీ పట్టించుకోలేదు. రాహుల్ గాంధీ వైఖరి ఎంత విచిత్రంగా ఉంటుందంటే... దేశంలోని మత మైనారిటీల రక్షణకు రాకుండా, వారినే అంతమొందిస్తామన్న ఖలిస్తానీ తీవ్రవాదులకు మద్దతుగా మాట్లాడేంత! దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేతపై క్రిస్టియన్ అన్న ఒక్క కారణంగా జరుగుతున్న దుష్ప్రచారానికి పవిత్రత కల్పిస్తూగానీ మెజారిటీ వర్గాలకు భరోసా ఇవ్వలేకపోయేంత!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం చేసుకున్న అదృష్టం ఏమిటంటే... జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ లాంటివాడు కాకపోవడం! వారసుడే అయినప్పటికీ, అట్టడుగు నుంచి అధికార పగ్గాలు చేపట్టే స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం షేక్స్పియర్, మారియో పూజో('ద గాడ్ ఫాదర్' రచయిత) ఉమ్మడిగా రాసినట్టుండే కథనానికి ఏమాత్రం తీసిపోనిది. భారతీయ రాజకీయ యవనికపై అకస్మాత్తుగా కనుమరుగైన నేతలు ఎందరో ఉన్నారు. కానీ అత్యంత ప్రభావశీలమైన నిష్క్రమణల్లో వై.ఎస్. రాజశేఖర రెడ్డిది ఒకటి. 2009 సెప్టెంబరు 2న జరిగిన ఆ హెలికాప్టర్ ప్రమాదం నుంచి ఆయన బతికి బయటపడి ఉంటే కాంగ్రెస్ పార్టీకి పెట్టని కోటగా మారిన ఆంధ్రప్రదేశ్ అసలు విభజితమై ఉండేది కాదు. నియంతల్లా పేరుపడ్డ మోదీ, అమిత్ షా సైతం సిగ్గుపడే స్థాయిలో అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేయాలన్న నిర్ణయం తీసుకోవడం, అమలు చేయడం కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బ తీశాయి. ఈ ఒక్క నిరంకుశ నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీ అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇటు తెలంగాణలోనూ తుడిచి పెట్టుకుపోయింది. ఈ సమయంలోనే మోదీ కూడా గుజరాత్‌ను వీడి జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పడం మొదలుపెట్టిన విషయం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాల తరువాత కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కేలా చేసిన వై.ఎస్. రాజశేఖర రెడ్డి వారసుడైన జగన్ మోహన్ రెడ్డిని ఆ పార్టీ ముప్పు తిప్పలు పెట్టింది. జగన్ మోహన్‌రెడ్డిని పార్టీలోనే పరాయివాణ్ణి చేశారు. ఆంక్షలు పెట్టారు. కేసుల పేరుతో హింసకు గురిచేశారు. జగన్ పోరాడింది ఆషామాషీ వ్యక్తులతో కాదు. దేశంలోనే అత్యంత శక్తిమంతులైన రాజకీయ నేతలతో. ఢిల్లీలో గాంధీలు... హైదరాబాద్‌లోని వారి చంచాలు ఒక పక్క, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ఇంకోపక్క. వైఎస్ దాతృత్వంతో లబ్ధి పొందిన వాళ్ల కేసుల కారణంగానే జైల్లో మగ్గిన జగన్‌కు ఇక భవిష్యత్తు లేదని చాలామంది అనుకున్నారు. అయితే జగన్ ఈ విషయాలపై ఫిర్యాదు చేయలేదు. తనకు అన్యాయం జరిగిపోయిందని ఏడవలేదు. పోరాడాడు. సొంతంగా పార్టీ స్థాపించాడు. అత్యంత దుర్భరమైన, వేల కిలోమీటర్ల పొడవునా జన సామాన్యులతో కలిసిపోతూ పాదయాత్ర నిర్వహించాడు. పార్టీ స్థాపించిన ఎనిమిదేళ్లకు వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చాడు. ఏ రకంగా చూసినా ఇది అసాధారణ విజయమనే చెప్పాలి.



వై.ఎస్.రాజశేఖర రెడ్డి కుటుంబాన్ని అన్ని మతాలు, కులాల వాళ్లూ ఇష్టపడ్డారు. క్రిస్టియన్ కాబట్టి నేతగా అంగీకరించమని ఎవరూ అనుకోలేదు. రాజశేఖర రెడ్డి కూడా కులమతాలకు అతీతంగా అందరినీ కలుపుకుని పోయేవాడు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన ప్రతిసారీ తిరుపతిని సందర్శించడం రాజశేఖర రెడ్డి పాటించిన పద్ధతుల్లో ఒకటి. వాళ్లు రహస్య క్రైస్తవులని అంటున్న హిందువుల మెప్పు కోసం నేను ఈ మాటలు అనడం లేదు. మత విశ్వాసాల విషయంలో రాజశేఖర రెడ్డి వైఖరి అన్నింటినీ సమాదరించే లక్షణం ఉండటం వల్ల అంటున్నా. ఆయనది అసలైన భారతీయుడి మనస్తత్వం.

జగన్‌ను ప్రత్యర్థిగా చేసుకుని ఆయన్ని హిందూ వ్యతిరేకిగా ముద్రించేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు గర్హనీయం, హేయం, అత్యంత ప్రమాదకరం, నిర్లక్ష్యపూరితం. ఈ విషయంలో చంద్రబాబు అండ్ కో రోజు రోజుకూ అత్యంత నీచమైన రాజకీయాలకు పాల్పడుతోంది. హిందూ ధర్మ పరిరక్షకుడి స్థాయిలో తానూ గుర్తుండిపోవాలని చంద్రబాబు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంత అధమ స్థాయికి చేరిందంటే... టీటీడీ బోర్డు ఛైర్మన్ భార్య తన చేతిలో బైబిల్ పట్టుకుని తిరుగుతోందని ఆరోపించేంత వరకు!


రాజకీయాల్లోకి మతాన్ని లాగడం ద్వారా చంద్రబాబు ఘోరమైన తప్పు చేస్తున్నాడు. దీనిపై ఆగ్రహ జ్వాలలు సర్వత్రా వ్యాపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మెజారిటీ ప్రజానీకం ఇదంతా నాటకమని నమ్ముతూంటే, మిగిలిన వారిని రెచ్చగొట్టేందుకు పవన్ కల్యాణ్ తనవంతు ప్రయత్నం చేస్తున్నాడు. ఏది ఏమైనప్పటికీ వై.ఎస్. రాజశేఖర రెడ్డి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌లో గట్టి మద్దతే ఉంది. మతతత్వ రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లో పెద్దగా నడిచేవీ కావు. అధికారం ఎప్పుడూ ఒకే పార్టీ, నేతతో ఉండేదీ కాదు. విభజించి పాలించు అన్నది తాత్కాలికంగా కొన్ని లాభాలు ఇవ్వవచ్చునేమో కానీ... ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి మార్గంలో పెట్టాలని ఆశిస్తున్న చంద్రబాబుకు దీర్ఘకాలంలో ఇది చెరగని మరకగానే మిగిలిపోతుంది.

వ్యాసకర్త 'మాలెవొలెంట్ రిపబ్లిక్: ఎ షార్ట్ హిస్టరీ ఆఫ్ ద న్యూ ఇండియా' పుస్తక రచయిత ('ద ప్రింట్' సౌజన్యంతో)

లడ్డూపై రాజకీయమా?

తిరుపతి లడ్డూ వివాదాన్ని నాణ్యతా నియంత్రణ అంశానికి పరిమితం చేయాలి.

సుప్రసిద్ధమైన తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో 'అన్య కొవ్వు' కలుపుతున్నారని చేసిన ఆరోపణలు ప్రాథమికంగా చూస్తే తీవ్రమైనవి. సాక్షాత్తూ తెలుగు దేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేశ్ సెప్టెంబర్ 18న స్వయంగా ఈ ఆరోపణలు వైసీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చేశారు. వెంటనే చంద్రబాబు కేంద్ర కూటమి భాగస్వామిగా ఉన్న బీజేపీ నేతలు దీనిపై 'స్వతంత్ర దర్యాప్తు' కోరటంతో ఈ అంశం అదుపు తప్పి సకల వ్యాఖ్యానాలకు నెలవుగా మారింది. బీజేపీ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి కూడా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కోరారు. ఆశ్చర్యకరంగా, నెయ్యి కల్తీ ఆరోపణలు తిరుమల కొండపై ఉన్న ఆలయానికి భక్తుల రాకపోకలను నిరోధించలేదు సరి కదా, లడ్డూల విక్రయాలను మందగింప జేయలేదు కూడా! హరియాణా, మహారాష్ట్రలలో అధికారాన్ని నిలుపుకోవడానికి బీజేపీ కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఆ రాష్ట్రాల ఎన్నికలు సమీపిస్తుండగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వయంగా చేసిన ఈ ఆరోపణలు రాజకీయంగా ప్రేరేపితమైనవన్న ఆందోళనలు వినిపిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే ఈ ఆరోపణలు వాస్తవానికి బాధ్యతారాహిత్యమైనవని పిస్తోంది.



గుజరాత్‌లోని ఆనంద్ 'నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్' అనుబంధ సంస్థ అయిన 'సెంటర్ ఫర్ ఎనాలిసిస్ అండ్ లెర్నింగ్ ఇన్ లైవ్‌స్టాక్ అండ్ ఫుడ్' (సీఏఎల్ఎఫ్–కాఫ్) నిర్వహించిన నాణ్యతా పరీక్షకుగాను లడ్డూ నమూనాలు జూలై 9న అందాయి. పరీక్షా ఫలితాలను జూలై 16న సమర్పించారు. కానీ చంద్రబాబు సెప్టెంబర్‌లో ఈ ఫలితాలను ప్రకటించారు. అంతే కాకుండా – సోయాబీన్, ఆలివ్, పొద్దుతిరుగుడు, రాప్‌సీడ్, పత్తి గింజల నుండి మొదలుకుని చేప నూనె, పామాయిల్, బీఫ్ కొవ్వు, పంది కొవ్వు వరకు – పాల ఉత్పత్తులకు సంబంధంలేని కొవ్వు ఈ లడ్డూల్లో ఉందని పరీక్ష ఫలితాలు తెలిపాయి. తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన సరఫరాదారు ఎ.ఆర్. డెయిరీ పంపిన నెయ్యిలో కల్తీ ('అన్య కొవ్వు') ఎంత ఉంది అనే విషయంలో స్పష్టత లేదు. 'కాఫ్' పలు హెచ్చరికలు కూడా చేసింది. ఆహార నాణ్యత తనిఖీల కోసం ఏర్పర్చిన అత్యున్నత సంస్థ ఘాజియాబాద్ కేంద్రంగా ఉన్న 'నేషనల్ ఫుడ్ లాబొరేటరీ' (ఎన్ఎఫ్ఎల్). మరి, తుది ధ్రువీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నమూనాలను ఎన్ఎఫ్ఎల్‌కు ఎందుకు పంపలేదు? ఎ.ఆర్. డెయిరీ శాంపిల్స్‌లో 'వెజిటబుల్ నూనెల'కు మించిన కల్తీ ఉన్నందున ఆ సంస్థను నిషిద్ధ జాబితాలో చేరుస్తామని జూలై 29న తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారి ప్రకటించారు. ఈ వివాదం నేపథ్యంలో, టీటీడీతో సహా అన్ని ఆలయాల వ్యవహారాలనూ రాష్ట్ర పరిధి నుండి తొలగించి, 'వంశపారంపర్య సంరక్షకులకు' తిరిగి అప్పగించాలని హిందుత్వ వాదులు వాదిస్తున్నారు. ఇది అవకాశవాదంతో కూడుకున్న మాట. అంతేకాకుండా తప్పు కూడా. ఎందుకంటే ఇప్పటికే అన్ని రాష్ట్రాలలోనూ 'హిందూ రెలిజియస్ అండ్ ఛారిటబుల్ ఎండోమెంట్స్' చట్టాలను సుప్రీంకోర్టు సమర్థించింది. నాణ్యతా నియంత్రణకు పరిమితం చేయవలసిన ఒక వివాదాన్ని మతపరమైన బురద జల్లడంగా మార్చడాన్ని అంగీకరించ కూడదు.

(ఆంగ్ల పత్రిక 'ది హిందూ' సెప్టెంబర్ 24 నాటి సంపాదకీయం)

ఇన్ బాక్స్

ఆత్మగౌరవ ప్రతీక!

ఆధిపత్య వర్గాల పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి దొరలను గడీల నుంచి ఉరికించి తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడిన వీర వనిత చాకలి ఐలమ్మ. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో పాల్గొన్న వారిలో అగ్రగణ్య ఐలమ్మ.

ఉమ్మడి నల్లగొండజిల్లా (నేటి జనగాం జిల్లా) పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్య – ఐలమ్మలకు ఆరుగురు సంతానం. వారిది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం. కులవృత్తే వారికి జీవనాధారం. కులవృత్తితో బతకలేక పాలకుర్తికి పక్కనే ఉన్న మల్లంపల్లి దొర కుటుంబానికి చెందిన ఉత్తంరాజు జయప్రదాదేవి వద్ద 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుంది ఐలమ్మ. అదే విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డికి కంటగింపు అయింది. అప్పుడే వెట్టి గొట్టాలు చేయవద్దని పిలుపునిచ్చి... 1940–44 మధ్య కాలంలో విసునూరులో దేశ్‌ముఖ్‌లు, రజాకర్ల అరాచకాలపై ఎదురుతిరిగి ఎర్రజెండా పట్టి ఆంధ్రమహాసభ (సంఘం)లో చేరింది ఐలమ్మ. దీంతో రామచంద్రారెడ్డి రగిలిపోయాడు. ఆమె కౌలుకు తీసుకున్న భూమిలో కాపు కొచ్చిన పంటను కాజేయాలని పన్నాగం పన్నాడు. గూండాలను పురమాయించారు. 'ఈ భూమి నాది. పండించిన పంట నాది. తీసుకెళ్లడానికి దొరెవ్వడు... నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలిగేది' అంటూ తన పంటను దోచుకోవడానికి వచ్చిన దొర గూండాలతో పలికింది ఐలమ్మ. సంఘం కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా కోర్టులో తీర్పువచ్చింది.



చాకలి ఐలమ్మ

ఐలమ్మ భూపోరాటం సామాజికంగా దిగువ ఉన్న జనానికి ప్రేరణ, స్ఫూర్తినిచ్చింది. పల్లెపల్లెన ఉద్యమం ఎగిసిపడి, దొరల ఆధిపత్యం నేలమట్టమైంది. బడుగులను ఆదుకోవడమే ఆమెకు నిజమైన నివాళి!

– ఆలేటి రమేష్ ‌| రజక విద్యార్థి సంఘం తెలంగాణ ప్రధాన కార్యదర్శి (నేడు చాకలి ఐలమ్మ జయంతి)

అర్హతకు తగిన ఉపాధి లేకపోతే...

అభిప్రాయం



డా॥ పి.ఎస్. చారి

నేడు భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి అల్ప ఉద్యోగిత. అర్హత, నైపుణ్యాలకు తగిన ఉద్యోగానికి బదులు... తక్కువ స్థాయి ఉద్యోగం లభించే స్థితినే అల్ప ఉద్యోగిత అంటారు. ఇది ఆర్థిక వ్యవస్థలో ఉపాధి, శ్రామిక శక్తుల వినియోగానికి కొలమానం. అల్ప ఉద్యోగితకు అనేక కారణాలు ఉన్నాయి. పరిశ్రమల డిమాండ్‌లో మార్పుల కారణంగా పాత నైపుణ్యాలు కలిగిన కార్మికులకు ఉపాధి దొరకదు. భౌగోళిక అసమానతలు ఉద్యోగ అవకాశాలను పరిమితం చేస్తాయి. లింగ, జాతి లేదా వయస్సు ఆధారంగా చూపే పక్షపాతం వ్యక్తులు తగిన ఉపాధిని పొందకుండా అడ్డుకుంటుంది. కొన్ని రంగాలలో అధిక పోటీ కారణంగా అర్హత కలిగిన అభ్యర్థులు తమ నైపుణ్యానికి సరిపోయే ఉద్యోగాలను పొందడం కష్టమవుతుంది. ఉద్యోగాలు చేస్తున్నవారు కొత్త రంగంలోకి మారి తగిన ఉద్యోగాలు సంపాదించాలన్నా... ఆ రంగానికి అవసరమైన నైపుణ్యాల కొరత కారణంగా ఉద్యోగాలు పొందడం కష్టమవుతుంది.

అల్ప ఉద్యోగిత వ్యక్తిగతంగానూ, సామాజిక పరంగానూ నష్టదాయకం. వ్యక్తులు తరచుగా ప్రాథమిక అవసరాలు తీరడానికి కూడా ఖర్చు చేయలేరు. అందువల్ల అప్పుల పాలవుతారు. ఆర్థిక అభద్రతకూ గురవుతారు. అల్ప ఉద్యోగిత ఎక్కు కాలం కొనసాగడం వల్ల వ్యక్తుల నైపుణ్యాలు క్షీణిస్తాయి. ప్రభుత్వ సహాయ కార్యక్రమాలపై ఎక్కువ ఆధారపడటానికి అల్ప ఉద్యోగిత దారి తీస్తుంది. ప్రజా వనరులపై భారం పడుతుంది. ఈ స్థితి ఆర్థిక అసమానతలను పెంచుతుంది. వ్యక్తుల నైపుణ్యాలు పూర్తిగా వినియోగించుకోలేని కారణంగా ఆర్థిక వ్యవస్థలో మొత్తం ఉత్పాదకత క్షీణించవచ్చు. అల్ప ఉపాధి వల్ల తక్కువ ఆదాయం వస్తుంది కనుక వస్తు వినియోగం తగ్గి ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది.



నిరుద్యోగం లాగానే అల్ప ఉద్యోగిత కూడా ప్రపంచ దేశాల సమస్య. దేశాలు, ప్రాంతాలను బట్టి దీని తీవ్రత మారుతూ ఉంటుంది. ముఖ్యంగా స్పెయిన్, గ్రీస్, ఇటలీ దేశాలలో చాలా మంది నైపుణ్యం కలిగిన కార్మికులు తక్కువ జీతాలు పొందుతున్నారు లేదా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు.

కొన్ని అధ్యయనాల ప్రకారం భారతదేశంలో అల్ప ఉద్యోగిత 15–20 శాతం ఉన్నట్లు తేలింది. వివిధ రాష్ట్రాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డేటాను బట్టి... కేరళలో 10–15%, తమిళనాడులో దాదాపు 10–20%, గుజరాత్, మహారాష్ట్రల్లో 10–15% వరకు అల్ప ఉద్యోగిత ఉందని అంచనా. ఉత్తరప్రదేశ్‌లో వ్యవసాయం ఎక్కువగా ఉండి ఉద్యోగాల కల్పన పరిమితంగా ఉన్నందున 20–30% అల్ప ఉద్యోగిత ఉంది. బిహార్‌లో వ్యవసాయంపై ఆధారపడి ఉండటం, తక్కువ పారిశ్రామిక వృద్ధి జరగడం వల్ల అక్కడ, బహుశా 30% కంటే ఎక్కువ అల్ప ఉద్యోగిత ఉంది.


అనేక దేశాలు అల్ప ఉద్యోగితను తగ్గించే లక్ష్యంతో కొన్ని విధానాలను అమలు చేశాయి. అందుబాటులో ఉన్న ఉద్యోగాల కోసం కార్మికులు సన్నద్ధమయ్యారని నిర్ధారించుకోవడానికి వృత్తి శిక్షణ–నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడిని ప్రోత్సహించడం అందులో ఒకటి. ఉద్యోగ భద్రతను పెంచే విధానాలు చేపట్టడం, పని పరిస్థితులను మెరుగుపరచడం, న్యాయమైన వేతనాలను ప్రోత్సహించడం; గ్రాంట్లు, రుణాలు, శిక్షణ ద్వారా చిన్న వ్యాపార అభివృద్ధిని ప్రోత్సహించడం; పార్ట్ టైమ్ లేదా గిగ్ వర్క్‌కు మద్దతు ఇచ్చే విధానాలు రూపొందించడం వంటి విధానాలను ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. అల్ప ఉద్యోగితను పరిష్కరించడానికి తరచుగా నైపుణ్యాల శిక్షణ, ఆర్థిక మద్దతు, ఉద్యోగ సృష్టిని ప్రోత్సహించే బహుముఖ విధానం అవసరం. ప్రభుత్వాలు ఈ దిశలో చర్యలు తీసుకుంటే కొంత పరిష్కారం లభిస్తుంది.

*వ్యాసకర్త బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్
మొబైల్: 83090 82823*

ఏది అత్యుత్తమ మార్గం?

మార్గాలన్నీ సమాన ప్రాముఖ్యం కలిగినవే. ఎందుకంటే జీవాత్మను పరమాత్మునిలో చేర్చడమే ఈ అన్ని మార్గాల లక్ష్యం. మంచితనం విషయంలో ఉత్తమం, మధ్యమం, అధమం అనేవి సాపేక్ష పదాలు మాత్రమే. ఏ వ్యక్తికి ఏ మార్గం సులభంగా, మనస్సుకు నచ్చినట్లు ఉంటుందో అదే అతనికి ఉత్తమ మార్గం.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

వివిధ నదులు అనేక దిక్కుల నుంచి వేగంగా ప్రవహిస్తూ చివరగా సముద్రంలో కలిసిపోతాయి. అలాగే భక్తి, జ్ఞాన మార్గాల్లో పయనించే వాళ్లందరూ చివరిగా చేసే ప్రయత్నం ఒక్కటే. జీవుడు ఏ మూలం నుండి వచ్చాడో, ఆ మూలం లోనికి జీవుణ్ణి చేర్చడమే భక్తి, జ్ఞాన మార్గాల లక్ష్యం.

కారణం గుర్తించు నీవు, నీ అంతరాత్మతో పొందిక కలిగి ఉన్నట్లయితే బాహ్య ప్రపంచం నీతో పొందికను కలిగి ఉంటుంది. బాహ్య ప్రపంచంలో నీకు విరోధం కనిపించినట్లయితే అది నీ లోపల గల కల్లోలాలను బహిర్గతపరుస్తుంది. అందువల్ల బయట కల్లోలాలు సృష్టించబడతాయి. ప్రకృతి మాత రచించిన గొప్ప ప్రణాళికలో ప్రతి వస్తువునకూ సముచితమైన విలువ, ఉపయోగాలు ఉన్నాయి. దానికంటూ ప్రత్యేక స్థానం ఉంది. వేదాంతాన్ని అనుసరించి చూస్తే... ప్రకృతి ఎక్కడా కల్లోలాలను కలిగించదని అర్థమవుతుంది. కేవలం మానవుని మనస్సు మాత్రమే ఇటువంటి కల్లోలాలను సృష్టిస్తుంది. కల్లోలాలను గురించి ఎంత సులభంగా మాట్లాడతావో, నీవు వాటికి అంత ప్రాముఖ్యం ఇచ్చినవాడవు అవుతావు. ప్రతి విషయానికీ ఏదో ఒక పరిణామం కారణం అనే విషయాన్ని గ్రహించి, ఏ కారణం వల్ల అది సంభవించిందో... అటువంటి మూల కారణాలను నీవు గుర్తించు. కారణం లేకుండగానే ఏదీ సంభవించదు అని గుర్తెరగాలి. నీవు జీవితంలో ఉన్నత ఆశయాలకు లోబడి నడచుకున్నప్పుడు నీకు విశ్రాంతి లభిస్తుంది. అదే సమయంలో నీవు ప్రశాంతంగా ఉండగలవు. కాబట్టి దృష్టిని ప్రక్కకు మళ్ళించకుండా, నీ జీవితాన్ని భక్తి, విశ్వాసాలతో భగవదర్పణ చేసి గడుపు. సదా భగవన్నామాన్ని స్మరించు.

జాబితాపూర్ పాఠశాలకు మూత్రశాల

- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు



సాక్షి ఎఫెక్ట్

జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మూత్రశాల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. పాఠశాలలో మూత్రశాల, మరుగుదొడ్డి లేకపోవడంతో '139 మంది విద్యార్థులకు ఒకే మూత్రశాల' శీర్షికన 'సాక్షి' మెయిన్ పేజీలో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన కలెక్టర్ సత్యప్రసాద్ వెంటనే మూత్రశాలల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీపీవో రఘువరణ్, ఎంపీడీవో రమాదేవి పాఠశాలకు వెళ్లి నిర్మాణ పనులను ప్రారంభించారు.

మరి వీరికో..



సోన్: నిర్మల్ జిల్లా సోన్ మండలం న్యూవెల్మల్ బొప్పారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 214 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 107 మంది బాలికలు కాగా.. 107 మంది బాలురు ఉన్నారు. బాలికలకు ఒకే మూత్రశాల, మరుగుదొడ్డి ఉంది. బాలురకు అసలే లేవు. దీంతో వారు ఒంటికీ.. రెంటికీ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఉపాధి హామీ పథకం కింద రూ.37 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో బాలురకు 20 మూత్రశాలలు, నాలుగు మరుగుదొడ్లు, బాలికలకు 16 మూత్రశాలలు, నాలుగు మరుగుదొడ్లు, సిబ్బందికి నాలుగు మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మాణ పనులు తొంభై శాతం పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూపాయి కూడా బిల్లులు రాలేదని.. అందుకే మిగతా పనులు నిలిపివేసినట్లు కాంట్రాక్టర్ తెలిపారు.

అప్పులతో అన్నదాతల బలవన్మరణం



గోపాల్

ఇల్లెందు రూరల్/హవేళిఘణాపూర్(మెదక్): ఇటీవలి భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో అప్పు తీర్చేదెలా? అనే మనస్తాపంతో యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం చెన్నంగులగడ్డలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలెం రవి (29) రెండెకరాల్లో పత్తి, మూడెకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.లక్ష అప్పు చేశాడు. గతేడాది కూడా ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. ఈ ఏడాది పంటలు బాగానే ఉన్నప్పటికీ.. ఇటీవలి వరదలతో మొత్తం నీట మునిగాయి. దీంతో ఇటీవల మళ్లీ రూ.53 వేలు అప్పు తెచ్చి పంటకు మందులు వేసినా ఫలితం కానరాలేదు. ఈ మనస్తాపంతో రవి మంగళవారం ఇంట్లోనే పురుగు మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఖమ్మం తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అరిగె గోపాల్ (48) రూ.3 లక్షల అప్పు చేశాడు. మెదక్ ఏపీజీవీబీలో రూ.1.8 లక్షల రుణం తీసుకోగా.. ఇటీవల మాఫీ అయింది. ప్రైవేట్‌గా తీసుకున్న అప్పును తీర్చేందుకు మళ్లీ బ్యాంకులో రుణం తీసుకోవాలనుకున్నాడు. రుణదాతల ఒత్తిడి, బ్యాంకు రుణం అందక తీవ్ర మనస్తాపం చెందిన గోపాల్.. మంగళవారం సాయంత్రం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని గజ ఈతగాళ్లు బుధవారం మధ్యాహ్నం వెలికి తీశారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



రాజు మృతదేహం

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. హవేళిఘణాపూర్ మండలం కప్రాయిపల్లి గ్రామానికి చెందిన రైతు కుక్కల రాజు (28) బుధవారం ఉదయం గ్రామ శివారులోని తన వరి పొలానికి వెళ్లాడు. బోరు పని చేయకపోవడంతో.. మోటార్‌కు సరఫరా అయ్యే స్టార్టర్ డబ్బాకు మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. ఇది గమనించిన సమీపంలోని రైతులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు పొలం వద్దకు వెళ్లి చూడగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య సౌజన్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

పత్తి కాదు..వరే!

- ఈసారి పత్తి సాగును ప్రోత్సహించాలనుకున్న ప్రభుత్వం
- కానీ సాధారణ విస్తీర్ణం కన్నా తక్కువగా సాగు
- గత ఏడాదిని మించి పోయిన వరినాట్లు
- ఏకంగా 65.49 లక్షల ఎకరాల్లో పంట
- అక్టోబర్ 1 నుంచి యాసంగి పంటల సీజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి సాగు పడిపోయింది. సాధారణ విస్తీర్ణంతో పోల్చితే గణనీయంగా తగ్గింది. ప్రభుత్వం ఈసారి పత్తి విస్తీర్ణాన్ని సాధారణ సాగు లక్ష్యం కంటే పెంచాలని పిలుపు ఇచ్చినా రైతులు పట్టించుకోలేదు. వరివైపే మొగ్గు చూపారు. ఈ నెలాఖరుతో వానాకాలం సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ బుధవారం ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్లో ఏకంగా 60 లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు చేయించాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పేర్కొంది. సాధారణ సాగు విస్తీర్ణం ప్రకారం చూసినా కనీసం 50.48 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కావాలి. కానీ సర్కారు ప్రత్యేకంగా నిర్దేశించిన లక్ష్యాన్ని పక్కనపెడితే, సాధారణ విస్తీర్ణంతో పోల్చినా 86.67 శాతానికే పత్తి సాగు పరిమితమైంది. ఈ సీజన్‌లో కేవలం 43.76 లక్షల ఎకరాల్లోనే ఈ పంట సాగయ్యింది. సర్కారు లక్ష్యంతో పోల్చుకుంటే.. ఏకంగా 16.24 లక్షల ఎకరాలు తగ్గగా, సాధారణ విస్తీర్ణంతో పోల్చుకుంటే 6.72 లక్షల ఎకరాలు తగ్గడం గమనార్హం.

వరి వైపు రైతుల మొగ్గు

రాష్ట్రంలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు కాగా, ఈ సీజన్‌లో ఇప్పటివరకు నూటికి నూరు శాతం సాగైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 57.18 లక్షల ఎకరాలు కాగా గతేడాది 64.61 లక్షల ఎకరాల్లో సాగైంది. తాజా సీజన్‌లో దాన్ని అధిగమించి 65.49 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 114.53 శాతం పెరిగింది. ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు వరి వైపు మొగ్గు చూపారని అంటున్నారు.



తగ్గిన పప్పు ధాన్యాల సాగు

పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం మాత్రం గణనీయంగా తగ్గడం గమనార్హం. అన్ని రకాల పప్పు ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 8.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 5.90 లక్షల (69.30 శాతం) ఎకరాల్లోనే సాగైంది. కీలకమైన కంది సాధారణ సాగు విస్తీర్ణం 7.11 లక్షల ఎకరాలు కాగా, కేవలం 4.99 లక్షల ఎకరాల్లోనే సాగైంది. అలాగే పెసర సాధారణ సాగు విస్తీర్ణం 1.01 లక్షల ఎకరాలు అయితే, కేవలం 68,556 (67.38 శాతం) ఎకరాల్లోనే సాగైంది. మొక్కజొన్న 6.09 లక్షల ఎకరాలకు గాను ఇప్పటివరకు 5.46 లక్షల (89.73 శాతం) ఎకరాల్లో, సోయాబీన్ 4.29 లక్షల ఎకరాలకు గాను ఇప్పటివరకు 4.01 లక్షల (93.47 శాతం) ఎకరాల్లో, జొన్న 70,068 ఎకరాలకు గాను 41,782 ఎకరాల్లో సాగైంది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి యాసంగి పంటల సీజన్ ప్రారంభం కానుంది.

రుణమాఫీ కాలేదంటూ.. పీఏసీఎస్‌కు తాళం



సొసైటీకి తాళం వేస్తున్న బాధిత రైతులు

చిలుకూరు: అధికారుల కారణంగానే తమకు రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనగా బుధవారం సూర్యాపేట జిల్లా చిలుకూరు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి తాళం వేశారు. దీంతో సొసైటీ డైరెక్టర్లతో పాటు సిబ్బంది కార్యాలయం లోపలే బందీ అయ్యారు. విషయం తెలుసుకున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి కార్యాలయం వద్దకు వచ్చి బాధిత రైతులకు నచ్చచెప్పి తాళం తీయించారు. అక్కడి నుంచి రైతులు, సీఈఓ, సిబ్బందిని స్టేషన్‌కు తీసుకెళ్లి ఘటనపై విచారణ చేశారు. సాంకేతిక లోపం కారణంగానే 40 మంది రుణమాఫీ కాలేదని సంఘం సీఈఓ లక్ష్మీనారాయణ వివరణ ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు చెప్పామన్నారు.

బిడ్డ ఉద్యోగిని.. రుణమాఫీ దక్కని రైతు

- పెళ్లయి అత్తగారింటికి వెళ్లినా తనకు మాఫీ కాలేదన్న ఆదిలాబాద్ జిల్లా అన్నదాత
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌కు లేఖ



అల్లూరి రామరెడ్డి

సాక్షి, ఆదిలాబాద్: 'నా పెద్ద కూతురు మేఘన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. 2023 మార్చిలో పెళ్లి చేశాను. ఇప్పుడు అత్తగారి ఇంట్లోనే ఉంటోంది. నా ఇంట్లో ప్రస్తుతం ఉద్యోగి ఎవరూ లేరు. రేషన్ కార్డులో నా పెద్ద బిడ్డ పేరు కూడా తొలగించాను. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నాకు కాలేదు. దానికి కారణమేమిటని వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే మీ కూతురుకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోందని అని చెప్పారు' అని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ(బి) గ్రామానికి చెందిన అల్లూరి రామ రెడ్డి అనే రైతు వాపోయాడు. ప్రభుత్వం రుణమాఫీ చేసే ముందు ప్రాథమిక విచారణ చేయకుండా ఇలా నిర్ధారిస్తే ఎలాగని ప్రశ్నించాడు. దీనిపై ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు లేఖ రాశాడు. అల్లూరి రామరెడ్డికి కౌఠ గ్రామంలో భార్యాభర్తల పేరిట 9.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రామరెడ్డి పేరుపై కౌఠ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.1.60 లక్షల రుణం, భార్య సవిత పేరిట బోథ్ ప్రాథమిక సహకార సంఘంలో రూ.40 వేల రుణం ఉంది. ప్రభుత్వం రూ.2 లక్షల్లోపు రుణమాఫీ చేయగా, తనకు కూడా జరుగుతుందని ఆశ పడ్డాడు. కానీ మాఫీ కాలేదు. కాగా, రుణమాఫీకి సంబంధించి ఆదిలాబాద్ జిల్లాలో మూడు విడతల్లో కలిపి 55,961 మంది రైతులకు రూ.608.88 కోట్ల రుణ మాఫీ జరిగింది. అయితే తమకు రుణమాఫీ జరగలేదని వందలాది మంది రైతులు జిల్లాలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

వీధికుక్క స్వైర విహారం

- ఆరుగురికి తీవ్ర గాయాలు



రాజమణి, సత్తవ్వ కాళ్లకు అయిన గాయాలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 45, 46, 37 వార్డుల పరిధి కాలనీల్లో బుధవారం ఉదయం ఓ వీధి కుక్క ఆరుగురిని తీవ్రంగా గాయపరిచింది. మొదట భారత్‌రోడ్‌లో సత్తవ్వ అనే మహిళ కాళ్లను పట్టుకుని కరవడంతో ఆమె కింద పడిపోయింది. మరోమారు ఆమె ముఖంపై దాడి చేయగా.. మహిళ కంటి రెప్ప కింద తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను కాపాడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతలోనే అదే కాలనీలో రాజమణి, కళావతిలను సైతం రక్తం వచ్చేలా కుక్క తీవ్రంగా గాయపరిచింది. అనంతరం స్టేషన్‌రోడ్, పెద్దబజార్, జీపీఎస్ రోడ్‌లలో తిరుగుతూ మరో ముగ్గురిని కుక్క తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు కుక్కను పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. కంటి కింద తీవ్ర గాయమైన సత్తవ్వను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

భర్త అంత్యక్రియలకు సాయం చేయండి..

- చేతిలో చిల్లిగవ్వలేక మృతుడి భార్య కన్నీరుమున్నీరు
- దాతలు ముందుకు రావడంతో కార్యక్రమం పూర్తి
- హృదయాలను ద్రవింపజేసిన విషాద ఘటన



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లలిత, కూతుళ్లు

హుజూరాబాద్ రూరల్: మృత్యువు హఠాత్తుగా భర్తను కబళించింది. అంత్యక్రియలకు పేదరికం ఆటంకంగా నిలిచింది. కన్నీళ్లు దిగమింగుకున్న ఆ ఇల్లాలు సాయం కోసం వేడుకోగా.. స్పందించిన మానవత్వం చివరి మజిలీకి అవసరమైన సాయం చేసింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా ధర్మరాజుపల్లిలో చోటుచేసుకుంది. ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్–ప్రేమలత భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కూతుళ్లు. కూలినాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కూతుళ్లకు ఉన్నంతలో వివాహం జరిపించారు. ఇక తమ బతుకు తాము బతుకుదామనుకునే సమయంలో లక్ష్మణ్ మంగళవారం ఇంటి వద్ద హఠాత్తుగా కిందపడిపోయాడు. ఆ సమయంలో అందుబాటులో ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఆలస్యమైంది. చివరకు కొందరు గ్రామస్తులు అక్కడకు రావడంతో వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టిందని తెలిపారు. ఈ క్రమంలోనే చికిత్స అందిస్తుండగానే లక్ష్మణ్ మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకొచ్చేందుకు అద్దె ఇంటి యజమాని అడ్డు చెప్పాడు. దీంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం.. దుఃఖాన్ని దిగమింగుకుంది. ఊరు బయటనే ఓ డేరా వేయించి అక్కడే మృతదేహాన్ని ఉంచారు. అయితే, అంత్యక్రియలు పూర్తిచేసేందుకు చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో మృతుడి భార్య కన్నీటిపర్యంతమైంది. మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన వారిని సాయం చేయాలని ప్రాధేయపడింది. తల్లీకూతుళ్లు చేతులు చాచి ఆర్థికసాయం కోసం విన్నవించడం గ్రామస్తులకు కంటతడి పెట్టించింది. స్పందించిన వారు తలాకొంత పోగుచేసి రూ.80 వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సూచన మేరకు ఆ పార్టీ నాయకులు కూడా కొంత నగదు అందజేయడంతో అంత్యక్రియలు పూర్తయ్యాయి.


రూ.2.25 కోట్ల గంజాయి స్వాధీనం

- కంటెయినర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు అరెస్టు
- పరారైన ఆరుగురు నిందితులు



నిందితులు, స్వాధీనం చేసుకున్న కంటెయినర్, గంజాయితో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తలమడుగు మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఈ ముఠాలోని ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఆరుగురు పరారయ్యారు. ఆంధ్ర, ఒడిశా బార్డర్ అటవీ ప్రాంతం నుంచి ఈ ముఠా దేశంలోని వివిధ రాష్ట్రాలకు పెద్ద ఎత్తున గంజాయిని సరఫరా చేస్తోంది. ఉత్తరాఖండ్‌కు చెందిన కంటెయినర్ ఆదిలాబాద్ పట్టణం నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేయడంతో ఈ ముఠా గుట్టు రట్టయింది. కంటెయినర్ లోపల 292 ప్యాకెట్లలో దాదాపు 9 క్వింటాళ్ల గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.2.25 కోట్లు ఉంటుందని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో ఎనిమిది మంది నిందితులపై కేసు నమోదు చేశారు. అరెస్టయినవారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటెయినర్ డ్రైవర్ వసీమ్ అన్సారి, క్లీనర్ అర్మాన్‌లు ఉన్నారు. కాగా ఒడిశా రాష్ట్రం మల్కాజిగిరికి చెందిన ఆశిష్, యూపీలోని మీరట్‌కు చెందిన పండిత్‌జీ, మహారాష్ట్రలోని బుల్దాన, దులే జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు, అలాగే ఉత్తరాఖండ్‌కు చెందిన అన్షుజైన్, సోను అన్సారీలు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి ఐచర్ కంటైనర్‌తో పాటు 292 గంజాయి ప్యాకెట్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.



శతకోటి సూర్యులను తలదన్నే...
ప్లాస్మా ప్రవాహాలు

ఇదేమిటో తెలుసా? మన ఊహకు కూడా అందనంత పెద్దదైన బ్లాక్‌హోల్ నుంచి దూసుకొస్తున్న రెండు భారీ ప్లాస్మా ప్రవాహాల్లో (బ్లాక్‌హోల్ జెట్) ఒకటి. ఇప్పటిదాకా గుర్తించిన వాటిలో అత్యంత పెద్దవి ఇవేనట. ఈ ప్రవాహాలు అంతరిక్షంలో ఏకంగా 2.3 కోట్ల కాంతి సంవత్సరాల పొడవున పరుచుకున్నట్టు గుర్తించారు! అంతేగాక ఇవి లక్షలాది కోట్ల సూర్యులను మించిన శక్తిని వెదజల్లుతున్నాయట! దీన్నిబట్టి వాటి ఉద్గమ స్థానమైన రాకాసి కృష్ణబిలం ఎంత పెద్దదో ఊహించుకోవచ్చు. ఈ కృష్ణబిలం భూమికి 750 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. అనంతశక్తితో నిండిన కృష్ణబిలాలు తన పరిధిలోకి వచ్చే ఏ వస్తువునైనా లోనికి లాక్కుంటాయన్నది తెలిసిందే. ఎంతటి భారీ నక్షత్రాలైనా వాటి బారినుంచి తప్పించుకోలేవు. వాటిని కబళించే క్రమంలో కొద్దిపాటి ద్రవ్యరాశి ప్లాస్మా ప్రవాహంగా మారి కృష్ణబిలం తాలూకు రెండు అంచుల గుండా అపరిమితమైన వేగంతో బయటికి ఎగజిమ్ముతుంది. వాటిని బ్లాక్‌హోల్ జెట్స్‌గా పిలుస్తారు. ఇవి అనంతమైన ప్రకాశంతో మెరిసిపోవడమే గాక దాదాపుగా కాంతివేగంతో దూసుకెళ్తాయి. ఆ క్రమంలో అంతరిక్షంలో ఇలా కళ్లు చెదిరే దృశ్యాలను ఆవిష్కరిస్తాయి. విశ్వనిర్మాణాన్ని బ్లాక్‌హోల్ జెట్స్ ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకోవడానికి ఈ జంట ప్రవాహాలు ఎంతగానో దోహదపడతాయని సైంటిస్టులు మురిసిపోతున్నారు. వీటికి ముద్దుగా గ్రీకు పురాణాల్లోని మహాకాయుడు పోర్ఫిరియాన్ పేరు పెట్టుకున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

పాపం కంటిపాపలు

ప్రతి ముగ్గురిలో ఒకరికి హ్రస్వదృష్టి • విపరీతమైన స్క్రీన్ టైమే కారణం • ఆసియాలో పెచ్చరిల్లుతున్న సమస్య

తల్లిదండ్రులకు కంటిపాపలైన చిన్నారుల్లో కంటిచూపు క్రమంగా క్షీణిస్తోంది. సగటున ప్రతి ముగ్గురు బాలల్లో ఒకరు హ్రస్వదృష్టి (దూరంలోని వస్తువులు సరిగా కన్పించని) సమస్యతో బాధపడుతున్నట్టు అంతర్జాతీయ విశ్లేషణ ఒకటి హెచ్చరించింది. ఆసియాలోనైతే సమస్య మరీ దారుణంగా ఉంది. జపాన్‌లో ఏకంగా 85 శాతం, కొరియాలో 73 శాతం మంది బాలలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ ఆప్తల్మాలజీలో తాజాగా ప్రచురితమైన అధ్యయనం ఈ మేరకు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఆరు ఖండాల పరిధిలోని 50కి పైగా దేశాల్లో విస్తృతంగా అధ్యయనం చేసిన మీదట ఈ ఆందోళనకర గణాంకాలు వెలుగులోకి వచ్చినట్టు పేర్కొంది. అధ్యయనంలో భాగంగా 50 లక్షలమందికి పైగా బాలలు, టీనేజర్లను పరీక్షించారు. స్కూలు పుస్తకాలతో కుస్తీకి తోడు స్క్రీన్ సమయం విపరీతంగా పెరగడం, ఆరుబయట గడిపే సమయం తగ్గడం పిల్లలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నట్టు పరిశోధకులు తేల్చారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే 2050 నాటికి కోట్లాది మంది పిల్లల కంటిచూపు బాగా ప్రభావితం అవుతుందని హెచ్చరించారు. హ్రస్వదృష్టి సాధారణంగా స్కూలుకు వెళ్లడం మొదలు పెట్టే దశలోనే మొదలవుతుంది. కళ్ల ఎదుగుదల ఆగిపోయే దాకా, అంటే 20 ఏళ్లొచ్చేదాకా సమస్య తీవ్రత పెరుగుతూనే ఉంటుంది.

సగం యువతకు సమస్యే

- ప్రపంచవ్యాప్తంగా 36 శాతం మంది బాలలు హ్రస్వదృష్టితో బాధపడుతున్నారు.
- 1990 నుంచి 2023 మధ్యకాలంలోనే సమస్య ఏకంగా మూడు రెట్లు పెరిగింది.
- పిల్లల్లో హ్రస్వదృష్టి ఆసియా దేశాలతో పోలిస్తే ఆఫ్రికా దేశాల్లో ఏకంగా ఏడు రెట్లు తక్కువగా ఉండటం విశేషం.
- ఉగాండాలో అతి తక్కువగా కేవలం ఒక్క శాతం మంది పిల్లల్లో మాత్రమే హ్రస్వదృష్టి నమోదైంది.
- ఆఫ్రికా దేశాల్లో పాఠశాల విద్య ఆరు నుంచి ఎనిమిదేళ్ల వయస్సులో ప్రారంభమ తుంది. పైగా పిల్లలు ఆరుబయట ఎక్కువగా గడుపుతున్నారు. దాంతో అక్క డ బాలలు, యువకుల్లో సమస్య తక్కువగా ఉంది.
- జపాన్‌లో ఏకంగా 85%, దక్షిణ కొరియాలో 73% పిల్లలకు హ్రస్వదృష్టి ఉంది.
- చైనా, రష్యాల్లో 40 % కంటే ఎక్కువగా, యూకే, ఐర్లాండ్, అమెరికాల్లో 15 శాతానికి పైగా పిల్లల్లో సమస్య ఉంది.
- మిగతా ఖండాలతో పోలిస్తే ఆసియాలో 2050 నాటికి ఏకంగా 69 శాతం మంది హ్రస్వదృష్టి బారిన పడతారు.
- అప్పటికి ప్రపంచ యువతలో కనీసం సగానికి సగం ఈ సమస్యను ఎదుర్కొంటారు.
- వర్ధమాన దేశాల్లో 2050 నాటికి 40% మంది దీని బారిన పడే అవకాశముంది.
- పిల్లలను రెండేళ్ల వయసులోనే బడిబాట పట్టించే సింగపూర్, హాంకాంగ్ వంటిచోట్ల సమస్య విస్తరిస్తోంది.



అమ్మాయిల్లోనే ఎక్కువ

అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల్లోనే హ్రస్వదృష్టి ఎక్కువగా కన్పిస్తున్నట్టు అధ్యయనం తేలింది. ''అబ్బాయిలతో పోలిస్తే ఎదిగేక్రమంలో వాళ్లు ఇంట్లో గానీ, స్కూల్లో గానీ ఆటలపై, ఆరుబయట, గడిపే సమయం తక్కువ. వీటికితోడు ఆహారపు అలవాట్లు తదితరాల వల్ల చాలా చిన్నవయసులోనే రజస్వల అవుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వారిలో చాలావరకు టీనేజ్‌లోనే హ్రస్వదృష్టి బారిన పడుతున్నారు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.

- కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో బాలల్లో హ్రస్వదృష్టి సమస్య బాగా పెరిగింది.
- కోట్లాది మంది ఇళ్లకే పరిమితమై స్మార్ట్ ఫోన్లు, టీవీలు విపరీతంగా చూడటం దీనికి ప్రధాన కారణం.

- సాక్షి, నేషనల్ డెస్క్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే
విధ్వంసమే



- అభివృద్ధి ఆగిపోతుంది, అస్థిరత రాజ్యమేలుతుంది
- హరియాణా ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

సోనిపట్: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న కాంగ్రెస్ హరియాణాలో పొరపాటున అధికారంలోకి వస్తే విధ్వంసం తప్పదని అన్నారు. అభివృద్ధి పూర్తిగా ఆగిపోతుందని, అస్థిరత రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు అధికారం అప్పగించవద్దని ప్రజలకు సూచించారు. బుధవారం హరియాణాలోని సోనిపట్ జిల్లా గొహానాలో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అస్థిరత, అవినీతి, బంధుప్రీతి తదితర అవలక్షణాలన్నీ ఉంటాయని ఆరోపించారు. కర్ణాటకలో ఇప్పుడు అలాంటి పరిస్థితే ఉందని గుర్తుచేశారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మధ్య అంతర్గత యుద్ధం సాగుతోందన్నారు. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ అదే కథ అని పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పట్ల హరియాణా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలో బడుగులకు అన్యాయం

రిజర్వేషన్లను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ప్రధాన మంత్రి మండిపడ్డారు రిజర్వేషన్ల పట్ల ద్వేషం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందని విమర్శించారు. అందుకే కాంగ్రెస్ రాజ కుటుంబంలోని నాలుగో తరం రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ అధికారంలో లేనప్పుడే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు హక్కులు లభించాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆయా వర్గాల హక్కులను లాక్కుందని, తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు.

పారిశ్రామికీకరణతో పేదలు, రైతులు, దళితులకు లబ్ధి

ఇటీవల జరిగిన అమెరికా పర్యటన గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. అమెరికాలో పలువురు ముఖ్య నాయకులను, ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులను కలిశానని చెప్పారు. భారతీయ యువత నైపుణ్యాల గురించి వారికి వివరించానని అన్నారు. ప్రపంచంలోని అతి పెద్ద కంపెనీలు నేడు భారత్‌లో ఫ్యాక్టరీలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. దేశంలో పారిశ్రామికీకరణ పెరిగితే పేదలు, రైతులు, దళితులు అధికంగా లబ్ధి పొందుతారని స్పష్టంచేశారు. పరిశ్రమలు, వ్యవసాయ రంగాల్లో బీజేపీ ప్రభుత్వం హరియాణాను అగ్రశ్రేణి రాష్ట్రంగా తీర్చిదిద్దిందని ఉద్ఘాటించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ బీజేపీకి ఆదరణ నానాటికీ పెరుగుతోందని, కాంగ్రెస్ దిగజారిపోతోందని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు.

రైతు చట్టాల వ్యాఖ్యలపై కంగన సారీ



సిమ్లా: రైతన్నల ఉద్యమం ధాటికి రద్దయిన మూడు వివాదాస్పద సాగు చట్టాలను మళ్లీ తేవాలని మంగళవారం వ్యాఖ్యానించిన బీజేపీ నాయకురాలు, మండీ ఎంపీ కంగనా రనౌత్ బహిరంగ క్షమాపణ చెప్పారు. తన మాటలు ఎవరినైనా బాధించి ఉంటే మన్నించాలని వేడుకుంటూ తన వ్యాఖ్యలను వెనక్కితీసుకున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో బుధవారం 68 సెకన్ల వీడియోను పోస్ట్ చేశారు. ''రైతు చట్టాలపై నేను చేసిన వ్యాఖ్యానాలు కేవలం నా వ్యక్తిగత అభిప్రాయాలు. బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. ఇప్పుడు నేను కేవలం నటిని కాదన్న విషయం అర్థమైంది. రాజకీయనాయకురాలిగా ఒక పార్టీకి ప్రాతినిధ్యంవహిస్తున్నందున నేనేం మాట్లాడినా అవి పార్టీకి కూడా వర్తిస్తాయన్న విషయం తెలిసొచ్చింది. నా అభిప్రాయాలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి. నా మాటలను ఉపసంహరించుకుంటున్నా'' అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

తృణమూల్ ఎంపీ నూరుల్ ఇస్లాం మృతి



కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ హాజీ ఎస్‌కే నూరుల్ ఇస్లాం (61) బుధవారం మృతి చెందారు. బసిర్హత్ నియోజకవర్గ ఎంపీ నూరుల్ ఇస్లాం క్యాన్సర్‌తో పోరాడుతూ తనవు చాలించారు. నూరుల్ ఇస్లాం మృతి పట్ల బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'బసిర్హత్ ఎంపీ, విలువైన సహచర నాయకుడు నూరుల్ ఇస్లాం ఇకలేరనే వార్త బాధ కలిగించింది. మారుమూల సుందర్బన్ ప్రాంతంలో అంకితభావంతో పనిచేసిన సామాజిక కార్యకర్త. వెనుబడిన ప్రాంతంలో పేదప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించారు. బసిర్హత్ ప్రజలు ఆయన నాయకత్వాన్ని కోల్పోయారు. కుటుంబానికి సానుభూతి తెలిపాను' అని మమత 'ఎక్స్'లో స్పందించారు. నూరుల్ ఇస్లాం 2009లో తొలిసారిగా బసిర్హత్ నుంచి ఎంపీగా గెలిచారు. ఇదే లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని హరోవా నుంచి 2016లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో బసిర్హత్ నుంచి ఎంపీగా విజయం సాధించారు.

ఖండాంతర క్షిపణిని పరీక్షించిన చైనా

అమెరికా నగరాలను తాకే సామర్థ్యం దాని సొంతం

బీజింగ్: అమెరికాలోని నగరాలను తాకేంతగా సుదూరాలకు వెళ్లగల సామర్థ్యమున్న ఖండాంతర క్షిపణి(ఐసీబీఎం)ను చైనా విజయవంతంగా పరీక్షించింది. వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాలను ప్రపంచానికి చాటే ఉద్దేశంతోనే చైనా ఈ పరీక్ష జరిపిందని అంతర్జాతీయ రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్ర జలాల్లో బుధవారం ఉదయం 8.44 గంటలకు జరిపిన ఈ పరీక్ష తమ ఆయుధ పనితీరు, సైన్యం శిక్షణా సామర్థ్యాలను ప్రదర్శించి నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించిందని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. పొరుగు దేశాలు ఆందోళన చెందకుండా ముందే రాకెట్ ప్రయోగించే దిశ, గమ్యం తదితర వివరాలను వారితో చైనా పంచుకుంది. దశాబ్దాల కాలంలో చైనా బహిరంగంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించడం ఇదే తొలిసారని చైనా అధికారిక 'చైనా డైలీ' వార్తాసంస్థ పేర్కొంది. ఈ క్షిపణి ఎంత దూరం వెళ్తుందో చైనా చెప్పలేదు. ఇది పలు అమెరికా నగరాలనూ తాకగలదని హాంకాంగ్ కేంద్రంగా నడిచే సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పేర్కొంది.

విద్వేష వ్యాఖ్యలొద్దు

- మీ అభిప్రాయాలను చొప్పించకండి
- హైకోర్టు జడ్జి 'పాక్' వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కేసుల విచారణ సందర్భంగా వాడే పదజాలం విషయంలో న్యాయస్థానాలు అత్యంత జాగరూకత వహించాలని సుప్రీం కోర్టు సూచించింది. పురుషాధిక్య భావజాలం, స్త్రీద్వేషం తదితరాలతో కూడిన వ్యాఖ్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని హితవు పలికింది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద ఇటీవల ఒక కేసు విచారణ సందర్భంగా బెంగళూరులో ఒక ముస్లిం ప్రాబల్య ప్రాంతాన్ని పాకిస్తాన్‌తో పోల్చడం, మహిళా న్యాయవాదిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ ఉదంతంపై సుమోటో విచారణను సీజేఐ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం ముగించింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోని ఏ ప్రాంతాన్నీ పాకిస్తాన్‌తో పోల్చకూడదని కుండబద్దలు కొట్టింది. అవి దేశ ప్రాదేశిక సమగ్రతకు విరుద్ధమని గుర్తు చేసింది. ఇలా ప్రాంతాలను, సామాజికవర్గాలను ఉద్దేశించి అభ్యంతకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సరికాదని స్పష్టం చేసింది. ''న్యాయవ్యవస్థ నిష్పాక్షికతపై సమాజంలో అన్ని వర్గాల ప్రజలకూ పూర్తి విశ్వాసముండాలి. దీన్ని కాపాడాల్సిన బాధ్యత లాయర్ల నుంచి జడ్జిల దాకా అందరిపైనా ఉంది. న్యాయమూర్తులు యథాలాపంగా చేసే ఇలాంటి వ్యాఖ్యలు వారి వ్యక్తిగత అభిప్రాయాలకు, రాగద్వేషాలకు అద్దం పడతాయి. వాటి ప్రభావం మొత్తం న్యాయవ్యవస్థపై పడుతుంది'' అంటూ హెచ్చరించింది.

మరింత వెలుగే పరిష్కారం!

న్యాయవ్యవస్థలో పారదర్శకత చాలా ముఖ్యమని ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది. కోర్టుల విచారణ ప్రక్రియపై సోషల్ మీడియాలో విద్వేష వ్యాప్తి పెద్ద సవాలుగా మారిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. దీనిపై సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. ''వెలుగుకు మరింత వెలుగే పరిష్కారం తప్ప చీకట్లు కాదు. అన్నిరకాల కోర్టుల్లోనూ విచారణ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయడం, తద్వారా న్యాయవ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చడమే సమస్యకు పరిష్కారం'' అని కుండబద్దలు కొట్టారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 51 మంది మృతి

టెల్ అవీవ్: లెబనాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణుల దాడి మూడోరోజు బుధవారం కూడా కొనసాగింది. ఈ దాడుల్లో 51 మంది చనిపోగా, 223 గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫిరాస్ అబైద్ వెల్లడించారు. హెజ్బొల్లా అగ్ర నాయకులే లక్ష్యంగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల్లో సోమ, మంగళవారాల్లో 564 మంది ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్‌పై భూతల దాడులకు సిద్ధమవుతున్నట్టు ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలేవి బుధవారం తెలిపారు.

మొస్సాద్ ప్రధాన కార్యాలయం పైకి..

హెజ్బొల్లా బుధవారం ఇజ్రాయెల్‌పైకి డజన్ల కొద్ది క్షిపణులను ప్రయోగించింది. ఏకంగా టెల్ అవీవ్‌లోని నిఘా సంస్థ మొస్సాద్ ప్రధాన కార్యాలయంపైకి ఖాదర్–1 బాలిస్టిక్ మిస్సైల్‌ను ప్రయోగించినట్టు ప్రకటించింది. టెల్ అవీవ్‌లో, సెంట్రల్ ఇజ్రాయెల్ వ్యాప్తంగా హెచ్చరిక సైరన్లు మారుమోగాయి. దాంతో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. భూతలం నుంచి భూతల లక్ష్యంపైకి ప్రయోగించిన క్షిపణిని అడ్డుకున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. లెబనాన్ నుంచి ప్రయోగించిన క్షిపణి సెంట్రల్ ఇజ్రాయెల్‌ను చేరుకోవడం ఇదే మొదటిసారని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది.

విచారణ చేపట్టండి

- సిద్ధరామయ్య పాత్రపై 3 నెలల్లోపు నివేదిక ఇవ్వండి
- లోకాయుక్త పోలీసులను ఆదేశించిన బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం

బెంగళూరు: మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) స్థలాల పంపిణీలో అక్రమాలు జరిగాయన్న ఉదంతంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు రంగం సిద్ధమైంది. సిద్ధరామయ్యను విచారించాలని లోకాయుక్త పోలీసులకు బుధవారం బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో సిద్ధూపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు విచారణను లోకాయుక్త పోలీసులు మొదలుపెట్టనున్నారు. సిద్ధూ భార్యకు ప్రభుత్వ వెంచర్లలో 14 ప్లాట్లను అక్రమంగా కేటాయించారన్న ఫిర్యాదుల మేరకు సిద్ధూపై విచారణకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అనుమతి ఇవ్వడాన్ని సిద్ధూ కర్ణాటక హైకోర్టులో సవాల్ చేయడం, ఆయన పిటిషన్‌ను కోర్టు కొట్టేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలో బుధవారం బెంగళూరు ప్రత్యేక కోర్టు జడ్జి సంతోశ్ గజానన్ భట్ ఆదేశాలిచ్చారు. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ, సిట్టింగ్ ఎమ్మెల్యేలు/ఎంపీల సంబంధిత కేసులను విచారించే ఈ కోర్టు తదుపరి చర్యలకు ఆదేశాలిచ్చింది. మూడు నెలల్లోగా అంటే డిసెంబర్ 24వ తేదీకల్లా సమగ్ర దర్యాప్తు జరిపి నివేదికను సమర్పించాలని జడ్జి సూచించారు. ముఖ్యమంత్రిపై ఉన్న ఫిర్యాదులపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని స్పెషల్ కోర్టుకు ఆగస్ట్ 19న తాము ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు తాజాగా ఉపసంహరించుకోవడంతో స్పెషల్ కోర్టు బుధవారం ఆదేశాలు ఇవ్వడానికి వీలు కల్గింది. ఈ కేసులో సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి, పార్వతి సోదరుడు మల్లికార్జున స్వామి, స్వామికి ఈ భూమిని అమ్మిన దేవరాజులను ప్రతివాదులుగా కోర్టు చేర్చింది.

విచారణను ఎదుర్కోవడానికి సిద్ధం

దర్యాప్తు మొదలుపెట్టాలని లోకాయుక్తకు ఆదేశాలు రావడంపై సిద్ధరామయ్య స్పందించారు. ''ఎలాంటి దర్యాప్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని గతంలోనే చెప్పా. ఎలాంటి దర్యాప్తునకు నేను భయపడను. చట్టప్రకారం పోరాటానికి నేను సిద్ధం. కోర్టు ఉత్తర్వుల కాపీలో ఏముందో చదివాక మళ్లీ మాట్లాడతా'' అని సిద్ధరామయ్య అన్నారు.

భారీ స్పందన వెనక విదేశీ హస్తం: దూబే



న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లు–2024ను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి ఏకంగా 1.25 కోట్ల వినతులు అందడంపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే సందేహాలను లేవనెత్తారు. పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ, చైనాల హస్తముండొచ్చని అనుమానం వెలిబుచ్చారు. ఈ భారీ స్పందనపై హోంశాఖ విచారణ జరపాలని కోరారు. మత ఛాందసవాద సంస్థలు, ఇస్లామిక్ అతివాద ప్రచారకుడు జాకీర్ నాయక్, ఐఎస్ఐ, చైనాల హస్తముండొచ్చని, అన్ని కోణాల్లో హోంశాఖ విచారణ జరపాలని జేపీసీ ఛైర్‌పర్సన్ జగదాంబి పాల్‌కు రాసిన లేఖలో దూబే కోరారు. నాలుగుసార్లు ఎంపీ అయిన నిశికాంత్ దూబే వక్ఫ్ జేపీసీలో సభ్యుడు కావడం గమనార్హం.

చెన్నైలో రోడ్డుకు ఎస్పీబీ పేరు



సాక్షి, చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని నుంగంబాక్కం కమ్దార్ నగర్ మెయిన్‌రోడ్డుకు గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం రోడ్డుగా నామకరణం చేయాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను, ప్రకటనను ఎస్పీబీ వర్ధంతి సందర్భంగా బుధవారం రాత్రి విడుదల చేశారు. 'గాన గంధరుడ్వీగా ఎస్పీ బాల సుబ్రమణ్యం సంగీత ప్రపంచానికి , సినీ రంగానికి చేసిన సేవలు అజరామరం. ఆయన అందర్నీ వీడి అనంతలోకాలకు వెళ్లినా తన పాటల రూపంలో ప్రతి ఒక్కరి హృదయంలో పదిలంగానే ఉన్నారు. చెన్నై నుంగంబాక్కంలోని కమ్దార్‌నగర్ తొలి మెయిన్ రోడ్‌కు.. ఎస్.పి. 'బాలసుబ్రహ్మణ్యం రోడ్‌గా పేరు పెట్టాలి అన్న విజ్ఞప్తి మేరకు సీఎం స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నారు' అని ప్రకటనలో తెలిపారు.

360 డిగ్రీల్లో రక్షణ కల్పించే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

ఐఐటీ–ఢిల్లీతో కలిసి అభివృద్ధి చేసిన డీఆర్‌డీఓ



న్యూఢిల్లీ: 360 డిగ్రీల కోణంలో పూర్తిస్థాయిలో రక్షణ కల్పించే తేలికపాటి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసింది. ఐఐటీ–ఢిల్లీ సహకారంతో ఈ తూటా కవచాలను రూపొందించింది. వీటికి అడ్వాన్స్‌డ్ బాలిస్టిక్స్ ఫర్ హై ఎనర్జీ డిఫీట్(అబ్‌హెడ్) అని నామకరణం చేసినట్లు రక్షణ శాఖ బుధవారం వెల్లడించింది. అత్యధిక స్థాయి ముప్పులను ఇవి సమర్థవంతంగా ఎదుర్కొంటాయని తెలియజేసింది. ఈ జాకెట్లలో ముందు, వెనుక ఉండే కవచాలు 360 డిగ్రీల్లో రక్షణ కల్పిస్తాయని పేర్కొంది. ఐఐటీ–ఢిల్లీలోని డీఆర్‌డీఓ అకడమియా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో వీటిని డెవలప్ చేసినట్లు వివరించింది. పాలిమర్స్, బోరన్ కార్బైడ్ సెరామిక్ మెటీరియల్‌తో తయారు చేసిన ఈ జాకెట్లు 8.2 కిలోల నుంచి 9.5 కిలోల వరకు బరువుతో ఉన్నాయని రక్షణ శాఖ తెలిపింది. ప్రోటోకాల్ ప్రకారం అన్ని రకాల ఆర్‌అండ్‌డీ పరీక్షల్లో ఈ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు నెగ్గాయని వెల్లడించింది.

పారాసిటమాల్ నాసిరకం



53 డ్రగ్స్ నాణ్యత లేవు: కేంద్రం

జాబితాలో క్లావమ్ 625, పాన్ డీ, గ్లిమిపిరిడిన్, టెల్మీసార్టాన్ తదితరాలు

న్యూఢిల్లీ: ఒళ్లు కాస్తంత వేడిగా అనిపించినా వెంటనే మింగే మాత్ర పారాసిటమాల్. అది నాసిరకం మాత్ర అని కేంద్ర ఔషధాల ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) తేల్చింది! పారాసిటమాల్ 500 ఎంజీతో పాటు విటమిన్ సి, విటమిన్ డీ3, విటమిన్ బి కాంప్లెక్స్ వంటి 53 సర్వసాధారణ ఔషధాల నాణ్యత కూడా ప్రమాణాల మేరకు లేదని ప్రకటించింది. తాజా నెలవారీ నాణ్యతా పరీక్షలో ఇవన్నీ ఫెయిలైనట్టు పేర్కొంది. యాంటీబయాటిక్స్, రక్తపోటు ఔషధాలు, విటమిన్ల మాత్రల్లో కూడా నాణ్యత లోపించిందని వెల్లడించింది. పలు రాష్ట్రాల్లో డ్రగ్ ఆఫీసర్లు ర్యాండమ్‌గా ఆయా విభాగాల ఔషధాలను చెక్ చేసి ఈ మేరకు నిర్ధారించారు. విటమిన్ సీ సాఫ్ట్‌జెల్స్, ఎసిడిటీ నివారణకు వాడే పాన్ డీతో పాటు చక్కెరవ్యాధికి వాడే గ్లిమిపిరిడిన్, బీపీకి వాడే టెల్మీసార్టాన్ మందులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

ఆల్కెమ్ లేబొరేటరీస్, హిందుస్తాన్ యాంటీబయోటిక్స్ లిమిటెడ్, కర్ణాటక యాంటీబయోటిక్స్, ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, మెగ్ లైఫ్‌సైన్సెస్, ప్యూర్ అండ్ క్యూర్ హెల్త్‌కేర్, హెటిరో డ్రగ్స్ సహా చాలా ఔషధ తయారీ సంస్థల డ్రగ్స్ పరీక్షల్లో ఫెయిలయ్యాయి. జీర్ణకోశ, ఉదర సంబంధ ఇన్ఫెక్షన్లకు అత్యంత ఎక్కువగా వాడే మెట్రోనిడజోల్ (హిందుస్తాన్ యాంటీబయోటిక్స్ లిమిటెడ్) కూడా నాణ్యత పరీక్షలో విఫలమైంది. షెల్‌కాల్ (టోరెంట్ ఫార్మాస్యూటికల్స్), క్లావమ్ 625, పాన్ డీ (ఆల్కెమ్ హెల్త్‌కేర్ సైన్సెస్), పారాసిటమాల్ (కర్ణాటక యాంటీబయోటిక్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్), సెపోడెమ్ చిన్నారులకు తీవ్రమైన బాక్టీరియా ఇన్ఫెక్షన్ చికిత్సకు ఎక్కువగా వాడే ఎక్స్‌పీ50 (హెటిరో–హైదరాబాద్) కూడా ప్రమాణాలను అందుకోలేకపోయాయని సీడీఎస్‌సీఓ పేర్కొంది. భారత మార్కెట్లో అందుబాటులో ఉన్న 156 ఫిక్స్ డోస్ డ్రగ్ కాంబినేషన్ ఔషధాలు హానికరమంటూ సీడీఎస్‌సీఓ వాటిని గత ఆగస్టులో నిషేధించడం తెల్సిందే. సర్వసాధారణంగా వాడే జ్వరం మందులు, నొప్పి నివారిణులు, అలర్జీని తగ్గించే ఔషధాల వంటివి వాటిలో ఉన్నాయి.

కశ్మీర్‌లో రెండోదశ పోలింగ్ 56 శాతం



ఓటేస్తున్న ఒమర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి బుధవారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో 56.05 శాతం పోలింగ్ నమోదైంది. రెండో విడతలో 26 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగిందని జమ్మూకశ్మీర్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పి.కె.పోల్ తెలిపారు. హజ్రత్‌బల్, రియాసి లాంటి చోట్ల ఇంకా పోలింగ్ కొనసాగుతోందని, ఫలితంగా పోలింగ్ శాతం మరింత పెరగొచ్చని చెప్పారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఈనెల 18, 25వ తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ ముగియగా.. అక్టోబరు 1న తుదిదశ పోలింగ్ జరగనుంది. అక్టోబరు 8న హరియాణా, కశ్మీర్ ఓట్ల లెక్కింపు జరగనుంది. రెండో విడత పోలింగ్ ప్రక్రియను 16 దేశాలకు చెందిన విదేశీ రాయబారుల పరిశీలకుల బృందం ప్రత్యక్షంగా తిలకించింది. జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదం తలెత్తాక.. బుధవారం తొలిసారిగా విదేశీ పరిశీలకులను అనుమతించారు. దీనిని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా తప్పుపట్టారు.

'బద్లాపూర్' ఎన్‌కౌంటర్‌పై అనుమానాలెన్నో!

ఆ రెండు బుల్లెట్లెక్కడ: బాంబే హైకోర్టు

ముంబై: మహారాష్ట్రలో సంచలనం సృష్టించిన బద్లాపూర్ ఘటనలో నిందితుడు అక్షయ్ షిండే ఎన్‌కౌంటర్‌పై బాంబే హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దాన్ని నివారించి ఉండాల్సిందని పేర్కొంది. ఘటనపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని, అది చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. ఎన్‌కౌంటర్ ముసుగులో షిండేను పోలీసులు హత్య చేశారంటూ అతని తండ్రి పెట్టుకున్న పిటిషన్‌పై కోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ''షిండే ఒక పోలీసుల నుంచి పిస్తోల్ లాక్కొని కాల్పులు జరిపాడంటే నమ్మశక్యంగా లేదు. లాక్కోవడం, అన్‌లాక్ చేయడం, కాల్చడం అంత సులభం కాదు. నిందితుడి కాళ్లు, చేతులపై కాకుండా తలపై ఎందుకు కాల్చారు? నలుగురు పోలీసులు ఒక వ్యక్తిని బంధించలేకపోయారా? నిందితుడు కాల్చిన మూడు బుల్లెట్లలో ఒకటి పోలీసు అధికారిని తాకిందన్నారు. మిగతా రెండు బుల్లెట్లెక్కడ? నిందితుడిని బంధించే అవకాశమున్నా ఆ పని చేయలేదేం?'' అని నిలదీసింది. దీనిపై సరైన రీతిలో దర్యాప్తు జరగకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన అన్ని ఫైళ్లను సీఐడీకి అప్పగించాలని పోలీసులను ఆదేశించింది. బద్లాపూర్ స్కూల్ ఘటన తర్వాత చైల్డ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటుకు ఆదేశించినా మహారాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆగ్రహించింది. థానే జిల్లాలోని బద్లాపూర్‌లో ఓ పాఠశాలలో ఇద్దరు మైనర్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు షిండే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అతడు ఈ నెల 23న ఎదురు కాల్పుల్లో మరణించినట్టు పోలీసులు చెప్పడం తెలిసిందే.

ఆత్మరక్షణ కోసమే: సీఎం షిండే

ఆత్మరక్షణ కోసమే పోలీసులు ఎదురు కాల్పులు జరిపారని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే అన్నారు. దీనిపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. నిందితుడు పారిపోయి ఉంటే మరోరకంగా మాట్లాడేవని ఎద్దేవా చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తారుమారు చేశారు

కోల్‌కతా వైద్యురాలి కేసులో సీబీఐ ఆరోపణ

న్యూఢిల్లీ: ''కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి రేప్, హత్య కేసు రికార్డులను మార్చారు. నకిలీవి సృష్టించారు. ఇందులో తాలా పోలీస్‌స్టేషన్ పాత్ర ఉంది'' అని సీబీఐ ఆరోపించింది. స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ అభిజిత్ మోండల్, కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ కస్టడీ ముగియడంతో బుధవారం కోర్టులో హాజరుపరిచింది. ఈ సందర్భంగా పలు అంశాలను వెల్లడించింది.

సాక్షి హైదరాబాద్

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



6 నెలల్లో ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించండి
రామంతాపూర్ పెద్ద చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను ఆరు నెలల్లో నిర్ధారించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. -8లో



ఇంటి రూఫ్..మొక్కలు సేఫ్..
టెర్రస్‌గార్డెన్.. నగరంలోని నివాసాల నుంచి పల్లెల వరకూ ఇప్పుడు ఇదే ట్రెండింగ్. పెరుగుతున్న కాలుష్యం ప్రజలను ప్రకృతి ఒడికి చేరువయ్యేలా చేస్తోంది. - సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/23.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రం చల్లనిగాలులు వీస్తాయి.





కేటీఆర్ @ ఎస్టీపీ

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్, ఖాజాకుంట ప్రాంతాల్లో నిర్మించిన ఎస్టీపీల(మురుగు నీటి శుద్ధి కేంద్రాలు)ను బుధవారం మాజీ మంత్రి కేటీఆర్, పలువురు ఎమ్మెల్యేలు సందర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తమ హయాంలో నగరంలో నాలాల పరిరక్షణతో పాటు రూ.4 వేల కోట్లతో 31 మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించామని తెలిపారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్ తదితరులు కేటీఆర్ వెంట ఉన్నారు.

మూసీపై ముందడుగు



ప్రక్షాళన చర్యలపై స్పీడ్ పెరిగింది..

నిర్వాసితుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే
- పునరావాసం కోసం పేదల వివరాల సేకరణ
- అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- రంగంలోకి సర్వే బృందాలు

సాక్షి, సిటీబ్యూరో:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ ప్రక్షాళనకు ముందడుగు పడింది. మూసీ నిర్వాసితులకు పునరావాసం కల్పించే దిశగా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. పరీవాహక ప్రాంతాల్లో నివాసాలు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఇంటింటి సర్వే నిర్వహించి నిర్వాసితుల వివరాలను సేకరిస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలను అర్హులుగా పరిగణించనుంది. దీనికి అనుగుణంగా క్షేత్ర స్థాయి సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. నదీ పరివాహక ప్రాంతం విస్తరించి ఉన్న హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు తమ పరిధిలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, సర్వేయర్లతో బుధవారం ఉదయం ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పునరావాసం కల్పనపై మార్గనిర్దేశం చేశారు.

75 నుంచి 100 గృహాలకు ఒక బృందం

ఒక్కొక్క బృందం మూసీ పరివాహక ప్రాంతాల్లోని 75 నుంచి 100 గృహాలను సందర్శించి కుటుంబాల సమగ్ర వివరాలు సేకరిస్తోంది. సర్వేలో ఇంటి యజమాని, కిరాయిదారు పేరు, వృత్తి, ఆధార్, వయసు, కులం తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఈ బృందంలో తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, జీహెచ్ఎంసీ పోలీస్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌లు ఉంటారు. ప్రతి రెండు బృందాలపై ఒక డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.



అత్తాపూర్‌లో నిర్వాసితుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

నదీ గర్భం నివాసాలపై ఫోకస్

మొదటి విడతలో మూసీ నదీ గర్భంలో ఉన్న నివాసాలపై అధికార యంత్రాంగం ఫోకస్ పెట్టింది. వాస్తవంగా పరీవాహక పరిధిలో 12,184 పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని రెండుగా వర్గీకరించి నదీ గర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీ గర్భంలో 2,166 నిర్మాణాలు ఉండగా, అందులో 288 భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు గల బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు, ఇందులో 1032 భారీ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్‌లో 3004 అక్రమ కట్టడాలున్నట్లు బయటపడింది.

పునరావాసం కింద డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు

మూసీ పరీవాహక నిర్వాసితులకు సుమారు 15 వేల కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లకు సంబంధించి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి నిర్వాసితులకు పునరావాసం కోసం ఇటీవల మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దాన కిషోర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. మూసీ నదీ గర్భం, బఫర్ జోన్‌లోని నివాసితులు ఏర్పాటు చేసుకున్న పేదల కుటుంబాలకు మానవతా ప్రాతిపదికన జీహెచ్ఎంసీ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి నివేదించారు. స్పందించిన ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నదీ గర్భంలో కట్టడాలు ఇలా

జిల్లా	నదీ గర్భం
హైదరాబాద్	1595
మేడ్చల్–మల్కాజిగిరి	239
రంగారెడ్డి జిల్లా	332

నిర్వాసితులకు భరోసా కల్పించండి: కలెక్టర్

మూసీ నిర్వాసితులకు పునరావాసంపై భరోసా కల్పించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పునరావాసం కల్పించేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయించిందని, అర్హులైన పేదల వివరాలు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటచారి, ఆర్డీఓ మహిపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

జంట జలాశయాలకు భారీగా వరద

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు భారీ స్థాయిలో వరద వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్లు నిండుకుండలుగా మారాయి. ఉస్మాన్‌సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరడంతో మంగళవారం రాత్రి రెండు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. హిమాయత్ సాగర్ జలాశయానికి సైతం వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి దగ్గరలో ఉంది. దీంతో బుధవారం సాయంత్రం రిజర్వాయర్ ఒక గేటు ఒక అడుగు మేర ఎత్తారు. ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను జలమండలి అప్రమత్తం చేసింది.

హిమాయత్‌సాగర్

పూర్తి స్థాయి నీటి మట్టం	: 1763.50 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	: 1763.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,200 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 348 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	: 17
ఎత్తిన గేట్లు	: 01

ఉస్మాన్‌సాగర్

పూర్తి స్థాయి నీటి మట్టం	: 1790 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	: 1790 అడుగులు
ఇన్‌ఫ్లో	: 400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 242 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	: 15
ఎత్తిన గేట్లు	: 02

వాన జల్లు.. రోడ్లకు చిల్లు

వర్షాలతో భారీగా దెబ్బతిన్న రహదారులు

వాహనదారులకు తప్పని అవస్థలు

సాక్షి, సిటీబ్యూరో: ఏ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయమయ్యే మహానగరంలో వరుసగా కురుస్తున్న వానలతో రోడ్లు దెబ్బతిన్నాయి. కాలనీ రోడ్లు, బస్తీ రోడ్లే కాకుండా ప్రధాన రహదారులు సైతం గుంతలు పడి బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్లపై వాహనాలు సాఫీగా ముందుకు కదలలేక గంటల తరబడి ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధ్వానంగా మారిన రోడ్లతో వాహనదారులకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు వెన్ను నొప్పి సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాలకు దెబ్బతింటున్న రోడ్లు కాంట్రాక్టర్ల పనితీరుకు అద్దం పడుతున్నాయి. ఇటీవల ముగిసిన గణేశ్ నిమజ్జనాలకు ముందే ప్రధాన రహదారులకు మరమ్మతులు చేశారు.

పది రోజులు గడవకముందే తిరిగి రోడ్లు గుంతలు పడి ప్రజలు అల్లాడుతున్నారు. ప్రధాన రహదారుల మార్గాల్లో రోడ్లు దెబ్బతింటే.. ఇరవై నాలుగు గంటల్లోగా మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ సదరు పనులు జరగడం లేదు. ప్రధాన రహదారులు సాఫీ ప్రయాణానికి ఎల్లప్పుడూ అనుకూలంగా ఉండాలనే తలంపుతో నిర్వహణ పనుల్ని సీఆర్ఎంపీ (సమగ్ర రోడ్డు నిర్వహణ ప్రాజెక్టు)కింద పెద్ద కాంట్రాక్టు ఏజెన్సీలకు అప్పగించారు. నిబంధనల మేరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణం, శానిటేషన్, గ్రీనరీ, రోడ్ మార్కింగ్స్ వంటి పనుల్ని సదరు ఏజెన్సీలే చేయాల్సి ఉండగా, చేయడం లేదు. దెబ్బతిన్న రోడ్లను సైతం సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం సీఆర్ఎంపీ పనుల్ని ప్రస్తావించారు. కాంట్రాక్టు పొందిన వారు కచ్చితంగా పనులు చేయాల్సిందేనని, లేని పక్షంలో తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఆర్ఎంపీ కింద ఏజెన్సీలకప్పగించిన రోడ్లు.. నిర్వహణ వ్యయం జోన్ల వారీగా (ఐదేళ్ల కాలానికి)

జోన్	రోడ్లు	దూరం(కి.మీ.)	అంచనా వ్యయం (రూ.కోట్లు)
ఎల్‌బీనగర్	81	155.07	290
చార్మినార్	93	132.03	269
ఖైరతాబాద్–1	84	85.50	202
ఖైరతాబాద్–2	74	102.02	239
శేరిలింగంపల్లి	55	110.44	312
కూకట్‌పల్లి	33	87.02	183
సికింద్రాబాద్	105	139.88	344
మొత్తం	525	811.96	1839

- ఖైరతాబాద్ జోన్‌లో ప్రధాన రహదారులు ఎక్కువగా ఉండటంతో రెండు ప్యాకేజీలుగా పనులప్పగించారు. ఒప్పందం మేరకు మూడేళ్లలో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావాలి. ఐదేళ్ల వరకు నిర్వహణ పనులు చేయాలి. నిర్వహణ పనులు కొద్దికాలంలో ముగియనున్నాయి.

ఒప్పందం మేరకు నిర్ణీత వ్యవధిలోగా సమస్య పరిష్కారం కావాలి. లేకుంటే సంబంధిత ఏజెన్సీకి దిగువ పేర్కొన్న మేరకు పెనాల్టీలు విధించాలి.

సమస్య	ఎన్ని గంటల్లో	పెనాల్టీ (రూ.లు)
పాట్‌హోల్స్	24	2,000
బ్యాడ్ ప్యాచెస్	72	2,000
నీటినిల్వ(వర్షాకాలంలో)	6	2,000
నీటినిల్వ ఇతర సీజన్లలో	12	2,000
మ్యాన్‌హోల్ కవర్స్	6	3,000
క్యాచ్‌పిట్ కవర్స్	6	3,000
వరదనీరు, మురుగునీరు	24	2,000

- కానీ పెనాల్టీలు విధిస్తున్న దాఖలాల్లేవు. పలు ప్రాంతాల్లో పాట్‌హోల్స్, నీటి నిల్వలున్నాయి.



విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్ సుష్మ టాకీస్ చౌరస్తాలో రోడ్డు పరిస్థితి ఇదీ...


గ్రేటర్‌లో మరిన్ని వెలుగులు

రూ.700 కోట్లతో 72 కొత్త సబ్‌స్టేషన్లు
- త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం..
- ఏటా 15 శాతానికిపైగా విద్యుత్ డిమాండ్
- భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ రోజు రోజుకూ మరింత పెరుగుతోంది. సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్ల పరిధిలోని పలు సబ్‌స్టేషన్లు ఇప్పటికే ఓవర్ లోడుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సరఫరాలో హెచ్చుతగ్గులు, తరచూ అంతరాయాలు తలెత్తుతుండటంతో ఇప్పటికే ఆయా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచారు. తాత్కాలికంగా సమస్యను పరిష్కరించినప్పటికీ..దీర్ఘకాలంలో వచ్చే వార్షిక వృద్ధి రేటును ఎదుర్కోవాలంటే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టక తప్పని పరిస్థితి. ఈ మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రూ.700 కోట్ల అంచనాతో 72 కొత్త ఇండోర్ సబ్‌స్టేషన్లు (33 కేవీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటిలో అత్యధికంగా సికింద్రాబాద్ సర్కిల్‌లో 14, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 13 సబ్‌స్టేషన్లను ప్రతిపాదించింది. ఆయా సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి ప్రధాన సమస్యగా మారింది. ప్రతిపాదిత సబ్‌స్టేషన్లకు అవసరమైన భూమిని కేటాయించాల్సిందిగా కోరుతూ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఇటీవల హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్, ఆర్టీసీ, అంబేద్కర్ వర్సిటీ, రాజీవ్ స్వగృహ, టీజీఐఐసీ, వాటర్ వర్క్స్ విభాగాధిపతులకు లేఖ రాశారు. వారి నుంచి సానుకూలమైన స్పందన కూడా లభించడంతో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శరవేగంగా చర్యలు చేపడుతోంది. డిసెంబర్‌లోగా ఆయా సబ్‌స్టేషన్లకు గ్లోబల్ టెండర్లు కూడా పిలిచే అవకాశం కూడా లేకపోలేదు.

కొత్తగా నిర్మించతలపెట్టిన సబ్‌స్టేషన్లు..

సర్కిల్	ప్రతిపాదిత సబ్‌స్టేషన్లు
హైదరాబాద్ సౌత్	12
హైదరాబాద్ సెంట్రల్	09
బంజారాహిల్స్	05
సికింద్రాబాద్	14
హబ్సిగూడ	03
మేడ్చల్	04
రాజేంద్రనగర్	13
సరూర్‌నగర్	05
సైబర్‌సిటీ	07



61 సబ్‌స్టేషన్లపై అధిక లోడు

2023 వేసవిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 3756 మెగావాట్లు నమోదు కాగా, 2024లో 4352 మెగావాట్లు నమోదైంది. ప్రస్తుతం 61 సబ్‌స్టేషన్లు 30 శాతానికిపైగా అధిక లోడుతో ఒత్తిడికి గురవుతున్నట్లు డిస్కం ఇప్పటికే గుర్తించింది. నగరంలో ఏటా వార్షిక విద్యుత్ వృద్ధిరేటు 15 నుంచి 20 శాతం నమోదవుతుండగా, కేపీహెచ్‌బీలో ఏకంగా 87 శాతం, పాపిరెడ్డికాలనీ 64 శాతం, గోపన్‌పల్లిలో 60 శాతం, పెద్ద అంబర్‌పేట్‌లో 58 శాతం, సాహెబ్‌నగర్‌లో 52 శాతం, బండ్లగూడలో 36 శాతం నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆయా ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలు, పరిశ్రమలు ఎక్కువగా వెలుస్తుండటం, గృహ విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో నమోదవుతుండడంతో ఆయా ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లు ఒత్తిడికి గురై..తరచూ అంతరాయాలకు కారణమవుతోంది. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి ప్రధాన అడ్డంకిగా మారింది. రెవెన్యూ అధికారులు భూములు కేటాయించినప్పటికీ..ఆయా భూములను ఏదో ఒక వివాదం వెంటాడుతూనే ఉంది. దీంతో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అంతరాయం ఏర్పడుతోంది. సీఎండీ ముషారఫ్ ఫారూఖీ స్వయంగా రంగంలోకి దిగి, ఎలాంటి వివాదాలు లేని భూములను కేటాయించాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు లేఖలు రాయడం గమనార్హం.

నేటి నుంచి స్టార్టప్ ఫెస్టివల్

రాయదుర్గం: ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్–2024ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) ప్రాంగణంలో ఈ వేడుకను గురు, శుక్ర, శని వారాల్లో నిర్వహించాలని తలపెట్టారు. గురువారం ఉదయం 9.30 గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫెస్టివల్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్–2లో ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖామంత్రి డి శ్రీధర్‌బాబు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. మనదేశంతో పాటు అమెరికా తదితర దేశాల నుంచి 20 రంగాలకు చెందిన 50 వేల స్టార్టప్‌లు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటాయి. వీటిలో 100 స్టార్టప్‌లను ఫైనలిస్టులుగా ఎంపిక చేస్తారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సైబర్ ఠాణాకు ప్రత్యేక గుర్తింపు

- సిటిజన్ సర్వీస్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం



సాక్షి, సిటీబ్యూరో: బాధితులకు ఉత్తమ సేవలు అందించడంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఠాణా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్ఓ) ఉన్న ఏసీపీ ఆర్జీ శివమారుతికి డీజీపీ డాక్టర్ జితేందర్, అదనపు డీజీ మహేష్ ఎం.భగవత్ ఈ మేరకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. డీజీపీ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. వివిధ అంశాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసుస్టేషన్లను గుర్తించడానికి పోలీసు విభాగం సిటిజన్ ఫీడ్ బ్యాక్ విధానం అవలంబిస్తోంది. జూలై, ఆగస్టులకు సంబంధించి బెస్ట్ సిటిజన్ సర్వీస్ కేటగిరీలో ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా టాప్ టెన్ ఠాణాలను ఎంపిక చేశారు. వీటిలో హైదరాబాద్ సైబర్ ఠాణా ప్రథమ స్థానంలో నిలిచింది. డీజీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్న ఏసీపీ శివమారుతిని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ తదితరులు అభినందించారు.

హెల్త్ సెక్టార్‌కు మంచి డిమాండ్: మంత్రి దామోదర



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి దామోదర

బంజారాహిల్స్: దేశ వ్యాప్తంగా హెల్త్ సెక్టార్‌కు మంచి డిమాండ్ ఉందని, దానికి తగినట్లుగానే తెలంగాణ ప్రభుత్వం కూడా వైద్య రంగంలో వివిధ విభాగాల్లో ఉన్న విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక సేవా దృక్పథం ఉండటం అభినందనీయమని, రక్తదానం చేస్తున్న విద్యార్థులు అవయవదానంపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అజయ్ మిశ్రా, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబు ఇంట్లో చోరీ

నిందితుడి అరెస్టు



నిందితుడు గణేశ్‌నాయక్

పహాడీషరీఫ్: సినీ నటుడు మంచు మోహన్‌బాబు ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ..జల్‌పల్లి గ్రామ శివారులో మోహన్‌బాబుకు నివాసం (మంచు టౌన్‌షిప్) ఉంది. ఇంటి ఆవరణలోనే వ్యక్తిగత కార్యదర్శులు, సెక్యూరిటీ సిబ్బంది, పనివారి కోసం వేర్వేరు గదులు సైతం ఉన్నాయి. ఈ నెల 22న మోహన్‌బాబు ఆదేశాల మేరకు పర్సనల్ సెక్రటరీ (పీఎస్) కిరణ్‌కుమార్ తిరుపతిలోని ఎంబీయూ యూనివర్సిటీ నుంచి రూ.10 లక్షల నగదు తీసుకొని రాత్రికి మంచు టౌన్‌షిప్‌కు చేరుకున్నాడు. రాత్రి కావడంతో ఉదయాన్నే డబ్బులు మోహన్‌బాబుకు ఇద్దామని భావించి తన గదిలో ఉంచాడు. ఈ టౌన్‌షిప్‌లోనే అనంతపురం జిల్లా నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన గణేశ్ నాయక్ (24) హౌజ్ బాయ్‌గా పని చేస్తున్నాడు. కిరణ్ డబ్బులు తెచ్చిన విషయం ముందే తెలుసుకున్న గణేశ్ అతడు నిద్రపోయాక, తలుపు నెట్టి డబ్బులు కాజేసి పరారయ్యాడు. ఉదయాన్నే లేచి చూడగా డబ్బుతో పాటు గణేష్ కూడా కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా అతడే డబ్బు తీసుకెళ్లినట్లు నిర్ధారణ అయ్యింది. మోహన్‌బాబు సూచన మేరకు కిరణ్ 23వ తేదీన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచనలతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపి బుధవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అతని వద్ద నుంచి రూ.7,36,400ల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

నిర్మాణాల్లోని సంపుల వద్ద జాగ్రత్త

సాక్షి, సిటీబ్యూరో: వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ (సంపుల) నిర్మాణాల వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సంపుల వద్ద ప్రమాదాలకు జరగకుండా సరిహద్దుల వద్ద పటిష్టంగా ఇనుప రాడ్లతో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతోపాటు రాత్రివేళల్లో విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యత గల అధికారిని ఇన్‌చార్జిగా నియమించడంతో పాటు పర్యవేక్షణకు మరొక అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని సూచించారు.

నకిలీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల అరెస్ట్



సాక్షి,సిటీబ్యూరో: ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా చెప్పుకుంటూ హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (హెల్త్) పంకజ తెలిపారు. బొగ్గుల సునీత, నీలి విజయలక్ష్మి అనే మహిళలు ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా చెప్పుకుంటూ వివిధ హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేస్తున్నట్లు ఇటీవల జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఫిర్యాదులు అందాయన్నారు. సదరు మహిళలు ఈ నెల 23న అల్వాల్, కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని రెస్టారెంట్లను తనిఖీ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే సమీపంలోని రెస్టారెంట్లు, హోటళ్లను అప్రమత్తం చేశారన్నారు. ఈ నేపథ్యంలో సుచిత్ర ఎక్స్ రోడ్ సమీపంలోని గిస్మత్ జైల్ మండి రెస్టారెంట్ నిర్వాహకులు సంబంధిత మహిళలను పట్టుకుని పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించగా, వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తాజ్‌మహల్ హోటల్‌కు షోకాజ్ నోటీసు

ఆబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో పప్పులో పురుగు కనిపించినట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంతో తనిఖీ చేసిన జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్‌లో పరిశుభ్రత లేకపోవడం తోపాటు ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారని పంకజ తెలిపారు. ఆహార పదార్థాలకు సంబంధించిన ఐటమ్స్‌పై లేబుల్స్ లేకపోవడం, ఆహారపదార్థాల నిల్వ ప్రదేశంలో బొద్దింకలు కనిపించడంతో పాటు పలు లోపాలున్నట్లు గుర్తించి నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి సంజాయిషీ వివరణ అందాక తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత..

● 7.795 కిలోలు స్వాధీనం



సాక్షి, సిటీ బ్యూరో: గ్రేటర్ పరిధిలోని రామచంద్రాపురం, కూకట్‌పల్లి రోడ్ సిటీ సర్కిళ్ల పరిధిలో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు బుధవారం 7.795 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ డీఎస్పీ తిరుపతి యాదవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా, మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన కిషోర్ దాస్ అనే వ్యక్తి నగరంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అతను అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 6.715 కేజీల గంజాయి, రూ. 7100 నగదు స్వాధీనం చేసుకున్నారు. దూల్‌పేట్ జాలి హనుమాన్ ప్రాంతానికి చెందిన గణేష్ సింగ్, ఉమేష్ సింగ్ కూకట్‌పల్లిలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచాం అందడంతో దాడి చేసిన పోలీసులు అతడి నుంచి 1.080 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గణేష్ సింగ్‌ను అరెస్టు చేయగా ఉమేష్ సింగ్ పరారీలో ఉన్నాడన్నారు. వారి నుంచి రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి అభినందించారు.

6 నెలల్లో ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించండి

● రామంతాపూర్ పెద్ద చెరువుపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
● అనధికార ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలి
● వారి వాదనలు విని తుది నోటిఫికేషన్ జారీ చేయాలి
● చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలి
● హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీని ఆదేశించిన ధర్మాసనం
● 2005 నాటి పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ ముగింపు



సాక్షి, హైదరాబాద్: నగరంలోని రామంతాపూర్ పెద్ద చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను ఆరు నెలల్లో నిర్ధారించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతకు ముందు అనధికార ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని.. వారి వాదనలను వినాలని అధికారులకు స్పష్టం చేసింది. తుది నోటిఫికేషన్ తర్వాత అక్రమ నిర్మాణాలు అని తేలితే తొలగించడంతో పాటు చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏను ఆదేశించింది. 2005 నాటి పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. కీలక ఆదేశాలు జారీ చేస్తూ విచారణ ముగించింది. హైదరాబాద్‌లో 532 చెరువులు క్షీణిస్తున్నాయని, 26 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని, ఈ కారణంగా నీటికాలుష్యం పెరిగి దుర్వాసన వ్యాపిస్తోందని ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ కెఎల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఆ తర్వాత అధికారిక ప్రతివాదులతో పాటు 153 మంది ప్రతివాదులుగా చేరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది.

ఎఫ్‌టీఎల్ 17.23 ఎకరాలు..

అనధికార ప్రతివాదుల తరఫున పలువురు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'గత ఏడాది అక్టోబర్‌లో ఎఫ్‌టీఎల్ 17.23 ఎకరాలని అధికారులు నివేదిక అందజేశారు. చుట్టు కంచె వేశామని.. గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు ఫొటోలను కూడా న్యాయస్థానానికి సమర్పించారు. నిజాం కాలంలో తాగు నీటి కోసం చెరువులు నిర్మించారు. పెద్ద చెరువు నుంచే హైవే నిర్మాణం చేపట్టారు. హైవేకు ఎంత విస్తీర్ణం పోయిందో అంచనా వేయలేదు. అనధికార ప్రతివాదులు దాదాపు 40 ఏళ్లకు పైగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. చెరువును చెత్తతో నింపడంతో విస్తీర్ణం కుంచించుకుపోయింది. సర్వే నంబర్లు లేకుండా చెరువు వివరాలు కోర్టుకు సమర్పించారు'అని చెప్పారు. సీజే జోక్యం చేసుకుంటూ.. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చారా? ఆ కాపీ ఉందా? అని ప్రశ్నించారు. నోటిఫికేషన్ కాపీ లేదని.. అయితే గత అక్టోబర్‌లో దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆ వివరాలకు కట్టుబడి ఉన్నామని అధికారులు చెప్పారన్నారు. 'రూ.10 కోట్లు ఖర్చు చేశామని, మార్కింగ్ చేశామని, ట్యాంక్ బండ్ నిర్మాణం కూడా చేపట్టామని చెప్పారు. గత అక్టోబర్ 10, 12న రెండు నివేదికలు దాఖలు చేశారు'అని న్యాయవాదులు పేర్కొన్నారు.

ఆక్రమణ అక్రమమే...

హెచ్ఎండీఏ తరఫున న్యాయవాది పాశం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'చుట్టుపక్క ప్రాంతాల్లో భూగర్భ నీటిని పెంచడం కోసం నాడు చెరువు నిర్మాణం చేపట్టారు. ఎఫ్‌టీఎల్‌పై తుది నోటిఫికేషన్ జారీ చేయలేదు. సర్వే చేయడానికి వెళ్లిన ప్రభుత్వ సిబ్బందిని అడ్డుకుంటున్నారు. న్యాయస్థానాల్లో పిటిషన్లు వేస్తూ.. కోర్టులో ఉన్నందున ఎలాంటి చర్యలు చేపట్టవద్దని వ్యాఖ్యానిస్తున్నారు. సర్వే చేసి రాళ్లు పాతినా కొద్ది రోజులకే వాటిని కూడా తొలగిస్తున్నారు. ఇళ్లను 40 ఏళ్ల క్రితం కట్టామని చెబుతున్నారు. ఎన్నేళ్ల క్రితం కట్టినా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తే అది అక్రమమే'అని వాదించారు. 'గత అక్టోబర్ 11 జారీ చేసింది ఎఫ్‌టీఎల్ ప్రిలిమినరీ నోటిఫికేషన్ మాత్రమే. చెరువు విస్తీర్ణం 17.23 ఎకరాలని అందజేసింది కేవలం రిపోర్టే. తుది నోటిఫికేషన్ జారీ కాలేదు. దుర్గం చెరువుకు ఇచ్చిన ఆదేశాలను ఇక్కడ కూడా అమలు చేస్తాం'అని ఏఏజీ ఇమ్రాన్ ఖాన్ చెప్పారు. దీనికి సమ్మతించిన ధర్మాసనం.. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేసి, చెరువు పరిరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను ముగించింది. విచారణ సందర్భంగా.. నీటి వనరులపై పిటిషన్లు పెరిగిపోతున్నాయని, రోజూ ఇలాంటివి విచారణకు వస్తున్నాయని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. చెరువుల ఆక్రమణ, కాలుష్యం లాంటి సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

పరీక్ష ఫెయిలైనందుకు..

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

చాదర్‌ఘాట్: పరీక్ష ఫెయిలైనందుకు మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్‌మలక్‌పేటలో నివసించే షేక్ దావూద్ (25) ఇంజినీరింగ్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షలు రాసిన అతను మంగళవారం వచ్చిన ఫలితాల్లో మళ్లీ ఫెయిలయ్యాడు. దీంతో మనస్తాపానికి లోనైన దావూద్ బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో వేడుకలు విజయవంతం



హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం

సాక్షి,సిటీబ్యూరో: నగరంలో బోనాలు, గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబి వేడుకలు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయడంతో విజయవంతమై ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హోటల్ గోల్కొండలో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్ – 2024కు ఆయన మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లోనూ అందరూ సమష్టి బాధ్యతతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను కాపాడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం వైద్య,విద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యటకంగా అభివృద్ధి చేసేందుకు నిర్వాసితులకు నష్టం జరగకుండా పునరావాసం, ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన బోనాలు, గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి ఉత్సవాల్లో కష్టపడి పని చేసిన అధికారులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వ ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

లంగర్‌హౌస్: చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్‌లను బుధవారం లంగర్‌హౌస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నార్సింగి ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలలు చెడు వ్యసనాలకు అలవాటుపడ్డారు. ఇందుకు అవసరమైన డబ్బుల కోసం వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన బైక్‌లను చోరీ చేసేవారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్‌ను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ డీసీపీ కేఎస్ ప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో ఎస్ఐ కవియుద్దీన్ పలు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించడంతో వారిని లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు. నిందితులను జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ముగ్గురి అరెస్ట్

కాచిగూడ: గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై కాచిగూడ పోలీసులు దాడిచేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. అడ్మిన్ ఎస్ఐ సుభాష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసులు అనే వ్యక్తి కొంత కాలంగా రఫీక్ ఉల్‌ముల్లా అనే వ్యక్తి సహకారంతో కుద్బిగూడలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం సదరు ఇంటిపై దాడి చేసిన పోలీసులు విటుడు సంతోష్ మిశ్రాతో పాటు శ్రీనివాసులు, రఫీక్ ఉల్‌మల్లాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6700 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు విమానాల దారిమళ్లింపు

ముంబైలో ప్రతికూల వాతావరణం నేపథ్యంలో..

శంషాబాద్: ముంబైలో భారీ వర్షాల కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల నెలకొనడంతో అక్కడికి బయలుదేరిన పలు విమానాలను దారి మళ్లిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం సాయంత్రం బయలుదేరిన రెండు విమానాలకు ముంబై విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వకపోవడంతో తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నాయి. అదే విధంగా ఇక్కడి నుంచి ముంబైకి బయలుదేరాల్సిన కొన్ని విమానాలు రద్దు చేసినట్లు సమాచారం.

బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం



సాక్షి,సిటీబ్యూరో: కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఐసీఈయు హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి, సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి. తిరుపతయ్య ఆరోపించారు.బుధవారం ఆబిడ్స్‌లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (సిటీ బ్రాంచ్ -7) శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీమా రంగంలో ప్రైవేట్ సంస్థలతో పోటీపడుతూ ఎల్ఐసీ అద్భుత ప్రగతిని ప్రదర్శిస్తుందన్నారు. దీనికి సంస్థ ఉద్యోగులు, ఏజెంట్ల నిరంతర కృషి ప్రధాన కారణంగా పేర్కొన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు సామాన్యులకు కొనుగోలు శక్తి తగ్గిపోతున్నదని, దీనికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. పాలకుల దురుద్దేశాలను ఉద్యోగులు, కార్మికులు నిశితంగా గమనించి సంఘటిత పోరాటం ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, గిరిధర్, ఝాన్సీ, మైథిలి, రవికుమార్, డెవలప్ మెంట్ ఆఫీసర్లు , ఏజెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఆబిడ్స్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (సిటీ బ్రాంచ్ – 7) శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణన్, కార్యదర్శిగా రమేష్ గౌడ్, కోశాధికారిగా శ్రావ్య, సంయుక్త కార్యదర్శులుగా వెంకటరమణ, సత్యనారాయణ, మహిళా సబ్ కమిటీ సభ్యులుగా సుచిత్ర ఎన్నికయ్యారు.

'గాంధీ'లో పసికందు అపహరణ

● గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు
● మహిళ అరెస్ట్



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

గాంధీ ఆసుపత్రి: గాంధీ ఆస్పత్రి నుంచి పసికందు(2 రోజులు) ఆపహరణకు గురి కావడం సంచలనం సృష్టించింది. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి శిశువు కిడ్నాప్‌ను కొద్ది గంటల్లోనే ఛేదించి చిన్నారిని సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, గుండాల మండలం, మోత్కూర్ గ్రామానికి చెందిన సుభాన్, షాహినా దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడోసారి గర్భం దాల్చిన షాహినాకు నొప్పులు రావడంతో ఈ నెల 24న ఉదయం గాంధీ ఆసుపత్రి లోని మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) లో అడ్మిట్ చేశారు. అదే రోజు ఉదయం ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. బుధవారం ఉదయం షాహినాకు కొన్ని పరీక్షలు చేయాల్సి ఉండడంతో చిన్నారిని అక్కడే వదిలేసి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చే సరికి బాబు కనిపించక పోవడంతో ఆసుపత్రి వర్గాల సహాయంతో అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా ఒక మహిళ బాబును అపహ రించినట్లు గుర్తించారు. ఫొటో ఆధారంగా ఆమెను నాచారంలో నివసిస్తున్న బీహార్‌కు చెందిన పూజాదేవిగా గుర్తించిన పోలీసులు నేరుగా ఆమె ఇంటికి వెళ్లి నిందితురాలని అదుపులోకి తీసుకోవడంతో పాటు చిన్నారిని గాంధీ ఆసుపత్రిలో ఉన్న తల్లిదండ్రులకు అప్పగించారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య పర్యవేక్షణలో చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్ గౌడ్, ఎస్ఐలు బాలరాజ్, కిషోర్, మహిళా కానిస్టేబుళ్లు మేఘమాల, ధనలక్ష్మి చాకచక్యంగా వ్యవహరించి కొద్ది గంటల్లోనే కేసును ఛేదించినందుకు ఉన్నతాధికారులు అభినందించారు.

'చిత్రపురి'అధ్యక్షుడి బెయిల్ రద్దు

మణికొండ: చిత్రపురి హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీలో నెలకొన్న అక్రమాలపై నమోదైన కేసుల్లో అరెస్టై బెయిల్‌పై బయటికి వచ్చిన సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ బెయిల్‌ను రాష్ట్ర హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు అతను అక్టోబర్ 4లోగా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవాలని ఆదేశించింది. అతను బెయిల్ నిబంధనలను ఖాతరు చేయకపోవడమేగాక ఎలాంటి అనుమతులు లేకుండా విజయవాడకు వెళ్లారని, పలు మార్లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారని, ఈ నేపథ్యంలో అతడి బెయిల్ రద్దు చేయాలని చిత్రపురి సాధన సమితి అధ్యక్షుడు కస్తూరి శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో న్యాయస్థానం అతడి బెయిల్ రద్దు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవాలని ఆదేశించినట్లు శ్రీనివాస్ తెలిపారు. బెయిల్ నిబంధనలకు విరుద్ధంగా అతను పలువురు సభ్యులను అతను బెదిరించాడన్నారు. త్వరలోనే చిత్రపురి హౌసింగ్ సొసైటీ రద్దయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్

21 కేసుల్లో హాజరైన ఎమ్మెల్యే రాజాసింగ్

సిటీ కోర్టులు : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పలు కేసుల్లో బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. శ్రీరామనవమి ర్యాలీ, గత ఎన్నికల్లో చేపట్టిన ప్రచార ర్యాలీల సందర్భంగా సిటీలో ట్రాఫిక్‌కు అంతారాయం ఏర్పడిందని, సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని పలువురు వ్యక్తులు నగరంలోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌లో మొత్తం 21 కేసులకు సంబంధించి విచారణకు హాజరయ్యారు. ఈ కేసుల్లో పలువురు ఫిర్యాదుదారులు, సాక్షులను న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి విచారించారు. అనంతరం రాజాసింగ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ మొత్తం 21 కేసుల్లో 15 మందిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా రాజాసింగ్ చేపట్టిన ర్యాలీతో ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం ఏర్పడలేదని, సోషల్ మీడియాలోఎలాంటి తప్పుడు ప్రచారాలు చేయలేదని న్యాయవాది కరుణసాగర్ కోర్టుకు సూచించారు. దీనిపై విచారణ చేపట్టిన స్పెషల్ జ్యుడీషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తదుపరి విచారణకు మరికొంత మంది సాక్షులకు నోటీసులు జారీ చేసింది.

బీజేపీ ఎంపీ బండి సంజయ్ గైర్హాజరు..

బీఆర్ఎస్ నాయకులను దండుపాలెం బ్యాచ్‌గా చిత్రీకరిస్తూ , దోపిడీ దొంగలుగా అభివర్ణించారని బీజేపీ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై నమోదైన పరువునష్టం కేసుపై బుధవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుల విచారణకు ఆయన గైర్హాజరు కావడంతో బండి సంజయ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ సీఆర్‌పీసీ 317 పిటిషన్ దాఖలు చేశారు.

మోత మోగితే వేటే..

● పరిమితులు దాటుతున్న పబ్స్ నిర్వాహకులు
● అర్ధరాత్రి వరకూ డీజే హోరు
● కేసులు నమోదు చేస్తున్న సైబరాబాద్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: పబ్‌ల నుంచి వచ్చే అధిక శబ్దాలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. ధ్వని కాలుష్యంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వారాంతంలో పబ్‌లపై ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. నిర్దేశించిన పరిమితికి మించి శబ్ద కాలుష్యాన్ని వెదజల్లుతున్న పబ్స్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు.

అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు..

రాయదుర్గంలోని రెండు పబ్‌ల నుంచి వచ్చే అధిక శబ్దాల కారణంగా ఆయా భవనంలోని ఇతర వ్యాపారులకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఓ వ్యక్తి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో సైబరాబాద్ పోలీసులు వారాంతంలో పబ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. గత వారాంతంలో రాత్రి 10–11:30 గంటల మధ్య ఐటీ కారిడార్‌లోని పలు పబ్‌లలో గచ్చిబౌలి పోలీసులు సౌండ్ మీటర్లతో తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి శబ్ద కాలుష్యాన్ని వెదజల్లుతున్న 15 పబ్‌లను గుర్తించారు. కాలుష్య ప్రమాణాలను ఉల్లంఘించిన ఆయా పబ్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

పరిమితికి మించి శబ్దాలు..

రాత్రి సమయంలో శబ్ద ఉద్గారాలు 55 డెసిబుల్స్‌కు మించి రాకూడదనేది నిబంధన. కానీ, చాలా వరకు పబ్‌లను పరిమితికి మించి ధ్వని కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. రాయదుర్గంలోని రెండు పబ్‌లలో అత్యధికంగా 88, 86 డెసిబుల్స్, అలాగే మాదాపూర్‌లో పరిధిలోని ఆరు పబ్‌లలో 60 నుంచి 72 డెసిబెల్స్ మధ్య శబ్ద కాలుష్యం ఉన్నట్లు తనిఖీలలో గుర్తించారు. నిబంధనలు అతిక్రమించిన పబ్‌ల నిర్వాహకులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, 292 కింద కేసులు నమోదు చేశారు.

శబ్ద పరిమితులివీ: (డెసిబుల్స్‌లో)

జోన్	ఉదయం	రాత్రి
వాణిజ్య ప్రాంతం	65	55
నివాస ప్రాంతం	55	45
నిర్మానుశ్య ప్రాంతం	50	40

టీజీఎస్పీడీసీఎల్ సీఎండీకి వినతి


టీజీఎస్పీడీసీఎల్ సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

వెంగళరావునగర్ : ఆర్టిజన్లను వారి అర్హతను బట్టి జేఎల్ఎంలుగా మార్చాలని పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 నేతలు కోరారు. ఈ మేరకు యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వజీర్ నాయకత్వంలో నేతలు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా ఆర్టిజన్లను పట్టించుకునే నాథుడే లేడన్నారు. జేఎల్ఎం నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అది వచ్చేలోపే అర్హతను బట్టి జేఎల్ఎం జూనియర్ అకౌంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా కన్వర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్, కె.శ్రీనివాస్, నాయకులు పులి కోటి, కె.లింగం, నవీన్, సురేశ్, రాజు, మాళవిక, వసంత, దుర్గ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య బృందం

రహమత్‌నగర్(బోరబండ) : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు బోరబండలోని సైట్–3 భార్గవి విద్యానికేతన్ స్కూల్లో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి దంత పరీక్షలు చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనత్‌నగర్ టీం సెక్రటరీ లయన్ డా. ప్రఫుల్లరెడ్డి మాట్లాడుతూ నగరవ్యాప్తంగా పాఠశాలల్లో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ డెంటిస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జూబ్లీహిల్స్ సభ్యురాలు లయన్ డా.సీతా మాట్లాడుతూ చిన్న పాటి జాగ్రత్తలతో దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చన్నారు. దంత వైద్యులు శ్రీనివాస్ భార్గవి విద్యానికేతన్ హెచ్‌ఎం మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ బస్తీ దశ మారేనా..?

- దత్తతకు గవర్నర్ ఆసక్తి
- బస్తీలో పర్యటించిన గవర్నర్ కార్యాలయ అధికారులు
- సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధిపై ఆరా
- నేడో, రేపో ఆమోద ముద్ర పడే అవకాశం
- త్వరలోనే బస్తీలో పనులు జరిగే ఛాన్స్


ఖైరతాబాద్ ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఇందిరానగర్ బస్తీ

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని ఐమ్యాక్స్ ఎదురుగా డబుల్ బెడ్రూం ఇండ్లను ఆనుకొని ఉన్న ఇందిరానగర్ బస్తీ దశ మారనుందా..? అంటే అవుననే సూచనలు కనిపిస్తున్నాయి. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ బిష్ణు వర్మ ఈ బస్తీని దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. బుధవారం గవర్నర్ కార్యాలయ అధికారులు ఇందిరానగర్ బస్తీలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ఎన్ని ఇండ్లు ఉన్నాయి..? ఎంత మంది నివసిస్తున్నారు..? స్థానికంగా ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అన్ని అనుకున్నట్లు జరిగితే గవర్నర్ ఆమోద ముద్ర వేస్తే ఈ నెల 27వ తేదీన స్వయంగా గవర్నర్ బస్తీలో పర్యటించి దత్తత తీసుకుంటున్నా అనే ప్రకటన చేసే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. అదేరోజు ఖైరతాబాద్ బడా గణేశ్ వద్ద స్వచ్ఛత కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొననున్నారు. ఈ బస్తీని గవర్నర్ దత్తత తీసుకుంటే పరిసర ప్రాంతాలన్నీ పచ్చదనం శుభ్రతతోపాటు, అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా మురుగు సమస్య..

ఇందిరానగర్ బస్తీలో మురుగు సమస్య కొన్నేళ్లుగా అధికంగా ఉంది. వరద వచ్చిందంటే చాలు స్థానికులకు కంటిమీద కునుకులేకుండా పోతున్నది. బస్తీవాసులు ఈ సమస్యను గవర్నర్ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, మహిళా భవన్ తదితర నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరారు.

గతంలోఆనంద్‌నగర్‌ను నరసింహన్..

గతంలో పనిచేసిన గవర్నర్ నరసింహన్ కూడా ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్‌కాలనీని దత్తత తీసుకున్నారు. ఇక్కడ సమస్యలను పరిష్కరించడమే కాకుండా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయన రెండుసార్లు ఈ కాలనీలో పర్యటించగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలను కూడా దత్తత తీసుకుని స్కూల్‌ను పూర్తిగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఈ పాఠశాలలో సీటు దొరకాలంటేనే కష్టతరంగా మారింది. ఆ స్థాయిలో పాఠశాలను తీర్చిదిద్దారు. ఇందిరానగర్ వాసులు కూడా గవర్నర్ తమ బస్తీని దత్తత తీసుకుంటే రూపురేఖలు మారుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


బస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న గవర్నర్ కార్యాలయ అధికారులు

ఉచిత వైద్య శిబిరం

లిబర్టీ: ఆదిలీలా ఫౌండేషన్ మాతృదేవోభవస రంగా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎన్విరాన్‌మెంట్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కాదని చెప్పినా కూల్చివేస్తారా..?

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా షేక్ పేట మండలం హకీంపేట విలేజ్ సర్వే నెం. 102/4/2లో ఉన్న 12 ఎకరాల 2 గుంటల స్థలం బంజారాకుంజ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిందని హైకోర్టు 2001, 2009లోనూ తీర్పునిచ్చినా ఎలా కూల్చివేస్తారని సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ బిన్ మహ్మద్, సెక్రటరీ కేవీ. నర్సింహారావు ప్రశ్నించారు. సొసైటీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. 1956 లో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి ఈ స్థలాన్ని మొయినుద్దీన్ ఖురేషికి ప్రభుత్వమే పంచనామా చేసి అలాట్ చేసిందన్నారు. 1994లో రాఘవ సొసైటీకి అలాట్ చేయగా ఇది ప్రభుత్వానికి చెందిందని హైకోర్టు రెండు దఫాలుగా తీర్పునిచ్చిందన్నారు. ఇక్కడ గది నిర్మించి విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నామన్నారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి సొసైటీ కార్యాలయ గదిని కూల్చివేయడం తగదన్నారు. ఈ స్థలం ప్రభుత్వానిది కాదని హైకోర్టు తీర్పునిచ్చిన తర్వాత కూడా రెవెన్యూ అధికారులు కోర్టులో అప్పీల్ కూడా చేయలేదని గుర్తు చేశారు. రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

27న ఉద్యమకారుల ఆత్మీయ సత్కార సభ



పోస్టర్ ఆవిష్కరణలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ శ్రీనివాస్ తదితరులు

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సత్కార సభను నిర్వహించనున్నట్లు ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సత్కార సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి వారికి గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, ఎంపీ ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, విమలక్క, దిలీప్‌కుమార్, వెన్నెల, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, వీరస్వామి, ఇంద్ర కుమార్, విష్ణువర్ధన్, నరేందర్ గౌడ్, పోచయ్య, అనంత లక్ష్మి, కొండ స్వామి, సురేందర్ యాదవ్, ఆర్కే బూపాల్, రాంబాబు, యాదిరెడ్డి, శ్యామల, జానకీరెడ్డి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లపై అభ్యంతరాలు ఉంటే చెప్పండి


సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

బంజారాహిల్స్: ఎక్కడైనా పోలింగ్ బూత్‌ల అవసరం ఉంటే ఈ నెల 27లోగా తమకు తెలియజేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి సూచించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ పొలిటికల్ పార్టీ మీటింగ్‌ను సర్కిల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, మృతుల పేర్ల తొలగింపు, షిఫ్టింగ్, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి ఇంటింటా సర్వే తుదిదశకు చేరిందన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా సర్వే చేసి ఎప్పటికప్పుడు యాప్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల తమకు పూర్తి సమాచారం లభించిందన్నారు.

ఎమ్మెల్యే కాలనీలో సీసీ రోడ్డు పనులు షురూ


ఎమ్మెల్యే కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీలో రమేశ్ సెలూన్ చౌరస్తాలో వీడీసీసీ రోడ్డు పనులు ఎట్టకేలకు బుధవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పనులకు శంకుస్థాపన జరగగా, అప్పటి నుంచి పనులు వాయిదా పడుతూ వచ్చాయి. నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కావా..? అంటూ 'సాక్షి' సమస్యను ఎత్తిచూపింది. దీంతో స్పందించిన జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఇంజినీర్లు రూ.40 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నారు. కాంగ్రెస్ నేత రోహిణ్‌రెడ్డి ఇంటి నుంచి ఈ చౌరస్తాకు నాలుగు వైపులా పనులు జరగనున్నాయి. వర్షం లేకుంటే 8 రోజుల్లో పనులు పూర్తిచేస్తామని ఇంజినీర్లు తెలిపారు.

రూ.86 లక్షల వ్యయంతో..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ప్రధాన రహదారి నుంచి క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, చర్చి, ఏసీబీ కార్యాలయం మీదుగా రమేశ్ సెలూన్ చౌరస్తా వరకు రూ.86 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయి వర్క్ ఆర్డర్ ఇచ్చారు. త్వరలోనే 540 మీటర్ల మేర రోడ్డు వేయనున్నట్లు ఇంజినీర్లు తెలిపారు.

కరాటేలో ఎస్ఎస్ఎస్వీ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు కరాటే పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం 68వ ఎస్‌జీఎఫ్ డిస్ట్రిక్స్ లెవల్ కరాటే పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థి సాహితీ గోల్డ్ మెడల్ సాధించి స్టేట్‌లెవల్ కాంపిటీషన్‌కు ఎంపికైంది. అదేవిధంగా పి.లోహిత్ శౌర్య, ఏ.చక్రేశ్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శిరీషా భవానీశంకర్, స్కూల్ కరాటే మాస్టర్ వాసుదేవ్, టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం పరిశీలన


మురుగునీటి శుద్ధి కేంద్రంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశ్

ఫిలింనగర్: కూకట్‌పల్లిలోని ఫతేనగర్‌లో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని కేటీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు బుధవారం పరిశీలించారు. దీంతో వారికి మద్దతుగా ఫిలింనగర్ నుంచి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అక్కడికి తరలివెళ్లారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ వాసవి హాస్పిటల్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో జాతీయ సేవాపథకం, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తమాలజీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్‌ల విభాగాలకు చెందిన వైద్యులు సుమారు 400 మంది విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి


జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఫిలింనగర్: ఫిలింనగర్ గౌతమ్‌నగర్ చౌరస్తాలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బీజేపీ నేతలు 'సదస్యత దివాస్'ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాడి భోజిరెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, నాయకులు ముద్దంగుల శ్రీనివాస్, కొత్త నీరజ, శంకర్, మైపాల్‌రెడ్డి, దండుగుల శేఖర్, గణేశ్‌యాదవ్, రామాంజనేయులు, పుట్ల శశిశేఖర్, లక్ష్మీనారాయణ, మక్కల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని వినతి


షబ్బీర్ అలీతో క్రిస్టియన్ నేతలు, పాస్టర్లు

బంజారాహిల్స్: క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని ఖైరతాబాద్ నియోజకవర్గం పలు చర్చిల పాస్టర్లతో పాటు క్రిస్టియన్ నేతలు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సలహాదారు షబ్బీర్ అలీని ఆయన నివాసంలో బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ పాస్టర్స్ ప్రేయర్ ఫెల్లోషిప్ చైర్మన్ రెవరెండ్ ఎం. ప్రభుదాస్ మాట్లాడుతూ నగరంలో క్రైస్తవ శ్మశాన వాటిక కోసం గతంలో పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఇప్పటికైనా కేటాయించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ ప్రేయర్ ఫెల్లోషిప్ అధ్యక్షుడు కె. రవి కుమార్, సంయుక్త కార్యదర్శి రాయల్ ప్రభాకర్, జాన్సన్, జీవన్, బెనర్జీ, కే. దేవదాస్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో ట్రాఫిక్ జామ్


చెట్టును తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్‌లో బుధవారం దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం అంజయ్యనగర్ ప్రధాన రహదారిపై ఉన్న చెట్టును సంబంధిత శాఖ సిబ్బంది తొలగించేందుకు క్రేన్‌ను తీసుకువచ్చారు. దీంతో రోడ్డు జామ్ అయ్యింది. హైటెక్ సిటీ, బోరబండ, పెద్దమ్మనగర్ వైపు వెళ్లే వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విజ్ఞానజ్యోతి ప్రిన్సిపాల్‌కు డైనమిక్ అవార్డు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌కాలనీలోని విజ్ఞానజ్యోతి పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ జె.అరుణ కుమారి డైనమిక్ అవార్డు–2024 అందుకున్నది. ఎడ్యుకేషన్ న్యూస్ నెట్‌వర్క్ సంస్థ యేటా ఉత్తమ ప్రతిభ, సాంస్కృతిక, విద్యారంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించి, వారిలోని ప్రతిభను వెలికితీసే పాఠశాలను గుర్తించి అవార్డులు ఇస్తుంటుంది. ఇందులోభాగంగా 2024లో విజ్ఞానజ్యోతి పబ్లిక్‌స్కూల్‌కు అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణ కుమారి మాట్లాడుతూ యాజమాన్యం, స్కూల్ చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్టూడెంట్స్ కృషి, ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందన్నారు.


డైనమిక్ అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ అరుణకుమారి

అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలి

లిబర్టీ: అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల నవీన్‌కుమార్ కోరారు. లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిపోయందన్నారు. వెంటనే విధివిధానాలు రూపొందించి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ఆరోగ్య భద్రత కల్పించాలి

కాచిగూడ: రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ఆరోగ్య భద్రత కల్పించాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ రావు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన అధ్యక్షతన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయీస్ హెల్త్‌కార్డ్ పరిధిని రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచాలని, మెడికల్ అలవెన్స్‌ను రూ.600 నుంచి రూ. 1000 వరకు పెంచాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఉద్యోగ విరమణ రోజునే చెక్కు రూపంలో అందేలా చూడాలన్నారు. అసోసియేషన్ సెంట్రల్ ఆఫీస్ కోసం నగరంలో ఒక చోట ప్రభుత్వ భవనం, అలాగే జిల్లా కేంద్రాల్లోనూ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.రాజమల్ల రెడ్డి, ఎస్పీ ఖాసింపీరా, ఆర్.రాధాకృష్ణ మూర్తి, సీహెచ్ రాజమౌళి గౌడ్, ఎస్.దేవేందర్ రెడ్డి, ఎ.సుదర్శన్ రాజ్, టీ వేణుగోపాల స్వామి, ఎస్.అయోధ్య, జీ రాజులు, ఆర్.సంజీవరెడ్డి, ఎం.ఏ.రహీం, యు.రాజులు, వి.రాజశ్రీ, పాల్గొన్నారు.

28, 29న తల్లిపాల ప్రాముఖ్యతపై అంతర్జాతీయ సదస్సు



వంజగుట్ట: సుషేనా హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ భాగస్వామ్యంతో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ నియోనాటాలజీ ఫోరం, రిషిహుడ్ యూనివర్సిటీల సహకారంతో తల్లిపాల ప్రాముఖ్యతపై ఈ నెల 28, 29వ తేదీల్లో నాలుగో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జాతీయ వైద్యకమిషన్ సభ్యుడు డాక్టర్ సంతోష్ కుమార్ క్రాలేటి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని డాక్టర్ దుర్గాభవానీతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటిరోజు నగరంలోని నీలోఫర్, ఈఎస్‌ఐతో పాటు మొత్తం 10 ప్రముఖ ఆసుపత్రుల్లో దేశవిదేశాల నుంచి వచ్చిన నిష్ణాతులైన వైద్యులతో వర్క్‌షాపు, 29 న మారీగోల్డ్ హోటల్‌లో దేశ విదేశాల నుంచి వచ్చిన 470 మందికి పైగా తల్లిపాల ఎక్స్‌పర్ట్‌చే సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సును జాతీయ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ గంగాధర్ ప్రారంభిస్తారని తెలిపారు.

నిమ్స్‌ను సందర్శించిన నిజాం ముని మనవడు



లక్డీకాపూల్ : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిమ్స్ దవాఖానలో రెండు రోజులుగా ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. బుధవారం నిమ్స్‌ను నిజాం ముని మనవడు సందర్శించారు. ప్రముఖ బ్రిటన్ వైద్యుడు దన్నపనేని రమణ వైద్య బృందం, నిమ్స్ కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డా.అమరేశ్వర్రావు సారథ్యంలో చిన్నారులకు మిలినియం బ్లాక్లోని పీడియాట్రిక్ గుండె విభాగాలను పరిశీలించి వారికి అందుతున్న చికిత్సను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే బ్రిటన్, నిమ్స్ వైద్య బృందాన్ని ఘనంగా సత్కరించారు

సాక్షి
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024

రెస్టారెంట్ సిబ్బందికి కేఎఫ్‌సీ శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో ఆహార పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందని కేఎఫ్‌సీ ఇండియా పార్టనర్ దేశాల జనరల్ మేనేజర్ మోక్ష్ చోప్రా ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెండ్‌కు అనుగుణంగా రెస్టారెంట్ల సేవల్లోనూ మార్పులు అవసరమని ఆయన పేర్కొన్నారు. 'ఇండియా సహయోగ్' కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది దేశంలో వెయ్యి రెస్టారెంట్లలోని సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందులో భాగంగా ఆహార భద్రత, పరిశుభ్రత, వినియోగదారుడి సేవలు, లాభదాయకం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫలితంగా రెస్టారెంట్ల అభివృద్ధితో పాటు వినియోగదారులకు మెరుగైన ఆహారం, సేవలు అందించే వీలుంటుందన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 2021లో ఇండియా సహయోగ్ కార్యక్రమంలో 100 రెస్టారెంట్లలోని సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. తాజాగా మరో వంద రెస్టారెంట్లలోని సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. బెంగళూరు, ఢిల్లీ, గౌహతి, కోల్‌కతా, ముంబై వంటి నగరాల్లో దాదాపు 800 రెస్టారెంట్లలోని సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. జాతీయ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఆర్‌ఏఐ), ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐకు చెందిన ఫుడ్ సేఫ్టీ, ట్రైనింగ్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం అధికారులతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

శతాధిక దేవాలయాలకు ప్రతిష్ఠ చేసిన రమాకాంతాచార్యులు

– త్రిదండి చినజీయర్ స్వామి



నాగోలు: వేలాది మంది ఆగమ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన ఘనత సముద్రాల రమాకాంతాచార్యులకే దక్కుతుందని త్రిదండి చినజీయర్ స్వామి కొనియాడారు. ఆగమ శాస్త్ర పండితుడు సముద్రాల రమాకాంతాచార్యులు ఈ నెల 13వ తేదీన నాగోలులో తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సముద్రాల రామాకాంతాచార్యుల పరమపదోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన జీయర్ స్వామి మాట్లాడుతూ తమ ఆశ్రమాలతో ప్రధానంగా యజ్ఞయాగాది క్రతువులన్నీ రమాకాంతాచార్యులే చేశారన్నారు. 2000 సంవత్సరంలో కృష్ణా వసంతోత్సవాలకు వారే ప్రధాన యజ్ఞాచార్యులుగా ఉన్నారని, శతాధిక దేవాలయాల ప్రతిష్ఠలు చేశారని జీయర్ స్వామి గుర్తు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వాములు, వివిధ ప్రాంతాల వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

8వ బెటాలియన్‌లో పోలీస్ క్యాంటిన్ ప్రారంభం



కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో సబ్సిడీ పోలీస్ క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న సంజయ్‌కుమార్

రాయదుర్గం: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో సబ్సిడీ పోలీస్ క్యాంటిన్(ఎస్‌పీఎస్)ను తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. 8వ బెటాలియన్ కమాండెంట్ సీ సన్నీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలీసుల సౌకర్యాల కల్పనకు కట్టుబడి ఉన్నామన్నారు. అన్ని రకాలుగా ప్రభుత్వం, రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగం కూడా పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడంలో భాగంగానే ఈ సబ్సిడీ పోలీస్ క్యాంటిన్ ప్రారంభించినట్లు చెప్పారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉన్నతాధికారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీ డీఐజీ ఎంఎస్ సిద్దిఖీ, అసిస్టెంట్ కమాండెంట్ కె.వీరయ్య, బి.సిత్రం, ఎం.రహెమాన్, నాగభూషణం, బి.రాంబాబు, బెటాలియన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జలమండలి ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఈడీ మయాంక్ మిట్టల్ ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, బోన్ మినరల్ డెన్సిటీ, ఆప్తమాలజీ స్క్రీనింగ్, డెంటల్, కొలెస్ట్రాల్ తదితర పరీక్షలు నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలో పనిచేసే సుమారు 200 మంది ఉద్యోగులు శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు.

మల్లేపల్లి ఐటీఐ ప్రవేశాల దరఖాస్తు గడువు 28

విజయనగర్‌కాలనీ: మల్లేపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లోని వివిధ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు, స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ పుష్పాల జ్యోతిరాణి తెలిపారు. ఈ నెల 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్) ట్రేడ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు, రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు విజయనగర్ కాలనీలోని మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించవచ్చు.


సంస్కృతికి చిరునామాగా హైదరాబాద్

చార్మినార్: దేశంలో అతి పురాతన, చారిత్రక నగరాలలో ఒకటైన హైదరాబాద్ నగరం సంస్కృతి, సంప్రదాయాలకు చిరునామాగా నిలుస్తుందని సీనియర్ ఆర్కిటెక్ట్ తాన్యా శ్రీవాస్తవ అన్నారు. పర్యాటక వారోత్సవాల్లో భాగంగా సిటీ కళాశాల టూరిజం విద్యార్థుల కోసం బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ గోల్కొండ నుంచి హైదరాబాద్ వరకు కాకతీయులు, బహమనీలు, మొగలులు, అసఫ్ జాహీలతో సహా వివిధ రాజవంశాల నిర్మాణ శైలుల విశిష్టతను ఆమె వివరించారు. ఇండో–పర్షియన్, యూరోపియన్, ఇండో–యూరోపియన్ శైలిలో ఉన్న నగరంలోని వారసత్వ కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ ఐజాజ్ సుల్తానా మాట్లాడుతూ ఇక్కడి ప్రత్యేక వంటల రుచులకు విదేశీ పర్యాటకులు ఫిదా అవుతున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ భాస్కర్, డాక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై తగ్గేదేలే!

- కంటోన్మెంట్ బోర్డు విజ్ఞప్తిని తిరస్కరించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎన్‌హెచ్–44, రాజీవ్ రహదారి మార్గాలు 60 మీటర్లకు విస్తరణ





కంటోన్మెంట్ పరిధిలో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌ల నమూనా ఊహా చిత్రాలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని రెండు ప్రధాన రహదారుల్లో నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి భూసేకరణ కుదింపునకు రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఎలివేటెడ్ కారిడార్ల కోసం రోడ్డు విస్తరణను 60 మీటర్ల(సుమారు 200 ఫీట్లు)కు బదులుగా 40 మీటర్లకు కుదించాలంటూ కంటోన్మెంట్ బోర్డు చేసిన విజ్ఞప్తిని తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కంటోన్మెంట్‌కు సమాచారం ఇచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణీత 60 మీటర్ల వరకు భూసేకరణ తప్పనిసరి అని తేల్చేశారు. గత నెల 24న కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో నిర్వహించిన బోర్డు సమావేశంలో పాల్గొన్న హెచ్‌ఎండీఏ అధికారులకు బోర్డు సభ్యులు పలు విజ్ఞప్తులు చేశారు. రోడ్డు విస్తరణలో ప్రైవేటు స్థలాలు ఉన్న చోట కుదింపునకు అవకాశం ఇవ్వాలంటూ స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ బోర్డు సభ్యుడు రామకృష్ణ సూచించారు. రోడ్డు విస్తరణ సజావుగా సాగాలంటే పూర్తిస్థాయిలో విస్తరణ చేపట్టడమే మంచిదని హెచ్‌ఎండీఏ అధికారులు అభిప్రాయపడ్డారు. శరవేగంగా పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఎలివేటెడ్ కారిడార్‌ను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ, ప్రజాప్రతినిధులు, బోర్డు అధికారుల సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అయితే రోడ్డు విస్తరణలో రాజీపడే అవకాశమే లేదని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, కంటోన్మెంట్‌కు సమాచారం ఇచ్చారు.

ఎన్‌హెచ్–44 మార్గంలో మెట్రోకు అనుగుణంగా..

నేషనల్ హైవే–44 మార్గంలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫామ్ రోడ్డు వరకు 5.4 కిలోమీటర్ల మేరకు, రాష్ట్ర రహదారి–1 (రాజీవ్ రహదారి) మార్గంలో టివోలీ జంక్షన్ నుంచి శామీర్‌పేట సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు 18.124 కిలో మీటర్ల వరకు రోడ్డును 60 మీటర్లకు విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించి రక్షణ శాఖ సుమారు 160 ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు అనుమతులు ఇచ్చింది. అయితే ఈ మార్గాల్లోని ప్రైవేటు స్థలాలకు సంబంధించి మినహాయింపులు ఇవ్వాలంటూ బాధితులు ఎంపీ, ఎమ్మెల్యే సహా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కలిసి వినతి పత్రాలు అందజేస్తున్నారు.

త్వరలోనే బోర్డు సమావేశం..


రోడ్డు విస్తరణను కుదించాలంటూ బోర్డు విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిన నేపథ్యంలో మరోసారి బోర్డు సమావేశం నిర్వహించే అవకాశం ఉందని బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా, లేదా మరోసారి విజ్ఞప్తి చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రోడ్డు విస్తరణ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ వాదన వినిపించేందుకు సిద్ధం అవుతున్నారు.

దృష్టి లోపంపై అలసత్వం వద్దు



సాక్షి, సిటీబ్యూరో: దృష్టి లోపంపై అలసత్వం తగదని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, అనంత్ బాజాజ్ రెటినా ఇన్‌స్టిట్యూట్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ రాజా నారాయణన్ స్పష్టం చేశారు. ప్రపంచ రెటీనా దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంఈ, ఎన్‌ఏఎండీ అనేవి దృష్టికి లోపాన్ని కలిగించే వ్యాధులని, వీటికి సరైన సమయంలో నిర్ధారణ, చికిత్స అవసరమని తెలిపారు. సమయానికి గుర్తిస్తే ప్రత్యేకమైన ఇంజెక్షన్లతో చికిత్స చేసి కంటి చూపు కాపాడవచ్చన్నారు. మందులు, పరికరాల్లో నూతన ఆవిష్కరణలతో డీఎంఈ, ఎన్‌ఏఎండీ వంటి రెటినల్ వ్యాధుల చికిత్సలో సవాళ్లను కూడా అధిగమించవచ్చని, 90 శాతం అంధత్వం నివారించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా స్మిత్ కనూరి సంతమ్మ సెంటర్ ఫర్ విట్రియో డిసీజెస్ హెడ్ డాక్టర్ ముదిత్ త్యాగి మాట్లాడుతూ భారత దేశంలో రెటినల్ వ్యాధులు 11 మిలియన్ల మేర ఉన్నాయన్నారు. అయితే, మౌలిక వసతులు, వైద్యుల కొరత ఉందన్నారు. సమస్యను ఎదుర్కొనేందుకు వ్యవస్థాపక సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కంటి శుక్లం, గ్లాకోమా సంబంధిత అంధత్వాన్ని తగ్గించడంలో నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్ నెస్, విజువల్ ఇంపెయిర్‌మెంట్ (ఎన్‌పీసీబీవీఐ) వంటి కార్యక్రమాలు ప్రశంసనీయమైన పురోగతి సాధించాయన్నారు.

ఎంఆర్‌డీసీఎల్ సీఈగా దత్తుపంత్



సాక్షి, సిటీబ్యూరో: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) చీఫ్ ఇంజినీర్(ఎఫ్‌ఏసీ)గా దత్తుపంత్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎంఆర్‌డీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఈగా నియమించారు. ఈమేరకు మున్సిపల్ పరిపాలనశాఖ ఉత్తర్వు జారీ చేసింది.

నిజాం కళాశాలకు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్సీ అవార్డు



నవీన్ మిట్టల్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ భీమా

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాలకు గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ ఆఫ్ విండ్సర్(కెనడా), గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కేరియర్ ఫోరంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్ చేతులమీదుగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల సమష్టి కృషి ఫలితమే ఈ అవార్డు అని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

పదేళ్లు నగరాన్ని గాలికి వదిలేసి.. బడాయి

– కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సాక్షి, సిటీబ్యూరో: అధికారంలో ఉన్నప్పుడు పదేళ్ల పాటు హైదరాబాద్‌ను గాలికి వదిలేసిన కేటీఆర్ ఇప్పుడు తెగ బడాయి కబుర్లు చెప్పడం విస్మయానికి గురిచేస్తోందని కాంగ్రెస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ విమర్శించారు. సీఎల్పీలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. చిన్న వర్షం పడితే నగరం వణికిపోయే పరిస్థితిని పదేళ్లలో తీసుకువచ్చారని, నాలాలు, చెరువులు కబ్జాకు గురైతే పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే కదా నగరం వరదల్లో మునిగిపోయిందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ట్రాఫిక్‌పై ఏ రోజైనా దృష్టి సారించారా?చిన్నపాటి వర్షానికే గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయ్యే పరిస్థితి నెలకొందని విమర్శించారు. నగరంలో కేటీఆర్ ఏ మొహం పెట్టుకొని తిరుగుతున్నాడని ప్రశ్నించారు. పైగా నగరాన్ని తానే తీర్చిదిద్దినట్లుగా తెగ హడావుడి చేస్తున్నాడని, తండ్రి నగర సృష్టికర్తగా, తాను నగిషీలు దిద్దాను అన్నట్లు కేటీఆర్ ఫోజులు, నవ్వులు ఉన్నాయన్నారు. వినే వాళ్లు అమాయకులైతే హైదరాబాద్ నగరాన్ని కనిపెట్టింది కల్వకుంట్ల కుటుంబం అని చెబుతాడేమో అన్నారు.

రాష్ట్రపతి నిలయంలో కళామహోత్సవ్ వేడుకలు



కళా మహోత్సవ్ వేడుకల వివరాలను వెల్లడిస్తున్న స్వాతి షాహీ

రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో భారతీయ కళా మహోత్సవ్‌ను ఈ నెల 29 నుంచి అక్టోబర్ 6 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఓఎస్‌డీ స్వాతిషాహీ మాట్లాడుతూ.. ఈ నెల 28న రాష్ట్రపతి నిలయంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 8 రోజుల పాటు జరిగే కళామహోత్సవ్ వేడుకలను ప్రారంభిస్తారని తెలిపారు. విభిన్నమైన సంస్కృతికి నిలయమైన అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయా, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన 300 మంది కళాకారులు కళ, సంస్కృతి చేనేత, ఆహార పద్ధతులను ప్రదర్శిస్తారు. ఈనెల 26 నుంచి అక్టోబర్ 6 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రపతి నిలయం అధికార వెబ్‌సైట్‌లో సందర్శన కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చని, రాష్ట్రపతి నిలయం వద్ద వాక్ ఇన్ సందర్శకుల కోసం ఆన్ ది స్పాట్ బుకింగ్ సౌకర్యం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి భవన్ ఇంటర్నల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ సునీష్, ఈశాన్య హస్తకళలు హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బ్రిగేడియర్ రాజీవ్‌కుమార్ సింగ్, రాష్ట్రపతి భవనం పీఆర్‌వో కుమార్ సమరేష్, నిలయం పరిపాలనాధికారి రజినిప్రియా తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రుల్లో 'రంగ్ రాత్రి'

- నగరంలో అతిపెద్ద దాండియా నైట్స్ కార్యక్రమాలు
- 4 నుంచి 6వ తేదీ వరకు సెలబ్రిటీలతో వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నార్సింగ్ ఓమ్ కన్వెన్షన్ వేదికగా వచ్చేనెల 4 నుంచి 6వ తేదీ వరకు 'రంగ్ రాత్రి' పేరుతో నగరంలోనే అతిపెద్ద దాండియా నైట్స్ నిర్వహించనున్నారు. ఆరం ఈవెంట్ ఆధ్వర్యంలో జరగనున్న 'రంగ్ రాత్రి' దాండియా నైట్స్ బ్రోచర్‌ను సినీ హీరో భరత్ వాజ్, డీజే పీయూష్ బజాజ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆరమ్ సీఈఓ కవితా శెట్టి మాట్లాడుతూ.. 3 రోజుల పాటు నగరంలోనే అతిపెద్ద దాండియా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. వచ్చేనెల 5న నటి శ్రీముఖీతో కలిసి ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద బతుకమ్మ, లైవ్ మ్యూజిక్ కన్సర్ట్‌లో పంజాబీ డోల్, గేమ్ జోన్ గుజరాతి సింగెర్స్, లైవ్ ఢోల్ తదితర విభిన్న రకాల వినోదభరిత కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.

బహుజన బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ



నాంపల్లి: ప్రతిఏటా నిర్వహించే బహుజన బతుకమ్మను, ఊరూరా, వాడవాడలా ఉద్యమంగా జరుపుకోనున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సారథి విమలక్క తెలిపారు. అక్టోబరు 2వ తేదీ నుంచి జరిగే బతుకమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఆమె బుధవారం అసెంబ్లీ ఎదురుగా ఉండే గన్‌పార్కు వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగికదాడులను నిరసిస్తూ మహిళలు గౌరవంగా జీవించే హక్కును చాటి చెబుతూ బహుజన బతుకమ్మ పండుగను అక్టోబర్ 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల కలకత్తాలో యువ వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఆడ పిల్లలను పుట్టనిద్దాం .. బతకనిద్దాం..' అంటూ నినాదాలు చేశారు.

జేఎన్‌ఎఫ్‌ఏయూకి భూకేటాయింపు

ఆలోచన విరమించుకోవాలి



నిరసనలో అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

– అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్‌ఎఫ్‌ఏయూ) కేటాయించడాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని బుధవారం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా హెచ్చరించింది. జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పల్లవి కాబడే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మహేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ యూనివర్సిటీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి జూబ్లీహిల్స్‌లో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 53 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే తర్వాత టీ–శాట్‌కు దాదాపు ఐదెకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం అనధికారికంగా కేటాయించింది. కేబుల్ బ్రిడ్జి అభివృద్ధికి నాలుగెకరాల భూమిని ఉపయోగించారు. దుర్గం చెరువులో ఇప్పటికే మరో ఐదెకరాలకు పైగా నీట మునిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది విద్యార్థులకు సేవలు అందించడానికి నిర్మించిన వివిధ కార్యాలయాల భవనాలతో విశ్వవిద్యాలయం 35 ఎకరాల్లో విస్తరించి ఉంది. మల్టీమీడియా భవనం, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ లెర్నింగ్ సెంటర్ కోసం ప్రత్యేక భవనాలను నిర్మించాల్సి ఉంది. నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇప్పటికే యూనివర్సిటీలో ఉన్న భవనాలు, ఇతర మౌలిక వసతులు సరిపోక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తమ ఆలోచనను విరమించుకోకపోతే ఉద్యమం ప్రారంభిస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ, అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మహేశ్వర్‌గౌడ్, రవీంద్రనాథ్ సోలమన్, డాక్టర్ వెంకటేశ్వర్లు, నారాయణరావు, బానోత్ ధర్మ ఎం.రుషేంద్రమని, పుష్పా చక్రపాణి, మాధురి, మేరీ సునంద, వెంకటరమణ, ఎల్వీకే రెడ్డి, ఎండీ హబీబుద్దీన్, కాంతం ప్రేమ్‌కుమార్, యాకేష్ దైద, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలు వీడాలి



కేంద్రీయ సదన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు

సుల్తాన్‌బజార్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలను వీడనాడాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. కోఠిలోని కేంద్రీయ సదన్ వద్ద పెన్షనర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు ఎంఎస్.రెడ్డి, కన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్ జాతీయ చైర్మన్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 8వ కేంద్ర పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సౌకర్యాల్లో కోత విధింపు తగదన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించినట్లు చెప్పారు. సీజీహెచ్‌ఎస్‌కు ఉద్యోగులు ప్రతినెలా జీతంలో చందా చెల్లిస్తున్నారని, రిటైర్డ్ అయిన తర్వాత కూడా 120 నెలల సబ్ స్క్రిప్షన్ చెల్లించారని తెలిపారు. కానీ ఇప్పుడు ఆయుష్మాన్ భారత్‌తో లింకు చేసి వైద్య సౌకర్యాలను కుదించాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. రైల్వే ఆస్పత్రిలో సీజీహెచ్‌ఎస్‌లో నిపుణులైన వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోమయ్య, రామచంద్రుడు అరుణ, ప్రభాకర్, బ్రహ్మచారి, శివలింగం, సుధావస్, వెంకయ్య, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీకి నూతన కార్యవర్గం

- ఏకగ్రీవంగా కమిటీ ఎన్నిక
- మరోసారి అధ్యక్షుడిగా మంత్రి శ్రీధర్‌బాబు



ఎన్నికైన ఎగ్జిబిషన్ సొసైటీ నూతన కార్యవర్గం

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సొసైటీ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడు కె.నీరంజన్, గౌరవ కార్యదర్శిగా బి.సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా డి.మోహన్, కోశాధికారిగా బి.ప్రభాశంకర్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా వి.అజయ్‌కుమార్, అశ్విని మార్గం, ఎం.చంద్రశేఖర్, మిలింద్ గద్వాల్‌కర్, బి.మురళీమోహన్, సతీష్ నాయక్, డాక్టర్ బి.వెంకటేశ్వర్, ఎకనామిక్ కమిటీ తరఫున డాక్టర్ గంగాధర్‌రావు, అశ్వక్ హైదర్, బీఎన్.రాజేశ్వర్, తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ విభాగం నుంచి డాక్టర్ జి.మన్సూర్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నూతన కమిటీ ఒక సంవత్సరం పాటు అధికారంలో ఉంటుంది.

కోర్టుకెక్కిన కుక్క గ్రూమింగ్ కేసు

- కుక్కకు గ్రూమింగ్ చేస్తూ గాయపర్చారని ఫిర్యాదు చేసిన విద్యార్థి
- ఆధారాలు లేక ఫిర్యాదును కొట్టేసిన రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్

సిటీ కోర్టులు: వినియోగదారుల కమిషన్‌లో కుక్కకు జరిగిన సేవా లోపంతో ఓ పిటిషనర్ దాఖలు చేసి పరిహారం కోరిన కేసు సంచలనంగా మారింది. ఆ కేసును కొట్టివేస్తూ రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు సీహెచ్ లతాకుమారి, సభ్యులు పారుపల్లి జవహర్‌బాబు, శ్యామలతో కూడిన బెంచ్ మంగళవారం విచారణ తీర్పు ఇచ్చింది. కేసు వివరాలు ఇలా.. కాప్రా, సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన న్యాయశాస్త్ర విద్యార్థి అనన్య వైష్ణవి రూ.1.20 లక్షలతో టామ్ పుడిల్ అనే కుక్కపిల్లను కొనుగోలు చేసింది. దానికి గ్రూమింగ్ చేయించేందుకు 12 అక్టోబర్ 2022న స్కూపీ స్క్రబ్ అండ్ పెట్ బైట్స్, పెట్ గ్రూమింగ్ సెలూన్‌కు తీసుకువెళ్లింది. ఇందుకు రూ.1900 వసూలు చేశారు. గ్రూమింగ్ చేసే సమయంలో కుక్క అరవడంతో గాయపడిందంటూ కుక్కను వెటర్నరీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. కుక్క ప్రైవేట్ పార్ట్ వద్ద ట్రిమ్మర్ గాట్లు కనిపించినట్లు వారు రిపోర్ట్ ఇచ్చారు. దీంతో పరిహారం కోరుతూ పిటిషనర్ రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ డాక్టర్ నివేదిక అంటే 12–10–2022కు ముందే కుక్కను వైద్యుడి వద్దకు 7–10–2022న తీసుకువెళ్లగా దాని ఎడమకాలు బరువు భరించలేక కుంటుతుండటంతో మందులు ఇచ్చారని, ఈ విషయాన్ని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొనలేదు. అయితే అక్టోబర్ 12 అక్టోబర్ 2022న జరిగిన గాయాల గురించి నిపుణులైన వైద్యుల నివేదిక దాఖలు చేయనందున గాయం ఎలా అయ్యిందని నిరూపించలేకపోవడంతో ఫిర్యాదు కొట్టివేస్తున్నట్లు కమిషన్ పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చింది.

మనిషి జీవితంలో అనేక పాత్రలు

హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి



చిక్కడపల్లి: నటన ఎంతో కష్టంతో కూడుకున్నదని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి పేర్కొన్నారు. చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో బుధవారం రాత్రి ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధన 30వ టీవీ పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి నిజజీవితంలో అనేక పాత్రల్లో జీవిస్తుంటారని అన్నారు. సినీదర్శకులు రేలంగి నర్సింహారావు మాట్లాడుతూ పురస్కారాలు మరింత ప్రతిష్టను పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలతో పాటు టీవీ రంగంలో ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. సాక్షి టీవీలో ప్రసారమయ్యే సత్యమేవ జయతే కార్యక్రమానికి ఆరాధన అవార్డు దక్కింది. ఈ సందర్భంగా సత్యమేవ జయతే ప్రోగ్రాం ప్రొడ్యూసర్ సంతోష్ ఈ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి అవార్డుతో సత్కరించారు. ఉత్తమ సీరియల్‌గా ఈటీవీలో ప్రసారమయ్యే మనసంతా నువ్వే సీరియల్ నిర్మాత ఎం.రాధాకృష్ణ, ఉత్తమ నటిగా పెళ్లి పుస్తకం నటి నయ, ఉత్తమ హాస్యనటుడిగా జబర్దస్త్ నటుడు గడ్డం నవీన్, ఉత్తమ విలన్‌గా మౌనపోరాటం నటి రూప పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖులు రేలంగి నర్సింహారావు, చిల్లా రాజశేఖర్ రెడ్డి, జి.హనుమంతరావు, ఉమర్‌ఖాన్, యుగేందర్ రెడ్డి, లోకం కృష్ణయ్య, లంకా లక్ష్మీనారాయణ, దైవజ్ఞ శర్మ, నిర్మలాప్రభాకర్, మోహన్‌కృష్ణ, గిరిరాజు, శంకర్, హమీద్ పాల్గొన్నారు.

సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్..

ఆన్‌లైన్ వేదికగా మిద్దె తోటల పెంపకంపై చర్చోపచర్చలు, గ్రూపులు ఊపందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఉద్యాన వన ప్రియుడు శ్రీనివాస్ హర్కరా 'సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్' స్థాపించారు. ఇప్పుడు ఇది అత్యధిక సంఖ్యలో నిపుణులు, సభ్యులను కలిగిన గ్రూప్స్‌లో ఒకటి. అటువంటి 16 గ్రూప్స్‌తో దాదాపు 25 వేల మంది సభ్యులతో టెర్రస్ గార్డెన్ హవా నడుస్తోంది. రూఫ్ గార్డెనింగ్, ఆర్గానిక్ కూరగాయలు, పండ్లను పండించడానికి సంబంధించిన అన్ని పరిష్కారాల కోసం వన్ స్టాప్ ప్లాట్‌ఫారమ్‌గా మారింది.





ఇంటి రూఫ్.. మొక్కలు సేఫ్..

ట్రెండీగా..టెర్రస్ గార్డెన్స్..

- అందం, ఆరోగ్యం, ఆహ్లాదం
- 'ఇంటింటై'వటుడింతై అన్నట్లుగా
- రూఫ్ గార్డెనింగ్‌పై పెరుగుతున్న క్రేజ్
- నగరంలో టెర్రస్ గార్డెన్ గ్రూప్స్‌లో 25వేల మందికి పైగా సభ్యులు
- పచ్చటి పరిసరాలపై నగరవాసుల ఆసక్తి
- ప్రకృతి ప్రేమికుల కలల వనాలుగా ఇంటి ఆవాసాలు

టెర్రస్‌గార్డెన్.. నగరంలోని నివాసాల నుంచి పల్లెల వరకూ ఇప్పుడు ఇదే ట్రెండింగ్. పెరుగుతున్న కాలుష్యం ప్రజలను ప్రకృతి ఒడికి చేరువయ్యేలా చేస్తోంది. ఓ వైపు ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం.. మరోవైపు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ నివాసాల్లో మొక్కలు పెంచుతున్నారు. నగరంలో స్థలాభావం కారణంగా మిద్దెలపై మొక్కలు పెంచడం వైపు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికితోడు గ్రీన్ సిటీస్, గ్రీన్ హౌస్ అనే కాన్సెప్ట్‌తో ఇప్పటికే అత్యాధునిక సౌకర్యాలతో బిల్డింగ్ డిజైన్‌లు వెలుస్తున్నాయి. దీంతో నగర వాసుల, ప్రకృతి ప్రేమికుల నివాసాలు పచ్చదనానికి ఆవాసాలుగా మారుతున్నాయి. అపార్ట్‌మెంట్, కాంప్లెక్స్‌ల నిర్వాహకుల నుంచి ఇండివిడ్యువల్ ఇళ్ల వరకూ గ్రీనరీకి ప్రాధాన్యతనిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

నగరంలో స్థల పరిమితులు ఉండటంతో, స్థలాభావం ఉన్నప్పటికీ పచ్చదనానికి పట్టం కట్టాలని ఆరాటపడుతున్న వారికి.. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలోని టెర్రస్ గార్డెన్‌లు పరిష్కారాన్ని అందిస్తున్నాయి. నగరంలో అపార్ట్‌మెంట్, కాంప్లెక్సుల్లో టెర్రస్ గార్డెన్‌లు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఒకప్పుడు భవనాల పైకప్పులపై ఖాళీగా ఉన్న స్థలాలు ఇప్పుడు పచ్చని ప్రదేశాలుగా మారి నగరవాసుల అభిరుచుల వైవిధ్యానికి నిదర్శనాలుగా మారుతున్నాయి.

మిద్దెతోట.. పచ్చని బాట..

పచ్చని వాతావరణాన్ని అందించడమే కాకుండా కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి గాలిలోకి ఆక్సిజన్‌ను విడుదల చేయడం ద్వారా మిద్దె తోటలు గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. అంతేకాదు కూరగాయలు, మూలికలు, పండ్లను సైతం పెంచడానికి అనేక మార్గాలను అన్వేషిస్తున్నారు ప్రకృతి ప్రేమికులు. ఇలా పర్యావరణానికి రక్షణగా నిలవడం.. తద్వారా ఆరోగ్యకరమైన ఆహారం తినడానికి అలవాటుపడుతున్నారు నగరవాసులు.



గ్రాండ్.. గార్డెన్ ట్రీట్స్..

ఇంటి మిద్దెలు, టెర్రస్ గార్డెన్స్ ఇటీవలి కాలంలో గ్రాండ్ ట్రీట్స్‌కి వేదికలు అవుతున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, కమ్యూనిటీ మిత్రులు, ఆఫీస్ కొలీగ్స్‌తో కలిసి వీకెండ్స్, ఇతర ప్రత్యేక ఈవెంట్స్‌లో ట్రీట్స్ ఇచ్చుకోడానికి వీలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అవుట్‌డోర్ సీటింగ్‌కు అనుగుణంగా బెంచ్‌లు, కుర్చీలు, ఊయల వంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. రట్టన్, వెదురు, కలప, లోహాలు మొదలైన వాటి నుండి ఆల్-వెదర్ ఫర్నిచర్ శ్రేణిలో రూఫ్ గార్డెన్స్ నిర్మాణమవుతున్నాయి.



ఆరోగ్యం వెంట.. ఇంటి పంట..

ఇటీవలి కాలంలో నగరంలో అధిక శాతం మంది భవనాలపై, టెర్రస్‌లో తమ సొంత కూరగాయలను ఆర్గానిక్ పద్ధతుల్లో పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది వారికి ఆరోగ్యకరమైన తాజా ఉత్పత్తులను అందించడమే కాదు.. సొంతంగా పండించుకుంటున్నామనే గొప్ప సంతృప్తిని కూడా అందిస్తుంది. టెర్రస్ గార్డెన్ కేవలం పచ్చదనాన్ని పంచడం మాత్రమే కాకుండా ఆయా కమ్యూనిటీలు నిర్వహించుకునే ఈవెంట్‌లకు అద్భుతమైన అనువైన ప్రదేశంగా మారాయి. పండుగల నుంచీ బార్బెక్యూల దాకా వేడుకలుగా జరుపుకోడానికి ఇవి వేదికలవుతున్నాయి. నగర జీవితంలో హడావిడి నుంచి తప్పించుకోడానికి నివాసితులకు వీలు కల్పిస్తోంది.



కొత్తపేటలో చంద్రావతి పెంచుతున్న గార్డెన్



'పురుగుమందులు లేని సేంద్రీయ కూరగాయలకు పెరుగుతున్న డిమాండ్‌తో, తమ సొంత పెరట్లలో లేదా టెర్రస్‌లలో కూరగాయలు, పండ్లను పండించడం వైపు చాలా మంది ఆకర్షితులవుతున్నారు. అలాగే ఇంటి ఖర్చులో పొదుపు మార్గాలను అందిస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కనీసం 45,000 మంది టెర్రస్‌పై తోటలను పెంచేందుకు మా ప్రచారం తోడ్పడింది' అని శ్రీనివాస్ చెప్పారు. హరిత ఉద్యాన వనాలను మెరుగుపరచడానికి కావాల్సిన విత్తనాలు, మాధ్యమాలు విడిభాగాలను కొనుగోలు చేయడానికి నిపుణుల సలహాలను పొందడంతో పాటు అన్ని రకాల సహకారం అందిస్తామని చెప్పారాయన.

రసాయనాల నుంచి విముక్తికి..



గోడల నుంచి.. ఎలివేషన్స్ వరకూ..

పచ్చదనం కోసం నగరవాసుల్లో పెరుగుతున్న ఆరాటం గోడల నుంచి ఎలివేషన్స్ వరకూ గతంలో ఉపయోగించని ప్రదేశాలను సైతం మొక్కలతో నింపేలా చేస్తోంది. ఈ క్రమంలోనే రూఫ్ గార్డెనింగ్, టెర్రస్, రూఫ్‌టాప్, పాటియో, బాల్కనీ, పోర్చ్, వరండా, సన్‌డెక్ వంటి ప్రదేశాల్లో మొక్కలు పెంచేస్తున్నారు. దీంతోపాటు హ్యాంగింగ్ గార్డెనింగ్ కూడా ప్రాచుర్యం పొందుతోంది.. బాల్కనీల్లో వైర్లు, బుట్టలు, కుండీలు వంటివి వేలాడదీస్తూ తీగ మొక్కలను పెంచుతున్నారు. తద్వారా ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కూడా లభిస్తోంది.

70 వేలకు పైగా సభ్యులు..

నగరంలో టెర్రస్ గార్డెన్స్ ట్రెండ్ బాగా పెరుగుతోంది. ప్రస్తుతం మా సంస్థ ఆధ్వర్యంలో 26 గ్రూప్స్ ఉండగా, తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా దాదాపు 70వేల మందికిపైగా సభ్యులున్నారు. పర్యావరణ హితంగా, నగర వాతావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు ఈ ట్రెండ్‌ని మరింతగా ప్రోత్సహించాలి. నగరం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మా సంస్థ కృషికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు వచ్చింది.

– శ్రీనివాస్, వ్యవస్థాపకులు, సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్.. (సీటీజీ)



సరికొత్త బాణీలే.. భవిష్యత్తుకు బాటలు

ప్రముఖ సంగీత దర్శకుడు కోటి
జీ తెలుగు వేదికగా సరిగమప 16వ సీజన్

సాక్షి, సిటీబ్యూరో: సంగీత పరిశ్రమలో సృజనాత్మకతతో ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్ సృష్టించేవారు చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రముఖ సంగీత దర్శకులు కోటి తెలిపారు. జీ తెలుగు వేదికగా ప్రేక్షకాదరణ పొందిన ప్రముఖ షో సరిగమప 16వ సీజన్ ఈ నెల 29న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో సరిగమప న్యాయనిర్ణేత కోటి మాట్లాడుతూ.. దాదాపు 5 వేల మందిలో అత్యుత్తమ కళా నైపుణ్యాలున్న 26 మందిని ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం ఏఐ వంటి మాధ్యమాలు వచ్చి నకిలీ సంగీతాన్ని సృష్టిస్తున్నాయని, ఇలాంటి ఎన్ని సాంకేతికతలు వచ్చినా స్వచ్ఛమైన, సహజమైన సంగీతం ఎప్పుడూ తన ప్రశస్తిని పెంచుకుంటూ పోతుందని అన్నారు. ప్రముఖ లిరిసిస్ట్ శ్యామ్ క్యాసర్ల ఈ సీజన్‌లో జడ్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ షోకు ఎంపిక చేసిన మట్టిలో మాణిక్యాలను ప్రముఖ సింగర్లుగా తీర్చిదిద్దేలా సానబెడతామని తెలిపారు. రెండు తరాలకు మధ్య వారధిలా సంగీత, సాహిత్య అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ఆయన చెప్పారు. ఈ సీజన్లో విలేజ్ వోకల్స్, సిటీక్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే 3 జట్లుగా పోటీలు కొనసాగుతాయని మరో జడ్జి ఎస్పీ శైలజ వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ సింగర్లు రువంత్, రమ్య, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



- పైరేట్స్ ఆఫ్ హైదరాబాద్ పేరుతో గ్రూప్
- నిమ్స్ ఆయుష్ మాజీ ఇన్‌ఛార్జి డా.నాగలక్ష్మి





సైక్లింగ్ @ ఫిఫ్టీస్!



వందల కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం

సాక్షి, సిటీబ్యూరో: ఓ వయసు దాటాక సాధారణంగా ఇంట్లో ఉండి.. మనవలు, మనవరాళ్లతో కాలక్షేపం చేస్తుంటారు.. లేదంటే పుణ్యక్షేత్రాలు చుట్టొస్తారు. కానీ చాలా తక్కువ మంది మాత్రమే తమలోని చిన్ననాటి అభిలాషను నెరవేర్చుకుంటారు. ఆ కోవకే చెందుతారు.. డాక్టర్ నాగలక్ష్మి. నిమ్స్ నేచురోపతి విభాగాధిపతిగా పనిచేసిన ఆమె.. 50 ఏళ్ల వయసులో సైక్లింగ్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. సాధారణంగా ఆ వయసులో కిలోమీటర్ దూరం నడిస్తేనే అలసిపోతుంటారు. కానీ డాక్టర్ నాగలక్ష్మి మాత్రం అలవోకగా కిలోమీటర్ల మేర సైకిల్‌పై ఎంచక్కా షికారు చేస్తూ, యూత్‌కు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తున్నారు.

సైకిల్ అంటే ఎమోషన్..

చిన్నప్పటి నుంచి తనకు సైకిల్ అంటే ఒక భావోద్వేగమని డా.నాగలక్ష్మి చెబుతున్నారు. చిన్నతనంలో తన తండ్రిని అడిగితే సైకిల్ కొనివ్వలేదని, అప్పటినుంచి ఆ కోరిక అలానే ఉండేదని చెప్పారు. చివరకు తన భర్త, పిల్లలు 50వ పుట్టిన రోజున సైకిల్ కొనిచ్చారని, అప్పటి నుంచి సైక్లింగ్ అలవాటుగా మారిందని వివరించారు. ఒక్కరోజు తాను 7 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లిన విషయాన్ని స్టేటస్ పెట్టుకోవడంతో తన స్నేహితులు ఆశ్చర్యపోయి.. ఆ తర్వాత చాలామంది తమ గ్యాంగ్‌లో కలిసిపోయి చాలా దూరం వెళ్తుండేవారని చెప్పారు. అనంతరం హ్యాపీ హైదరాబాద్ అనే సైక్లింగ్ గ్రూప్‌లో చేరామని వివరించారు. ఆ తర్వాత పైరేట్స్ ఆఫ్ హైదరాబాద్ పేరుతో 14 మంది స్నేహితులతో గ్రూప్ ఏర్పాటు చేశామని, అప్పటినుంచి కొత్త వారిని కలుస్తూ.. వారితో ఐడియాలు పంచుకుంటూ సైక్లింగ్ చేస్తూ సరదాగా గడుపుతుండేవారిమని పేర్కొన్నారు.

ఉదయం నాలుగు గంటలకే..

సైక్లిల్ అనగానే ఉదయం నాలుగు గంటలకే మెలకువ వస్తుందని, ఆ వెంటనే రెడీ అయి సైక్లింగ్ చేస్తుంటామని పేర్కొన్నారు. ఆ తర్వాత హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లో సైక్లింగ్ చేస్తామని వివరించారు. మంత్లీ చాలెంజ్‌లా పెట్టుకుని, 30 రోజులు 30 ప్రదేశాలు వెళ్లాలనే టార్గెట్ పెట్టుకుని మరీ సైక్లింగ్ చేశామని చెప్పారు.

శారీరక, మానసిక ఆరోగ్యం..

సైక్లింగ్‌తో ఎన్నో లాభాలు ఉంటాయని, శారీరకంగా ఎంతో ఆరోగ్యంగా, రోజంతా యాక్టివ్‌గా ఉంటామని నాగలక్ష్మి వివరించారు. అంతేకాకుండా హ్యాపీ హార్మోన్లు విడుదల అవుతాయని, దీంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు.



ఇనార్బిట్‌లో.. గేమ్ ప్యాలాసియో

సాక్షి, సిటీబ్యూరో: షాపింగ్ ప్రియుల కోసం మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో సరికొత్త విభాగం ఏర్పాటైంది. మాల్‌లోని లెవల్ –5లో ఏర్పాటైన ఈ గేమ్ ప్యాలాసియో విలాసవంతమైన వినోదాన్ని అందిస్తుందని మాల్ ప్రతినిధులు తెలిపారు. గార్మెట్ డైనింగ్, బొటిక్ బౌలింగ్, అత్యాధునిక గేమింగ్ స్పేస్.. లాంజ్ వంటివి ఇందులో ప్రధాన ఆకర్షణగా వివరించారు. ఇందులో 4 లైన్ల బౌలింగ్ అలె, ఆర్కేడ్ గేమ్స్, వీఆర్ అనుభూతులు, ట్రాంపోలైన్ ఫన్, అస్ఫాల్ట్ లెజెండ్స్, ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ తదితర గేమ్స్.. ఉన్నాయన్నారు.

మార్కెట్‌లోకి మీవీ 'హియర్ క్లియర్'

సాక్షి, సిటీబ్యూరో: వినడంలోని స్పష్టత గురించి వినియోగదారుల్లో అవగాహన పెంచడానికి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ మీవీ (ఎంఐవీఐ) ఆడియో పరికరాల రంగంలో తొలి సైలెంట్ యాడ్ ఫిల్మ్ 'హియర్ క్లియర్'ను రూపొందించింది. ఈ విషయాన్ని బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు. అదే విధంగా తమ సూపర్‌పాడ్స్ ఇమ్మర్సియో టీడబ్ల్యూఎస్ ఉత్పత్తిని నగర మార్కెట్లోకి విడుదల చేసింది. ఇది థియేటర్ తరహా శబ్దాలను అత్యంత స్పష్టమైన అనుభూతిని కల్పిస్తుందని వివరించారు. ఆడియో పరికరాలను వినియోగదారులు ఎలా వినియోగించాలి అనేది తెలియజేస్తూ ప్రభావవంతమైన మార్గంలో రూపొందిన యాడ్ ఫిల్మ్ ప్రేక్షకుల్ని అలరిస్తుందన్నారు.



వావ్.. దాండియా..

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన టామ్ జామ్, ఫంకార్ లేడీస్ క్లబ్స్ ఆధ్వర్యంలో జరిగిన దాండియా నృత్యం ఆకట్టుకుంది. నగరానికి చెందిన పలువురు పేజ్ త్రీ మహిళలు, సోషలైట్స్.. ఈ కార్యక్రమంలో పాల్గొని ఉత్సాహంగా గార్బా, దాండియాలతో అలరించారు. జూబ్లీహిల్స్‌లోని మాకో బ్రూ కేఫ్-రెస్టారెంట్‌లో జరిగిన ఈ నృత్య సందడిని క్లబ్ నిర్వాహకులు సుశీల బొకాడియా పర్యవేక్షించారు.





27న తిరుమలకు మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నా రు. ఈనెల 27 శుక్రవారం రాత్రికి ఆయన తిరుమల చేరుకుంటున్నారు. మరుసటి రోజు (28న), శనివారం ఉదయం ఆయన స్వామివారిని దర్శించుకుంటారు.

చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న ఆలయాల్లో పూజలు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు

సాక్షి, అమరావతి: తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేసినందుకు, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ఈ నెల 28న (శనివారం) ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. తిరుమల పవిత్రతను, వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం విశిష్టతను, స్వామి వారి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేశారని అన్నారు. కావాలని అబద్ధాలాడి, జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా చిత్రీకరిస్తున్నారని, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు తిరుమలను, తిరుమల లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో శనివారంనాడు ప్రత్యేక పూజలు చేయాలని పిలుపునిస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్వీట్ చేశారు.

మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ, నీలిమ మెడికల్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించేంత వరకు మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్, కాళోజీ నారాయణ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశా రు. తక్షణమే వారిద్దరిని పదవుల నుంచి తొలగించాలని కోరారు. ఈ రెండు కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఏ మాత్రం అన్యాయం జరిగినా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చ రించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ కోర్టుకు వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించాలని స్వామిగౌడ్ కోరారు.

‘ఆలయ ఉద్యోగులకు పీఆర్సీ అమలుచేయండి’

వేములవాడ: రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ఓ హోటల్‌లో బుధవారం రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయశాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌ను ఇప్పటికీ అమలు చేస్తున్నారని చెప్పారు. ఆలయాలకు పెరిగిన భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఐదేళ్లకోసారి క్యాడర్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశానికి వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి, బాసర ఆలయాల ఉద్యోగులు హాజరయ్యారు. దేవాలయ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రమేశ్‌బాబు, జేఏసీ కో–చైర్మన్ చంద్రశేఖర్, టీఎన్జీవో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

బాబు కుట్రకు పోలీసు వత్తాసు

వేధించి తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే కుతంత్రం ● లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో చంద్రబాబు పన్నాగం

- వీర విధేయ పోలీసు అధికారులతో ‘సిట్’
- సిట్ ఏర్పాటు తరువాత కూడా పోలీసులకు ఫిర్యాదు
- ముందు రోజు రాత్రే సీఐని వీఆర్‌కు పంపిన ప్రభుత్వం
- తమ అనుకూల అధికారిని నియమించిన తరువాతే ఫిర్యాదు
- ఇప్పటికే వీర విధేయులతో ‘సిట్’.. తాజాగా పోలీసు అస్త్రం
- తమ కుట్రను ప్రశ్నిస్తున్న వారిని వేధించేందుకు చంద్రబాబు వ్యూహం



సాక్షి, అమరావతి: తిరుపతి లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారం బెడిసికొట్టడంతో సీఎం చంద్రబాబు కొత్త కుట్రకు తెర తీశారు. అవాస్తవ ఆరోపణల కుతంత్రం తన మెడకే చుట్టుకుంటుండంతో ఆయన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించలేకపోవడంతో ఆ వివాదమంతా టీడీపీ ప్రభుత్వ సృష్టేనని జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ అంశంపై మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టు తలుపు తట్టడంతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ అంశంపై న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుంటే తన కుట్ర బట్టబయలవుతుందని బెంబేలెత్తుతున్నారు. దీంతో తాను సృష్టించిన వివాదాన్ని తనకు అనుకూలంగా ముగించేందుకు చంద్రబాబు దారులు వెతుకుతున్నారు. అందులో భాగంగానే టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో ‘సిట్’ఏర్పాటు చేసినప్పటికీ ఆయన స్థిమితపడలేకపోతున్నారు. అందుకే లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో టీటీడీ అధికారులతో బుధవారం ఫిర్యాదు చేయించారు. పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తిమ్మిని బమ్మి చేసే కుతంత్రానికి పదును పెడుతున్నారు.

మరి.. నాడు బాబు హయాంలోనూ కల్తీ జరిగిందా?

నెయ్యి కల్తీ జరిగినట్లు ప్రాథమిక ఆధారంగా టీటీడీ ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన అంశం విడ్డూరంగా ఉంది. కేజీ నెయ్యి రూ.319.80 చొప్పున సరఫరా చేసేందుకు ఏఆర్ డెయిరీ అంగీకరించడమే కల్తీ చేశారనేందుకు ప్రాథమిక ఆధారం అని పేర్కొనడం గమనార్హం. మరి కేజీ రూ.319.80 చొప్పున సరఫరా చేయడమే కల్తీ చేసినట్టుగా భావించాలంటే.. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2015లో కేజీ రూ.276 చొప్పున, 2018లో రూ.320 చొప్పునే టీటీడీ నెయ్యి కొలుగోలు చేసింది. ఇక అప్పుడు కూడా కల్తీ చేసినట్లే భావించాలి కదా...? నాడు టీడీపీ హయాంలో నెయ్యి సరఫరా చేసిన డెయిరీలపై కూడా ఫిర్యాదు చేయాలి కదా? అని నిపుణులు నిలదీస్తున్నారు.

రాత్రికి రాత్రే సీఐ అవుట్

తిరుపతి ఈస్ట్ పోలీసులకు టీటీడీ బుధవారం ఫిర్యాదు చేసింది. అయితే ఆ ముందు రోజే అంటే మంగళవారం రాత్రే తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం హఠాత్తుగా వీఆర్‌కు పంపించింది. ఆయన స్థానంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న తమకు విధేయుడైన ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించింది. లడ్డూ అంశంపై అక్రమ కేసు నమోదు చేసేందుకు మహేశ్వర్ రెడ్డి సుముఖత చూపలేదని సమాచారం. దాంతో ఆయన్ని తప్పించి తమకు విధేయుడైన అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసే ఫిర్యాదులపై విచారణ నిర్వహించాల్సిన బాధ్యత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌దే. టీడీపీ ప్రధాన కార్యాలయం చెప్పినట్లుగా దర్యాప్తు పేరిట వేధింపులకు పాల్పడే అధికారిని నియమించుకునేందుకే ఈ ఎత్తుగడ వేసినట్లు స్పష్టమవుతోంది.

సిట్ వేశాక పోలీసులకు ఫిర్యాదా...!

లడ్డూ ప్రసాదం అంశంపై ప్రభుత్వం మంగళవారం తమకు వీర విధేయులైన పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు కొమ్ము కాసిన గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇక సిట్‌లో సభ్యుడిగా నియమించిన విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య అల్లుడు. రిటైరైన తరువాత హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా పని చేసిన కృష్ణయ్య అనంతరం 2014–19లో టీడీపీ హయాంలో ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన్ని కూటమి ప్రభుత్వం తాజాగా రాష్ట్ర కాలుష్య నియమంత్రణ మండలి చైర్మన్‌గా నియమించింది. ఆయన అల్లుడు గోపీనాథ్ జెట్టీని సిట్ సభ్యుడిగా నియమించడం ద్వారా చంద్రబాబు కుతంత్రం బహిర్గతమవుతోంది. అయినా సరే చంద్రబాబులో ఆందోళన తగ్గలేదు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని జాతీయ స్థాయిలో పార్టీలు, నిపుణులు, న్యాయవేత్తలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. తన వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో చంద్రబాబులో ఆందోళన మరింత తీవ్రమైంది. సుప్రీంకోర్టు విచారణకు ఆదేశిస్తే టీడీపీ సర్కారు కుట్ర మొత్తం బయటపడుతుందన్నది ఆయనకు తెలుసు. తమ కుట్రను కప్పిపుచ్చేందుకు సిట్‌తో సరిపెట్టలేమని భావించారు. అందుకే పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తనకు అనుకూలంగా లొంగదీసుకునే కుతంత్రానికి తెరతీశారు. తాజాగా తిరుపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం ద్వారా మరోవైపు నుంచి కూడా విచారణ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

పక్కా పన్నాగంతోనే పోలీసులకు ఫిర్యాదు

లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూనే చంద్రబాబు ప్రభుత్వం పోలీసు అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధపడింది. కల్తీ నెయ్యి సరఫరా చేశారని గుర్తించామని చెబుతున్న రెండు నెలల తరువాత టీటీడీ తీరిగ్గా తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఫిర్యాదు చేయడం గమనార్హం. తమిళనాడుకు చెందిన నెయ్యి సరఫరాదారు ఏఆర్ డెయిరీపై టీటీడీ జనరల్ మేనేజర్ (స్టోర్స్) పి.మురళీకృష్ణ ద్వారా ప్రభుత్వం ఫిర్యాదు చేయించింది. నెయ్యి కల్తీ జరిగిందని జూలై 23నే టీటీడీకి నివేదిక వచ్చిందన్న చంద్రబాబు సెప్టెంబరు 20న తొలిసారిగా వెల్లడించి దుష్ప్రచారానికి తెరతీశారు. మరి కల్తీ జరిగిందని తెలిసిన జూలై 23నే ఆహార భద్రతా చట్టం కింద టీటీడీ ఎందుకు కేసు నమోదు చేయలేదన్న న్యాయ నిపుణుల ప్రశ్నకు ప్రభుత్వం సూటిగా సమాధానం చెప్పలేకపోయింది. టీటీడీ ఈవో శ్యామలరావు మొదట ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ కలిసిందని... అయితే ఆ నెయ్యి వాడలేదని.. తిప్పి పంపామని వెల్లడించారు. అంతేగానీ జంతువుల కొవ్వు కలిసిందని ఆయన చెప్పలేదు. జంతువుల కొవ్వు కలిసినట్లు ఎన్‌డీడీబీ నివేదికలో కూడా వెల్లడించలేదు. కానీ తరువాత ఈ నెల 20న సీఎం చంద్రబాబు కుట్రపూరితంగా నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందనే దుష్ప్రచారం మొదలు పెట్టడంతో శ్యామలరావు కూడా మాట మార్చక తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలోని డొల్లతనంపై నిపుణులు సూటిగా ప్రశ్నలు సంధిస్తుండటంతో చంద్రబాబు బెంబేలెత్తున్నారు. దాంతో తమను ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేసేందుకు పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారాన్ని పతాకస్థాయికి చేర్చిన చంద్రబాబు బృందం తాజాగా తిరుపతి పోలీసులకు ఫిర్యాదు ముసుగులో వేధింపుల కుట్రకు తెరతీసింది.

విచారణ పేరిట వేధింపుల కుట్ర..

రాజకీయ ప్రత్యర్థులు, డెయిరీల యాజమాన్యం, ఎంపిక చేసుకున్న అధికారులు, ఉద్యోగులపై వేధింపులకు పాల్పడాలన్నదే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర. అక్రమ కేసుల్లో ఇరికించి అనంతరం కొందర్ని అప్రూవర్‌గా మార్చుకుని తమ కుట్ర వాదనను వారితో ఒప్పించాలనే కుతంత్రం పన్నింది. సిట్ పూర్తి స్వరూపాన్ని ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. నివేదికతో సరిపెట్టాలా? అంతకుమించి అధికార పరిధి కల్పిస్తారా? అనేది స్పష్టం చేయలేదు. మరోవైపు తిరుపతి పోలీసులు కేసు విచారణ పేరిట వేధింపులకు గురి చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. అమరావతిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం డైరెక్షన్ మేరకే తిరుపతి పోలీసుల విచారణ హైడ్రామా కొనసాగనుంది. ఎవరెవరిని విచారణకు పిలవాలి..? ఎలా భయపెట్టాలి..? ఎలా వేధించాలన్నది అంతా టీడీపీ పర్యవేక్షణలోనే సాగనుందన్నది సుస్పష్టం. లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారానికి వత్తాసు పలకాలని.. తప్పుడు వాంగ్మూలాలు ఇవ్వాలని... లేదంటే కేసుల్లో ఇరికించి అరెస్టులతో వేధిస్తామని పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలన్నది చంద్రబాబు కుతంత్రం అని స్పష్టమవుతోంది.

దిద్దుబాటు ఫిర్యాదు!

- శ్రీవారి లడ్డూ వివాదంతో ఏపీ ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి
- ఎలాంటి ఆధారం లేకుండా సీఎం చంద్రబాబు తీవ్ర ఆరోపణలు
- బాబు తీరుపై ప్రపంచ వ్యాప్తంగా భక్తుల ఆగ్రహం
- తప్పు జరిగి ఉంటే ఇన్నాళ్లు ఎందుకు ఫిర్యాదు చేయలేదని నిలదీత
- ఒత్తిడి తట్టుకోలేక ఎట్టకేలకు ఏఆర్ ఫుడ్స్‌పై పోలీసులకు ఫిర్యాదు
- రెండు నెలల తర్వాత వాడని నెయ్యిపై ఫిర్యాదు చేసిన టీటీడీ జీఎం

బాబూ మీరు కొన్న నెయ్యి రూ.276కే

- అప్పుడు బహిరంగ మార్కెట్‌లో రూ.1100–1200 ఉందన్నది నువ్వే..
- అలాంటప్పుడు అంత తక్కువ ధరకు ఎలా కొన్నావ్
- ఆ సమయంలో కూడా కల్తీ నెయ్యి కొన్నావా?
- నెయ్యి ధరలు విషయంలో నువ్వు చెప్పింది అబద్ధమే కదా..
- తక్కువ ధరకు కొన్నారు కాబట్టే కల్తీ నెయ్యి సరఫరా చేసారని చంద్రబాబు చెబుతున్నదంతా సొల్లే
- గత ప్రభుత్వంలో అదే రేటుకు కొంటే ఎలా తప్పు
- వాడని నెయ్యి... తయారు కానీ లడ్డూ ప్రసాదంపై ఎందుకీ దుష్ప్రచారం
- అయినా నెయ్యి ధరలపై అడ్డగోలుగా బురద జల్లే ప్రయత్నం
- వెన్న తీసిన పాలు, పాల పదార్థాల ద్వారా అదనంగా ఆదాయం
- అందుకే తక్కువ ధరకు నెయ్యి సరఫరా

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సింగరేణి భాగస్వామ్యానికి వ్యతిరేకంగా ఆందోళన

తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: రామగుండంలో తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)కు చెందిన కాలం చెల్లిన 62.5 మెగావాట్ల రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి సంస్థ, జెన్‌కో సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ తీవ్రంగా వ్యతిరేకించింది. సింగరేణి, జెన్‌కో సంస్థల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా కొత్త విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడానికి విధివిధానాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనికి వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం ఇక్కడ సమావేశమై తీసుకున్న నిర్ణయాలను జేఏసీ చైర్మన్ జి.సాయిబాబు, కన్వీనర్ పి.రత్నాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న విద్యుత్ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొనాలని జేఏసీ పిలుపునిచ్చింది. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 3 వరకు జెన్‌కోకి సంబంధించిన అన్ని విద్యుత్ కేంద్రాల వద్ద గేట్ సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించింది. అక్టోబర్ 4 నుంచి 5 వరకు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన నిర్వహిస్తామని తెలిపింది.

సాగర్ ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో నీటి విడుదల

నడిగూడెం: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు బుధవారం అధికారులు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేశారు. ఈ నెల 1న నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం సమీపంలో సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. గండి మరమ్మతులను ఈ నెల 14న చేపట్టి రాత్రింబవళ్లు పనులు చేశారు. ఇప్పటికి కట్ట ఏర్పాటు పనులు పూర్తి కాగా, కాల్వ లోపలి నుంచి 150 మీటర్ల పొడవు వరకు ఎనిమిది మీటర్ల ఎత్తులో ఇసుక బస్తాలను ఏర్పాటు చేసే పనులు కూడా పూర్తి కావచ్చాయి. బుధవారం ఖమ్మం జిల్లాకు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఈ రమేశ్‌బాబు, ఎస్‌ఈ శివ ధర్మతేజ, ఈఈ రామకిషోర్, డీఈ రఘు, ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



కాగిత రామచంద్రాపురం సమీపంలో గండి పూడ్చిన ప్రాంతం నుంచి కాల్వలో పారుతున్న నీరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొండా సురేఖ తదితరులు

జోగుళాంబ శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోనే ఏకైక శక్తి పీఠమైన అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవోను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. దేవస్థానంలో వచ్చే నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే జోగుళాంబఅమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ కమిటీ ఆహ్వానించింది. ఈ మేరకు బుధవారం మంత్రి కొండా సురేఖను ఆలయ ఈవో పురేందర్ కుమార్, ఆలయ ప్రధానార్చకుడు ఆనంద్ శర్మ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

దసరా నాటికి ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు

- వార్డు నుంచి జిల్లా స్థాయి వరకు ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఒకట్రెండు రోజుల్లో విధివిధానాలను రూపొందించాలి

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ నాటికి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వార్డు, గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు కోసం ఒకట్రెండు రోజుల్లో విధివిధానాలను రూపొందించాలని సూచించారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బుధవారం రాత్రి సీఎం రేవంత్ ఇందిరమ్మ ఇళ్లపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్రం నుంచి చాలా రాష్ట్రాలు లక్షల సంఖ్యలో ఇళ్లను మంజూరు చేయించుకుంటుంటే.. తెలంగాణ మాత్రం ఈ విషయంలో వెనకబడి ఉందని, ఈసారి ఆ పొరపాటు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కేంద్రం మంజూరు చేసే ఇళ్లలో ఎక్కువ సంఖ్యలో మన రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పథకానికి సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల బకాయిలు త్వరగా వచ్చే చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వివరాలను సకాలంలో అందించాలని స్పష్టం చేశారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బందికి కొరత ఏర్పడుతుందని అధికారులు పేర్కొనగా.. అవసరమైతే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేపట్టాలని సూచించారు.



సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి

రాజీవ్ స్వగృహ వేలం..

ఏళ్ల తరబడి రాజీవ్ స్వగృహ ఇళ్లను ఖాళీగా పెట్టడం సరికాదని.. ఇప్పటివరకు అమ్ముడుపోకుండా ఉన్న ఫ్లాట్లు, బ్లాక్‌లను వేలం వేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. అలాగే నిర్మాణం పూర్తయి, కేటాయించకుండా ఉండిపోయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వెంటనే అర్హులకు అందజేయాలని సూచించారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఇంకా ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌తో నిరంజన్ తదితరులు

సత్వరం బీసీ కులగణన

బీసీ కమిషన్‌కు సీఎం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: వెంటనే బీసీ కులగణన కార్యాచరణ ప్రారంభించి.. ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయనను రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం సచివాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి విధానాలపై కమిషన్ సభ్యులు చర్చించారు. సీఎం మాట్లాడుతూ కులగణనకు అనుగుణంగా అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధి, విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు

కుల గణన.. కాంగ్రెస్ పార్టీ పేటెంట్

- నాలుగైదు రోజుల్లో విధి విధానాలు పూర్తిచేస్తాం
- బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సనత్‌నగర్ (హైదరాబాద్): కులగణన కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, అది జరగనిదే స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ల నియామకాల్లో కూడా నలుగురు బీసీలకు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చెప్పారు. ‘సమగ్ర కుల గణన–బీసీ రిజర్వేషన్ల పెంపుపై’బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, కులగణన అంశాన్ని తెర మీదకు తీసుకువచ్చిన నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎవరికి దక్కాల్సిన ఫలాలు వారికి అందాలనే ఉద్దేశంతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించడం జరిగిందని గుర్తుచేశారు. నాలుగైదు రోజుల్లో కులగణనపై విధి విధానాలను ఖరారు చేసి ఆ దిశగా ముందుకు సాగుతామన్నారు. రాష్ట్ర ఖజానా అధ్వాన్న స్థితిలో ఉందని, నెలసరి ఆదాయం 18 వేల కోట్లు కాగా, గత ప్రభుత్వం చేసిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు తీర్చేందుకే ఎక్కువ శాతం ఆదాయం కేటాయిస్తూ వస్తున్నట్లు చెప్పారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అనవసర ప్రాజెక్టులతో దుబారా చేసి అప్పులపాలు చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ కులగణన అంశాన్ని లేవనెత్తగానే బీజేపీ కూడా స్వరం మార్చి ఆర్‌ఎస్‌ఎస్‌తో మద్దతు తెలియజేస్తోందన్నారు. బీజేపీ హయాంలో పెట్టుబడిదారులకు న్యాయం జరిగిందే తప్ప ప్రజలకు జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నష్టాల్లో ఉన్న సంస్థలను ప్రైవేటీకరణ చేసిందే తప్ప లాభాల్లో ఉన్న వాటి జోలికి వెళ్లలేదని, నేడు బీజేపీ లాభాల్లో ఉన్న సంస్థలను కూడా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ కూడా కులగణనకు మద్దతు అంటూ ఇప్పుడు చెబుతోందని, గత పదేళ్లు ఆ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా కులగణన జరిపి తీరుతామని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ కులగణన చేసి తీరాల్సిందేనన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కులగణనపై గత ఆరు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేపట్టామని, చివరిగా హైకోర్టులో కేసు కూడా వేశామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కులగణనపై స్పష్టమైన హామీ ఇవ్వడంతోనే తాము కులగణన మార్చ్ చేపట్టాలనే ఆలోచనను విరమించుకున్నామని జాజుల తెలిపారు.

లడ్డూ వివాదం వెనుక బీజేపీ కుట్ర

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- బీజేపీ డైరెక్షన్‌లోనే చంద్రబాబు మాట్లాడుతున్నారు
- లడ్డూలో కల్తీ నెయ్యి కలపాలని ఏ ముఖ్యమంత్రీ చెప్పరు



సాక్షి, హైదరాబాద్: తిరుమల లడ్డూ వివాదం వెనుక బీజేపీ రాజకీయ కుట్ర ఉందనే అనుమానం తనకు వ్యక్తిగతంగా కలుగుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. ‘కల్తీ నెయ్యిని లడ్డూలో కలపమని ఏ ముఖ్యమంత్రీ చెప్పరు. లడ్డూలో కల్తీ జరిగి ఉంటే అందుకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవడం చాలా చిన్న పని. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అలా చేస్తే వివాదం సమసిపోతుంది. కానీ అలా చేయకుండా రోజుల తరబడి ఈ అంశాన్ని చర్చకు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు టీడీపీ చేస్తున్న ప్రయత్నం వెనుక బీజేపీ కుట్ర కనబడుతోంది..’ అని బుధవారం ఒక ప్రకటనలో జగ్గారెడ్డి పేర్కొన్నారు. ‘లడ్డూ అంశాన్ని చంద్రబాబు రాజకీయం చేయడం, మత ప్రస్తావనతో పాటు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరును ప్రస్తావించడంపై నాకు కొన్ని అనుమానాలు వస్తున్నాయి. చంద్రబాబుతో కలిసి బీజేపీ మతపరమైన రాజకీయాలకు తెర తీస్తోందని అనిపిస్తోంది. ఎందుకుంటే బీజేపీ ఎజెండానే అది. ప్రజలను ఉద్వేగాలతో రెచ్చగొట్టడమే ఆ పార్టీ పని. పరిస్థితులు చూస్తుంటే ఏపీలో బీజేపీ ఆట మొదలు పెట్టినట్టు కనిపిస్తోంది. లడ్డూ గురించి చంద్రబాబు మాట్లాడుతోంది బీజేపీ డైరెక్షన్‌లోనే. ఈ వివాదాన్ని బీజేపీ ప్రోత్సహిస్తోంది కనుకనే జగన్ ఇంటిపై బీజేవైఎం కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. జగన్‌ను దెబ్బకొట్టేందుకు చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ కొట్లాటలో తమ ఎంపీ స్థానాలు పెంచుకోవాలనేది బీజేపీ ప్లాన్..’అని జగ్గారెడ్డి వివరించారు. త్వరలో జరగబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూడా టీడీపీ, బీజేపీ, జనసేనలు కలిసి పోటీ చేసి లడ్డూ ఎమోషన్‌తో ఎక్కువ స్థానాలు గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తాయని తనకు అనిపిస్తోందని అన్నారు. ఏపీలోని రాజకీయ పార్టీలు ఈ వివాదాన్ని రాజకీయం చేయరాదని, ప్రభుత్వం దోషులెవరో విచారించి శిక్షించాలని, వెంకన్న భక్తులకు భరోసా కల్పించాలని జగ్గారెడ్డి ఆ ప్రకటనలో కోరారు.

మేల్కొలుపు



పూర్వం పురుషుడి సంపాదనకు
స్త్రీ సంపాదన తోడైతే
'ఏదో వేణ్ణీళ్లకు చన్నీళ్లు తోడు' అనేవారు.
రాను రాను స్త్రీ సంపాదన ప్రధానం అయ్యింది.
స్త్రీలు ఇంటి పని, ఉద్యోగం చేయాల్సి వస్తోంది.
కాని పని గంటలు వారి జీవితాలను
కబళిస్తున్నాయా?
ప్రయివేటు ఉద్యోగాలు పది గంటలు
డిమాండ్ చేస్తుంటే సేల్స్ ఉమెన్‌గానో,
చిన్న ఉద్యోగాల్లోనో ఉండే
మహిళలు ఏకంగా
12 గంటలు చేయాల్సి వస్తోంది.
కుటుంబ, సాంఘిక, సామాజిక జీవితాలను
తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఈ పని గంటలపై
కార్మిక చట్టాలు ఏమీ చేయడం లేదు.
స్త్రీలు ప్రాణాలు పోయేంతగా
వొత్తిడి అనుభవించాలా?



ఇంట్లో రెస్ట్ లేదు...
ఆఫీస్ లేదు

ఇటీవల పూణెలో అన్నా సెబాస్టియన్ అనే యువ చార్టర్డ్ అకౌంటెంట్ తను పని చేసే సంస్థలో ఒత్తిడి తట్టుకోలేక మరణించింది.

మంగళవారం (సెప్టెంబర్ 24) లక్నోలోని ఒక ప్రయివేట్ బ్యాంకులో పని చేస్తున్న ఫాతిమా అనే ఉద్యోగిని కుర్చీలోనే కుప్పకూలి మరణించింది. పని ఒత్తిడి వల్లే అని సహోద్యోగుల ఆరోపణ. ఇవి తెలిసి. తెలియనివి ఇంకెన్నో.

స్త్రీలకు రెండు ఉద్యోగాలు

ఉదయం ఎనిమిదన్నర నుంచి రాత్రి ఎనిమిదన్నర వరకూ పని చేస్తే తప్ప జీతం రాని ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు మన దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. సేల్స్‌గర్ల్స్, హాస్పిటల్ స్టాఫ్, హోటల్ రంగం, కాల్ సెంటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫ్యాక్టరీ వర్కర్లు... 12 గంటలు చేయలేం అంటే 10 గంటలు అడుగుతున్నారు. అదీ కాదంటే 9 గంటలకు ఒక్క నిమిషం కూడా తక్కువ కాకుండా పని చేయాలన్నది వాస్తవం. ఈ 9 గంటలతో పాటు రాకపోకల సమయం కూడా కలుపుకుంటే స్త్రీలకు ఇంటి పనికీ, పిల్లల పెంపకానికి, విశ్రాంతికీ మిగిలే సమయం ఎంత?

జీవితం గడవడానికి సంపాదన చాలా ముఖ్యమయ్యాక, ఆ సంపాదనలో ప్రధాన భాగం పిల్లల చదువుకు, వైద్యానికి, రవాణాకు ఖర్చు చేయకతప్పని పరిస్థితుల్లో భార్యాభర్తలు పని చేయక తప్పడం లేదు. మగాడిగా భర్తకు ఉద్యోగ వొత్తిడి తప్పదు. కాని స్త్రీలకు ఇంటి బాధ్యత కూడా ఉంటుంది. వంట వారే చేయాలి. ఇక పిల్లల పనులు, బట్టలు ఉతకడం, ఇంటి శుభ్రత, ఆతిథ్యం, అత్తమామలు ఉంటే వారి బాగోగులు... ఇవన్నీ భారమే. ఇటు ఈ పని అటు ఆ పని వీటి మధ్య సమన్వయం చేసుకోలేక మౌనంగా వొత్తిడి ఎదుర్కొంటూ అనారోగ్యం తెచ్చుకుంటూ ఒక్కోసారి ప్రాణాల మీదకు వచ్చే స్థితికి చేరువ చేస్తోంది మహిళా ఉపాధి.

ఒకప్పుడు గవర్నమెంట్ ఉద్యోగాలలో కొంత వెసులుబాటు ఉండేది. కాని ప్రస్తుతం వారి పని ఒత్తిడి కూడా తక్కువగా లేదు. సుఖమైన బ్యాంకు ఉద్యోగం ఇప్పుడు పచ్చి అబద్ధం. చాలా చాకిరి అందులో ఉంటోంది. పెద్ద జీతాల సాఫ్ట్‌వేర్ రంగం విషయానికి వస్తే వర్క్ ఫ్రమ్ హోమ్ వచ్చాక ఇరవై నాలుగ్గంటలు పనే అనే భావన కలుగుతోంది. 'మల్టీనేషనల్ కంపెనీలు భారతీయ ఉద్యోగులను మనుషుల్లా కాకుండా గాడిదలతో సమానంగా చూస్తున్నాయి'...'లాగిన్ చేయడం వరకే మా చేతుల్లో ఉంటుంది. ఆ తర్వాత ఎన్ని గంటలు పని చేస్తామో మాకే తెలియదు' అనే మాటలు ఆ రంగంలో సర్వసాధారణం అయ్యాయి. ఈ నేపథ్యంలో స్త్రీలు తమ ఉద్యోగ, కుటుంబ జీవితాలను నిర్వహించుకోవడానికి సతమతమవుతున్నారు.

వారానికి 60 గంటలు

ఈ మధ్య కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఎవర్ని పలకరించినా చేస్తున్న ఉద్యోగం గురించి గొప్పగా చెప్పుకోవడం కంటే ఆవేదన వ్యక్తం చేసే సందర్భాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. లైఫ్‌కు భరోసా ఇవ్వాల్సిన ఉద్యోగాలే ప్రాణాలను హరిస్తున్నాయనడానికి పూణెలో అన్నా సెబాస్టియన్ అనే మహిళ పని ఒత్తిడితో మరణించడం ఒక ఉదాహరణ మాత్రమే. 26 ఏళ్ల చార్టెడ్ అకౌంటెంట్ అన్నా సెబాస్టియన్ ఉద్యోగంలో చేరిన కొన్ని నెలలకే దారుణమైన వర్క్ కండిషన్స్ కారణంగా ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోయింది. భారత్‌లో యువ మహిళా ఉద్యోగులు ప్రపంచంలో అందరి కంటే ఎక్కువ గంటలు పనిచేస్తున్నారని తాజా సర్వేలు చెబుతున్నాయి. వారానికి 40 గంటలు పాత మాటగా మారగా 55 నుంచి 60 గంటలు మహిళలతో కార్పోరేట్ కంపెనీలు పని చేయించుకుంటున్నాయి. సాఫ్ట్‌వేర్, ఐటీ, ఫైనాన్స్ రంగాల్లో రోజుకు 18 గంటల పని విధానం సర్వసాధారణంగా మారిపోయింది. పని గంటలు ముగిసినా ఇంట్లో ఉన్నా చివరకు వారాంతమైనా సరే టార్గెట్లు పూర్తి చేయించుకోవడానికి ఆయా సంస్థలు ఉద్యోగులను వెంటాడుతున్నాయి. కుటుంబం, వ్యక్తిగత జీవితంతో పాటు ఆరోగ్యాన్ని కూడా త్యాగం చేస్తే తప్ప ఈ తరహా ఉద్యోగాలు చేయలేని పరిస్థితి.

హక్కులు ఏవి? చట్టాలు ఎక్కడ?

చట్టాలను కఠినంగా అమలు చేసే దేశాల్లో ఇంత చాకిరి చెల్లుబాటు కాదు. ప్రపంచంలో అతి తక్కువ పని గంటలున్న 20 దేశాల్లో ఇండియా ఊసు కూడా లేదు. మన దేశంలో జీవించడానికి ఉద్యోగం చేస్తున్నామా లేక ఉద్యోగం చేయడమే జీవితమా అన్న స్థాయిలో పని కబళించేస్తోంది. ఒకరకంగా మానవ హక్కుల ఉల్లంఘనే జరుగుతోంది. వర్క్ కండిషన్స్ ఎలా ఉండాలి అనే అంశంపై 1948లో 'యూనివర్సల్ డిక్లరేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్'ను మెజార్టీ దేశాలు ఆమోదించాయి. ఉద్యోగుల హక్కులను కాపాడే ఈ డిక్లరేషన్‌ను రూపొందించడంలో భారత్ కూడా కీలక పాత్ర పోషించింది. అయితే దానికి కట్టుబడి చట్టాలను అమలు చేయడంలో మాత్రం మన ప్రభుత్వాలు, వ్యవస్థలు విఫలమవుతున్నాయి. అందుకే భారతీయులతో గొడ్డుచాకిరీ చేయించుకునే సంస్థలు పెరిగిపోయాయి.

స్మార్ట్‌వర్క్‌ను ప్రోత్సహించాలి

ఎక్కువ గంటలు పని చేయడం ఉద్యోగి డెడికేషన్‌కు ఏమాత్రం కొలమానం కాదన్న విషయాన్ని సంస్థలు గుర్తించాలి. వర్కింగ్ కండిషన్స్ ఏమాత్రం సానుకూలంగా లేని చోట హార్డ్ వర్క్ కంటే స్మార్ట్ వర్క్ చేయడం చాలా అవసరం. ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలంటే 'నో' చెప్పడం ఒక్కటే ఉత్తమమైన మార్గం. ఇన్ని గంటలు ఇంత పనే చేయగలం అని చెప్పాలి. ఎవరి జీవితం వాళ్ల చేతుల్లోనే ఉండాలంటే మొహమాటాలను పక్కన పెట్టి నో చెప్పడానికి సిద్ధంగా ఉండాలి.

– ఫణికుమార్ అనంతోజు, సాక్షి



ఫ్యాక్టరీస్ చట్టం 1948, మైన్స్ చట్టం, బీడీ- సిగార్ కార్మికుల చట్టం మొదలగు చట్టాల కింద ప్రత్యేక సందర్భాలలో తప్ప ఉదయం 6 నుంచి సాయంత్రం 7 వరకు మాత్రమే స్త్రీలు పని చేయాల్సి ఉంటుంది. ఈ పని వేళలు దాటి రాత్రి 10 వరకు పనిచేయాలి అంటే సదరు యాజమాన్యం ప్రత్యేకమైన వసతులు; రక్షణ, రవాణా వంటివి కల్పించాల్సి ఉంటుంది. అయితే ఈ పని వేళలు సాఫ్ట్వేర్ రంగానికి కూడా వర్తించినప్పటికీ, కొన్ని వెసులుబాటులను ప్రభుత్వం ఐటీ రంగానికి కల్పించింది. అయినప్పటికీ స్త్రీలను రాత్రి వేళలో పనిచేయాలి అని ఏ యాజమాన్యం కూడా ఒత్తిడి చేయడానికి వీలులేదు. ఒకవేళ అలా పని చేయాల్సి వస్తే రవాణా, చిన్నపిల్లల సౌకర్యార్థం (క్రెచ్) నదుపాయాలు కల్పించాల్సి వుంటుంది.

– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది



స్త్రీలకు పిల్లల పెంపకం, ఇంటి పని భారం, ఉద్యోగ భారం... ట్రిపుల్ బర్డన్ కలిగిస్తున్నాయి. ఇంటిని చూసుకోవాలి... సంపాదించాలి... అంటే రెండు చోట్లా ఆమె ఉత్పాదనను పరీక్షకు పెడుతున్నట్టే లెక్క. ఈ రెండు పనులు ఆమెకు సౌకర్యంగా లేకపోతే శారీరకంగా మానసికంగా చాలా సమస్యలు వస్తున్నాయి. మానసికంగా యాంగ్జయిటీ, డిప్రెషన్ చూస్తున్నాం. ఇక ఎముకల బలం క్షీణించడం, బహిష్టు సమస్యలు... కనపడుతున్నాయి. కొందరిలో ఇన్‌ఫెర్టిలిటీ పెరుగుతోంది. భార్యాభర్తల మధ్య సమన్వయమే ఈ పరిస్థితి నుంచి స్త్రీలను బయటపడేయగలదు.

– డాక్టర్ ఆరతి బెల్లారి
కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్

● శ్రీలంక ప్రధాని హరిణి

హక్కుల చుక్కాని



శ్రీలంక నూతన ప్రధానమంత్రిగా హరిణి అమరసూర్య. ప్రధాని కావడానికి ముందు పార్లమెంట్ సభ్యురాలు. ఎంపీ కావడానికి ముందు లెక్చరర్. లెక్చరర్‌కు ముందు, లెక్చరర్ అయిన తరువాత స్త్రీవాదం, నిరుద్యోగం, లింగ వివక్ష... ఇలా ఎన్నో సామాజిక అంశాలపై హక్కుల కార్యకర్తగా తన గొంతును బలంగా వినిపించింది. సమస్యలు తెలిసిన... సామాజిక స్పృహ ఉన్న వ్యక్తి ప్రధాని అయితే ఆ పాలన దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని చరిత్ర నిరూపించింది. 'ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రయాణంతో శ్రీలంకలో మరో చరిత్ర మొదలుకానుంది' అనే ఆశారేఖలు వెల్లివిరుస్తున్నాయి...

కొలంబోలో పుట్టి పెరిగిన హరిణి అమరసూర్య హిందూ కాలేజ్, ఢిల్లీ యూనివర్శిటీలో బి.ఎ, సిడ్నీలోని మక్వరీ యూనివర్శిటీలో ఆంత్రోపాలజీ అండ్ డెవలప్‌మెంట్‌లో ఎం.ఎ, ఎడిన్‌బరో యూనివర్శిటీలో సోషల్ ఆంత్రోపాలజీలో పీహెచ్‌డీ చేసింది. యూత్, పాలిటిక్స్, యాక్టివిజం, జెండర్, డెవలప్‌మెంట్, శిశు సంరక్షణ, గ్లోబలైజేషన్ అండ్ డెవలప్‌మెంట్... ఇలా ఎన్నో అంశాలపై లోతైన పరిశోధన చేసింది. పుస్తకాలు రాసింది.

డిగ్రీ తరువాత శ్రీలంకలోని మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ 'నెస్ట్'తో కలిసి పనిచేసింది హరిణి.

'నెస్ట్' వ్యవస్థాపకురాలైన సాలీ హులుగల్లే అట్టడుగు, అణగారిన వర్గాల కోసం పనిచేసింది. 'నెస్ట్' ద్వారా ఎంతో మార్పు తీసుకురాగలిగింది. ఆమె ప్రభావంతో మానసిక వైద్యశాలలలో ఎంతోకాలంగా దిక్కుమొక్కు లేకుండా పడి ఉన్న దీనులు, ఎవరూ పట్టించుకోని హెచ్ఐవీ బాధితులు, అనాథ పిల్లలతో కలిసి పనిచేసింది హరిణి.

చైల్డ్ ప్రొటెక్షన్, సైకలాజికల్ ప్రాక్టీషనర్‌గా ఎన్నో సంవత్సరాలు పని చేసిన తరువాత శ్రీలంక ఓపెన్ యూనివర్శిటీలో లెక్చరర్‌గా చేరింది. యాక్టివిస్ట్‌గా ఉచిత విద్య కోసం ఎన్నో ఉద్యమాలు చేసింది. 'ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్' సభ్యురాలైన హరిణి లింగసమానత్వం నుంచి జంతుసంక్షేమం వరకు ఎన్నో అంశాలపై తన గళాన్ని వినిపించింది.

ఇక రాజకీయాల విషయానికి వస్తే... 2019లో 'నేషనల్ ఇంటలెక్చువల్ ఆర్గనైజేషన్'లో చేరిన హరిణి శ్రీలంక అధ్యక్ష ఎన్నికల సమయంలో నేషనల్ పీపుల్స్ పవర్(ఎన్‌పీపీ) అభ్యర్థి అనురా కుమార దిస్సానాయకే తరపున ప్రచారం చేసింది. 2020 శ్రీలంక పార్లమెంటరీ ఎన్నికల తరువాత ఎంపీగా పార్లమెంట్‌లోకి అడుగు పెట్టింది. ఎంపీగా తన రాజకీయ జీవితాన్ని కొనసాగించడానికి లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసింది.

అత్యున్నత పదవి విషయంలో 'సరియైన వ్యక్తి' అనే ప్రశంస చాలా తక్కువమందికి లభిస్తుంది. ఇలాంటి వారిలో 54 సంవత్సరాల హరిణి అమరసూర్య ఒకరు. 'ప్రధానిగా ఆమె సరియైన వ్యక్తి' అనేది ఇప్పుడు చాలామంది నోట వినిపిస్తున్న మాట.

సమాజం అనే పుస్తకాన్ని చదివి...

హరిణికి ఆంగ్ల సాహిత్యం అంటే చాలా ఇష్టం. 'ఇంగ్లీష్ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని ఉంది' అంటూ నాన్న స్నేహితుడైన మాజీ దౌత్యవేత్త దగ్గర తన మనసులో మాట బయటపెట్టింది. మొదట ఆయన ఎగతాళిగా నవ్వినా ఆ తరువాత మాత్రం ఆంగ్ల సాహిత్యంలోని ఎంతో మంది దిగ్గజ రచయితలను పరిచయం చేశాడు. వారి రచనలు చదువుతుంటే ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లుగా అనిపించింది.

'ఆంగ్ల సాహిత్యంలోకి అడుగు పెట్టిన తరువాత నా చుట్టూ ఉన్న ప్రపంచం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి మొదలైంది. ఆ తరువాత కాలంలో సాహిత్య అధ్యయనం కంటే నా చుట్టూ ఉన్న సమాజాన్ని లోతుగా అధ్యయనం చేయాలనిపించింది' అంటుంది హరిణి. పుస్తక ప్రపంచంలో కంటే సామాజిక ప్రపంచంలోనే ఆమెకు ఎక్కువ విషయాలు తెలిసాయి. నిరుద్యోగం నుంచి లింగ వివక్ష వరకు ఎన్నో సమస్యలను ప్రత్యక్షంగా చూసింది. ఆమె ఉద్యమకారిణిగా ప్రయాణం ప్రారంభించడానికి, ఆ తరువాత రాజకీయాల్లోకి అడుగు పెట్టడానికి 'సమాజం' అనే పుస్తకం ఎంతో ఉపయోగపడింది.

అవును... ఆమె ఢిల్లీ స్టూడెంట్!

'హిందూ కళాశాల పూర్వ విద్యార్థి అయిన హరిణి శ్రీలంక ప్రధాని కావడం మా కళాశాలకు గౌరవంగా భావిస్తున్నాను. ఆమె విజయం పట్ల మేము గర్వపడుతున్నాం. హరిణి సాధించిన విజయం మా కళాశాల చరిత్రలో మరో మైలురాయి. హిందూ కళాశాలలో హరిణి గడిపిన కాలం ఆమె నాయకత్వానికి మార్గనిర్దేశం చేయడంలో సహాయపడుతుందని ఆశిస్తున్నాను' అన్నారు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అంజు శ్రీవాస్తవ. హరిణి హిందూ కాలేజీలో 1991 నుండి 1994 వరకు చదివింది. బాలీవుడ్ దర్శకుడు నళిన్ రాజన్‌సింగ్ హిందూ కాలేజీలో హరిణి బ్యాచ్ మేట్.'కాలేజీ ఉత్సవాలు, చర్చలలో హరిణి చురుగ్గా పాల్గొనేది. ఆమె ప్రధాని స్థాయికి ఎదగడం గర్వంగా ఉంది' అంటున్నాడు నళిన్ రాజన్‌సింగ్.

● రిలీఫ్

మెనోపాజ్ ఎక్సర్‌సైజ్

మెనోపాజ్ అనేది మహిళల జీవితంలో ఒక సహజమైన దశ. ఇది సాధారణంగా 45 నుంచి 55 సంవత్సరాల మధ్య కాలంలో సంభవించే రుతుక్రమ ముగింపును సూచిస్తుంది. హార్మోన్లు.. ప్రధానంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ ఉత్పత్తి తగ్గుదల వల్ల ఒంట్లో వేడి, మానసిక అలజడి, నిద్ర పట్టకపోవడం, బరువు పెరగడం వంటివి సంభవిస్తాయి. ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నప్పుడు చాలామంది 'ఇది ఈ సమయంలో సహజమే, భరించాలి మరి' అని చెబుతుంటారు. అయితే, మెనోపాజ్ దశనూ ఆహ్లాదంగా గడిపేయాలంటే నిపుణులు సూచనలను పాటించడం మేలు.

ప్రధానంగా శారీరక శ్రమ వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ఎండార్ఫిన్ విడుదల ద్వారా మానసిక స్థితి బాగవుతుంది. ఎముకలను బలోపేతం చేయడం ద్వారా బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపొరోసిస్) ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వ్యాయామం, ఏరోబిక్స్ వంటివి హాయినిచ్చే నిద్రను, పనిచేయగలిగే సామర్థ్యాన్నీ పెంచుతాయి. మెనోపాజ్ సమయం లో ఉపశమనం కలిగించే ఈ 8 వ్యాయామాలను ఒక అలవాటుగా మార్చుకోవాలి.





1. వాకింగ్

నడక గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడే ప్రభావవంతమైన వ్యాయామం ఇది. జీవక్రియలు మందగించినప్పుడు ఇది కీలకంగా పనిచేస్తుంది. ఒత్తిడిని నివారిస్తుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

2. యోగా

ఆందోళనను తగ్గించడంలో యోగా ఔషధంగా పనిచేస్తుంది. కొన్ని యోగ భంగిమలు కీళ్ల దృఢత్వాన్ని మెరుగుపరుస్తాయి. విశ్రాంతిని, మంచి నిద్రను పొందడంలో సహాయపడతాయి.

3. పవర్ ట్రెయినింగ్

మెనోపాజ్ వల్ల కలిగే కండరాల క్షీణతను ఎదుర్కోవడానికి పవర్ ట్రెయినింగ్ సహాయపడుతుంది. ఎముక సాంద్రత మెరుగవుతుంది. ఆస్టియోపొరోసిస్ వంటి ఎముకల వ్యాధి వల్ల కలిగే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బరువులు ఎత్తడం వల్ల కండరాల శక్తి పెరుగుతుంది. జీవక్రియ మెరుగవుతుంది.



4. ఈత

మెనోపాజ్ దశలో స్విమ్మింగ్ అనేది శరీరమంతటికీ పనికి వచ్చే వ్యాయామంగా చెప్పుకోవచ్చు. ఇది కీళ్లపై సున్నితంగా పనిచేస్తుంది. దీనివల్ల కీళ్ల నొప్పులు ఉండి, రుతుక్రమం ఆగిన మహిళలకు చాలా ఉపశమనంగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కండరాల బలాన్ని పెంచుతుంది. శరీరంలో వేడి ఆవిర్లు వచ్చినట్లు అనిపించే భావనను తగ్గించి, శరీరాన్ని చల్లబరచడంలో ప్రత్యేకంగా సహాయపడుతుంది.

5. పిలాటిస్

శరీర భంగిమలను సరిచేయడానికి ఉపకరించే ఆధునిక వ్యాయామ పద్ధతులను పిలాటిస్ అంటారు. ప్రత్యేక సాధనాల తో ఈ వ్యాయామాలు చేస్తారు. కండరాల బలాన్ని పెంచడానికి, నొప్పులను తగ్గించడానికి సున్నితమైన కదలికల ద్వారా శరీరంపై ఎక్కువ ఒత్తిడిని కలిగించకుండా ఈ వ్యాయామాలు చేస్తారు.

6. నృత్యం

చురుకుగా ఉండటానికి, ఒత్తిడిని తగ్గించడానికి డ్యాన్స్ ఒక ఆహ్లాదకరమైన మార్గం. డ్యాన్స్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కేలరీలను బర్న్ చేస్తుంది. సామాజికంగానూ నలుగురిని కలిసేలా చేస్తుంది. ఒంటరితనం భావాలను తగ్గిస్తుంది.

7. తాయ్– చి

తాయ్– చి వ్యాయామంలో కదలికలు నెమ్మదిగా ఉన్నా శారీరక ఆరోగ్యానికి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ వ్యాయామం రుతుక్రమం ఆగిన మహిళలకు ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది, మానసిక స్థితిని, నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది.



8. సైక్లింగ్

హిప్ కింది భాగానికి బలం చేకూరుతుంది. ఎండార్ఫిన్ల విడుదల ద్వారా మానసిక స్థితి మెరుగవుతుంది. ఈ వ్యాయామాలు మెనోపాజ్ లక్షణాలను తగ్గించడానికి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడతాయి.

మన(సు)లో మాట

అతి తిండీ అడిక్షనే!



నా వయసు 25 సం॥లు. కొన్ని నెలలుగా నేను విపరీతంగా తింటున్నాను. ఈ మధ్య 15 కేజీలు బరువు పెరిగాను. 'స్ట్రెస్'కు లోనైనప్పుడూ, ఒంటరిగా ఉన్నప్పుడు తినడం మరీ ఎక్కువ. ఎలాగైనా ఈ అతి తిండి అలవాటు నుండి బయటపడాలని ఉంది. మీరే ఏదైనా సలహా చెబుతారనే ఆశతో ఉన్నాను.

– రజని, విశాఖపట్నం

పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాలలో కొంచెం ఎక్కువగా తినడం మనందరికీ మామూలే! మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే, బహుశా మీరు 'బింజ్ ఈటింగ్ డిజార్డర్' అనే ఒక మానసిక రుగ్మతకు లోనైనట్లు తెలుస్తుంది. 25–30 సం॥ల మహిళల్లోను, 40–45 సం॥ల పురుషుల్లోనూ ఈ సమస్యను ఎక్కువగా చూస్తున్నా. మెదడులోని రసాయనాలలో వచ్చే మార్పులు, ఒత్తిడి, జన్యుపరమైన కారణాల వల్ల ఇలాంటి సమస్య రావచ్చు. అతి తక్కువ సమయంలో, ఫాస్ట్‌గా తినడం, కడుపు నిండినా ఆపుకోలేకపోవడం, బరువు పెరిగి గిల్టీగా ఫీలవడం, ఇన్‌ఫీరియారిటీకి, డిప్రెషన్‌కు లోనవడం జరుగుతుంది. ఒక విధంగా దీనిని 'ఫుడ్ అడిక్షన్' అనవచ్చు. మీలాంటి వారిలో మిగతా అడిక్షన్స్ లాగానే ఈ సమస్యను కూడా కొన్ని మందులతోను, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపి, జీవనశైలిలో మార్పులు, డైట్ కౌన్సెలింగ్‌తో మంచి మార్పులు తీసుకురావచ్చు. 'ఫుడ్ డెలివరీ యాప్స్' వచ్చిన తర్వాత ఇలాంటి సమస్యలను ఎక్కువగా చూస్తున్నా. సైకియాట్రిస్ట్‌ను సంప్రదిస్తే మీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.



– డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.

మీ సమస్యలు,సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● నోమోఫోబియా

స్మార్ట్‌గా తప్పించుకుందాం

మొబైల్ ఫోన్ల వాడకానికి– క్యాన్సర్‌కు మధ్య ఏమైనా సంబంధం ఉందా? ఈ విషయాన్ని తెలుసుకోవడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 5వేలకు పైగా అధ్యయనాలను సమీక్షించింది. ఆస్ట్రేలియన్ రేడియేషన్ ప్రొటెక్షన్ అండ్ న్యూక్లియర్ సేఫ్టీ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరిపింది. 1994 నుంచి 2022 సంవత్సరాల మధ్య ఉన్న అధ్యయనాలను తీసుకొని చేసిన సమీక్ష లో ఆసక్తికరమైన అంశాలెన్నో వెలుగులోకి వచ్చాయి.

ప్రపంచంలో 70 శాతం మంది స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. మొబైల్ ఫోన్ల వాడకం వల్ల క్యాన్సర్ రాదు కానీ, అనేక నష్టాలు ఉన్నాయని స్పష్టం చేసింది. వాటిలో..



● రీల్స్ విజృంభణ వల్ల ప్రతి 30 సెకన్లకు రీల్ చొప్పున మారుతూ ఫోన్‌ని అదేపనిగా చూస్తూనే ఉంటారు. దీంతో చూపు తగ్గుతోంది.

● అర్ధరాత్రి దాటుతున్నా మొబైల్ నుంచి వెలువడే కాంతి వల్ల మన శరీరం నిద్రకు అవసరం అయ్యే హార్మోన్‌ను విడుదల చేయదు. దాంతో గాఢ నిద్ర పట్టక పనితీరు మందగిస్తుంది. రోగనిరోధక శక్తి తగ్గి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

● మొబైల్ స్క్రీన్‌ను చూసే క్రమంలో కళ్లు పొడిబారడం, చూపు మందగించడం, తల నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ కంటిచూపుపై ప్రభావం చూపుతాయి.

● అదేపనిగా స్క్రీన్ చూడటం వల్ల కళ్లు, మెడ కండరాలపై ఒత్తిడి పెరిగి, మానసిక ఆందోళన పెరుగుతుంది.

● కొంతమంది టాయిలెట్‌కు వెళ్లినా, మంచం మీద పడుకున్నా ఫోన్ చూస్తూనే ఉంటారు. ప్రతి దానికీ మొబైల్ పైనే ఆధారపడే వ్యసనాన్ని 'నోమోఫోబియా' అంటారు. అంటే, మొబైల్ లేకుండా ఉండలేకపోవడం.

● అతిగా మొబైల్ వాడటం వల్ల పరధ్యానం వస్తుంది. చేస్తున్న పనిపై ఏకాగ్రత ఉండదు. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, ఇర్విన్ అధ్యయనం గడిచిన 20 ఏళ్లలో మానవుల సగటు ఏకాగ్రత 2.5 నిమిషాల నుండి 47 సెకన్లకు తగ్గిందని తేల్చింది.

● ఎక్కువ స్క్రీన్ సమయం వల్ల పిల్లలలో భావోద్వేగాలు తగ్గిపోతున్నాయి. ఆరుబయట ఆటలు తగ్గిపోతున్నాయి. నిద్ర, ఆకలి మందగించడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ సెల్ డేటా ప్రకారం కొన్నాళ్లుగా స్మార్ట్ ఫోన్ అమ్మకాలు తగ్గుముఖం పడుతున్నాయి. కొత్తతరం మళ్లీ బేసిక్ ఫోన్లను కొనడం ప్రారంభించిందనడానికి ఇదో ఉదాహరణ. మెదడును ఉపయోగించకుండా ఫోన్‌లపై ఆధారపడినట్లయితే మెదడు పనితీరు బలహీనంగా మారి, పరిణామంలో కూడా చిన్నదైపోతుందని చాలామంది శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ కంటే మన మెదడు చాలా వేగం, శక్తిమంతమైనది. అందుకే స్మార్ట్ ఫోన్ అధిక వాడకాన్ని స్మార్ట్‌గా తప్పించేద్దాం.



క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే సుమిత్ ఓటమి

చైనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. బీజింగ్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే ప్రపంచ 83వ ర్యాంకర్ సుమిత్ ఓడిపోయాడు. ప్రపంచ 63వ ర్యాంకర్ పావెల్ కొటోవ్ (రష్యా)తో జరిగిన మ్యాచ్‌లో సుమిత్ 2-6, 6-7 (5/7)తో ఓటమి పాలయ్యాడు. గంటా 51 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ 37 అనవసర తప్పిదాలు చేశాడు. సుమిత్‌కు 8,340 డాలర్ల (రూ. 6 లక్షల 97 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టుకు రెండో ఓటమి

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 0-2 గోల్స్ తేడాతో పంజాబ్ ఎఫ్‌సీ జట్టు చేతిలో ఓడిపోయింది. పంజాబ్ తరఫున ఎజెకిల్ విదాల్ (35వ ని.లో), ఫిలిప్ మిర్జాక్ (71వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన పంజాబ్ జట్టు తొమ్మిది పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.





మీ ప్రదర్శన అద్భుతం

భారత చెస్ జట్లను ప్రశంసించిన నరేంద్ర మోదీ ● పతక విజేతలతో భేటీ అయిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ: బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ చరిత్ర లిఖించిన భారత చాంపియన్ గ్రాండ్‌మాస్టర్లు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ప్రతిష్టాత్మక ఒలింపియాడ్‌లో పసిడి పతకాలు సాధించి భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించిన పురుషులు, మహిళల జట్లను ఈ సందర్భంగా మోదీ అభినందించారు. అందరితోనూ చనువుగా మాట్లాడిన మోదీ వారి ప్రదర్శనను ఆకాశానికెత్తారు. మహిళా గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలి, తానియా సచ్‌దేవ్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, మూడో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్, ఆర్.ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతిలతో ప్రధాని ముచ్చటించారు. 11 గేమ్‌లకుగాను 10 గేముల్లో గెలిచి భారత విజయంలో కీలకపాత్ర పోషించిన దొమ్మరాజు గుకేశ్‌ను మోదీ ప్రశంసలతో ముంచెత్తారు. ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానందలతో కలిసి మోదీ గేమ్ ఆడారు. అనంతరం విజేత సభ్యులంతా కలిసి తమ ఆటోగ్రాఫ్‌లతో కూడిన చెస్ బోర్డును ప్రధానికి అందజేశారు. ప్లేయర్లతో ప్రధాని ముఖాముఖీ వీడియోను క్రీడాశాఖ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

డిఫెండింగ్ టైటిల్‌ను వదిలేసి...



ప్రధానితో ప్రత్యేక భేటీలో పాల్గొనే అవకాశాన్ని చేజార్చుకోరాదనే ఉద్దేశంతో విదిత్ సంతోష్ గుజరాతి అజర్‌బైజాన్ టోర్నీ నుంచి వైదొలగి హుటాహుటిన ఢిల్లీకి తిరిగొచ్చాడు. గతేడాది బాకులో జరిగిన వుగార్ గాషిమోవ్ మెమోరియల్ చెస్ సూపర్ టోర్నమెంట్‌లో విదిత్ విజేతగా నిలిచాడు. టైటిల్ నిలబెట్టుకునేందుకు బాకు చేరుకున్న అతనికి ప్రధాని భేటీకి సంబంధించిన సమాచారం వచ్చింది. దీంతో ఉన్నపళంగా డిఫెండింగ్ చాంపియన్‌షిప్‌ను వదిలేసి ఢిల్లీకి పయనమై కార్యక్రమంలో పాల్గొన్నాడు.

ఏఐసీఎఫ్ నజరానా రూ. 3 కోట్ల 20 లక్షలు

చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు నెగ్గిన భారత జట్లకు అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) రూ. 3 కోట్ల 20 లక్షలు నగదు ప్రోత్సాహకాలు ప్రకటించింది. భారత పురుషుల జట్టులోని ఐదుగురికి రూ. 25 లక్షల చొప్పున.... భారత మహిళల జట్టులోని ఐదుగురికి రూ. 25 లక్షల చొప్పున నజరానా అందజేస్తామని ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ ప్రకటించారు. పురుషుల జట్టు కోచ్, కెప్టెన్ శ్రీనాథ్ నారాయణన్‌కు, మహిళల జట్టు కోచ్, కెప్టెన్ అభిజిత్ కుంతేకు రూ. 15 లక్షల చొప్పున ఇస్తారు. భారత బృందం చీఫ్ దివ్యేందు బారువాకు రూ. 10 లక్షలు, అసిస్టెంట్ కోచ్‌లకు రూ. 7 లక్షల 50 వేల చొప్పున లభిస్తాయి.

మహిళల ప్రపంచకప్ టికెట్ల విక్రయం షురూ

- రూ. 114కే మ్యాచ్‌ను చూసే ఛాన్స్
- మైనర్లకు మైదానంలో ఉచిత ప్రవేశం

దుబాయ్: యూఏఈలో త్వరలోనే జరగబోయే మహిళల టి20 ప్రపంచకప్ టికెట్ల విక్రయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రారంభించింది. కేవలం 5 యూఏఈ దిర్హామ్ (రూ. 114)లకే ఈ టికెట్లు అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు 18 ఏళ్లలోపు వయసున్న బాలబాలికలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. 'అందరు వెచ్చించగలిగే స్థితిలో టికెట్లను అందుబాటు ధరలో ఉంచాం. ప్రారంభ టికెట్ ఐదు దిర్హామ్‌లకే కొనుగోలు చేయొచ్చు. అత్యధికంగా ప్రీమియం సీట్ల ధర 40 దిర్హామ్ (రూ. 910)లుగా ఉంది. ఒక వేదికపై ఒకే రోజు రెండు మ్యాచ్‌లుంటే ఒక టికెట్‌తోనే ఆ రెండు మ్యాచ్‌ల్ని వీక్షించవచ్చు' అని ఐసీసీ తెలిపింది. ఐసీసీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు, ఆఫ్‌లైన్‌లోనూ టికెట్లను విక్రయించేందుకు దుబాయ్, షార్జా క్రికెట్ స్టేడియాల వద్ద కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీసీ పేర్కొంది. భారత్ సహా 10 దేశాల జట్లు పోటీపడే ఈ మెగా ఈవెంట్ వచ్చే నెల 3 నుంచి యూఏఈలోని రెండు వేదిక (దుబాయ్, షార్జా)ల్లో జరుగుతుంది.

శ్రీకాంత్ శుభారంభం

మకావ్: నాలుగు నెలల విరామం తర్వాత బరిలోకి దిగిన తొలి టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. మకావ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-14, 21-15తో డానిల్ దుబొవెంకో (ఇజ్రాయెల్)పై నెగ్గాడు. 35 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ రెండు గేముల్లోనూ పూర్తి ఆధిపత్యం చలాయించాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆయుశ్ శెట్టి 21-13, 21-5తో సహచరుడు ఆలాప్ మిశ్రాను ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో శంకర్ ముత్తుస్వామి (భారత్) 14-21, 21-10, 12-21తో పనిట్‌చాపోన్ (థాయ్‌లాండ్) చేతిలో, చిరాగ్ సేన్ (భారత్) 12-21, 17-21తో లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో, మిథున్ (భారత్) 12-21, 15-21తో హువాంగ్ యు కాయ్ (చైనీస్ తైపీ) చేతిలో, సమీర్ వర్మ (భారత్) 21-18, 11-21, 13-21తో వాంగ్ జెంగ్ జింగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి (భారత్) జోడీ 24-22, 10-21, 21-13తో లూ బింగ్ కున్-హో లో ఈ (మలేసియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 21-23, 22-24తో రుతానాపక్-జీహెనిచా (థాయ్‌లాండ్) జంట చేతిలో పోరాడి ఓడింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రుత్విక జోడీ 17-21, 19-21తో నికోల్ చాన్-యాంగ్ చు యున్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో పరాజయం పాలైంది.


శ్రీకాంత్

విజేత అర్జున్... రన్నరప్ సరయు



సాక్షి, హైదరాబాద్: జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు ఆదిరెడ్డి అర్జున్, వేల్పుల సరయు అదరగొట్టారు. హరియాణాలోని కర్నాల్ పట్టణంలో జరిగిన ఈ టోర్నీలో ఓపెన్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ ఆదిరెడ్డి అర్జున్ టైటిల్‌ను నిలబెట్టుకోగా... వరంగల్ జిల్లాకు చెందిన సరయు రన్నరప్‌గా నిలిచింది. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 14 ఏళ్ల అర్జున్ 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. అర్జున్ 8 గేముల్లో గెలిచి, 3 గేమ్‌లను 'డ్రా' చేసుకొని టోర్నీని అజేయంగా ముగించాడు. సౌరత్ బిశ్వాస్ (పశ్చిమ బెంగాల్; 8.5 పాయింట్లు) రెండో స్థానంలో, జైవీర్ మహేంద్రు (మహారాష్ట్ర; 8.5 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో సరయు నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9 పాయింట్లతో మృతిక మల్లిక్ (పశ్చిమ బెంగాల్)తో కలిసి సంయుక్తంగా టాప్ ర్యాంక్‌లో నిలిచింది. అయితే చాంపియన్‌ను నిర్ణయించేందుకు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. మెరుగైన టైబ్రేక్ స్కోరుతో మృతిక టైటిల్ సొంతం చేసుకోగా... సరయుకు రెండో స్థానంతో రన్నరప్ ట్రోఫీ దక్కింది. సరయు తొమ్మిది గేముల్లో గెలిచి, రెండు గేముల్లో ఓడిపోయింది. విజేత అర్జున్, రన్నరప్ సరయులను తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ అభినందించారు.



ప్రపంచ 6-రెడ్ స్నూకర్ చాంపియన్ కమల్ చావ్లా

ఉలాన్‌బాటర్ (మంగోలియా): అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పురుషుల 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారతప్లేయర్ కమల్ చావ్లా విజేతగా అవతరించాడు. బుధవారం జరిగిన ఫైనల్లో కమల్ చావ్లా 6-2 (23-47, 18-47, 71-0, 41-7, 64-0, 43-0, 33-20, 36-29) ఫ్రేమ్‌ల తేడాతో అస్జాద్ ఇక్బాల్ (పాకిస్తాన్)పై విజయం సాధించి తొలిసారి ప్రపంచ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఇదే టోర్నీలో కమల్ 2017లో రన్నరప్‌గా నిలిచాడు. ప్రపంచ పురుషుల 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా కమల్ చావ్లా గుర్తింపు పొందాడు. గతంలో భారత్ నుంచి పంకజ్ అద్వానీ (2014, 2015), లక్ష్మణ్ రావత్ (2019), శ్రీకృష్ణ సూర్యనారాయణన్ (2022) ఈ ఘనత సాధించారు.

రెండో టెస్టుకు షకీబ్ ఫిట్

కాన్పూర్: బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ రెండో టెస్టుకు పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉంటాడని జట్టు హెడ్ కోచ్ హతురుసింఘే తెలిపారు. చేతివేలి గాయంతో చెన్నైలో జరిగిన తొలి టెస్టులో షకీబ్ ఇబ్బంది పడ్డాడు. బుమ్రా బౌలింగ్‌లో అతని వేలికి గాయమవగా, స్పిన్‌కు స్వర్గధామమైన చెపాక్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి అతను కేవలం 21 ఓవర్లే వేయగలిగాడు. ఈ నేపథ్యంలో కోచ్ మాట్లాడుతూ అతని ఫిట్‌నెస్‌పై ఏ బెంగా లేదన్నాడు. తొలిటెస్టు పరాజయంపై స్పందిస్తూ తమ ఆటగాళ్లు స్థాయికి తగ్గ ఆటతీరు కనబరచలేకపోయారని చెప్పాడు.


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● అల్లు అర్జున్

కాకినాడ కాలింగ్

కాకినాడ కాలింగ్ అంటూ అక్కడికి వెళ్లనున్నారు పుష్పరాజ్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందనున్న 'పుష్ప' ఫ్రాంచైజీ నుంచి రానున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. ఈ చిత్రంలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, హీరోయిన్ శ్రీ వల్లీ పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 6న విడుదల కానుంది. కాగా హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో కొన్ని రోజులుగా 'పుష్ప: ది రూల్' క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో భాగంగా ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తీశారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ కాకినాడలో జరగనుందని తెలిసింది. కానీ ఈ షెడ్యూల్ రెండు మూడు రోజుల్లోనే పూర్తవుతుందట. దీంతో 'పుష్ప: ది రూల్' సినిమా మేజర్ టాకీ పార్టు పూర్తవుతుందని, ఆ తర్వాత మిగిలి ఉన్న పాటల చిత్రీకరణను ప్లాన్ చేశారని సమాచారం. ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


● రజనీకాంత్

యముడొచ్చి దిగినాడు!

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. తెలుగులో 'వేట్టయాన్: ద హంటర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి టీజర్ తరహాలో ప్రివ్యూ వీడియో విడుదలైంది. బుధవారం విడుదలైన ఈ తెలుగు వెర్షన్ వీడియోలో 'ఈ దేశంలో లక్షలాదిమంది పోలీసు అధికారులు ఉన్నారు. కానీ వీళ్లను మాత్రం చూడగానే గుర్తు పడుతున్నారంటే... హౌ ఈజ్ ఇట్ పాజిబుల్, సో... ఎన్‌కౌంటర్ పేరుతో ఒక మనిషిని హత్య చేయడం అదొక హీరోయిజం...ఈజ్ ఇట్' (అమితాబ్ బచ్చన్), 'ఎన్‌కౌంటర్ అనేది నేరం చేసినవాళ్లకి విధించే శిక్ష మాత్రమే కాదు... ఇక మీదట ఎలాంటి నేరం మళ్లీ జరగకూడదని తీసుకునే ముందు జాగ్రత్త చర్య' (రజనీకాంత్), 'మోస్ట్ డేంజరస్ క్రిమినల్స్‌ని భయపడకుండా ఎన్‌కౌంటర్ చేసినందు వల్ల వీళ్లు హీరోస్ అయ్యారు' (రితికా సింగ్), 'మన ఎస్పీ అన్న పేరు మీద ఒక యముడొచ్చి దిగినాడు' అనే డైలాగ్స్ ఈ ప్రివ్యూ వీడియోలో ఉన్నాయి.

రా మచ్చా మచ్చా...


● రామ్‌చరణ్

'రా మచ్చా మచ్చా...' అంటూ సందడి చేస్తున్నారు హీరో రామ్‌చరణ్. 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీలో ఓ హీరోగా నటించిన రామ్‌చరణ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్. శంకర్ దర్శకత్వంలో అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి తమన్ సంగీతం అందించిన 'జరగండి... జరగండి..' పాటను విడుదల చేశారు. 'రా మచ్చా మచ్చా..' అంటూ సాగే సెకండ్ సాంగ్ ప్రోమోను ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ''తొలి పాట 'జరగండి జరగండి...' ఎంత సెన్సేషన్ అయ్యిందో తెలిసిందే. రెండో పాట 'రా మచ్చా మచ్చా..' కూడా అదే స్థాయిలో ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఈ పాటకు అనంత్ శ్రీరామ్ అద్భుతమైన సాహిత్యం అందించారు'' అని యూనిట్ తెలిపింది. ఈ సినిమాకి కెమెరా: ఎస్. తిరుణావుక్కరసు.

ఆ ఇద్దరే ఈ సినిమాకి పెద్ద బలం

- సి. ప్రేమ్‌కుమార్



''నేను తీసిన '96' సినిమా ప్రేమకథ. కానీ, 'సత్యం సుందరం' కుటుంబ కథా చిత్రం. కార్తీ, అరవింద్ స్వామిగార్ల పాత్రల మధ్య ఒక రాత్రిలో జరిగే కథ. వాళ్ల మధ్య అనుబంధం ఏంటి? ఆ ఒక్క రాత్రిలో వారి మధ్య ఎలాంటి మానసిక సంఘర్షణ జరిగింది? అనేది ఆసక్తిగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులకు ఈ ఫ్యామిలీ డ్రామా బాగా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ సి. ప్రేమ్‌కుమార్ అన్నారు. కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సత్యం సుందరం'. 2డి ఎంటర్‌టైన్‌మెంట్‌పై సూర్య, జ్యోతిక నిర్మించిన ఈ సినిమా తెలుగులో ఈ నెల 28న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా సి. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ- ''సత్యం సుందరం' నవలని సినిమా స్క్రిప్ట్‌లాగానే రాశాను. కార్తీ, అరవింద్ స్వామిగార్లు ముందు నవలని చదివారు... వారికి బాగా నచ్చింది. ఆ నవలని స్క్రిప్ట్‌గా మలచడం సులభంగా అనిపించింది. కార్తీ, అరవింద్ స్వామిగార్లలో ఏ ఒక్కరు అంగీకరించకపోయినా ఈ సినిమా చేసేవాడిని కాదు. వాళ్లిద్దరే అలా నటించగలరు. వాళ్ల కెమిస్ట్రీ, కాంబినేషన్ ఈ సినిమాకి పెద్ద బలం. సూర్యగారికి సినిమా అంటే చాలా ప్యాషన్. ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రం నిర్మించారు. గోవింద్ వసంత '96'కి ఎంత మంచి మ్యూజిక్ ఇచ్చారో అందరికీ తెలుసు. 'సత్యం సుందరం'కి కూడా అంతే అద్భుతమైన సంగీతం అందించారు. ఈ సినిమా తెలుగు వెర్షన్ డబ్బింగ్ అద్భుతంగా వచ్చింది'' అన్నారు.

నవ్వుల ప్రయాణం


● శర్వానంద్

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'శర్వా 37' (వర్కింగ్ టైటిల్). రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం కేరళ షెడ్యూల్ పూర్తయింది. ''హిలేరియస్ రైడ్‌గా రూపొందుతున్న చిత్రం 'శర్వా 37'. 10 రోజుల పాటు జరిగిన కేరళ షెడ్యూల్‌లో శర్వానంద్, సాక్షీ వైద్యలపై బృందా మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటని షూట్ చేశాం. అలాగే పృథ్వీ మాస్టర్ ఆధ్వర్యంలో ఫైట్ సీక్వెన్స్‌ను, ప్రధాన నటీనటులపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. త్వరలో టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: జ్ఞానశేఖర్.

ట్రైలర్ థ్రిల్లింగ్‌గా అనిపించింది

- ప్రశాంత్ వర్మ


● ప్రశాంత్ వర్మ, ప్రిన్స్

''కలి' ట్రైలర్ థ్రిల్లింగ్‌గా అనిపించింది. గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం ఉండబోతున్నట్లు తెలుస్తోంది'' అని 'హను-మాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ అన్నారు. ప్రిన్స్, నరేష్ అగస్త్య హీరోలుగా నేహా కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కలి'. శివ శేషు దర్శకత్వం వహించారు. కథా రచయిత కె. రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో లీలా గౌతమ్ వర్మ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని ప్రశాంత్ వర్మ విడుదల చేసి, మాట్లాడుతూ- ''ట్రైలర్ చూస్తే ప్రిన్స్, నరేష్ అగస్త్య, నేహా కృష్ణన్ బాగా నటించారనిపిస్తోంది. వీఎఫ్ఎక్స్ హై క్వాలిటీతో ఉన్నాయి. శివ శేషు, లీలా గౌతమ్ వర్మతో పాటు 'కలి' టీమ్‌కి ఆల్ ది బెస్ట్. ఈ చిత్రం చూసేందుకు ఎదురు చూస్తున్నాను. అలాగే ప్రేక్షకులూ చూడాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జీవన్ బాబు, కెమెరా: నిశాంత్ కటారి, రమణ జాగర్లమూడి.

తారలు మెరిసే... ఫ్యాన్స్ మురిసే...


● సమంత, ప్రియాంకా చోప్రా

ప్రియాంకా చోప్రా, సమంత ఒకే వేదికపై మెరిశారు. ముచ్చట్లు చెప్పుకుంటూ, చిరు నవ్వులు చిందిస్తూ వీరు ఫొటోలకు పోజులివ్వగా, అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన వారి ఫ్యాన్స్ ఆనందంతో మురిసిపోతున్నారు. ఇంతకీ సమంత, ప్రియాంకా చోప్రా ఎక్కడ కలిశారనే విషయానికి వస్తే... వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో రూపొందిన స్పై యాక్షన్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ మాధ్యమంలో నవంబరు 7 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. కాగా లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'సిటాడెల్: హనీ బన్నీ' సిరీస్ ప్రీమియర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు ప్రపంచవ్యాప్త సినీ తారలతో పాటు సమంత, ప్రియాంకా చోప్రాలు కూడా ఈ వేడుకలో సందడి చేశారు. ఇక రిచర్డ్ మాడెన్, ప్రియాంకా చోప్రా లీడ్ రోల్స్‌లో దర్శక ద్వయం న్యూటన్ థామస్- జెస్సికా రూపొందించిన అమెరికన్ స్పై యాక్షన్ సిరీస్ 'సిటాడెల్'కు ఇండియన్ వెర్షన్‌గా 'సిటాడెల్: హనీ బన్నీ' రూపొందింది. అమెరికన్ 'సిటాడెల్' తొలి సీజన్ 2023 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అలాగే 'సిటాడెల్'కు సెకండ్ సీజన్ కూడా రూపొందుతోందని, ఈ సీజన్‌లో కూడా ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్ చేస్తున్నారని సమాచారం.

క కంప్లీట్


● సుజీత్, కిరణ్ అబ్బవరం, సందీప్

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 'క' సినిమా షూటింగ్ కంప్లీట్ అయింది. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, కేఏ ప్రొడక్షన్స్‌పై చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకులు సుజీత్, సందీప్ మాట్లాడుతూ-''గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్ కథతో 'క' రూపొందింది. టీమ్ అంతా ఒక ఫ్యామిలీలా కలిసిపోయి అహర్నిశలు సినిమా కోసం పనిచేశాం. 'క' చిత్రం జీవితాంతం గుర్తుండే అనుభవాలు మాకు ఇచ్చింది'' అని తెలిపారు. కాగా ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో త్వరలో విడుదలకానుంది. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి సీఈఓ: రహస్య గోరక్ (కేఏ ప్రొడక్షన్స్), కెమెరా: విశ్వాస్ డానియేల్, సతీష్ రెడ్డి మాసం, సంగీతం: సామ్ సీఎస్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
256	64
85,170	26,004

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	18,081	▲	6
డోజోన్స్	41,868	▼	34
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,269	▼	14
డాక్స్	18,918	▼	78
షాంఘై	2,896	▲	33
నికాయ్	37,870	▼	70

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75,248	▲	484
బంగారం (99.5 స్వచ్ఛత)	74,947	▲	482
వెండి (కిలో)	90,730	▲	2,328

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.18	84.20
€	యూరో		92.52	94.92
AU$	ఆస్ట్రేలియా డాలర్		56.73	58.69
£	బ్రిటన్ పౌండ్		109.58	114.48
¥	జపాన్ ఎన్ (100)		46.00	69.00
S$	సింగపూర్ డాలర్		62.74	67.44
SAR	సౌదీ రియాల్		21.39	22.95
UAE D	యూఏఈ దిర్హామ్		21.87	23.65
¥	చైనా యువాన్		11.02	12.85



- హ్యుందాయ్, స్విగ్గీ భారీ ఆఫర్లకు సెబీ లైన్‌క్లియర్
- హ్యుందాయ్ మెగా ఇష్యూ @ రూ. 25,000 కోట్లు
- పూర్తయితే దేశంలో అతిపెద్ద ఐపీఓగా రికార్డ్
- స్విగ్గీ రూ. 11,700 కోట్ల పబ్లిక్ ఆఫర్ నవంబర్లో...

ఇప్పటిదాకా వచ్చినవి ఒక రేంజ్.. ఇకపై వచ్చేవి వేరే లెవెల్! అడుగుపెడితే మార్కెట్ రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోవాల్సిందే!! ఇప్పటికే సెప్టెంబర్లో ఇన్వెస్టర్లు ఐపీఓల వర్షంలో ముద్దవుతుండగా.. రాబోయే రెండు నెలల్లో బాహుబలి ఆఫర్లు మార్కెట్‌ను ముంచెత్తనున్నాయి. దేశంలో రెండో బడా కార్ల కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా అతిపెద్ద ఇష్యూగా రికార్డు బ్రేక్ చేయనుంది. ఇక ఫుడ్-గ్రాసరీ డెలివరీ దిగ్గజం స్విగ్గీ రెండో మెగా స్టార్టప్ ఆఫర్‌గా నిలవనుంది. ఈ రెండింటికీ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక మెగా ఐపీఓల జాతరకు రంగం సిద్ధమైంది.

బాహు'బుల్' ఐపీఓలొస్తున్నాయ్!



దక్షిణకొరియా కార్ల దిగ్గజం హ్యుందాయ్ ఐపీఓకు సెబీ తాజాగా ఆమోదం తెలపడంతో పబ్లిక్ ఆఫర్ల (ఐపీఓ) చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ కనీసం 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25,000 కోట్లు) సమీకరించనుంది. హ్యుందాయ్ ఇండియా మాతృ సంస్థ (ప్రమోటర్) హ్యుందాయ్ మోటార్ కంపెనీ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) మార్గంలో కొంత వాటాను, అంటే 14.22 కోట్ల షేర్లను విక్రయించనుంది. తాజా ఈక్విటీ షేర్లు ఏవీ జారీ చేయడం లేదు. ఈ ఇష్యూ పూర్తయితే ఎల్‌ఐసీ రికార్డును బద్దలవుతుంది. 2022లో ఎల్‌ఐసీ ఐపీఓ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.21,000 కోట్లను సమీకరించింది. ఇప్పటిదాకా ఇదే దలాల్ స్ట్రీట్‌లో అతిపెద్ద పబ్లిక్ ఆఫర్.

రెండు దశాబ్దాల తర్వాత...

దేశీ వాహన పరిశ్రమలో ఇదో సరికొత్త మైలురాయిగా నిలవనుంది. 2003లో జపాన్ వాహన దిగ్గజం మారుతీ సుజుకీ లిస్టింగ్ అయిన రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ దేశీయంగా ఒక కార్ల కంపెనీ ఐపీఓకు వస్తుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. అమ్మకాల పరంగా దేశంలో రెండో అతిపెద్ద కార్ల కంపెనీగా నిలుస్తున్న హ్యుందాయ్ ఇండియా మార్కెట్ క్యాప్ (విలువ) 18–20 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. ప్రస్తుతం మారుతీ మార్కెట్ విలువ దాదాపు 48 బిలియన్ డాలర్లు. కాగా, అక్టోబర్‌లో హ్యుందాయ్ ఐపీఓ వస్తుందని సమాచారం. 1996లో భారత్‌లోకి అడుగుపెట్టిన హ్యుందాయ్.. వివిధ కార్ల విభాగాల్లో 13 మోడల్స్ విక్రయిస్తోంది. గత నెలలో ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ ఐపీఓ ద్వారా రూ.6,145 కోట్ల సమీకరించడంతో పాటు బంపర్ లిస్టింగ్ నేపథ్యంలో హ్యుందాయ్ మెగా ఇష్యూపై ఇన్వెస్టర్లు గురిపెడుతున్నారు.

స్విగ్గీ డెలివరీ రెడీ...

ఫుడ్ డెలివరీ దిగ్గజం స్విగ్గీకి కూడా సెబీ నుంచి ప్రాథమిక ఆమోదం లభించింది. సెబీ కొన్ని మార్పుచేర్పులు సూచించడంతో తుది డ్రాఫ్ట్ ప్రాస్పెక్టస్‌ను కంపెనీ త్వరలో దాఖలు చేయనుంది. ఏప్రిల్‌లో వాటాదారుల ఆమోదం ప్రకారం ఈ మెగా ఇష్యూ ద్వారా రూ.10,414 కోట్లను స్విగ్గీ సమీకరించనుంది. ఇందులో రూ.3,750 కోట్లను తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా కంపెనీ సమీకరించనుంది. మిగతా మొత్తాన్ని ప్రస్తుత ఇన్వెస్టర్లు కొంత వాటాను విక్రయించి సొమ్ము చేసుకోనున్నారు. తుది ఆమోదం మేరకు ఇష్యూ సైజు 1.4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.11,700 కోట్లు) ఉండొచ్చని అంచనా. 2014లో ఆరంభమైన స్విగ్గీ ప్రస్తుతం ఫుడ్ డెలివరీతో పాటు క్విక్ కామర్స్ (ఇన్‌స్టామార్ట్), హైపర్ లోకల్ లాజిస్టిక్స్ విభాగాల్లో దూసుకుపోతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి కంపెనీ మార్కెట్ వేల్యుయేషన్ 13 బిలియన్ డాలర్లుగా అంచనా. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 1.09 బిలియన్ డాలర్ల ఆదాయం ఆర్జించింది. 4,700 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. కాగా, జొమాటో 2021లో బంపర్ లిస్టింగ్‌తో బోణీ చేసింది. రూ.9,375 కోట్లు సమీకరించింది. రూ.76 ఇష్యూ ధర కాగా, 60% ప్రీమియంతో రూ.115 వద్ద లిస్టయింది. రెండేళ్లలో జొమాటో షేరు రూ.46 కనిష్ట స్థాయి నుంచి 520 శాతం (ప్రస్తుత ధర 286) ఎగబాకడం విశేషం. కాగా, స్విగ్గీ ఐపీఓ నవంబర్లో ఉండొచ్చనేది మార్కెట్ వర్గాల సమాచారం.

దలాల్ స్ట్రీట్‌లో టాప్ ఐపీఓలు... (రూ. కోట్లలో)

సంవత్సరం	కంపెనీ	మొత్తం
2024	హ్యుందాయ్	25,000
2022	ఎల్‌ఐసీ	21,000
2021	పేటీఎం	18,300
2010	కోల్ ఇండియా	15,200
2008	రిలయన్స్ పవర్	11,563
2024	స్విగ్గీ ★	11,700


★ అంచనా



\- సాక్షి, బిజినెస్ డెస్క్

పసిడి కాంతులు

రికార్డు పరుగులు
- ప్రపంచవ్యాప్తంగా దూసుకెళ్తున్న బంగారం



న్యూఢిల్లీ/న్యూయార్క్: అటు అంతర్జాతీయంగా, ఇటు దేశీయంగా బుధవారం బంగారం ధరల రికార్డుల మోత మోగించాయి. ఒకవైపు అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ ఫండ్ కోత, దీనితో వ్యవస్థలో భారీ ద్రవ్య లభ్యత (లిక్విడిటీ) అంచనాలు- ద్రవ్యోల్బణం భయాలు, మరోవైపు భౌగోళిక ఉద్రిక్తతలు బంగారం రికార్డు పరుగుకు ప్రధాన కారణం.

అంతర్జాతీయం @ 2,694 డాలర్లు

అంతర్జాతీయంగా కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ఔన్స్ (31.1 గ్రాములు) ధర బుధవారం ఒక దశలో క్రితం ముగింపుతో పోల్చితే 17 డాలర్లు పెరిగి 2,694.75 డాలర్ల స్థాయిని చూసింది. ఈ రేటు చరిత్రాత్మక గరిష్ట స్థాయి. ఈ వార్త రాస్తున్న 9 గంటల సమయంలో పటిష్టంగా 2,682 డాలర్ల స్థాయిలో ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు సమీప భవిష్యత్తులో ఔన్స్‌కు 3,200 డాలర్లను అధిగమించే చాన్స్ ఉందని ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా చెప్పారు.

న్యూఢిల్లీ @ 77,850

ఇక దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 స్వచ్ఛత పసిడి ధర ఆల్‌టైమ్ గరిష్టాన్ని చూసింది. క్రితం ముగింపుతో పోల్చితే 10 గ్రాముల రూ.900 ఎగసి రూ.77,850కి ఎగసింది. 99.5 స్వచ్ఛత ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.77,500 వద్దకు చేరింది. అంతర్జాతీయ ధరలతో పోల్చితే నిజానికి భారత్‌లో పసిడి ధరలు ఇప్పటికే మరింత అధిక స్థాయికి చేరాల్సి ఉంది. అయితే బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకాల తగ్గింపు, ఈక్విటీ మార్కెట్ పరుగు నేపథ్యంలో రూపాయి కాస్త బలోపేత ధోరణి దేశంలో పసిడి పరుగును కొంత కట్టడి చేశాయి. మరోపక్క, న్యూఢిల్లీలో వెండి ధర కేజీకి రూ. 3,000 ఎగసి రూ. 93,000కు చేరింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
వర్ధమాన దేశాలకు ఏఐఐబీ సాయం: సీతారామన్ విజ్ఞప్తి
భారత్ వృద్ధి 7 శాతం: ఏడీబీ

సరికొత్త శిఖరాలకు...

- సెన్సెక్స్ 85,000.. నిఫ్టీ 26,000 పైన క్లోజ్
- చివర్లో బ్యాంకింగ్, పవర్ షేర్ల కొనుగోళ్ల దన్ను



ముంబై: మార్కెట్లో రికార్డుల మోత మోగుతోంది. తొలిసారిగా సెన్సెక్స్ 85,000 పాయింట్లు, నిఫ్టీ 26,000 పాయింట్ల పైన ముగిసి సరికొత్త చరిత్ర సృష్టించాయి. ట్రేడింగ్ చివర్లో బ్యాంకింగ్, పవర్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు జోరందుకోవడంతో సూచీలు ఆరంభ నష్టాలను పూడ్చుకుని కొత్త ఆల్ టైమ్ గరిష్టాలకు దూసుకుపోయాయి. సెన్సెక్స్ 256 పాయింట్లు ఎగబాకి 85,170 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 85,247 గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 64 పాయింట్లు ఎగబాకి 26,004 వద్ద క్లోజైంది. ఒకానొక దశలో 26,033 స్థాయికి చేరింది. కాగా, ఇంట్రాడే, ముగింపులోనూ సూచీలు కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ షేర్లలో పవర్ గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఎంఅండ్ఎం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అత్యధికంగా క్షీణించాయి. ఆసియా మార్కెట్లలో షాంఘై, హాంకాంగ్ లాభాల్లో నిలవగా.. సియోల్, టోక్యో నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు సైతం నష్టాల్లో ముగిశాయి, అమెరికా సూచీలు కూడా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

వేదాంత నాలుగో విడత డివిడెండ్

ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగో విడత మధ్యంతర డివిడెండ్ ఇవ్వడంపై మైనింగ్ దిగ్గజం వేదాంత బోర్డు అక్టోబర్ 8న భేటీ కానుంది. 2024–25లో కంపెనీ ఇప్పటివరకు మూడు విడతల్లో రూ. 13,474 కోట్ల (దాదాపు షేరుకు రూ.34.5) డివిడెండును ఆమోదించింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నిట్ ఆంధ్రప్రదేశ్‌లో 125 ఫ్యాకల్టీ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 125.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2 (కాంట్రాక్ట్)–48, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2 (కాంట్రాక్ట్)–20, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్ 1–20, అసోసియేట్ ప్రొఫెసర్–30, ప్రొఫెసర్–7.
» **విభాగాలు:** బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, కెమిస్ట్రీ, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 35 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు, ప్రొఫెసర్ పోస్టులకు 55 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** టీచింగ్ డెమాన్‌స్ట్రేషన్/రీసెర్చ్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2024
» **వెబ్‌సైట్:** https://www.nitandhra.ac.in

ఐఐటీ తిరుపతిలో ఎంఎస్-పీహెచ్‌డీ ప్రవేశాలు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. ఎంఎస్–పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** మాస్టర్ ఆఫ్ సైన్స్ బై రీసెర్చ్ ఇన్ ఇంజనీరింగ్(ఎంఎస్(ఆర్)), డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్(పీహెచ్‌డీ).
» **అర్హత:** సంబంధిత విభాగంలో యూజీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.10.2024
» **వెబ్‌సైట్:** https://www.iittp.ac.in

ఐఓసీఎల్‌లో 12 లా ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) ఒప్పంద ప్రాతిపదికన లా ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. పీజీ క్లాట్–2024 స్కోరు తప్పనిసరిగా ఉండాలి. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000.
» **ఎంపిక విధానం:** సర్టిఫికేట్ల పరిశీలన, మెడికల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.10.2024
» **వెబ్‌సైట్:** https://iocl.com

ఐఐటీ ఇండోర్‌లో 26 ఫ్యాకల్టీ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇండోర్(ఐఐటీఐ)లో.. ఒప్పంద ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్(గ్రేడ్1–గ్రేడ్–2).
» **విభాగాలు:** ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్, స్పేస్ ఇంజనీరింగ్, బయోసైన్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, ఇండర్ డిసిప్లినరీ ఏరియాస్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత పోస్టును అనుసరించి పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు టీచింగ్ అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–1 పోస్టుకు రూ.1,81,320, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2 పోస్టుకు రూ.1,29,912.
» **వయసు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–1 పోస్టుకు 35 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2 పోస్టుకు 32 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.10.2024
» **వెబ్‌సైట్:** https://www.iiti.ac.in

గ్రూప్-3.. తుది మెరుగులు ఇలా!

» నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్–3 పరీక్షలు
» మొత్తం 1,375 పోస్ట్‌లకు ఐదు లక్షలకుపైగా దరఖాస్తులు
» మొత్తం మూడు పేపర్లలో పరీక్ష నిర్వహణ
» రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత

గ్రూప్-3 సర్వీసెస్.. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు అయిదు లక్షల మందికిపైగా అభ్యర్థులు పోటీ పడుతున్న పరీక్ష! ఈ పరీక్షలో విజయం సాధించడానికి అహర్నిశలు కృషి చేస్తున్న పరిస్థితి! వీరంతా తమ ప్రిపరేషన్‌కు తుది మెరుగులు దిద్దుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. గ్రూప్-3 పరీక్ష తేదీలు ఖరారు కావడమే!! నవంబర్ 17, 18 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలో.. గ్రూప్-3 పరీక్ష తీరుతెన్నులు, పరీక్షలో విజయానికి చివరి దశ ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం..



టీజీపీఎస్సీ ఎగ్జామ్స్

- **1,375:** గ్రూప్–3 ఉద్యోగాల సంఖ్య!
- **5,36,477:** మొత్తం దరఖాస్తుల సంఖ్య.
- అంటే.. ఒక్కో పోస్ట్‌కు 390కు పైగా పోటీ!!

ఇంతటి తీవ్ర పోటీలో నెగ్గాలంటే.. ఇప్పటి వరకు సాగించిన ప్రిపరేషన్ శైలికి భిన్నంగా తుది మెరుగులు దిద్దుకోవాలి. ఇంతకాలం చదివిన అంశాల రివిజన్‌పై అధికంగా దృష్టిపెట్టాలి.

గ్రూప్-3 పరీక్ష స్వరూపం

గ్రూప్ 3 పరీక్షను మొత్తం మూడు పేపర్లలో నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు చొప్పున 450 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో పేపర్ 1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ 150 మార్కులకు, పేపర్–2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ 150 మార్కులకు, పేపర్ 3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ 150 మార్కులకు ఉంటాయి. పేపర్–2, 3లలో ప్రతి పేపర్‌లోనూ మూడు విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు చొప్పున 150 ప్రశ్నలతో పేపర్ ఉంటుంది.

సమయం.. సమన్వయం

గ్రూప్–3 పరీక్షలు నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. అంటే.. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయం 50 రోజులు. ఈ సమయాన్ని ఎంతో సమన్వయంతో వినియోగించుకోవాలి. మూడు పేపర్లలో ఉన్న కామన్ టాపిక్స్‌ను గుర్తిస్తూ వాటిని ఒకే సమయంలో చదివేలా ప్లాన్ చేసుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌లలోని ఉమ్మడి అంశాలను గుర్తించి.. వాటిని అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అన్ని అంశాలను సమన్వయం చేసుకుంటూ చదివే వీలుంది.

పునశ్చరణ

ఈ సమయంలో ముందుగా పాటించాల్సిన వ్యూహం రివిజన్(పునశ్చరణ). ఇప్పటి వరకు తాము చదివిన అంశాల అవలోకనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కొత్త పుస్తకాల జోలికి వెళ్లకుండా సిలబస్‌కు సరితూగే పుస్తకాలను మాత్రమే చదవాలి. డిస్క్రిప్టివ్ విధానంలో చదువుతూ ముఖ్యాంశాలను సొంత నోట్సులో రాసుకుంటూ ప్రతి రోజూ పునశ్చరణ చేసుకోవాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి. రోజూ సగటున 8 నుంచి 10 గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించాలి.

కొత్త టాపిక్స్‌కు ఇలా

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు తమకు కష్టంగా భావించిన అంశాలను తర్వాత చదవచ్చు అనే ఉద్దేశంతో విస్మరిస్తారు. వాటిలో ముఖ్యమైనవి కూడా ఉండొచ్చు. ఇలాంటి టాపిక్స్ విషయంలో వాటికి పరీక్షలో లభిస్తున్న ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని.. ప్రిపరేషన్‌కు కొంత టైమ్ కేటాయించాలి. దీంతోపాటు తెలంగాణ ప్రాంతానికి సంబంధించి తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖచిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, వాస్తు, శిల్పం, కవులు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి. తెలంగాణ ఎకానమీ, తెలంగాణ జాగ్రఫీ కీలకమైనవిగా గుర్తించాలి.

సొంత నోట్స్

అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభం నుంచే ఆయా సబ్జెక్ట్‌లలోని ముఖ్యమైన అంశాలతో సొంత నోట్స్ రాసుకుంటారు. ప్రస్తుత సమయంలో అభ్యర్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పాయింట్లతో రాసుకున్న నోట్స్‌ను పదేపదే చదవాలి. ఇలా చదువుతూ అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి.

తాజా విధానాలు

ఇప్పటి వరకు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి సిలబస్ ప్రకారం చదువుతున్న అభ్యర్థులు.. ప్రభుత్వ తాజా విధానాలపై దృష్టి పెట్టడం మేలు చేస్తుంది. పరీక్షలో ప్రభుత్వ విధానాలపై కనీసం 15 నుంచి 20ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం ప్రభుత్వ విధానాలపై ప్రచురితమైన అధికారిక డాక్యుమెంట్లను పరిశీలించాలి. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు తెచ్చారు. వీటిపై దృష్టిపెట్టాలి.

పరీక్ష రోజు ఇలా

ఎన్ని సంవత్సరాలు కష్ట పడినా.. ఎన్ని పుస్తకాలు అధ్యయనం చేసినా.. పరీక్ష రోజున అందుబాటులో ఉన్న వ్యవధిలో చూపే ప్రతిభే విజయాన్ని నిర్దేశిస్తుందని గుర్తించాలి. పరీక్ష హాల్లో ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. కనీసం పది నిమిషాలపాటు ప్రశ్నపత్రం పరిశీలించాలి. ఫలితంగా ప్రశ్న పత్రం క్లిష్టత స్థాయిపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ఆ తర్వాత సులభంగా భావించిన ప్రశ్నలకు ముందుగా సమాధానం ఇవ్వాలి. అనంతరం ఓ మోస్తరు క్లిష్టత ఉన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. చివరగా తమకు అత్యంత క్లిష్టంగా భావించిన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. ఇలా ప్రస్తుతం రివిజన్ నుంచి ఎగ్జామ్ హాల్లో వ్యవహరించే తీరు వరకూ.. స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలి.

పరీక్షలో ముఖ్యమైన అంశాలు

పేపర్-1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్

- కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ ఈవెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలకు సంబంధించి భారతదేశ ప్రమేయం, అదే విధంగా భారత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలపై దృష్టిపెట్టాలి. చరిత్రలో కీలక సంఘటనలు, అవి చోటు చేసుకున్న సంవత్సరాలపై పట్టు సాధించాలి. అదే విధంగా చరిత్రలో ముఖ్యమైన యుద్ధాలు, అందుకు దారితీసిన పరిస్థితులపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోని ముఖ్యమైన ఘట్టాల గురించి తెలుసుకోవాలి.
- ఎకానమీ కోసం బేసిక్స్‌తోపాటు ఇటీవల కాలంలో ఆర్థిక విధానాలు, అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిదారులు, పథకాల లక్ష్యం వంటి అంశాలను అధ్యయనం చేయాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి బేసిక్ సైన్స్ అంశాలతోపాటు నిజ జీవితంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర, ఈ రంగంలో తాజా పరిణామాలు, వాటి వల్ల ప్రయోజనాలు వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- జాగ్రఫీలో భౌగోళికంగా ప్రాధాన్యం సంతరించుకున్న ప్రాంతాలు, ఖనిజ వనరులు, సహజ వనరులు, నదీ తీర ప్రాంతాలు, అడవులు–రకాలు, పంటలు–అవి ఎక్కువగా పండే ప్రాంతాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. జనరల్ ఎబిలిటీలో రాణించేందుకు దత్తాంశాల విశదీకరణ, టేబుల్స్, గ్రాఫ్స్‌ను పరిశీలించి.. వాటిలోని ముఖ్యాంశాలను గుర్తించే విధంగా అధ్యయనం చేయాలి.

పేపర్-2

హిస్టరీ, పాలిటీ, అండ్ సొసైటీ పేరిట ఉన్న పేపర్–2 కోసం తెలంగాణ హిస్టరీలో తెలంగాణ సంస్కృతి, కవులు, కళలు, శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు, అసఫ్‌జాహీలు, సాయుధ రైతాంగ పోరాటం తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి. పాలిటీ విభాగానికి సంబంధించి భారత రాజ్యాంగం ప్రధాన చట్టాలపై పట్టు సాధించాలి. అధికరణలు, ప్రకరణలు, సవరణల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, సమాఖ్య వ్యవస్థలపై పట్టు పెంచుకోవాలి. వీటితోపాటు రాజ్యాంగ పరమైన సంస్థలు, వాటి విధుల గురించి తెలుసుకోవాలి. ముఖ్యంగా రాజ్యాంగంపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.

పేపర్-3 కోసం

ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పేరిట ఉండే పేపర్–3 కోసం దేశ, రాష్ట్ర ఆర్థిక విధానాలపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణ ఎకానమీని అధ్యయనం చేయాలి.రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాల గురించి తెలుసుకోవాలి. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, గిరిజనుల కోసం తెచ్చిన విధానాలు, పథకాలపై అవగాహన అవసరం. జాతీయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కోర్ ఎకానమీ అంశాలు మొదలు తాజా ఆర్థిక విధానాల వరకు అన్నింటినీ తెలుసుకోవాలి. బడ్జెట్ గణాంకాలు, తాజా ఆర్థిక సర్వే గణాంకాలపై పట్టుసాధించాలి.

క్లుప్తంగా...

ప్రొఫెసర్ ప్రమోద్ కె. నాయర్‌కు అంతర్జాతీయ గుర్తింపు



రాయదుర్గం: ప్రపంచ వ్యాప్తంగా టాప్ 2 శాతం మంది పరిశోధకులు, సాహిత్య అధ్యయనాల రంగంలో ఏకైక భారతీయ విశ్వవిద్యాలయం పరిశోధకునిగా హెచ్‌సీయూలోని ఇంగ్లిష్ సీనియర్ ప్రొఫెసర్ ప్రమోద్ కె. నాయర్ గుర్తింపు సాధించారు. ఈ ప్రత్యేకతతోపాటు ప్రొఫెసర్ ప్రమోద్ ఇప్పుడు సాహిత్య అధ్యయనాల్లో గ్లోబల్ టాప్–100లోకి చేరుకున్నారు. ప్రమోద్ నాయర్ హెచ్‌సీయూలో యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్‌గా కూడా విధులను నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ గుర్తింపు రావడంపై పలువురు ప్రొఫెసర్లు ఆయనను అభినందించారు.

28న జాతీయ లోక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఐ యాక్ట్, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, మ్యాట్రిమోనియల్, సివిల్ కేసుల్లో రాజీ కోసం 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. హైకోర్టుతో పాటు తాలూకా కోర్టుల్లోనూ లోక్ అదాలత్ జరుగుతుందని స్పష్టం చేశారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని సూచించారు.

'సునామీ' సంసిద్ధతపై ఇన్‌కాయస్ 'మాక్ ఎక్సర్‌సైజ్'

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయస్), నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ)ల సంయుక్త ఆధ్వర్యంలో సునామీ వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే విషయంలో సంసిద్ధతను పెంచుకునేందుకు 'మాక్ ఎక్సర్‌సైజ్'(నమూనా కార్యక్రమం) నిర్వహించారు. సునామీ సంసిద్ధతను పెంచుకునేందుకు వివిధ కమ్యూనికేషన్ చానళ్ల పనితీరును పరిశీలించారు. సునామీ ఎప్పుడు సంభవిస్తుందో తెలియదు కాబట్టి, అలాంటి విపత్తులు వచ్చినపుడు త్వరితంగా స్పందించి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిని కేంద్రీకరించారు. బుధవారం హైదరాబాద్ ఇన్‌కాయస్‌లో 'సునామీ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్'కు సంబంధించి ప్రీ ఎక్సర్‌సైజ్ వర్క్‌షాపు నిర్వహించారు. ఇది గురువారం కూడా కొనసాగనుంది. నవంబర్ 5న 'వరల్డ్ సునామీ అవేర్‌నెస్ డే'సందర్భంగా దేశవ్యాప్తంగా 'సునామీ మాక్ ఎక్సర్‌సైజ్'నిర్వహణకు ఇన్‌కాయస్ నిర్ణయించింది.

'తాండూరు' రైళ్ల రద్దు

తాండూరు: హైదరాబాద్ నుంచి తాండూరు మీదుగా ప్రయాణించే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ ప్రకటించింది. దీంతో ఈ లైన్‌లో వెళ్లే 7 రైళ్ల రాకపోకలకు బ్రేక్ పడింది. హుబ్లీ డివిజన్‌లోని భీమా నది రైల్వే బ్రిడ్జి పునరుద్ధరణలో భాగంగా.. ఈ వంతెన మీదుగా పలు ప్రాంతాలనుంచి ప్రయాణించే మొత్తం 12 రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ప్రకటించారు. తాండూరు మీదుగా వెళ్లే 17320 హైదరాబాద్–హుబ్లీ రైలును వాడి, గుల్బర్గా మీదుగా దారి మళ్లించినట్లు పేర్కొన్నారు.

మౌంట్ గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించి..

మహబూబాబాద్ జిల్లా గిరిజన యువకుడు యశ్వంత్ ఘనత




మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన గిరిజన యువకుడు భూక్య యశ్వంత్ అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గోరిచెన్ శిఖరంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశాడు. గతంలో పలు పర్వతాలను అవలీలగా అధిరోహించిన ఈ సాహసవీరుడు తాజాగా అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం తవాంగ్ జిల్లాలో ఎత్తైన మౌంట్ గోరిచెన్ మంచు శిఖరాన్ని అధిరోహించి మరో అరుదైన ఘనత సాధించాడు. సెప్టెంబర్ 4న మొదలైన యశ్వంత్ గోరిచెన్ పర్వతారోహణ యాత్ర 16 రోజులపాటు సాగి 19న ముగిసింది. గతంలో 2021 జూన్‌లో జమ్మూకశ్మీర్–లద్దాక్ ప్రాంతంలోని 5,602 మీటర్ల ఎత్తైన ఖార్డుంగ్‌లా పర్వతాన్ని అధిరోహించాడు. అదే ఏడాది ఆగస్టులో ఆఫ్రికా దేశమైన టాంజానియాలోని 5,895 మీటర్ల ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి తెలంగాణ ఖ్యాతిని చాటాడు. అదేవిధంగా హిమాచల్‌ప్రదేశ్‌లో 6,111 మీటర్ల ఎత్తున్న యునామ్ మంచు పర్వతాన్ని అనుకున్న సమయానికంటే ఒక రోజు ముందుగానే చేరుకొని రికార్డు సృష్టించాడు. త్వరలో ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించి భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు యశ్వంత్ చెప్పాడు.

అతి వినియోగం అనర్థమే

యూరినరీ, బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌లు, న్యుమోనియా చికిత్సల్లో తగ్గిన సాధారణ యాంటీబయాటిక్స్ ప్రభావం





- వ్యాధి కారక చెడు బ్యాక్టీరియాకు పెరిగిన సాధారణ యాంటీబయాటిక్స్‌ను తట్టుకునే శక్తి
- దేశంలో యాంటీ బయాటిక్స్ నిరోధకతపై ఐసీఎంఆర్ విడుదల చేసిన నివేదికలో వెల్లడి
- గతేడాది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 99,492 నమూనాలు విశ్లేషించిన ఐసీఎంఆర్

యాంటీ బయాటిక్స్ అతి వినియోగం కొంపముంచుతోంది. దగ్గు, జలుబు, ఇలా ఏ చిన్న అనారోగ్య సమస్యకైనా ప్రస్తుతం యాంటీ బయాటిక్స్ వాడకం పెరిగి పోయింది. దీంతో వ్యాధి కారక సూక్ష్మజీవులు రోగనిరోధక శక్తి పెంచుకుని యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) తీవ్ర సమస్యగా మారుతోంది. ఫలితంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్(యూటీఐ), బ్లడ్ ఇన్‌ఫెక్షన్, న్యూమోనియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు సాధారణ యాంటీ బయోటిక్ మందులతో చికిత్సలు కష్టతరంగా మారాయని ఐసీఎంఆర్ చెబుతోంది. ఐసీఎంఆర్‌కు చెందిన ఏఎంఆర్ రీసెర్చ్, సర్వైలెన్స్ నెట్‌వర్క్ విభాగం ఇటీవల 2023 నివేదికను విడుదల చేసింది. ఇందులో ఆందోళనకర అంశాలు వెలుగు చూశాయి. 2023 జనవరి నుంచి డిసెంబర్ మధ్య దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 99,492 నమూనాలను విశ్లేషించి, ఆ ఫలితాల ఆధారంగా నివేదికను విడుదల చేశారు.

20 శాతం తక్కువ ప్రభావం

విశ్లేషించిన నమూనాల్లో 22,182 రక్తం, 20,026 యూరిన్, 19,360 అంటు వ్యాధులు, 17, 902 లోయర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ మిగిలినవి ఇతర బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌లకు చెందినవి. కాగా సెఫోటాక్సిమ్, సెఫ్టాజిడిమ్, సిప్రోఫ్లాక్సాసిన్, లెవోఫ్లాక్సాసిన్ వంటి కీలక యాంటీ బయాటిక్స్ బ్యాక్టీరియాతో కలిగే ఇన్‌ఫెక్షన్‌లను నయం చేయడంలో 20 శాతం తక్కువ ప్రభావాన్ని చూపినట్టు నిర్ధారించారు. ఉదాహరణకు పైపెరాసిలిన్–టాజోబాక్టమ్ ప్రభావం 2017లో 56.8 శాతం ఉండగా 2023లో 42.4 శాతానికి తగ్గింది. గ్యాస్ట్రోఎంటరైటిస్‌కు కారణమయ్యే సాల్మోనెల్లా టైఫీ వంటి బ్యాక్టీరియా ఫ్లూరోక్వినోలోన్ ఔషధానికి 95 శాతానికిపైగా నిరోధకతను పెంచుకుందని స్పష్టమైంది. మూత్రనాళ, ఇతర ఇన్‌ఫెక్షన్‌లలో చికిత్స కోసం వినియోగించే అమికాసిన్ ప్రభావం 2017లో 79.2 శాతం ఉండగా, 2023లో 68.2 శాతానికి పడిపోయింది. ఏఎంఆర్ ముప్పు నుంచి బయటపడటానికి తక్షణ చర్యలు అవసరమని ఈ నివేదిక నొక్కి చెప్పింది. యాంటీ బయాటిక్స్ విక్రయాలు, వినియోగంపై కఠినమైన నిబంధనలు ఉండాలని వెల్లడించింది. వ్యవసాయరంగంలోనూ యాంటీ బయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టాలని స్పష్టం చేసింది.

ఏటా 10 లక్షల మంది మృతి

యాంటీ బయాటిక్స్ అపరిమిత వినియోగం కారణంగా వ్యాధులు సోకినప్పుడు చికిత్సల్లో అవి పని చేయక ప్రపంచంలో ఏటా 10 లక్షల మందికిపైగా మృత్యువాతపడుతున్నారు. 1990–2021 మధ్య ఈ మరణాలు సంభవించినట్టు జర్నల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లాన్సెట్‌లో ప్రచురించిన స్టడీ రిపోర్ట్‌లో పేర్కొంది. రాబోయే 25 ఏళ్లలో నాలుగు కోట్ల మంది మృత్యువాత పడే ప్రమాదం ఉన్నట్టు అంచనా వేసింది. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో 2025–2050 మధ్య యాంటీ బయాటిక్స్‌కు లొంగని వ్యాధులతో 1.18 కోట్ల మరణాలు సంభవిస్తాయని పేర్కొంది. మానవాళి ఎదుర్కొంటున్న 10 అతిపెద్ద ఆరోగ్య సవాళ్లలో ఏఎంఆర్ ఒకటని డబ్ల్యూహెచ్‌వో సైతం ఇప్పటికే పలు మార్లు హెచ్చరించిందని గుర్తు చేసింది.

సాక్షి, అమరావతి

27న సరస్ ఫెయిర్-2024 ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 27న నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో 'సరస్ ఫెయిర్–2024'ప్రారంభం కానుంది. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దీనిని ప్రారంభించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన –జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఈ మేళాను నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వరకు ఈ మేళా ఉంటుంది. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, చేనేత, హస్తకళ నైపుణ్యతలకు మార్కెట్ లింకేజీలను కల్పించడానికి ఈమేళా ద్వారా చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో వివిధ ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 250కిపైగా స్వయం సహాయక సంఘాల మహిళా గ్రామీణ కళాకారుల ఉత్పత్తులను ఒకే వేదికపైకి తెస్తున్నారు. ఈ మేళాలో ఆదిలాబాద్ డోక్రా లోహపు బొమ్మలు, పోచంపల్లి ఇక్కత్ చీరలు, గద్వాల్ పట్టు చీరలు, ఆదిలాబాద్ అగర్ బత్తులు, జగిత్యాల హెర్బల్ ఉత్పత్తులు, జనగామ మసాలా దినుసులు, కొమురంభీం ఆసిఫాబాద్ గిరిజన హస్త కళాకృతులు, రాజన్న సిరిసిల్ల చేనేతలు, నిర్మల్ పెయింటింగ్స్, మేడ్చల్ పిండి వంటలు, మెదక్ సిరిధాన్యాలు అందుబాటులో ఉండనున్నాయి. అలాగే ఏపీ కొండపల్లి బొమ్మలు, బిహార్ లక్క గాజులు, బెంగాల్ జూట్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి.

కాంట్రాక్టర్లకు బిల్లుల కోసమే 'కాళేశ్వరం' కార్పొరేషన్!

కార్పొరేషన్‌కు సొంత ఆదాయమేదీ లేదు

- రుణాలపై వచ్చే వడ్డీలతోనే కార్పొరేషన్ నిర్వహణ
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదించిన కాళేశ్వరం కార్పొరేషన్ అధికారులు



సాక్షి, హైదరాబాద్: బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొంది కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం కోసమే కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటైందని నీటిపారుదల శాఖ చీఫ్ అకౌంట్స్ అధికారి పద్మావతి, కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ అధికారి కొమ్మరాజు వెంకట అప్పారావు వెల్లడించారు. కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. బుధవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న ముగ్గురు అధికారులను వేర్వేరుగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. నాటి నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ ఆదేశాలతో కార్పొరేషన్ రుణాలను సమీకరించిందని ఓ ప్రశ్నకు సమాధానంగా కొమ్మరాజు వెంకట అప్పారావు తెలిపారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు స్వతహాగా ఆదాయం ఏమీ లేదన్నారు. రుణాలు మంజూరైన వెంటనే కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరపకుండా బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని.. వాటిపై వచ్చే వడ్డీలతో కార్పొరేషన్ నిర్వహణ జరుగుతోందని చెప్పారు. కాంట్రాక్టర్ల బ్యాంకు డిపాజిట్లపై వచ్చే వడ్డీలను సైతం కార్పొరేషన్ అవసరాలకు వాడుకుంటున్నామని వివరించారు. పూర్తయిన పనులన్నింటినీ కార్పొరేషన్ ఆస్తులుగానే పరిగణిస్తామని తెలిపారు. రామగుండం ఫెర్టిలైజర్, ఎన్టీపీసీ నుంచి నీటి విడుదలకు సంబంధించిన బిల్లులు 2023 నుంచి వస్తున్నాయని వివరించారు. కొలతలు చూశాకే బిల్లులు ఇస్తారా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సిద్ధం చేసిన బిల్లులను పేఅండ్‌అకౌంట్స్ విభాగం పరిశీలించి కార్పొరేషన్‌కు పంపిస్తుందని, తర్వాత చెల్లింపులు చేస్తామని బదులిచ్చారు. కాగ్ అభ్యంతరాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు.

మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి

నీటి పారుదల శాఖ బడ్జెట్ రూపకల్పనలో మీ పాత్ర ఏమిటని ఆ శాఖ చీఫ్ అకౌంట్స్ అధికారి పద్మావతిని కమిషన్ ప్రశ్నించగా.. చీఫ్ ఇంజనీర్ల నుంచి వివరాలను సేకరించి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపిస్తానని ఆమె బదులిచ్చారు. కార్పొరేషన్ రుణాల తిరిగి చెల్లింపు కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తోందని తెలిపారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ అభ్యంతరాల విషయంలో మీ అభిప్రాయమేంటి? రుణాలపై నిర్వహించిన సమావేశాల్లో గత ప్రభుత్వంలోని సీఎంఓ అధికారులు పాల్గొన్నారా? ప్రాజెక్టుతో ఆర్థికభారం పడే అవకాశం ఉండటంతో ఆర్థిక క్రమశిక్షణ కోసం సలహాలు ఏమైనా ఇచ్చారా?' కమిషన్ ప్రశ్నించగా.. ఆమె సమాధానం దాటవేసినట్టు తెలిసింది. 'కాళేశ్వరం ప్రాజెక్టుతో పడే ఆర్థిక భారం? దీనికి మీ సమర్థన ఉందా? రాష్ట్రంపై ఈ భారం రానున్న రోజుల్లో ఎలా ఉంటుంది? మీ బాధ్యతగా ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారా?' అన్న ప్రశ్నలకు తాను జవాబు చెప్పలేనని పేర్కొన్నట్టు సమాచారం. ఇక ఆర్థిక క్రమశిక్షణ లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకున్నదెవరని ప్రశ్నించగా.. అది చాలా విస్తృతమైన అంశమని, దానిపై తానేమీ చెప్పలేనని చెప్పినట్టు తెలిసింది. దీంతో కమిషన్ కొంత ఘాటుగా స్పందిస్తూ.. ''విచారణ సందర్భంగా ఎవరినో రక్షించే ప్రయత్నం చేయవద్దు. మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి. విచారణలో వాస్తవాలనే తెలపాలి. దాపరికాలు వద్దు'' అని పేర్కొన్నట్టు సమాచారం. మరోవైపు బిల్లులను పరిశీలించి చెల్లింపులకు సిఫారసు చేయడమే తన బాధ్యత అని వర్క్ అకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మ కమిషన్‌కు వివరించారు. కాగ్ నివేదికలోని ఒకటి రెండు విషయాలు మాత్రమే వాస్తవాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చిందని తెలిపారు.

ఎస్‌ఈ ఆదేశాలతో బ్యాంక్ గ్యారంటీల విడుదల!

- తాజాగా వెలుగులోకి ఎస్‌ఈ రాసిన లేఖ
- మేడిగడ్డ ఈఈ తిరుమలరావుపై ఆరోపణల్లో కొత్త మలుపు

సాక్షి హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్‌కి సంబంధించిన రూ.159 కోట్ల బ్యాంకు గ్యారంటీలను నిర్మాణ సంస్థకు విడుదల చేసిన అంశంపై నీటిపారుదల శాఖ అధికారుల మధ్య చిచ్చు రేగింది. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే మహదేవ్‌పూర్ డివిజన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలరావు విడుదల చేశారని నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎస్‌ఈ మంగళవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే బ్యాంకు గ్యారంటీలను విడుదల చేయాలని ఆదేశిస్తూ ఈఈ తిరుమలరావుకు 2021 జనవరి 21న కాళేశ్వరం ప్రాజెక్ట్ రామగుండం సర్కిల్–1 ఎస్‌ఈ రాసిన లేఖ బుధవారం బయటకు వచ్చింది. మేడిగడ్డ బరాజ్‌ను విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని పనులను నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ పూర్తి చేయడంతో పాటు గడచిన రెండేళ్లుగా బరాజ్‌ను నీటిపారుదల శాఖ వాడుకుంటున్న నేపథ్యంలో బ్యాంకు గ్యారంటీలను విడుదల చేయాలని ఆదేశిస్తూ ఎస్‌ఈ ఈ లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రామగుండం ఈఎన్సీ సైతం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అప్పటికే మరో లేఖ రాసిన విషయాన్ని ఎస్‌ఈ తన లేఖలో ప్రస్తావించడం విశేషం. కోవిడ్ –19 నేపథ్యంలో కాంట్రాక్టర్లకు బ్యాంక్ గ్యారంటీలను తిరిగి చెల్లించాలని అప్పట్లో కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు మేడిగడ్డ బరాజ్ కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరపాలని ఎస్‌ఈ కోరడం గమనార్హం.

చిన్ని గుండె పదిలం

- సాక్షి కథనంతో విద్యార్థికి నిమ్స్‌లో ఉచితంగా శస్త్రచికిత్స



ఆపరేషన్ తర్వాత వైద్యుడితో బాలుడు

జీడిమెట్ల: 'చిన్ని గుండెకు పెద్ద కష్టం'శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి నిమ్స్ వైద్యులు స్పందించారు. నిమ్స్‌లో బ్రిటన్ వైద్యుల సారథ్యంలో కొనసాగుతున్న ఉచిత గుండె శస్త్ర చికిత్సల్లో ఆ విద్యార్థికి విజయవంతంగా చికిత్స పూర్తి చేసినట్టు నిమ్స్ కార్డియో విభాగాధిపతి అమరేశ్వర రావు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. దూలపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన నూకల లక్ష్మీనారాయణ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. చిన్నతనంలోనే తల్లి మరణించగా, తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. దీంతో లక్ష్మీనారాయణ అమ్మమ్మ వద్దకు చేరాడు. ఈనెల 10వ తేదీన లక్ష్మీనారాయణ ఛాతీలో నొప్పి వచ్చింది. ఆస్పత్రిలో చూపించగా, గుండె నాళాల్లో రంధ్రం పడిందని, ఆపరేషన్‌కు రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. లక్ష్మీనారాయణ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో స్థానికులు ద్వారా వివరాలు తెలుసుకున్న 'సాక్షి'ఈ నెల 13న కథనం ప్రచురించింది. వెంటనే స్పందించిన నిమ్స్ వైద్యులు 14న నిమ్స్‌లో చేర్చుకొని విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించారు. లక్ష్మీనారాయణ అమ్మమ్మ నిమ్స్ వైద్యులు, సీఎం రేవంత్‌రెడ్డి, సాక్షి దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టుల దాడి

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టులు దాడికి దిగారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి క్యాంపుపైకి రాకెట్ లాంచర్లు విసురుతూ కవ్వింపు చర్యలకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో మావోయిస్టులు పారిపోయారు. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య పలుమార్లు మావోయిస్టులు దూరం నుంచి క్యాంపుపైకి కాల్పులు జరపగా, వారిని గుర్తించేందుకు పోలీసులు ఆకాశంలోకి పారా బాంబులు ఎగురవేసినట్లు తెలిసింది. ఈ ఘటనలో సుమారు 200 మందికి పైగా మావోయిస్టులు పాల్గొన్నట్లు అనుమానిస్తున్నారు. తెలంగాణ సీఆర్‌పీఎఫ్ క్యాంపుల పైకి మావోయిస్టులు దాడికి దిగడం ఇదే ప్రథమం. కాగా, ఈ ఘటనలో ఇరువర్గాల్లో ఎవరికీ ప్రాణనష్టం జరిగినట్టుగా సమాచారం లేదు. పూసుగుప్ప క్యాంపుపై మావోయిస్టులు దాడికి దిగిన ఘటనతో మండలంలోని చెలిమెల, తిప్పాపురం, చెన్నాపురం క్యాంపులతో పాటు సరిహద్దున ఉన్న పామేడు, తోగ్గూడెం, చింతవాగు, ధర్మారం, పాలోడి, ఎలకనగూడెం, లింగంపల్లి తదితర క్యాంపులను అప్రమత్తం చేశారు.

జానీ మాస్టర్‌కు నాలుగు రోజుల కస్టడీ



రంగారెడ్డి కోర్టులు: నృత్య దర్శకుడు జానీ మాస్టర్‌పై ఇటీవల నమోదైన అభియోగాల ఆధారంగా నమోదైన కేసులో నార్సింగి పోలీసులు సోమవారం రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా కమ్ జిల్లా ప్రధాన పోక్సో కోర్టు ముందు కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు.. విచారణ ఖైదీ జానీ మాస్టర్‌ను నాలుగు రోజుల కస్టడీకి అనుమతిస్తూ బుధవారం తీర్పు చెప్పిందని కోర్టు ఏపీపీ నరేశ్‌కుమార్ తెలిపారు. కాగా పిటిషనర్ కోరుకుంటే తన న్యాయవాది సమక్షంలో పోలీసు విచారణ జరిపేందుకు కోర్టు వెసులుబాటు కల్పించింది. చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్న విచారణ ఖైదీ జానీ మాస్టర్‌ను నార్సింగి పోలీసులు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు తమ కస్టడీకి తీసుకుని.. తిరిగి శనివారం సాయంత్రం నాలుగు గంటల్లోపు కోర్టు ముందు హాజరుపరచాలని న్యాయమూర్తి హరీశ తీర్పు చెప్పారు.

వాహన తుక్కు విధానం రూపొందించండి: పొన్నం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాలం తీరిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు మరింత సమగ్ర విధానాన్ని రూపొందించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. 15 ఏళ్లు నిండిన వాహనాలను తుక్కుగా మార్చాల్సిన నేపథ్యంలో, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం, మరికొన్ని సూచనలు చేశారు. ఆమేరకు మరింత సమగ్రంగా ఆ విధానం ఉండేలా మరో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ల ఏర్పాటుపై కూడా నివేదిక కోరారు. ఆయన సచివాలయంలో బుధవారం సాయంత్రం రవాణాశాఖ అధికారులతో సమీక్షించారు. అవగాహన కార్యక్రమాల కోసం రాజ్‌భవన్ స్కూల్‌కు రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు వెల్లడించారు.

ఒక కమిషనర్.. నలుగురు అదనపు కమిషనర్లు

వివిధ విభాగాల నుంచి హైడ్రాకు 169 మంది డిప్యుటేషన్.. ఆర్థిక శాఖ ఆమోద ముద్ర

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్‌ఆర్) హద్దుగా జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)లో పని చేసే అధికారులను ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోనున్నారు. ఈ విభాగానికి 169 మందిని కేటాయిస్తూ కేబినెట్ ఇటీవల ఆమోదముద్ర వేసింది. దీంతో వీరి డిప్యు టేషన్‌కు క్లియరెన్స్ ఇస్తూ ఆర్థిక శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఐజీ స్థాయిలో ఉన్న ఏవీ రంగనాథ్ దీనికి కమిషనర్‌గా ఉన్నాయి. ఈయనకు తోడు నలుగురు ఎస్పీ ర్యాంక్ అధికారులు అదనపు కమిషనర్లుగా రానున్నారు. వీరిలో ఒకరు ఐపీఎస్ కాగా, ముగ్గురు రాష్ట్ర సర్వీసుకు చెందిన వారు ఉంటారు. హైడ్రాలో పోలీసు విభాగం నుంచి ఐదుగురు డీఎస్పీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 16 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 60 మంది కానిస్టేబుళ్లతో పాటు ఐదుగురు కమ్యూనికేషన్ వింగ్ సిబ్బంది ఉంటారు. వీరితో పాటు జీహెచ్‌ఎంసీ, అర్బన్ డెవలప్‌మెంట్, అగ్నిమాపక శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, కాలుష్య నియంత్రణ విభాగాల నుంచి అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకోనున్నారు. ఒక డిప్యూటీ కలెక్టర్, ముగ్గురు తహసీల్దార్లు, ముగ్గురు సర్వేయర్లు, ఒక సబ్ రిజిస్ట్రార్ కూడా హైడ్రాలో ఉంటారు.

త్వరలో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

- మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సర్కారు కసరత్తు
- జాతీయ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఫ్యాకల్టీ ఉండేలా చర్యలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా ఈ ఏడాది నుంచి కొత్తగా 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 643 మంది అధ్యాపకులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించారు. ఇవిగాక మరో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నాహాలు మొదలుపెట్టింది. ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశంతో త్వరలో ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు మంత్రి అనుమతి ఇచ్చారు. అవసరమైతే మరో విడతలోనూ అధ్యాపక పోస్టుల భర్తీ చేపట్టనున్నారు. మరోవైపు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తామని వైద్య,ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి.

2 వారాల్లో 3,967 పోస్టులకు నోటిఫికేషన్లు

కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, ఆస్పత్రుల ఆధునీకరణ తదితర కారణాలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. నర్సింగ్ ఆఫీసర్ నియామకాలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేయించి, ఒకేసారి 6,956 మందిని భర్తీ చేశారు. 285 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 48 మంది ఫిజియోథెరపిస్టులు, 18 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. మొత్తంగా ఇప్పటివరకూ 7,308 పోస్టులు భర్తీ చేశారు. గత రెండు వారాల్లో 4 వేల పోస్టులకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఈ నెల 11వ తేదీన 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు, ఈ నెల 17వ తేదీన మరో 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు, రెండ్రోజుల క్రితం 633 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. వీటితోపాటు 1,666 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్), 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్, 435 సివిల్ సర్జన్, 24 ఫుడ్ ఇన్‌స్పెక్టర్, 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 1,600 స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం కోరుతూ వైద్య, ఆరోగ్యశాఖ ఫైల్ పంపింది. ఆర్థికశాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఈ పోస్టులకు కూడా నోటిఫికేషన్లు ఇస్తామని మంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఉత్తమ సేవలకు డీజీపీ 'ప్రశంసలు'



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్. చిత్రంలో అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్

సాక్షి, హైదరాబాద్: పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజల నుంచి వచ్చిన సమాచారం, అభిప్రాయాల ఆధారంగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన అధికారులు, సిబ్బందికి డీజీపీ డాక్టర్ జితేందర్ బుధవారం 'ప్రశంసా పత్రాల'ను అందచేశారు. 2,116 మంది పౌరుల నుంచి వచ్చిన అభిప్రాయాల ఆధారంగా ఉత్తమంగా ఎంపికైన పది పోలీసు స్టేషన్లు/ఎస్‌హెచ్‌వో, ఐదుగురు రిసెప్షన్ ఆఫీసర్లు, ఐదుగురు విచారణ అధికారులకు ఈ ప్రశంసా పత్రాలను ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, ప్రస్తుతం మాన్యువల్‌గా తీసుకుంటున్న అభిప్రాయ సేకరణకు మరింత సాంకేతికతను జోడిస్తున్నామని, క్యూఆర్ కోడ్, ఎస్‌ఎంఎస్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ సహా కొత్త సాంకేతికతను త్వరలో ప్రవేశపెడతామని ప్రకటించారు. పిటిషనర్లు, బాధితులు సులభంగా తమ అభిప్రాయాన్ని అందించడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ పోలీసులు తమ సేవల నాణ్యతను మెరుగుపరుచుకోవడానికి, సమాజంలో సానుకూల సంబంధాలు ఏర్పడడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. సీఐడీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ పోలీసుల సామర్థ్యం, జవాబుదారీతనాన్ని పెంచుతుందని అన్నారు. సమావేశంలో అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) మహేశ్ భగవత్, ఎస్పీ, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ శ్రీనివాస్, డీఎస్పీ శ్రీమతి సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగ పోరాట యోధ, ఆత్మగౌరవ ప్రతీక, వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి గురువారం జరుపుకుంటున్న సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర రావు స్మరించుకున్నారు. అణచివేతకు గురైన బలహీన వర్గాల తిరుగుబాటు తత్వానికి, ప్రతిఘటనా పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక ఉద్యమంలో, స్వయం పాలన కోసం కొనసాగిన పోరాటంలో, పెద్దఎత్తున బహుజనులు భాగస్వామ్యం కావడం వెనక ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఇమిడివుందన్నారు. ఐలమ్మ ఆకాంక్షలకు అనుగుణంగానే.. బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం సంక్షేమ, ప్రగతి కార్యాచరణను అమలుచేసిందని చెప్పారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ సబ్బండ వర్గాలకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వేలకోట్ల రూపాయలతో పలు పథకాలను అమలుచేసి వారిని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిపిందన్నారు. ప్రజా వ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన చాకలి ఐలమ్మ ప్రతిఘటనా తత్వం ఎల్లవేళలా ఆదర్శమని కేసీఆర్ తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించే దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారంగా నిర్వహించాలని నిర్ణయించి అమలుచేసిందన్నారు. బలహీన వర్గాలు, నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయడమే ఐలమ్మకు మనం అర్పించే ఘన నివాళి అని కేసీఆర్ తెలిపారు.

ఐలమ్మ ధీరచరిత్ర ఎన్నో పోరాటాలకు స్ఫూర్తి

అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ తొలి పోరాట యోధురాలుగా చాకలి ఐలమ్మ ధీరచరిత్ర ఎన్నో ప్రజా పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందని అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఆమె చేసిన భూ పోరాటమే తర్వాత కాలంలో భూ సంస్కరణలకు దారి చూపిందని గుర్తుచేశారు. తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి చాకలి (చిట్యాల) ఐలమ్మ ప్రతీక అని తెలిపారు. గురువారం ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా.. ఆమె పోరాట పటిమను, తెగువను మంత్రి స్మరించుకున్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు గుర్తుండేలా కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమె పేరు పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఐలమ్మ సేవలకు గుర్తింపుగా ఆమె మనమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమించామని పేర్కొన్నారు. మహిళల సాధికారతకు, బడుగు బలహీన వర్గాల స్వావలంబనకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతోందని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా తెలంగాణ ప్రగతి చక్రాలను పరుగు పెట్టించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుదిట్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతోందన్నారు.

రైతుల గోస చూడు

సీఎంకు కేటీఆర్ ట్వీట్లు



సాక్షి, హైదరాబాద్: రైతులను అన్ని విషయాల్లో సీఎం మోసం చేశారని, వృత్తి కులాలపై కత్తి కట్టారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం 'ఎక్స్'లో ట్వీట్లు చేశారు. ఎత్తు కుర్చీల్లో కూర్చోవడం కాదని, కన్నెత్తి రైతుల గోస చూడాలని కోరారు. రుణమాఫీ కాలేదని, పాల బిల్లులు రావడం లేదని, రైతు భరోసా ఊసే లేదని బోనస్ పేరుతో బోగస్ మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. మునుపటిలా ఈసారి దసరా చేసుకునే స్థితిలో రైతులు లేరని విమర్శించారు. మత్తడి దుంకే చెరువుల్లో మత్స్య సంపద సృష్టించిన నిన్నటి నీలి విప్లవాన్ని రేవంత్‌రెడ్డి నీరుగార్చేస్తున్నారని ఆరోపించారు. చేప పిల్లల పంపిణీ పథకాన్ని చెడగొడుతున్నారని విమర్శించారు. చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఆనవాళ్లను తుడిచెయ్యాలనే రాజకీయ కక్షతో.. మత్స్యకారుల జీవనోపాధిని కాలరాస్తారా..? అని ప్రశ్నించారు.





నారాయణపేట సరాఫ్ బజార్

సోనేకా రేట్.. నారాయణపేట్

తెలంగాణలో పేట బంగారానికి గుర్తింపు
చొక్క బంగారానికి పెట్టింది పేరు
128 ఏళ్లుగా బంగారు ఆభరణాల విక్రయాలు



నారాయణపేట: మగువల మనసు దోచే అందమైన, అద్భుతమైన మన్నికకు మారుపేరుగా నిలిచే బంగారు ఆభరణాలకు నారాయణపేట తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధి. దాదాపు 128 ఏళ్లుగా పేట బంగారానికి చెక్కుచెదరని ఖ్యాతి ఉంది. ఇక్కడి బంగారం నాణ్యత చూసిన నిజాం ప్రభువు నారాయణపేట్ సోనేకా రేట్ (స్వచ్ఛమైన బంగారం) అని కితాబిచ్చినట్లు ప్రచారం ఉంది. 24 క్యారెట్ల స్వచ్ఛ బంగారాన్ని విక్రయించడంలో స్థానిక స్వర్ణకారులు నమ్మకాన్ని కూడగట్టుకున్నారు. అందుకే పక్కన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సైతం బంగారు నగలను కొనుగోలు చేసేందుకు ఇక్కడికి వస్తుంటారు.

బంగారు విక్రయానికి 128 ఏళ్లు

నారాయణపేటలో 1898వ సంవత్సరం నుంచి బంగారం విక్రయాలు కొనసాగుతున్నాయి. అప్పట్లో వ్యాపారులు బంగారు వ్యాపారాన్ని ప్రారంభించారు. నిజాం కాలంలో లహోటికి చెందిన వారు వ్యాపారం భారీగా చేసేవారు. ఆ కాలంలో రాజస్తాన్ నుంచి నారాయణపేటకు వచ్చిన రాంచందర్ మెగరాజ్ భట్టడ్ ఇక్కడ బంగారం వ్యాపారాన్ని ప్రారంభించారు. ఐదు దశాబ్దాలుగా స్థానికంగా బంగారం వ్యాపారం రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. ఆరంభంలో అసరం భట్టడ్, వై.సురేశ్, బంగారు బాలప్ప, దత్తురావు, సరాఫ్ హన్మంతు, మహ్మద్ హసన్ సహాబ్ చాంద్ తదితర ఎనిమిది బంగారు దుకాణాలుంటే.. ప్రస్తుతం 100పైగా దుకాణాలకు విస్తరించాయి.

చొక్క బంగారు అభరణాలివే

నాను, పుస్తెలతాడు, గొలుసు, రెండు, మూడు వరసల పెద్దగొలుసులు, జిలేబీ చైను, చుట్టూ ఉంగరాలను 24 క్యారెట్లతో తయారు చేస్తారు. చంద్రహార, బోర్‌మాల్ గుండ్లు, కొలువులు, టెక్కీలు, ఐదారుటెక్కీలు, నెక్లెస్, లాంగ్‌చైన్, వడ్డాణం, వంకీలు, గాజులు, చెవుల కమ్మలు, జుంకీలు, మకరకురందనాలు, గెంటీలు, తార్‌కాస్ కమ్మలు, కరివేపూలు, ఏడురాళ్ల కమ్మలు, బ్రాస్‌లెట్లు, లాకెట్లు తదితర ఆభరణాలను కూడా తయారు చేస్తారు.



పేటలో బంగారు అభరణాలు కొనేందుకు వచ్చిన జనం

హాల్‌మార్క్.. మోనోగ్రామ్

స్థానికంగా దుకాణాల్లో తయారు చేసిన అభరణాలపై చిన్న సైజులో తమ దుకాణం పేరు ముద్రను (మోనోగ్రామ్) వేస్తారు. తిరిగి ఆయా దుకాణాల్లో కొనుగోలు చేసిన వారు విక్రయించేందుకు వెళ్తే.. గుర్తు పట్టేందుకు సులభంగా ఉంటుంది. వివిధ రకాల డిజైన్లను వ్యాపారులు బంగారం ప్రియుల కోసం అందుబాటులో ఉంచుతారు. తారాపూర్, అమృత్‌సర్, ముంబై, మచిలీపట్నంలో డైస్ తయారవుతాయి. మార్కెట్‌లో డైస్ వచ్చిన పది రోజుల్లో ఆయా కొత్త డిజైన్లు ఇక్కడికి చేరుతాయి. హాల్‌మార్క్‌తో కూడిన వివిధ రకాల డిజైన్లలో నగలను హైదరాబాద్, నారాయణపేటలోని బెంగాలీ స్వర్ణకారులతో తయారు చేయించి విక్రయిస్తారు. లక్ష్మీ నెక్లెస్, లక్ష్మీలాంగ్ చైన్, లాంగ్ చైన్ తదితర రకాల డిజైన్ల అభరణాలు లభిస్తాయి.

శుభకార్యం వస్తే చాలు..

పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు నారాయణపేట సరాఫ్ బజార్ కిటకిటలాడుతుంది. రాష్ట్రంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, జనగాంలతో పాటు నారాయణపేటలో బంగారం ఎంతో నాణ్యత, మన్నికతో ఉంటుంది. శుభకార్యాలు, పండుగలు ఉన్నప్పుడు పేట బంగారం కొనుగోలు చేసేందుకు కర్ణాటకలోని యాద్గిర్, సేడం, గుల్బర్గా, బీదర్, రాయచూర్, మహారాష్ట్రలోని పుణే, షోలాపూర్, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా వాసులు ఎక్కువ వస్తుంటారు.

స్విస్ బ్యాంక్ కార్పొరేషన్ నుంచే కొనుగోళ్లు

దేశంలోని బంగారు వ్యాపారస్తులు ఆన్‌లైన్ ద్వారా స్విస్ బ్యాంక్ కార్పొరేషన్‌తో పాటు సెంట్రల్ బ్యాంకుల్లో డీడీలను కట్టి బంగారు బిస్కెట్‌లను కొనుగోలు చేస్తుంటారు. ఎస్‌బీఐ, కార్పొరేషన్ బ్యాంకులు, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ల నుంచి కిలోల చొప్పున బంగారాన్ని కొనుగోలు చేస్తుంటారు. అంతర్జాతీయ మార్కెట్ న్యూయార్క్ బంగారం ధరపై ఆధారపడి ఉంటుంది. మార్కెట్ ఆరంభంలో డాలర్ విలువపై హెచ్చుతగ్గు ధరలు కావాల్సిన వారు.. బంగారం కోసం ఆన్‌లైన్‌లో ధరను కోట్ చేసి ఉంచితే వారికి అదే ధరకు బంగారం కేటాయిస్తారు.

సరాఫ్ బజార్

ఏ ఊళ్లోనైనా కూరగాయల మార్కెట్, చికెన్, మటన్ మార్కెట్, కిరాణా మార్కెట్, పత్తి బజార్ తదితర బజార్లు ఉండడం సహజం. కానీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే కాదు తెలంగాణ రాష్ట్రంలో సరాఫ్ బజార్ ఎక్కడా లేదు. నారాయణపేటలో దాదాపు 100 దుకాణాలు వరుసగా ఉండడంతో సరాఫ్ బజార్ అని పేరుపెట్టారు. పెద్ద పెద్ద నగరాల స్థాయిలో పేటలో బులియన్ అండ్ జువెల్లర్స్‌గా వ్యాపారం కొనసాగుతోంది.

తేజాప్‌తో నాణ్యత

ఆభరణాలు నాణ్యతగా ఉన్నాయా?, డూప్లికేటా? అనేది తేజాప్‌తోనే పరిశీలిస్తారు. డూప్లికేట్ బంగారు నగలైతే వెంటనే అది కాలిపోతూ నల్లగా మారుతుంది. ఒరిజినల్ బంగారాన్ని తేజాప్‌లో వేసి కరిగించినా ఎలాంటి మార్పు రాదు. తేజాప్‌లో పాత బంగారాన్ని కరిగించి నగల నాణ్యతను గుర్తిస్తారు. టెక్నాలజీ పెరగడంతో ప్రస్తుతం టెస్టింగ్ మెషీన్ ద్వారా బంగారాన్ని పరీక్షిస్తున్నారు. నారాయణపేటలో 24 క్యారెట్లతో నగలు తయారు చేస్తారు. అందుకే అత్యవసర సమయాల్లో అభరణాలను విక్రయిస్తే.. పేట బంగారానికి ఏ మాత్రం విలువ తగ్గదు.



30 ఏళ్లుగా వ్యాపారం

నేను 30 ఏళ్లుగా బంగారు వ్యాపారం చేస్తున్నా. ముంబై, పుణే, హైదరాబాద్ నగరాల్లో 18, 19 క్యారెట్లతో బంగారు అభరణాలు విక్రయిస్తుంటారు. కానీ ఒక్క నారాయణపేటలోనే ఇప్పటికి 24 క్యారెట్లతో నగలు తయారు చేసి విక్రయిస్తున్నాం.

– సరాఫ్ నాగరాజు, వ్యాపారి, నారాయణపేట

నాణ్యతకు మారుపేరు..



నమ్మకానికి, నాణ్యతకు, మన్నికకు మారుపేరు నారాయణపేట బంగారు అభరణాలు. 24 క్యారెట్లతో నాణ్యత కూడిన బంగారు అభరణాల విక్రయాలు ఇక్కడ జరుగుతాయి. ఇక్కడ కొన్న అభరణాలు రీసేల్ చేస్తే 99.12 శాతం ఉంటుంది. అందుకే నారాయణపేట బంగారాన్ని కొనేందుకు ఆసక్తి చూపుతారు.

– హరినారాయణభట్టడ్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, నారాయణపేట

అంతా 'చొక్క'బంగారమే



నారాయణపేటలో స్వర్ణకారులు తయారు చేసేది.. వ్యాపారస్తులు అమ్మేదంతా చొక్క బంగారమే. అభరణాల్లో కల్తీ ఉండదు. పుస్తెలు, వంకి, ఉంగరాలు, నల్లపూసల దండలు, వడ్డాణాలు, నానులు తదితర ఆభరణాలను నాణ్యత, మన్నికతో తయారు చేస్తాం. జాయింట్ల కోసమే కేడీఎం వాడుతాం. వంద శాతం నాణ్యతగా ఉంటుంది.

– శ్రీనివాస్ చారి, స్వర్ణకారుడు, నారాయణపేట

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు కసరత్తు

- మద్దతు కూడగట్టే పనిలో సంఘాలు
- ఈసారి పీఆర్‌టీయూ నుంచి పరిశీలనలో రవీందర్, శ్రీపాల్‌రెడ్డి పేర్లు
- యూటీఎఫ్ నుంచి రెండోసారి పోటీకి నర్సిరెడ్డి ఆలోచన
- బీజేపీ, కాంగ్రెస్ నుంచి కూడా పోటీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు నోటిఫికేషన్ జారీకానున్న నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలు, పార్టీలు అప్పుడే మద్దతు కూడగట్టే పనిలో పడ్డాయి. 2025 మార్చి 29తో వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పదవీ కాలం ముగియనుంది. దీంతో ఆలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కసరత్తు ప్రారంభించారు. ఈ నెల 30న ఓటరు నమోదుకు నోటిఫికేషన్ జారీచేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

బలం పెంచుకునేందుకు....

రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ఈసారి తమ సంఘం నుంచి అభ్యర్థులను గెలిపించుకునేందుకు పీఆర్‌టీయూ అప్పుడే కసరత్తు ప్రారంభించింది. పెద్దఎత్తున ఓటర్లను నమోదు చేయించేందుకు చర్యలు చేపట్టింది. యూటీఎఫ్ కూడా అదే పనిపై దృష్టి సారించింది. నెల రోజుల నుంచి సంఘ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేస్తోంది. గతంలో పోగొట్టుకున్న స్థానాన్ని ఈసారి ఎలాగైనా దక్కించుకోవాలనే పట్టుదలతో పీఆర్‌టీయూ ఉంది. సంఘంలోని నాయకుల్లో ఉన్న అభిప్రాయభేదాలను పక్కన పెట్టి అంతా కలిసి పనిచేసేలా ప్రయత్నాలు చేస్తోంది. గతంలో సంఘాన్ని వీడిన, సంఘం నుంచి సస్పెండ్ చేసిన నేతలను కూడా మళ్లీ చేర్చుకుంటోంది. ఇందులో భాగంగా గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో నల్లగొండలో పీఆర్‌టీయూ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని సస్పెండ్ చేసిన సుంకరి బిక్షంగౌడ్‌తోపాటు మరికొంతమంది నాయకులను ఇటీవల మళ్లీ సంఘంలోకి చేర్చుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోసమే వారిని తిరిగి చేర్చుకున్నారన్న చర్చ సాగుతోంది. ఇక యూటీఎఫ్, ఎస్టీయూ, టీపీటీఎఫ్ కూడా ఈనెలాఖరు వరకు తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడ్డాయి.

త్వరలోనే పీఆర్‌టీయూ అభ్యర్థుల ఖరారు

పీఆర్‌టీయూ ప్రస్తుతం జిల్లా కార్యవర్గాల సమావేశాలు నిర్వహిస్తోంది. వాటిని ఈనెలాఖరులోగా పూర్తి చేసి, రాష్ట్ర కార్యవర్గ సమావేశం వచ్చే నెల 7న నిర్వహించాలని నిర్ణయించింది. అందులో కొత్తగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోనుంది. ఆ సమావేశంలోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరపున పోటీలో ఉండే వారి పేర్లను ఖరారు చేసే అవకాశముంది. వరంగల్–ఖమ్మం–నల్లగొండ స్థానం నుంచి గత ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పోటీచేయగా, రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన పులి సరోత్తంరెడ్డి రెబెల్‌గా పోటీచేశారు. ఆ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలుపొందారు. ప్రస్తుతం పీఆర్‌టీయూ నుంచి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ఎమ్మెల్సీగా పోటీచేయాలని భావిస్తున్నట్టుగా సంఘంలో చర్చ సాగుతోంది.

- మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పీఆర్‌టీయూ సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు పోటీ చేయాలని భావిస్తున్నారు. వారిలో ఎవరిని ఖరారు చేస్తారన్నది మొదటి వారంలోనే తేలనుంది. మరోవైపు టీపీటీఎఫ్, యూటీఎఫ్ కూడా అభ్యర్థులను నిలబెట్టే అవకాశం ఉంది.

ఈసారి పార్టీల నుంచి పోటీ..

టీచర్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఈసారి కాంగ్రెస్, బీజేపీ తరపున కూడా అభ్యర్థులను పోటీలో నిలుపుతారన్న చర్చ సాగుతోంది. అదే జరిగితే బీజేపీ తరఫున ఈసారి వరంగల్–ఖమ్మం– నల్లగొండ స్థానంలో పోటీచేయాలని పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పులి సరోత్తంరెడ్డి భావిస్తున్నారు. ఆయనతోపాటు టీపీయూఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నట్టు తెలిసింది.

- మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ –కరీంనగర్ స్థానంలో బీజేపీ నుంచి నరహరి లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి పోటీచేయాలని భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తనకు అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. ఈ రెండు స్థానాల్లో ఎక్కడి నుంచి పార్టీ పోటీ చేయమని చెబితే అక్కడి నుంచి పోటీ చేసేందుకు సిద్ధమని పేర్కొంటున్నారు.



నిబంధనల ఉల్లంఘనపై నిరసన



సుల్తానియాకు ఫిర్యాదు చేస్తున్న ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు పూర్తి విరుద్ధంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో.. ఆర్థిక శాఖకు చెందిన సెక్షన్ ఆఫీసర్‌ను ఏకంగా చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా నియమించడంపై ట్రెజరీ అండ్ అకౌంట్స్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. నియమాలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాన్ని వెంటనే రద్దు చేయాలని బుధవారం ట్రెజరీ, అకౌంట్స్ గజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియాకు ఫిర్యాదు చేసింది.

ఇండియా వర్కింగ్ ఏజ్ పాపులేషన్.. 100 కోట్లు!

2030 కల్లా చేరుకునే అవకాశం

- వచ్చే జనాభా లెక్కల నాటికి 64.4 శాతానికి చేరుకునే అవకాశం
- యూపీ, బిహార్ ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో పెరుగుదల
- తెలంగాణ, ఏపీ, తమిళనాడులో కొంతమేర తగ్గుదల
- పట్టణీకరణతో 10 లక్షలకు పైబడి జనాభా ఉన్న నగరాల పెరుగుదల
- ఎస్‌బీఐ రిసెర్చ్ తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో 'వర్కింగ్ ఏజ్ పాపులేషన్'(15–59 ఏళ్ల మధ్యనున్న వారు) క్రమంగా పెరుగుతోంది. 1971 నుంచి ఓ క్రమ పద్ధతిలో పెరుగుతున్న ఈ జనాభా వచ్చే జనాభా లెక్కల వెల్లడి నాటికి (2026) 64.4 శాతానికి చేరుకునే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది 2031 సంవత్సరం నాటికి 65.2 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. అదేవిధంగా 2024 ఆఖరు నాటికి వయోజనుల జనాభా 10.7 శాతానికి, 2031 నాటికి 13.1 శాతానికి చేరుకుంటుందని చెబుతున్నారు. దేశంలో వర్కింగ్ ఏజ్ పాపులేషన్ 1991లో 55.4 శాతం ఉండగా, 2021 సంవత్సరానికి 60.7 శాతానికి చేరుకుంది. తాజాగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రిసెర్చ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనంలో పలు అంశాలు వెల్లడయ్యాయి. ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వయిజర్ సౌమ్య కాంతిఘోష్ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. ఇందులో భాగంగా... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో వర్కింగ్ ఏజ్ పాపులేషన్‌లో వృద్ధి కొంతమేర తగ్గుదల నమోదు కానున్నట్టు వెల్లడైంది. ఉత్తరప్రదేశ్, బిహార్ ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రం వృద్ధి నమోదవుతుందని, ఈశాన్యప్రాంతాల్లో ఈ వృద్ధి 52 శాతం ఉంటుందని వెల్లడైంది.

ఆసక్తి రేకెత్తిస్తున్న గణాంకాలు

మన దేశంలో పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు నిర్వహిస్తున్నారు. 1872లో తొలిసారిగా జనాభా లెక్కలు నిర్వహించగా, 2011లో చివరిసారి దానిని దేశవ్యాప్తంగా జరిపారు. 2021లో దీనిని చేపట్టాల్సి ఉండగా కోవిడ్ మహమ్మారి వ్యాప్తి కారణంగా దానిని వాయిదా వేస్తూ వచ్చారు. 1971 దాకా 0–14 ఏళ్ల మధ్యనున్న వయసున్న వారి జనాభా పెరుగుతూ వచ్చి ఆ తర్వాత క్రమంగా తగ్గుదల నమోదైనట్టుగా తెలుస్తోంది. 2011లో 30.9 శాతమున్న ఈ వయసులోని వారు, తాజా లెక్కల ప్రకారం 24.3 శాతానికి తగ్గుతారని అంచనా వేస్తున్నారు. 1951 నుంచి వృద్ధుల నిష్పత్తి పెరుగుతుండగా, తదుపరి లెక్కలు వెలువడేనాటికి 10.7 శాతంగా ఉండే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. అదే 2031 సంవత్సరం నాటికి 13.1 శాతానికి పెరగొచ్చని అంచనావేస్తున్నారు. మొత్తంగా చూస్తే...2030 నాటికి భారత్‌లో 'వర్కింగ్ ఏజ్ పాపులేషన్'వంద కోట్లు దాటొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 25 శాతంగా ఉండొచ్చని చెబుతున్నారు. 2023–24 సంవత్సరంలో చూస్తే భారత్ ప్రపంచంలో యువజనులు ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటిగా కొనసాగనుంది. గత పదేళ్లలో భారత్‌లో సాంకేతికంగా, ఇతర అంశాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో.. రాబోయే జనాభాలెక్కల్లో వెల్లడయ్యే వివరాలు ఆసక్తికరంగా ఉండనున్నాయి.

పట్టణీకరణ పెరుగుదలతో...

ఇండియాలో పట్టణీకరణ వేగంగా సాగుతోంది. దీంతో పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం... దేశంలో పట్టణ జనాభా 31.1 శాతం ఉండగా, తదుపరి నివేదిక వెల్లడయ్యే నాటికి 35 నుంచి 37 శాతం ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా పది లక్షలకు పైగా జనాభా ఉన్న పట్టణ ప్రాంతాలు... 2014లో 14.3 శాతం ఉండగా 2023 నాటికి 16.6 శాతానికి పెరిగినట్టుగా తెలుస్తోంది. పట్టణీకరణ వేగంగా సాగుతుండటంతో 1991 జనాభా లెక్కల ప్రకారం 18 నగరాల్లోనే పది లక్షలకు పైగా జనాభా ఉండగా, 2011 నాటికి 52 నగరాల్లో ఈ మేరకు జనాభా పెరిగినట్టుగా తేల్చారు. తదుపరి జనాభా లెక్కలు పూర్తయ్యే నాటికి దేశంలో పది లక్షలకు పైబడి జనాభా 75–80 నగరాల్లో ఉంటుందని ఈ నివేదికలో వెల్లడైంది.

వందేళ్ల ఊడల మర్రి

వందేళ్ల నాటి ఈ ఊడల మర్రి అలసిసొలసి తన చెంతకి చేరినవారికి చల్లని నీడతో సేదతీరుస్తోంది. విజయవాడ స్టేట్ గెస్ట్ హౌస్ సమీపంలోని ఈ ఊడల మర్రి చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సాయం సమయం..గోదారి తీరం

సాయం సంధ్య వేళ.. నులివెచ్చని భానుని కిరణాలు గోదారి తరంగాలపైపడి బంగారు వన్నెలీనుతుంటే ఆ దృశ్యం చూడటానికి రెండు కళ్లు చాలవు. రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్ వద్ద ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



ట్రైన్‌కు ట్రాఫిక్ కష్టాలు

బెంగళూరును ట్రాఫిక్ నగరంగా పిలుస్తుంటారు. తాజాగా..అక్కడ ట్రాఫిక్ రద్దీకి తార్కాణం పట్టే ఘటన ఐటీ సిటీలో బుధవారం జరిగింది. బెంగళూరు ట్రాఫిక్ రద్దీకి కిలోమీటర్ల కొద్దీ వాహనాలు రోడ్లపై నిలిచిపోవడం పరిపాటి..అయితే ఇక్కడ ఏకంగా ఒక రైలును నిమిషాల పాటు బెంగళూరు ట్రాఫిక్ నిలిపివేయడం విశేషం. సోషల్ మీడియాలో సంబంధిత వీడియోను సుధీర్ చక్రవర్తి అనే వ్యక్తి ఇన్‌స్ట్రాగామ్‌లో పోస్ట్ చేశారు. రైల్వే క్రాసింగ్ లైన్‌పై వాహనాలు బారులు తీరడంతో ఆ ట్రాఫిక్ రద్దీలో చిక్కుకుని రైలు పట్టాలపై నిలిచిపోయింది. బెంగళూరు మున్నేకొళ్లాల రైల్వే క్రాసింగ్ వద్ద ఈ సంఘటన జరిగింది.

- సాక్షి, బెంగళూరు





పోలవరానికి ఈ ఏడాది ఎంత కావాలి?

41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ఏ పనులు చేస్తారు?.. ఖర్చెంత?

పోలవరం ప్రాజెక్టు కనీస నీటి మట్టం (41.15 మీటర్ల కాంటూర్) స్థాయిలో ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు, వాటికి ఎంత ఖర్చవుతుంది, ఎప్పుడు ఎంత విడుదల చేయాలో సమగ్ర ప్రతిపాదనలు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం కోరింది. పీపీఏ, కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)తో చర్చించి ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, వాటికయ్యే వ్యయాన్ని ఖరారు చేసి, ఆ మేరకు నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపుతామని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ దీపక్ చంద్ర భట్ ఇటీవల లేఖ రాశారు. సాక్షి, అమరావతి

నాడు మోకాలడ్డిన చంద్రబాబు



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉండగా పోలవరం పూర్తి చేయడానికి తాజా ధరల మేరకు, విభాగాల వారీగా పరిమితి విధించకుండా బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించాలని ప్రధానిని కోరారు. అందుకు మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయాన్ని రీయింబర్స్ చేసేందుకు విభాగాల వారీగా విధించిన పరిమితి ఎత్తేశారు. తాజా ధరల మేరకు నిధులిచ్చేందుకు అంగీకరించారు. తొలి దశ పూర్తికి అవసరమయ్యే నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. దాంతో తొలి దశ పనులు పూర్తి, చంద్రబాబు చారిత్రక తప్పిదం వల్ల ధ్వంసమైన గ్యాప్–2లో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు అంగీకరిస్తూ గతేడాది జూన్ 5న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నోట్ జారీ చేశారు. ఈ క్రమంలో పోలవరం తొలి దశ వ్యయాన్ని రూ.30,436.95 కోట్లుగా కేంద్ర జల్ శక్తి శాఖ ఖరారు చేసింది. 2014 ఏప్రిల్ 1 వరకూ చేసిన ఖర్చు రూ.4,730.71 కోట్లు పోనూ రూ.25,706.24 కోట్లు ఇవ్వాలని నిర్ధారించింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటి నుంచి 2024 ఫిబ్రవరి వరకు రూ.15,146.27 కోట్లు రీయింబర్స్ చేసింది. ఇందులో రెండో దశ కింద చేపట్టిన పనులకు రూ.1,597.56 కోట్లు విడుదల చేసింది. ఆ నిధులు పోనూ కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం, తొలి దశ పనుల పూర్తికి రూ.12,157.53 కోట్లు అవసరమని తేల్చింది. ఆ మేరకు నిధులు మంజూరు చేయాలని మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు జల్ శక్తి శాఖ ప్రతిపాదనలు పంపింది. అప్పటికే బీజేపీతో పొత్తు పెట్టుకుని, ఎన్డీఏలో చేరిన చంద్రబాబు.. ఆ నిధులు ఇస్తే రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని బీజేపీ పెద్దల చెవిలో ఊదారు. దాంతో ఆ ప్రతిపాదన పక్కన పెట్టిన కేంద్ర కేబినెట్ ఆగస్టు 28న ఆమోదం తెలిపింది.

- ఈ వివరాలను సమగ్రంగా పీపీఏ ద్వారా పంపండి
- చేపట్టాల్సిన పనులు, వాటికయ్యే వ్యయాన్ని ఖరారు చేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జల్ శక్తి శాఖ వెల్లడి
- రూ.12,157.53 కోట్లు విడుదలకు మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు జలశక్తి శాఖ ప్రతిపాదన

గతేడాది జూన్ 5నే తొలి దశ, డయాఫ్రం వాల్‌కు రూ.12,911 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకారం

- అప్పటికే బీజేపీతో పొత్తు పెట్టుకుని ఎన్డీఏలో చేరిన చంద్రబాబు
- పోలవరానికి ఆ నిధులిస్తే రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని విన్నపం
- దాంతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టిన కేంద్ర కేబినెట్
- అదే ప్రతిపాదనపై ఆగస్టు 28న ఆమోదం

నిధుల సంక్షోభం నుంచి గట్టెక్కించిన వైఎస్ జగన్

విభజన చట్టం ప్రకారం కేంద్రమే నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కక్కుర్తితో 2016 సెప్టెంబరు 7న సీఎం చంద్రబాబు తన చేతుల్లోకి తీసుకున్నారు. ఈ క్రమంలో 2013–14 ధరల ప్రకారం నీటిపారుదల విభాగానికి అయ్యే వ్యయం మాత్రమే ఇస్తామన్న కేంద్రం షరతుకు అంగీకరించారు. బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు నుంచి రుణం తీసుకుని రీయింబర్స్ చేస్తామన్న ప్రతిపాదనకూ తలూపారు. 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టు వ్యయాన్ని రూ.20,398.61 కోట్లుగా లెక్కగట్టి.. 2024 ఏప్రిల్ 1 వరకూ ఖర్చు చేసిన రూ.4,730.71 కోట్లు పోనూ మిగతా రూ.15,667.9 కోట్లు మాత్రమే ఇచ్చేలా 2017 మార్చి 15న కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిజానికి 2017–18 ధరల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.55,656.87 కోట్లు. ఇందులో భూసేకరణ, పునరవాసానికే నికే రూ.33,168.23 కోట్లు అవసరం. కానీ.. రూ.15,667.9 కోట్లు ఇస్తే చాలు ప్రాజెక్టు పూర్తి చేస్తానని చంద్రబాబు అంగీకరించడంలో లోగుట్టు కమీషన్లే. ముడుపుల కోసం ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి ప్రాజెక్టును చంద్రబాబు విధ్వంసం చేయడమే కాదు.. నిధుల సంక్షోభంలోకి కూడా నెట్టారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టి పనులను పరుగులు పెట్టించారు. ప్రాజెక్టు పనుల్లో చంద్రబాబు నిర్వాకాలను కేంద్రానికి వివరించారు. తాజా ధరల ప్రకారం నిధులిస్తేనే పోలవరాన్ని పూర్తి చేయడానికి సాధ్యమవుతుందన్న వైఎస్ జగన్ ప్రతిపాదనతో ప్రధాని మోదీ ఏకీభవించారు. ఇలా తాజా ధరల మేరకు నిధులు ఇచ్చేందుకు కేంద్రాన్ని ఒప్పించడం ద్వారా నిధుల సంక్షోభం నుంచి పోలవరాన్ని వైఎస్ జగన్ గట్టెక్కించారు.



లారీ ఎక్కిన యుద్ధ ట్యాంక్

కదనరంగంలో శత్రువులను చీల్చిచెండాడే యుద్ధట్యాంక్ ఇలా ఒక్కసారిగా రహదారిపై కనిపించింది. చెన్నై నుంచి విశాఖపట్నం తరలిస్తున్న ఈ ట్యాంక్ జాతీయ రహదారిపై నెల్లూరు వద్ద ఆగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

స్వర్ణ రథంపై ఆదిదంపతులు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. ఆరుద్రనక్షత్రాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో బుధవారం వేకువజామున అర్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం రథారూఢులైన శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు.

పలు కార్పొరేషన్లకు చైర్మన్, డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు చైర్మన్, మెంబర్/డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా తోట మెహర్ సీతారామ సుధీర్, బోర్డు మెంబర్లుగా వంతల రాజేశ్వరి, ఎం.ఆనంద్‌సాగర్, ఆర్.శైలజ, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, పర్విన్‌తాజ్, లోహిత్ సిస్లా, బోయ మహేష్ నాయుడు, గద్దె బాబూరావు, రాజేంద్ర ప్రతాప్ భంజ్‌దేవ్, తోట పార్థసారథి, కేశన కోటేశ్వరరావు, కోకటి లక్ష్మీనారాయణ, తుమ్మల పద్మజ లక్ష్మీ, కడలి ఈశ్వరి, బోడపాటి శివదత్‌లను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో కార్యదర్శి జి.వీరపాండియన్ ఉత్తర్వులిచ్చారు. అలాగే, ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నూకసాని బాలాజీ, బోర్డు మెంబర్లు/డైరెక్టర్లుగా పీవీజీ కుమార్, కిల్లు వెంకట రమేష్ నాయుడు, కుర్రా అప్పారావు, కటారి హేమలత, కైపా పద్మలత రెడ్డి, ఇందుకూరి సుబ్బలక్ష్మి, వాసిరెడ్డి రాంబాబు, కొడాలి వినోద్‌కుమార్, గంటా స్వరూపాదేవి, డాక్టర్ పాకనాటి గౌతమ్‌రాజ్‌లను నియమిస్తూ యువజన సర్వీసులు, పర్యాటక–సాంస్కృతిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఉత్తర్వులిచ్చారు. అలాగే, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ (సీడ్స్) చైర్మన్‌గా మన్నే సుబ్బారెడ్డి, సభ్యులుగా చిల్లా జగదీశ్వరి, కమటం కాటమయ్యలను నియమిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. అలాగే, ఏపీ టిడ్కో చైర్మన్‌గా వెనుములపాటి అజయ్‌కుమార్, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా బత్తుల తాతయ్యబాబును ప్రభుత్వం నియమించింది.

ఎయిడెడ్‌లో ఖాళీల భర్తీకి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కోర్టు ఆదేశాల మేరకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రకటనలు జారీచేసి, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని రీజినల్ డైరెక్టర్లను ఆదేశించింది.

ఆర్టీజీఎస్ సీఈవో బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈవోగా ఐఏఎస్ అధికారి కె.దినేశ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆయన బాధ్యతలు చేపట్టి ఆర్టీజీఎస్ పనితీరును సమీక్షించారు.

అన్నా క్యాంటీన్లకు రూ.166.25 కోట్ల నిధులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన 203 అన్నా క్యాంటీన్లలో పేదలకు భోజనాలు అందించేందుకు 312 రోజులకు అవసరమైన రూ.166,25,70,000 నిధుల విడుదలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతినిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా క్యాంటీన్లలో సాంకేతిక, సాఫ్ట్‌వేర్ పరికరాల (ఐవోటీ) కొనుగోలుకు రూ.7,48,65,265 మంజూరు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్‌ఎఫ్‌ఐఆర్‌టీడబ్ల్యూ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పి.దామోదరరావు

సాక్షి, అమరావతి: అఖిల భారత రోడ్డు రవాణా ఉద్యోగుల సంఘాల సమాఖ్య సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పలిశెట్టి దామోదరరావు (ఆర్టీసీ ఎంప్లాయస్ యూనియన్), కార్యదర్శిగా జి.వి.నరసయ్య (ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్), వర్కింగ్ కమిటీ సభ్యులుగా జి.నారాయణరావు, వై.శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా పి.సుబ్రహ్మణ్యం రాజు, పి.భానుమూర్తి ఎన్నికయ్యారు. బెంగళూరులో బుధవారం నిర్వహించిన అఖిల భారత రోడ్డు రవాణా ఉద్యోగ సంఘాల సమాఖ్య జాతీయ మహాసభల్లో కొత్త జాతీయ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడిగా ఎం.ఎల్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వి.ఎ.విజయ్ భాస్కర్‌ను ఎన్నుకున్నారు.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,616 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,759 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45 కోట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం హుండీ ఆదాయం రూ.1,45,87,352 వచ్చినట్టు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం హుండీలోని కానుకలను లెక్కించినట్టు పేర్కొన్నారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 68 గ్రాములు, వెండి 412.200 కిలోలు, విదేశీ కరెన్సీ 3,452 వచ్చినట్టు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా శాంతిహోమం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16 కాళ్ల మండపంలో బుధవారం శాంతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని వేద పండితులు 16 కాళ్ల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

దసరా ఉత్సవాలకు లోపాల్లేకుండా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో ఎటువంటి లోటుపాట్లు, ఇబ్బందులు ఎదురవకుండా అన్ని విభాగాలు పని చేయాలని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్. సత్యనారాయణ అన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవ ఏర్పాట్లపై కమిషనర్ సత్యనారాయణ దుర్గగుడి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

కృష్ణమ్మకు నవ హారతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు బుధవారం నుంచి నవ హారతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం సాయంత్రం సంధ్యాసమయంలో దుర్గాఘాట్‌లో ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై దుర్గగుడి అర్చకులు నదీమాతల్లికి నవ హారతులను ఇచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కృష్ణమ్మకు నవహారతులను ఇవ్వగా పలువురు భక్తులు హారతులను వీక్షించేందుకు ఘాట్‌కు తరలి వచ్చారు. నవ హారతులను దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కాలభైరవునికి అష్టమి పూజలు



అయినవిల్లి: కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కొలువైన కాలభైరవ స్వామివారికి బుధవారం అష్టమి పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు అల్లవరపు బాలసుబ్రహ్మణ్యశర్మ, సూరిబాబు ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, వివిధ పూజలు జరిపారు. అష్టోత్తర శతనామావళి పూజలు, స్వామికి ఇష్టమైన గారెలు నైవేద్యంగా చెల్లించారు. స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించారు.

ఔషధ రంగంలో ఫార్మసిస్టులు కీలకం



తిరుపతి కల్చరల్: ఔషధ రంగంలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమని పలువురు వైద్య ప్రముఖులు వెల్లడించారు. బుధవారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహించారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వైద్యుల కంటే రోగులకు ఫార్మసిస్టుల సేవలే అవసరంగా మారాయని వక్తలు వెల్లడించారు. ఫార్మా రంగంలో యువతకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వెబ్‌సైట్లో ఎన్‌ఎంఎంఎస్ అప్లికేషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్లు ఉన్నట్టు తిరుపతి డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 3వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు వాయిదా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సులు (టీటీసీ) డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్ లూమ్, వీవింగ్ (లోయర్ గ్రేడ్), గతంలో జరిగిన పరీక్షల్లో ఫెయిల్ అయిన (ప్రైవేట్) అభ్యర్థులకు జరగాల్సిన థియరీ పరీక్షలు ఏపీ టెట్ జూలై–2024 పరీక్షల కారణంగా వాయిదా వేసినట్టు ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీటీసీ పరీక్షలు అక్టోబర్ 27 నుంచి జరుగుతాయని తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్ కడప, అనంతపురం ఐదు జిల్లాల్లో మాత్రమే ఈ పరీక్షలకు కేంద్రాలు ఏర్పాటుచేశారన్నారు.

నెడుంగుణం యోగ రామాలయం





యోగముద్రలో... రామయ్య తండ్రి

అరుదైన, అందమైన ఆలయాలకు ఆలవాలమైన తమిళనాట రాముడు చేతిలో ధనుర్బాణాలు లేకుండా యోగభంగిమలో దర్శన మిచ్చే అతిపురాతనమైన, పెద్దదైన ఆలయం నెడుంగుణమ్. రాముడిలా యోగభంగిమలో అగుపించే ఆలయాలు ఈ ప్రాంతంలో మూడున్నాయి. వాటిలో నెడుంగుణంలోని రామాలయమే పెద్దది, ప్రఖ్యాతి పొందినదీ.

పల్లవుల కాలంనాటి ఈ ఆలయం గోడలు ఎంతో పెద్దవి, అతి ఎత్తైనవి. ఐదు అంతస్థుల రాజగోపురం రామభక్తులను ఆలయంలోనికి రమ్మని స్వాగతం పలుకుతున్నట్లుగా కనిపిస్తుంది. ఈ రాజగోపురం గోడలపై రామాయణ ఘట్టాలను చిత్రించే శిల్పాలు చూపుతిప్పుకోనివ్వనంత రమణీయంగా ఉంటాయి. ప్రాకారం దాటి లోనికి అడుగుపెట్టగానే కిలిగోపురమనే మరో ప్రాకారం కనిపిస్తుంది. ఈ ప్రాకారంలోనికి ప్రవేశించగానే ఎత్తైన, అందమైన ద్వారపాలక విగ్రహాలు కనువిందు చేస్తాయి. జీవకళ ఉట్టిపడుతూ, నల్లటి విగ్రహాలతో, నూత్న వస్త్రాలతో నిజంగానే ఎవరో దివ్యపురుషులు వచ్చి నిలబడి ఉన్నారేమో అనుకునేంత అద్భుతమైన శిల్పసౌందర్యం చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఎదురుగా గర్భాలయంలో రామచంద్రమూర్తి తన సోదరుడు లక్ష్మణుడు, ధర్మపత్ని సీతా మహాసాధ్వితో యోగభంగిమలో అభయముద్రతో దర్శనమిస్తాడు. ఆయన పాదాల చెంత హనుమంతుడు కూర్చుని ఉంటాడు. లక్ష్మణుడు మామూలుగానే ధనుర్బాణాలతో కనిపిస్తాడు కానీ, ఎల్లప్పుడూ కోదండంతో కనిపించే రాముడు ఈ విధంగా యోగ ముద్రలో కనిపించడం వెనుక ఒక కథ ఉంది. అదేమిటో చూద్దాం..

తన భక్తుడైన శుక మహర్షి కోసం రాముడు ఈ విధంగా యోగ భంగిమలో దర్శనమిచ్చాడు.

స్థలపురాణం: రావణ సంహారానంతరం రాముడు లంకానగరానికి విభీషణుడిని రాజుగా చేసి, సీత, లక్ష్మణుడు, ఇతర పరివారంతో కలసి అయోధ్యకు తిరిగి వెళుతున్నాడు. అప్పుడే ఆయన తన కోసం ఎంతోకాలంగా కలియానది నది ఒడ్డున శుకమహర్షి తపస్సు చేస్తున్నట్లు తెలిసింది. జ్ఞానంలో బ్రహ్మదేవుడంతటి వాడు కాబట్టి ఆయనను శుకబ్రహ్మ అన్నారు. నిర్ణీత సమయంలోగా అయోధ్యానగరానికి చేరుకోకపోతే భరతుడు ప్రాయోపవేశం చేసే ప్రమాదం ఉంది. అయినప్పటికీ భక్త సులభుడైన రాముడు, శుకుడికోసం తన ప్రయాణాన్ని ఆపుకుని మరీ శుకాశ్రమానికి వెళ్లి, తన దర్శన భాగ్యంతో ఆయనను అనుగ్రహించి, ఆతిథ్యం స్వీకరించి, కొద్దిసేపు విశ్రమించి, మునికి ఆనందం చేకూర్చి, ఆయన అనుమతి తీసుకుని ఆనకనే అయోధ్యకు వెళ్లాడు. నేదుం అంటే వినయం లేదా సౌశీల్యం. గుణం అంటే లక్షణం అని అర్థం. అందుకే ఈ ప్రాంతానికి నేదుంగుణం అనీ, ఇక్కడి రాముడికి నేదుంగుణ రాముడనే పేరు స్థిరపడింది. దీర్ఘాచలం కొండలలో పుట్టిన కలియా నది అక్కడి నుంచి చెంగల్పట్టులోగల మధురాంతక సరస్సు వరకు ప్రవహించి అంతటితో అంతమవుతుంది.

ఈ ఆలయం చెంత శుకమహర్షి ఆశ్రమం ఉంది. ఈ ఆశ్రమంలో శుకబ్రహ్మ ఆసీనుడై ఉండగా, హనుమంతుడు ధర్మశాస్త్రాలను చదివి, రామలక్ష్మణులకు, శుకునికి వినిపిస్తూ ఉన్నట్లుగా ఉన్న అరుదైన విగ్రహాలను చూడవచ్చు. సాధారణంగా రాముడి పాదాల వద్ద వినయవిధేయతలతో కూర్చుని కనిపించే హనుమంతుని చూస్తాము కానీ, ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా హనుమంతుడు ఏదో చదివి వినిపిస్తుండగా, రాముడు ఎంతో శ్రద్ధగా, సావధానంగా ఆయా శాస్త్రవిషయాలను ఆలకిస్తున్నట్లుగా ఉన్న అరుదైన దృశ్యం మనస్సును హత్తుకుంటుంది. ఆలయానికి అనుసంధానంగా శుకతీర్థమనే పేరుతో కోనేరుంది. ఈ కోనేటిలోని నీటినే పూజాకార్యక్రమాలకు ఉపయోగిస్తారు.

ఇక్కడ ఎంతోకాలంగా ఉన్న ఉత్సవ మూర్తుల విగ్రహాలు అపహరణకు గురి కావడంతో భక్తులు తామే స్వయంగా విగ్రహాలను ఏర్పాటు చేశాక, తిరిగి వెనకటి ఉత్సవ విగ్రహాలు యథావిధిగా కనిపించడంతో రెండు రకాల ఉత్సవ విగ్రహాలు ఆలయంలో అగుపిస్తాయి.

ఈ ఆలయంలోనే ఆళ్వార్, శ్రీ కృష్ణుడు, సుదర్శనుడు, యోగనరసింహమూర్తి సన్నిధులు కూడా కనిపిస్తాయి. అంతే కాదు, కలియుగదైవం వేంకటేశ్వర స్వామి వారి విగ్రహాన్ని కూడా ఇక్కడ దర్శించుకోవచ్చు. వైఖానస ఆగమానికి రూపకర్త అయిన విఖనస మహర్షి, ఆయన శిష్యగణంతో కూర్చుని కనిపిస్తాడు. ఇక్కడ మరో వింత ఏమిటంటే, ఆలయం కొలువై ఉన్న ధీరకాచలం కొండ అచ్చం శుకబ్రహ్మలా కనిపిస్తుంది. అంటే శుక మహర్షే తన స్వామికి సేవ చేసుకునేందుకు ధీరకాచలం కొండలా మారిపోయాడన్నమాట. మామూలు సమయాలలో భక్తుల రద్దీ అంతగా లేప్పటికీ, శ్రీరామ నవమి పర్వదినంలోనూ, రామనవరాత్రులలోనూ కిక్కిరిసిపోయి కనిపిస్తుంది ఈ ఆలయం.

ఎలా వెళ్లాలంటే... చెన్నైలోని అడయార్ నుంచి వందవాసికి దగ్గరలో ఆలయం ఉంది. వందవాసి నుంచి బస్సులు, ప్రైవేటు వాహనాలు ఉన్నాయి.

– డి.వి.ఆర్. భాస్కర్



హరే కృష్ణ అంటే..?

హరే కృష్ణ అనేది కలియుగంలో సమస్త మానవాళిని ఉద్ధరింపచేసే భగవానుడి దివ్య మంత్రం.

ఇద్దరు భక్తులు కలిసినపుడు ఒకరినొకరు 'హరే కృష్ణ' అంటూ పిలుచుకుంటూ ఉండటం సాధారణంగా చూస్తూ ఉంటాం. అసలు హరే కృష్ణ అంటే ఏంటో ఒకసారి చూద్దాం.

హరి' అంటే ఎటువంటి పాపములనైనా, ఎటువంటి దోషములనైనా హరించగలిగినవాడు, 'కృష్ణ' అంటే భగవంతుడు, సర్వ జగన్నియామకుడు. 'క్రిష్' అంటే అనిర్వచనీయమైన ఆనందం (మోక్షం), అటువంటి మోక్షాన్ని ప్రసాదింపగలవాడు కాబట్టి ఆయన్ని 'కృష్ణ' అంటారు.

చాలామంది భక్తులు రోజుకి కొన్ని వేలసార్లు కృష్ణ నామం పారాయణం చేస్తూ ఉంటారు. జననమరణ చక్రం అనే సంసార సముద్రంలో నావ వంటిది 'హరే కృష్ణ' నామం.

''కోట్లజన్మల తర్వాత ఏ ఒక్కడో మాయాపూరితమైన జగత్తుని వదిలి నన్నే స్మరించుకుంటూ నాకు దాసుడవుతున్నాడు. అటువంటి వాడియోగక్షేమాలు నేనే వహిస్తున్నాను'' అని భగవద్గీతలో(7.19) కృష్ణుడు మనకి అభయం ఇచ్చారు.

అలా ఆ పరాత్పరుడి నామాన్ని ప్రతిరోజు స్మరించుకోవడం మన జన్మ జన్మాంతరంగా కలిగిన అదృష్టం.

హరే కృష్ణ హరే కృష్ణ
కృష్ణ కృష్ణ హరే హరే
హరే రామ హరే రామ
రామ రామ హరే హరే



కర్మఫలితంగా ఎటువంటి ఆపదలు మనల్ని, మనకుటుంబ సభ్యులను బాధించకుండా ఉండాలని, కృష్ణ పరమాత్మ మనల్ని అనుగ్రహించాలని ఆయన పాదపద్మాలకు నమస్కరిస్తూ... ఆ నామాన్ని రోజూ కనీసం 108 సార్లు జపించడం సత్ఫలితాలనిస్తుంది.

తత్త్వదర్శిని

సర్వాంతర్యామి ఎవరు?



మానవుడు తనను తాను ఉత్కృష్ట రూపంగా, తన జన్మ మహోన్నతమైనదిగా ఊహించుకుని భగవంతుడు కూడా అదేవిధంగా ఉంటాడనుకుంటాడు. సర్వాంతర్యామి అంటే మరింత శక్తిమంతుడు కాబట్టి, అనేక శిరస్సులు, బాహువులతో ఊహించుకుంటాడు. కానీ, ఉపనిషత్తుల్లోని జ్ఞానం మానవునికి ఆ భగవంతుని రూపాన్ని అనంతమైన శక్తిగా, ఇంద్రియాలు గ్రహించలేని సూక్ష్మరూపమైనసూ, తాను లేని ప్రాంతంగాని, పదార్థాలు గాని లేనట్టి హేతువుగానూ తేల్చేసాయి. వేలప్రశ్నలకు, సందేహాలకు నిత్య నూతన సమాధానాలు ఉపనిషత్తులలో చూడగలం. ఉపనిషత్తులలో ఆధ్యాత్మికతను వెతికితే ఆధ్యాత్మికత, విజ్ఞానశాస్త్రాన్ని వెతికితే విజ్ఞానశాస్త్రం, భగవంతుని వెతికితే భగవంతుడు కనిపిస్తాడు. అంటే ఈ మూడింటినీ సమాధానపరిచే అద్భుత జ్ఞానం వాటిల్లో ఉందన్నమాట.

ఆత్మనైనా, అనంతశక్తినైనా, భగవంతుడినైనా జ్ఞానాన్ని ఆధారం చేసుకునే తెలుసుకోవాలి. ఆ జ్ఞానం సాహిత్యరూపంలో నిండి ఉంది. అయితే, భగవంతుని అర్థం చేసుకోవడానికి ఇక్కడొక వెంట్రుకవాసి వ్యత్యాసం ఉంటుంది. కేవలజ్ఞానం ద్వారా ఆ అనంతశక్తిని తెలుసుకున్నా అది పూర్తిగా అవగతం కాదు. ఎప్పుడైతే ఆ జ్ఞానాన్ని ఆధారం చేసుకుని, నిరంతర చింతన ద్వారా అటువంటి జ్ఞానాన్ని అనుభవిస్తామో, ఎప్పుడైతే అలాంటి జ్ఞానాన్ని మనసులో రమింపజేస్తామో అప్పుడే ఆ పరమాత్మను లేక అనంత శక్తిని లేదా భగవంతుని సందర్శించగలుగుతాము. అప్పుడే 'అహం బ్రహ్మాస్మి' స్థితి సాధ్యమవుతుంది. అంటే ఆత్మకు, సాధకునికి మధ్య అభేదం ఏర్పడుతుంది. ఆ సాధకునికి పంచేంద్రియాల ద్వారా ఏ విషయాన్ని గ్రహించినా ఆత్మానందమే కలుగుతుంది. ఎందుకంటే ఈ దృశ్యమాన ప్రపంచం లోపలా, బయటా అంతటా తాను ఆ ఆత్మనే సందర్శించగలుగుతాడు. తనలో కూడా ఆ ఆత్మని అనుభవించగలుగుతాడు. అదే బ్రహ్మానందం. అదే ఆధ్యాత్మిక మకరందం. దానిని మించిన తీపి దొరకదు, దానిని మించిన ఆనందం లభించదు.

– డా. రావుల గిరిధర్

ఖుర్ ఆన్ అవగాహనం

సర్దుబాటు ధోరణి ఉత్తమ మార్గం

అజ్ఞాన కాలంలో ఒక వ్యక్తికి అపరిమిత సంఖ్యలో వివాహాలు చేసుకునే స్వేచ్ఛ ఉండేది, కానీ ఆ భార్యలకు ఎలాంటి హక్కులు ఉండేవి కావు. నాలుగవ అధ్యాయం సురా నిసాలో తొలి (ఆయతులు) అంటే వాక్యాలు అవతరించినప్పుడు ఆ స్వేచ్ఛపై రెండు రకాల ఆంక్షలు విధించబడ్డాయి.

ఒకటి: భార్యల సంఖ్యను నాలుగు వరకు పరిమితం చేయడం జరిగింది.

రెండు: ఒకరిని మించి భార్యలు ఉన్న పక్షంలో న్యాయం (అంటే భార్యల మధ్య సమానమైన వ్యవహారం) పాటించడం షరతుగా నిర్ణయించడం జరిగింది. ఆపైన ఓ ప్రశ్న ఉదయించింది: ఒకవేళ భార్య గొడ్రాలు అయినందువల్ల, లేక శాశ్వతంగా వ్యాధిగ్రస్తురాలైనందువల్ల, లేక దాంపత్య సంబంధాలకు తగనిదై ఉన్నందువల్ల, భర్త మరో పెళ్లి చేసుకున్న పక్షంలో అతను ఆ ఇరువురి భార్యల పట్లనూ సమానమైన ఇష్టం కలిగి ఉండటం, ఇద్దరినీ సమంగా ప్రేమించడం, ఇద్దరితోనూ సమంగా వ్యవహరించడం తప్పనిసరియా? అతను అలా వ్యవహరించకపోతే న్యాయంగా వ్యవహరించే షరతును పురస్కరించుకుని రెండవ పెళ్లి చేసుకునే ముందు మొదటి భార్యను వదిలివెయ్యాలా? ఒకవేళ మొదటి భార్య స్వయంగా వేరుపడడానికి ఇష్టపడకపోతే వారు ఉభయులూ ఏదైనా ఒప్పందం చేసుకోవచ్చా? ఆ ఒప్పందం ప్రకారం భర్త శ్రద్ధను కోల్పోయిన భార్య, తన హక్కుల్ని కొన్ని స్వయంగా తానే వదులుకొని భర్త విడాకులు ఇవ్వకుండా రాజీ కుదుర్చుకోవడం సబబేనా? ఇలా చేయడం న్యాయం చెయ్యాలన్న షరతుకు వ్యతిరేకమవుతుందా? ఈ ప్రశ్నలకే ఈ ఆయత్‌లలో అంటే ఈ వాక్యాలలో సమాధానాలు ఇవ్వడం జరిగింది.

అల్లాహ్ అంటున్నాడు: ఒక స్త్రీ తనను భర్త నిరాదరించి, వేధిస్తాడేమో అనీ లేదా విముఖుడై ఈసడించుకుంటాడేమో అనీ భయపడితే భార్యాభర్తలు ఇరువురు పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సర్దుబాటు చేసుకోవడంలో దోషం లేదు. ఏమైనప్పటికీ సర్దుబాటే అన్ని విధాలా ఉత్తమమైనది. (దివ్య ఖుర్ ఆన్:4:128...)

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

మహాలయపక్షం ప్రాధాన్యత ఏమిటి?



ఇప్పుడు జరుగుతున్నది మహాలయపక్షం. దాని ప్రాశస్త్యం గురించి కంచి పరమాచార్య స్వామి వారి మాటల్లో..

ప్రతి మానవుడు వారి పితృదేవతలకు, దేవతలకు కృతజ్ఞతలు తెలపవలసిందే. ప్రతి ఒక్కరూ పితృదేవతలకు ఋణపడి ఉంటారు. కావున వారిని పితృయజ్ఞం ద్వారా తృప్తిపరచాలి.

వేదం ''మాతృదేవోభవ, పితృదేవోభవ'' అని చెప్తుంది. అంటే మన తల్లి తండ్రులు దైవ సమానులు. వారు ఎలాంటి వారైనా వారు ఈ లోకాన్ని వదిలి వెళ్ళిన తరువాత, తప్పకుండా వారికి వైదికంగా శ్రాద్ధ కర్మలు చేయాలి. శాస్త్ర ప్రకారం చెయ్యవలసిన క్రతువు శ్రద్ధగా చేస్తే పెట్టిన శ్రాద్ధం పితృదేవతలకు అందేటట్టు దేవతలు చేస్తారు.

వారు గోవులుగా పుట్టినట్లైతే పెట్టిన శ్రాద్ధం వారికి గడ్డి, దాణా రూపంలో అందుతుంది.

పరమాత్మ ఆజ్ఞ ప్రకారం సంబంధించిన దేవతలు వారికి అందిస్తారు. కనుక చనిపోయిన తల్లికి తండ్రికి పెట్టిన శ్రాద్ధం వారే వచ్చి తీసుకోవాలి అని లేదు. అది వారికి చెందుతుంది అంతే.

ఇక్కడ ముఖ్యంగా ఉండవలసినది తల్లితండ్రులయందు కృతజ్ఞతా భావం. శాస్త్రముయందు నమ్మకం. శ్రద్ధతో పెట్టేది శ్రాద్ధం. నమ్మకానికి చాలా ప్రాముఖ్యత ఉంది. మనం ఏదైనా చేస్తే అది ఎలా చెప్పబడిందో ఎలా చెయ్యాలో అలాగే చెయ్యాలి.

మనం ఒక ఉత్తరం రాస్తే అది ఎవరికి చేరాలో వారికి చేరుతుందా? ''నేను నా ఇష్టం వచ్చిన చిరునామా రాస్తాను. పోస్ట్ డబ్బాలో వెయ్యను. మా ఇంట్లో ఉన్న డబ్బాలో వేస్తాను అంటే అది చేరదు.''

ప్రేమ, భక్తి, జ్ఞానం వంటి స్థితులకు ఎటువంటి నియమము లేదు. కాని ఫలమాశించి చేసే ఏ కర్మకైనా నియమం అవసరం. ఆ నియమాలను తెలిపేదే శాస్త్రం. శ్రద్ధతో సశాస్త్రీయంగా చేసిన శ్రాద్ధం తప్పక ఫలితాన్నిస్తుంది.

'తస్మాత్ శాస్త్ర ప్రమాణంతే కార్యా కార్యా వ్యవస్థితౌ'

''దయివతిన్ కురల్'' పరమాచార్య స్వామి వారి ఉపన్యాసాల సంగ్రహం.

(సెప్టెంబర్ 18 నుంచి అక్టోబర్ 2 వరకు మహాలయ పక్షం)

మీలో పాపం చేయని వారెవరు..?

ఈ లోకం రకరకాల మనుషులకు ఆలవాలం. అందులో అన్నింటినీ విశ్వసించేవారు కొందరు, స్వయంగా శోధించనిదే దేనినీ విశ్వసించని వారు మరికొందరు. అలాంటి వారి కోవకు చెందినవారు ఇశ్రాయేలీయులలోని పరిసయ్యులు, శాస్త్రులనే రెండు వర్గాలవారు, ఒకరు యేసుక్రీస్తును అనేక సందర్భాలలో శోధించినవారైతే మరికొందరు లేఖకులు అనగా శాస్త్రులు, ఇంకొందరు క్రీస్తును ప్రభువు గాను, మెస్సయ్యగాను అంగీకరించని పరిసయ్యులు



మరి. వారు ఏ విధంగా శోధించారో ఒక సంఘటనలోని వృత్తాంతం.

ఒకరోజు వ్యభిచారం చేయుచుండగా పట్టుబడిన స్త్రీని దేవాలయంలో బోధిస్తున్న యేసు క్రీస్తు ముందు నిలబెట్టి ఈమె వ్యభిచారం చేయుచుండగా పట్టుబడిందని, తమకు మోషే రాసిన ధర్మశాస్త్రం ప్రకారం ఆమెను రాళ్ళతో కొట్టి చంపాలనీ, దీనికి మీరేమి చెయ్యమంటారని వారు యేసును శోధించారు. అప్పుడు యేసు వారితో మీలో పాపం లేని వారెవరో ఆమెపై రాయి విసిరికొట్టండని నేలపై చేవ్రాలు వ్రాసి మరీ చెప్పాడు. కానీ ఎవరూ అందుకు సాహసించలేదు. క్రీ.పూ. సర్వశక్తిగల దేవుడు మోషేకు ఆయన చేవ్రాలుతో రాసిన పది ఆజ్ఞలను ఆచరించి, అనుసరించిన వారు లేకపోవడమే అందుకు కారణం.

అప్పుడు యేసుక్రీస్తు ఆమెతో– ''అమ్మా! ఎవరూ శిక్షించలేదా! నేను కూడా నిన్ను శిక్షించను. ఇకనుండి పాపం చేయకుండా పరిశుద్ధంగా నడుచుకో'' అని చెప్పాడు. దేవుడైన యెహోవా మోషేకి అనుగ్రహించిన పది ఆజ్ఞలను ధర్మశాస్త్రంలో ప్రవీణులైన శాస్త్రులుగాని యేసుక్రీస్తును ప్రభువుగా అంగీకరించని పరిసయ్యులు గాని లేరు. ఆయన నాలో పాపమేదైనా వున్నదా? అని రూఢీగా చెప్పిన మాటకు కూడా సమాధానం చెప్పలేదు. కనిపించకుండా వెళ్ళిపోయారు పరిసయ్యులు, శాస్త్రులు (యోహాను సువార్త 8:1–11; ఎజ్రా 7: 6).

యేసుప్రభువు శిష్యుడైన తోమా అయన చేతులలోని గాయాన్ని, కాళ్ళలోని గాయాలలో వేలుపెట్టి పరిశీలిస్తే గాని నమ్మనన్నాడు. అప్పుడు ప్రభువు ప్రత్యక్షమై తోమా నా చేతుల గాయాలను, కాళ్ళ గాయాలలో వేలుపెట్టి అవిశ్వాసివి గాక విశ్వాసిగా వుండమని చూసి ''నమ్మిన వారికంటే చూడక నమ్మినవారు ధన్యుల''ని చెప్పాడు. అలాంటివారే ఆ స్త్రీపై నేరం మోపిన పరిసయ్యులు, శాస్త్రులు (యోహాను 20: 29).

కనుక రాళ్ళు విసరక జనులు ఎందుకు వెళ్ళారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకరిపై ఒకరు నేరం మోపడం అంటే నీ పొరుగువానిపై అబద్ధపు సాక్ష్యం చెప్పడం గనుక అటువంటి అబద్ధపు సాక్ష్యం నీ పొరుగు వానిపై చెప్పకూడదని గ్రహించాలి (నిర్గమం 20 :9).

– కోట బిపిన్ చంద్రపాల్

ధర్మ సందేహం

ప్ర: ఆబ్దికంలో కూడనివి ఏమిటి?

జ : గుమ్మడికాయ, గేదె పాలు, కందిపప్పు, బొబ్బర్లు, శనగలు, ఉలవలు, కొబ్బరి, ఖర్జూరం, పొట్లకాయ, శొంఠి ఆబ్దికానికి పనికిరావు. ఎరుపు వస్త్రాలు ధరించడం, ఉన్నివస్త్రాలు దాల్చడం, రుద్రాక్ష, విభూతి ధరించడం, బొట్టుపెట్టుకోవడం ఆబ్దికంలో చేయరాదు. వాటిని వాడితే పితృదేవతలు నిరాశతో వెళ్ళిపోతారు. కొన్ని సంప్రదాయాలలో భస్మధారణకు అనుమతి ఉంది.

ప్ర: పితృకర్మలకు 'శ్రాద్ధం' అనే పేరు ఎందుకు వచ్చింది?

జ: పితృదేవతలను ఉద్దేశించి చేసే హోమం, పిండప్రదానం, బ్రాహ్మణ భోజనం 'శ్రాద్ధం' అని చెప్పబడుతుంది.

'శ్రద్ధ' అనగా 'ఆస్తికత్వం'. భౌతిక విషయాలకు ప్రత్యక్ష ప్రమాణం, దివ్యవిషయాలకు శాస్త్రప్రమాణం. సామాన్యులకు దివ్యత్వం ప్రత్యక్షం వలె అనుభవంలో కనబడదు కనుక శాస్త్రప్రమాణం అవసరం. అంటే శాస్త్రాన్ని విశ్వసించడం. దాని పేరు 'శ్రద్ధ'. అటువంటి శ్రద్ధతో చేసే పని 'శ్రాద్ధం'. శాస్త్రవిశ్వాసంతో చేసే యజ్ఞయాగాదులకు కూడా శ్రద్ధ ప్రధానం. కానీ ఆబ్దికాది పితృకర్మలు తప్పనిసరిగా చేయవలసినదే. లేకుంటే దుష్ఫలితాలు ఉంటాయి. కనుక ఈ కర్మలకు 'శ్రాద్ధకర్మ' అని ప్రత్యేకించి వ్యవహరిస్తారు.

('ఋషిపీఠం' ప్రచురణ 'సమాధానమ్' పుస్తకం నుండి సేకరణ)

బిజినెస్ రీల్

ఓటీటీ యాప్‌లపై కేంద్రంతో టెల్కోల భేటీ



న్యూఢిల్లీ: కొత్త లైసెన్సింగ్ నిబంధనలపై సిఫార్సుల్లో వాట్సాప్, టెలిగ్రాం వంటి మెసేజింగ్, కాలింగ్ యాప్‌లను మినహాయించడంపై టెలికం సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో భేటీలో తమ ఈ మేరకు తమ అభిప్రాయాలు తెలిపాయి. అలాగే సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) సంబంధిత చెల్లింపుల అంశాల గురించి చర్చించాయి. రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ, వొడాఫోన్ ఐడియా సీఈవో అక్షయ ముంద్రా, భారతి ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్, బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి ఇందులో పాల్గొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ తన సిఫార్సుల్లో సర్వీస్ ఆథరైజేషన్ నుంచి ఓటీటీ యాప్‌లను మినహాయించడంపై అన్ని టెల్కోలు ఆందోళన వ్యక్తం చేసినట్లు వివరించాయి. వొడాఫోన్ ఐడియా, భారతి ఎయిర్‌టెల్ సంస్థలు ఏజీఆర్ అంశాన్ని ప్రస్తావించినట్లు పేర్కొన్నాయి. ఏజీఆర్ లెక్కింపులో గతంలో జరిగిన తప్పిదాలను సవరించాలంటూ టెల్కోలు దాఖలు చేసిన క్యూరేటివ్ పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. వొడాఫోన్ ఐడియా రూ. 70,320 కోట్ల మేర, భారతి ఎయిర్‌టెల్ రూ. 21,500 కోట్లు ఏజీఆర్ బకాయిలు కట్టాల్సి ఉంది.

డెట్ సెక్యూరిటీ పబ్లిక్ ఇష్యూలకు యూపీఐ

ఆదేశాలు జారీ చేసిన సెబీ



న్యూఢిల్లీ: డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూ దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసే దిశగా సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. రిటైల్ ఇన్వెస్టర్లు యూపీఐ ద్వారా నిధులను బ్లాక్ (బ్యాంక్ ఖాతాలో స్తంభన) చేసుకునే ఆప్షన్‌తోనే రూ.5లక్షల వరకు దరఖాస్తు చేసుకోవాలని సెబీ కోరింది. అదే సమయంలో సెల్ఫ్ సర్టిఫైడ్ సిండికేట్ బ్యాంక్‌లు లేదా స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్లాట్‌ఫామ్ తదితర ప్రత్యామ్నాయ విధానాల్లోనూ ఇన్వెస్ట్ చేసుకునే ఆప్షన్ ఉంటుందని స్పష్టం చేసింది. కొత్త నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఈక్విటీ పబ్లిష్ ఇష్యూలకు యూపీఐ బ్లాక్ ఆప్షన్ అవకాశం అందుబాటులో ఉన్న సంగతి విదితమే. ''డెట్ సెక్యూరిటీ పబ్లిక్ ఇష్యూలకు మధ్యవర్తుల ద్వారా (స్టాక్ బ్రోకర్లు, డీపీలు, రిజిస్ట్రార్ తదితర) దరఖాస్తు చేసుకునే వ్యక్తిగత ఇన్వెస్టర్లు, దరఖాస్తు రుసుం రూ.5 లక్షల వరకు ఉంటే వారు యూపీఐ బ్లాకింగ్ ఆప్షన్‌నే ఉపయోగించుకోవాలి''అని సెబీ తన సర్క్యులర్‌లో కోరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-9-2024	
విశాఖ	555-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
POWERGRID	364.2	4.04
AXISBANK	1,269.15	2.39
NTPC	436.75	2.02
BAJAJFINSV	1,935.00	1.59
GRASIM	2,660.00	1.55

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
LTIM	6,110.00	-3.69
TECHM	1,600.00	-2.27
TATACONSUM	1,189.00	-1.87
TATAMOTORS	964	-1.36
TITAN	3,742.00	-1.13

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,979
ఎన్ఎస్ఈ	1,09,967
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,13,555
ఎఫ్ఐఐ	- 974
డీఐఐ	+ 1,779


ముడిచమురు... (బ్యారెల్)



నైమెక్స్ లైట్ స్వీట్	70.58	$ 71.56
బ్రెంట్	73.73	$ 74.47

'భారత్‌లో తయారీ'తో పెరిగిన ఎగుమతులు

- స్థానికంగా తయారీ సామర్థ్యాలు
- బలపడిన ఆర్థిక వ్యవస్థ
- 'ఎక్స్'లో ప్రధాని మోదీ పోస్ట్
- 'మేక్ ఇన్ ఇండియా'కి పదేళ్లు



న్యూఢిల్లీ: 'మేక్ ఇన్ ఇండియా' (భారత్‌లో తయారీ)తో భారత్ నుంచి ఎగుమతులు గణనీయంగా పెరిగాయని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడినట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. తయారీకి భారత్‌ను కేంద్రంగా మలిచే లక్ష్యంతో 2014 సెప్టెంబర్ 25న మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మోదీ సర్కారు ప్రారంభించింది. పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా దీనిపై 'ఎక్స్'లో ప్రధాని ఓ పోస్ట్ పెట్టారు. ''వివిధ రంగాల్లో ఎగుమతులు ఎలా పెరిగాయన్నది గమనించాలి. సామర్థ్యాలు ఏర్పడ్డాయి. దీంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమైంది. సాధ్యమైన అన్ని విధాలుగా 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది. సంస్కరణల విషయంలో భారత పురోగతి సైతం కొనసాగుతుంది''అని తన పోస్ట్‌లో ప్రధాని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియాకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద 14 రంగాల్లో అదనపు సామర్థ్యాలపై ప్రోత్సాహకాలు కల్పించడం గమనార్హం. నిబంధనల అమలు, ఎఫ్‌డీఐ విధానాలు సులభంగా మార్చడం, మెరుగైన వ్యాపార వాతావరణానికి సంబంధించి సానుకూల చర్యలు ఇందుకు మద్దతుగా నిలిచినట్టు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. దీనికి తోడు అవినీతి పట్ల కఠిన వైఖరి, ఎలక్ట్రానిక్స్ తదితర వర్ధమాన రంగాల పట్ల ప్రత్యేక దృష్టి సారించడం మేక్ ఇన్ ఇండియా విజయవంతానికి, దేశ, విదేశీ పెట్టుబడులు పెరగడానికి సాయపడినట్టు చెప్పారు. ''మనం గొప్ప విజయం సాధించాం. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో దేశంలో తయారీకి అద్భుతమైన భవిష్యత్ ఉంది''అని గోయల్ పేర్కొన్నారు.

తయారీ వాటా పెరుగుతుంది..

మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో రానున్న సంవత్సరాల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తయారీ వాటా పెరుగుతుందని మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. దేశ అవసరాలు తీర్చడంతోపాటు ఎగుమతులు 2023-24లో ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి 778 బిలియన్ డాలర్లకు చేరుకునేలా ఈ కార్యక్రమం సాయపడినట్టు మంత్రి తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ఆకర్షణకు చర్యలు తీసుకున్నట్టు మంత్రి గోయల్ తెలిపారు. గడిచిన పది ఆర్థిక సంవత్సరాల్లో ఎఫ్‌డీఐ రాక, అంతకుముందు పదేళ్ల (యూపీఏ హయాం) కాలంతో పోల్చి చూస్తే 119 శాతం పెరిగి 667 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు.

100 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు

''ఏటా 70-80 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. రానున్న రోజుల్లో ఏటా 100 బిలియన్ డాలర్లకు పెట్టుబడులు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం''అని పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా సైతం ప్రకటించారు. ఎఫ్‌డీఐ దరఖాస్తుల అనుమతుల ప్రక్రియను గాడిలో పెడుతున్నట్టు చెప్పారు. దేశంలో పెట్టుబడుల ప్రోత్సాహానికి వీలుగా రక్షణ, రైల్వేలు, బీమా, టెలికం తదితర రంగాలకు సంబంధించి నిబంధనలను సరళతరం చేసినట్టు తెలిపారు.

బొంబార్డియర్ సీఈవోతో గౌతమ్ అదానీ భేటీ



న్యూఢిల్లీ: కెనడాకు చెందిన బిజినెస్ జెట్స్ తయారీ దిగ్గజం బొంబార్డియర్ సీఈవో ఎరిక్ మార్టెల్‌తో పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ భేటీ అయ్యారు. ఎయిర్‌క్రాఫ్ట్ సర్వీసులు, రక్షణ రంగ కార్యకలాపాల్లో భాగస్వామ్యం తదితర అంశాలపై ఇందులో చర్చించినట్లు మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో అదానీ పోస్ట్ చేశారు. అదానీ గ్రూప్ దేశీయంగా ఏడు విమానాశ్రయాలను నిర్వహిస్తోంది.

ఎకానమీకి ప్రభుత్వ వ్యయం, వ్యవసాయం దన్ను

- 2024-25లో వృద్ధి 7 శాతం
- ఏడీబీ అంచనా



న్యూఢిల్లీ: మెరుగైన వ్యవసాయోత్పత్తి, అధిక ప్రభుత్వ వ్యయాలు భారత్ ఆర్థిక కార్యకలాపాలకు దన్నుగా ఉంటాయని ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) అంచనావేసింది. వ్యవసాయం రంగం పురోగమనం నేపథ్యంలో గ్రామీణ వినియోగం బాగుంటుందని విశ్లేషించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) భారత్ వృద్ధి 7 శాతంగా ఉంటుందని తన సెప్టెంబర్ అప్‌డేటెడ్ అవుట్‌లుక్ (ఏడీఓ) నివేదికలో అంచనా వేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.2 శాతంగా అవుట్‌లుక్ విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎగుమతులకు సేవల రంగం తోడ్పాటును అందిస్తుందని నివేదిక వివరించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతం ఎకానమీ వృద్ధి నమోదయినప్పటికీ, రానున్న కాలంలో ఈ రేటు పుంజుకుంటుందన్న భరోసాను నివేదిక వెలిబుచ్చింది. ఎకానమీ 2023-24లో 8.2 శాతం పురోగమించగా, 2024-25లో 7.2 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ అంచనావేస్తోంది. ''ప్రపంచ భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే విషయంలో భారత్ ఆర్థిక వ్యవస్థ చక్కటి, స్థిరమైన పనితీరు కనబరిచింది''అని ఏడీబీ కంట్రీ (ఇండియా) డైరెక్టర్ మియో ఓకా చెప్పారు. కాగా, 2024-25లో సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.7 శాతంగా ఉంటుందని నివేదిక అభిప్రాయపడింది.

దక్షిణాసియాకు భారత్ భరోసా: డబ్ల్యూఈఎఫ్ సర్వే



ఇదిలావుండగా, ఎకానమీ దృఢమైన పనితీరుతో భారత్ మొత్తం దక్షిణాసియా ప్రాంతాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ స్థాయిలో నిలుపుతున్నట్లు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సర్వేలో పాల్గొన్న మెజారిటీ ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. అయితే గ్లోబల్ రికవరీ పట్ల ఆశావహ దృక్పదాన్ని వెలువరిస్తూనే కొన్ని సవాళ్లు ఉన్నాయని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పెరుగుతున్న రుణ స్థాయిలు ఆందోళన కలిగిస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు. దీనివల్ల మౌలిక, విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వ వ్యయాలకు గండిపడే అవకాశం ఉందని అంచనావేశారు. మొత్తంమీద 2024, 2025లో ప్రపంచ ఎకానమీ ఒక మోస్తరు, లేదా పటిష్టంగా పురోగమించడం ఖాయమన్నది వారి అభిప్రాయం. అమెరికా ఎన్నికల ఫలితాలు కూడా ప్రపంచ ఎకానమీపై ప్రభావం చూపే కీలక అంశాల్లో ఒకటిగా ఆర్థికవేత్తలు పేర్కొనడం గమనార్హం.

అల్పాదాయ దేశాలకు ఆర్థిక వనరులు అందించాలి

ఏఐఐబీకి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



ఏఐఐబీ ప్రెసిడెంట్ జిన్ లికున్ నేతృత్వంలోని బృందంతో ఆర్థికమంత్రి చర్చలు

న్యూఢిల్లీ: సాంకేతిక సహాయం, ఇతరత్రా సర్వీసుల ద్వారా అల్పాదాయ సభ్య దేశాలకు ఆర్థిక వనరులు అందుబాటులో ఉండేలా తోడ్పాటు అందించాలని ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌కి (ఏఐఐబీ) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. క్లయింట్ అవసరాలకు అనుగుణంగా సేవలు అందించే విధానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని పేర్కొన్నారు. ఉజ్బెకిస్తాన్‌లో ఏఐఐబీ బోర్డు గవర్నర్ల 9వ వార్షిక సమావేశం జరగనున్న నేపథ్యంలో బ్యాంక్ ప్రెసిడెంట్ జిన్ లికున్‌తో భేటీ సందర్భంగా ఆమె ఈ విషయాలు తెలిపినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మైక్రో బ్లాగింగ్ సైటు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. తొమ్మిదేళ్ల స్వల్ప వ్యవధిలోనే రుణ కార్యకలాపాలను ఏఐఐబీ వేగవంతంగా విస్తరించిందని మంత్రి ప్రశంసించారు. అలాగే సంస్థ గవర్నెన్స్ ప్రమాణాలు పాటించడంలోను, వృద్ధి సాధనలోను భారత్ కీలకపాత్ర పోషిస్తోందని బ్యాంకు తెలిపింది. మరోవైపు, ఖతార్ ఆర్థిక మంత్రి అలీ బిన్ అహ్మద్ అల్ కువారీతో కూడా సీతారామన్ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించారు. ఏఐఐబీలో భారత్ రెండో అతి పెద్ద వాటాదారు, అతి పెద్ద క్లయింట్‌గాను ఉంది. ఆసియా దేశాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆర్థిక వనరులను అందించే బహుళపక్ష డెవలప్‌మెంట్ బ్యాంకుగా, బీజింగ్ కేంద్రంగా ఏఐఐబీ ఏర్పడింది. ఇందులో చైనాకు అత్యధికంగా 2,97,804 షేర్లు ఉండగా, భారత్‌కు 83,673 షేర్లు ఉన్నాయి.

ఈపీఎఫ్‌వో కిందకు 20 లక్షల కొత్త సభ్యులు

జూలై నెల గణాంకాలు విడుదల



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) పరిధిలోకి జూలై నెలలో 19.94 లక్షల మంది కొత్తగా చేరారు. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ విడుదల చేశారు. ఈపీఎఫ్‌వో నిర్వహించే సామాజిక భద్రతా పథకం కింద జూలైలో 10.52 లక్షల మంది మొదటిసారి నమోదు చేసుకున్నట్టు తెలిపారు.

- 8.77 లక్షల మంది సభ్యుల వయసు 18-25 ఏళ్ల మధ్య ఉంది. అంటే వీరంతా మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు తెలుస్తోంది.
- జూలైలో కొత్తగా చేరిన వారిలో 4.41 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఈపీఎఫ్‌వో నెలవారీ పేరోల్ గణాంకాలు విడుదల చేయడం మొదలైన తర్వాత ఒక నెలలో మహిళా సభ్యుల గరిష్ట చేరిక ఇదే. ఇందులో 3.05 లక్షలు మొదటిసారి చేరిన వారు కావడం గమనార్హం.
- 14.65 లక్షల మంది ఒక సంస్థలో మానేసి, మరో సంస్థలో చేరారు.
- జూలైలో ఈపీఎఫ్‌వో కిందకు చేరిన వారిలో 59 శాతం మేర మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, హర్యానా, గుజరాత్ రాష్ట్రాల నుంచే ఉన్నారు.
- తయారీ, కంప్యూటర్ సేవలు, నిర్మాణ రంగం, ఇంజనీరింగ్, బ్యాంకింగ్, ప్రైవేటు ఎలక్ట్రానిక్ మీడియా రంగాల నుంచి ఎక్కువ మంది చేరారు.

బీఎంసీసీలో కోరమాండల్‌కు మరింత వాటా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ సెనెగల్‌కు చెందిన రాక్ ఫాస్ఫేట్ మైనింగ్ కంపెనీ బావోబాబ్ మైనింగ్, కెమికల్ కార్పొరేషన్‌లో (బీఎంసీసీ) మరో 8.82 శాతం వాటా కైవసం చేసుకుంది. దీంతో బీఎంసీసీలో సంస్థ వాటా 53.8 శాతానికి ఎగసిందని బుధవారం వెల్లడించింది. బీఎంసీసీలో కోరమాండల్ రూ.32 కోట్లు పెట్టుబడి చేయనుంది. అలాగే ప్రాజెక్టుల విస్తరణ, మూలధన అవసరాలకై రూ.54 కోట్ల రుణం సమకూర్చనుంది. కోరమాండల్ 2022 సెప్టెంబర్‌లో బీఎంసీసీలో 45 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఫాస్పారిక్ యాసిడ్ తయారీలో రాక్ ఫాస్ఫేట్ కీలక ముడి పదార్థం. దీనిని ఫాస్ఫేటిక్ ఎరువుల ఉత్పత్తికి ఉపయోగిస్తారు. రాక్ ఫాస్ఫేట్ ఉత్పత్తిని మెరుగుపర్చడానికి బీఎంసీసీ స్థిర ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ప్రారంభించిందని కోరమాండల్ తెలిపింది.

రూ.లక్ష కోట్ల లాభార్జన సంస్థగా ఎస్‌బీఐ: సీఎస్ శెట్టి



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ రూ.లక్ష కోట్ల లాభాన్ని వచ్చే 3-5 ఏళ్లలో సాధిస్తుందని సంస్థ చైర్మన్ సీఎస్ శెట్టి ప్రకటించారు. ఈ మైలురాయికి చేరుకున్న తొలి భారతీయ ఆర్థిక సంస్థగా ఎస్‌బీఐ నిలుస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ రూ.61,077 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభం కంటే 21.59 శాతం ఎక్కువ. ''లాభాలు, మార్కెట్ విలువ అన్నవి మా సంస్థకు ఎంతో కీలకమైన అంశాలు. కస్టమర్ కేంద్రీకృతంగా ఉండడానికే తగినంత ప్రాధాన్యం ఇస్తాం. మా కార్యకలాపాలలో ఇది అంతర్భాగంగా ఉంటుంది'' అని శెట్టి స్పష్టం చేశారు. కార్పొరేట్ రుణాలకు డిమాండ్ బలంగా ఉన్నట్టు తెలిపారు. భారత పరిశ్రమల నుంచి ఇప్పటికే రూ.4 లక్షల కోట్ల రుణ అభ్యర్థనలు వచ్చాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రైవేటు రంగం మూలధన వ్యయాలు తప్పకుండా పుంజుకుంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సాధారణ ఎన్నికల కారణంగా మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) నిదానించిన ప్రభుత్వ మూలధన వ్యయాలు సైతం తిరిగి పుంజుకున్నట్టు చెప్పారు. ''ప్రైవేటు మూలధన వ్యయాల పరంగా తగినంత ఆసక్తి కనిపిస్తోంది. ఇన్‌ఫ్రా రంగ రుణాలకు ప్రధానంగా రోడ్లు, పునరుత్పాదక ఇంధనాలు, రిఫైనరీల నుంచి డిమాండ్ వస్తోంది'' అని వివరించారు.

స్పామ్ కాల్స్‌కు ఎయిర్‌టెల్ చెక్



ఏఐ టెక్నాలజీ వినియోగం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్పామ్ కాల్స్, మెసేజెస్ కట్టడికి టెలికం కంపెనీ ఎయిర్‌టెల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాంకేతికతను వినియోగించనున్నట్టు ప్రకటించింది. సెప్టెంబర్ 26 అర్ధరాత్రి నుంచి తమ నెట్‌వర్క్‌లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వస్తోందని ఎయిర్‌టెల్ ఎండీ, సీఈవో గోపాల్ విఠల్ బుధవారం వెల్లడించారు. 'ఇది స్పామ్ కాల్స్, సందేశాల గురించి వినియోగదార్లను అప్రమత్తం చేస్తుంది. 2 మిల్లీ సెకన్లలో కాల్‌ను విశ్లేషించి డయలర్‌లో కస్టమర్‌ను అప్రమత్తం చేసే పరిష్కారాన్ని అభివృద్ధి చేశాం. ఎయిర్‌టెల్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరికీ ఈ సేవలను ఉచితంగా అందజేస్తాం. ఈ సొల్యూషన్ ప్రతిరోజూ 1.5 బిలియన్ సందేశాలను, 2.5 బిలియన్ కాల్స్‌ను ప్రాసెస్ చేస్తుంది. అలాగే 100 మిలియన్ సంభావ్య స్పామ్ కాల్స్, 3 మిలియన్ స్పామ్ ఎస్ఎంఎస్‌లను గుర్తించగలదు. ఈ సాంకేతికత స్వయంగా కాల్‌ని బ్లాక్ చేయదు. కాల్స్‌ను బ్లాక్ చేయాలా వద్దా అనేది వినియోగదార్ల నిర్ణయంపై ఆధారపడి ఉంది. కొన్నిసార్లు నిజమైన కాల్స్ కూడా స్పామ్‌గా ప్రదర్శించబడతాయి. వాట్సాప్ వంటి ఓవర్-ది-టాప్ యాప్‌లలో వచ్చే స్పామ్ కాల్స్‌కు ఈ టెక్నాలజీ పరిష్కారం చూపదు' అని ఆయన అన్నారు.

బీపీకి ప్రాధాన్య మార్కెట్‌గా భారత్



కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురిని కలిసిన బీపీ బోర్డు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇంధన రంగ దిగ్గజం బీపీ తమకు అత్యంత ప్రాధాన్య మార్కెట్లలో ఒకటిగా భారత్‌ను పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ రెండోసారి తమ బోర్డు సమావేశం నిర్వహిస్తున్నట్లు సంస్థ వివరించింది. బీపీ బోర్డు బృందం అయిదు రోజుల పాటు భారత్‌లో పర్యటిస్తోంది. సెప్టెంబర్ 23న పర్యటన ప్రారంభమైంది. ఈ సందర్భంగా పూర్తి స్థాయి బోర్డు సమావేశం నిర్వహించడంతో పాటు ప్రభుత్వాధినేతలు, వ్యాపార భాగస్వాములతో కూడా ఉన్నతాధికారులు భేటీ కానున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన ఆయిల్, గ్యాస్ బ్లాకుల్లో 7.2 బిలియన్ డాలర్లతో 30 శాతం వాటా తీసుకున్న రెండేళ్ల తర్వాత 2013 మేలో బీపీ బోర్డు భారత్‌ను సందర్శించింది. అప్పటి తరహాలోనే తాజా పర్యటన కూడా సాగుతోంది. కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురిని కలిసిన బీపీ బోర్డు, ఆంధ్రప్రదేశ్‌లో కేజీ బేసిన్ నుంచి ఉత్పత్తయ్యే గ్యాస్ ల్యాండింగ్ పాయింట్ అయిన గాడిమొగను సందర్శించింది.

అయిదు రాష్ట్రాల్లో షిప్ బిల్డింగ్ క్లస్టర్స్

- జాబితాలో ఆంధ్రప్రదేశ్ సైతం
- అయిదేళ్లలో 40 మి.టీఈయూలకు కంటైనర్ హ్యాండ్లింగ్
- తద్వారా 20 లక్షల ఉద్యోగ అవకాశాలు
- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడి



న్యూఢిల్లీ: షిప్ బిల్డింగ్, షిప్ రిపేర్ క్లస్టర్లను అయిదు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ బుధవారం తెలిపారు. నౌకా నిర్మాణం, నౌకల మరమ్మత్తు యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తిస్తూ గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, ఒడిశాలో క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడించారు. మూడవసారి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజులలో తన మంత్రిత్వ శాఖ సాధించిన ప్రధాన విజయాలను ఈ సందర్భంగా సోనోవాల్ వివరించారు. రాబోయే ఐదేళ్లలో కంటైనర్ హ్యాండ్లింగ్ 40 మిలియన్ టీఈయూలకు (ట్వెంటీ ఫుట్ ఈక్వలెంట్ యూనిట్) చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. తద్వారా దేశవ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందన్నారు.

తొలి భారతీయ పోర్టుగా..

జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ నిర్వహణ సామర్థ్యాన్ని ప్రస్తుత 6.6 మిలియన్ టీఈయూల నుండి 10 మిలియన్లకు పెంచుకుంటుందని సోనోవాల్ వివరించారు. ఇది కార్యరూపం దాలిస్తే ఈ సామర్థ్యానికి చేరుకున్న తొలి భారతీయ పోర్టుగా నిలుస్తుందని అన్నారు. హైడ్రోజన్ తయారీ కేంద్రాల ఏర్పాటుకై దీనదయాళ్ పోర్ట్ అథారిటీ, వీఓ చిదంబరనార్ పోర్ట్ ట్రస్ట్‌లో 3,900 ఎకరాల భూమిని కేటాయించినట్టు మంత్రి తెలిపారు. ఇది రానున్న సంవత్సరాల్లో రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తుందని ఆయన వెల్లడించారు. గ్రేట్ నికోబార్ ద్వీపంలోని గలాథియా బే వద్ద అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్ ప్రధాన ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌గా పనిచేస్తుందని వివరించారు.

టాప్-10 కంటైనర్ పోర్ట్‌లలో..

కామరాజర్ ఓడరేవును స్థాపించిన 25 సంవత్సరాల తరువాత వధ్వన్ పోర్ట్ చేరిక భారత సముద్ర ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని సర్బానంద సోనోవాల్ తెలిపారు. 21వ శతాబ్దపు భారత మొట్టమొదటి ప్రధాన పోర్ట్ ప్రాజెక్ట్ అయిన వధ్వన్ పోర్ట్ 298 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంతో అతిపెద్ద ఆల్ వెదర్ డీప్ వాటర్ పోర్ట్‌లలో ఒకటిగా అవతరించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ మెగా పోర్ట్ 12 లక్షల మందికి ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని చెప్పారు. అంతర్జాతీయ షిప్పింగ్ కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరుస్తుందని, రవాణా సమయం, ఖర్చులను తగ్గించడం ద్వారా ప్రపంచంలో టాప్-10 కంటైనర్ పోర్ట్‌లలో ఒకటిగా ఉంచుతుందని భావిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు.

ఆయిల్, గ్యాస్ బ్లాకుల కోసం పోటాపోటీ

- వేలానికి 28 బ్లాక్‌లు
- ఒక్కో దానికి రెండేసి బిడ్‌లు
- ఓఎన్‌జీసీతో జట్టుకట్టిన రిలయన్స్-బీపీ



న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ఆయిల్, గ్యాస్ బ్లాకుల వేలంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు పాలు పంచుకున్నాయి. ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ (ఓఎల్‌పీ-8) ఎనిమిదో దశ వేలంలో భాగంగా కేంద్ర సర్కారు 28 బ్లాకులను వేలానికి పెట్టింది. ఇవి 1.36 లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్-బీపీ సంస్థలు మొదటిసారి ఓఎన్‌జీసీతో కలసి గుజరాత్ తీరంలోని ఓ బ్లాక్‌కు బిడ్ వేశాయి. ఓఎన్‌జీసీతోపాటు మరో ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్ ఇండియా లిమిటెడ్, వేదాంత, రిలయన్స్ ఇండస్ట్రీస్-బీపీ జేవీ, సన్ పెట్రోకెమికల్స్ ఇందులో పాల్గొన్నాయి. ఎనిమిదో విడత ఓఎల్‌పీలో 28 బ్లాక్‌లకు బిడ్ల దాఖలు గడువు సెప్టెంబర్ 21తో ముగిసింది. దీంతో ఈ వివరాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డీజీహెచ్) విడుదల చేసింది. ఓఎన్‌జీసీ తాను సొంతంగా 14 బ్లాకులకు బిడ్‌లు దాఖలు చేసింది. ఆయిల్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌తో కలసి మరో నాలుగు బ్లాక్‌లకు బిడ్లు వేసింది. రిలయన్స్-బీపీతో కలసి వేసిన మరో బిడ్ కూడా కలిపి చూస్తే మొత్తం 19 బ్లాక్‌లకు ఓఎన్‌జీసీ పోటీ పడుతోంది. ఇక అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత లిమిటెడ్ మొత్తం 28 బ్లాకులకు సొంతంగా బిడ్‌లు సమర్పించింది. సన్ పెట్రోకెమికల్స్ ఏడు బ్లాకులకు బిడ్‌లు వేసింది. మొత్తం మీద నాలుగు బ్లాక్‌లకు మూడేసి చొప్పున బిడ్లు రాగా, మిగిలిన వాటికి రెండేసి చొప్పున దాఖలయ్యాయి.

షట్లర్ తులసిమతికి రూ. 2 కోట్ల నజరానా

- చెక్ అందజేసిన తమిళనాడు సీఎం స్టాలిన్
- పారాలింపిక్స్ పతక విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

చెన్నై: పారిస్ పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన తమిళనాడు అథ్లెట్లకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భారీ నజరానాలు అందించారు. ఇటీవల జరిగిన పారాలింపిక్స్ మహిళల బ్యాడ్మింటన్‌లో రజత పతకం గెలిచిన తులసిమతి మురుగేశన్‌కు (ఎస్‌యూ5) బుధవారం ముఖ్యమంత్రి రూ.2 కోట్ల చెక్ అందజేశారు. కాంస్య పతకాలు సాధించిన మనీషా రామదాస్, నిత్యశ్రీకి చెరో కోటి రూపాయాల చెక్‌లు అందించారు. పురుషుల హైజంప్‌లో కాంస్యం గెలిచిన తమిళనాడు అథ్లెట్ మరియప్పన్ తంగవేలుకు రూ. 1 కోటి చెక్ అందించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో సభ్యులైన తమిళనాడు గ్రాండ్‌మాస్టర్లకు మంగళవారం నగదు ప్రోత్సాహకం అందించిన స్టాలిన్... తాజాగా పారా అథ్లెట్లకు కూడా నజారానాలు అందించి తమ ప్రభుత్వం క్రీడారంగానికి అండగా ఉంటుందని మరోసారి చాటి చెప్పారు.



వినేశ్‌కు 'నాడా' నోటీసులు

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నోటీసులు జారీ చేసింది. ఎప్పుడు ఎక్కడ ఉన్నారనే అంశంపై 14 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరింది. ఈనెల 9న హరియాణాలోని ఖర్ఖోడ గ్రామంలో డోప్ టెస్టు నిర్వహించాలనుకుంటే ఆ సమయంలో వినేశ్ అందుబాటులో లేకపోవడంతో 'నాడా' ఈ నోటీసులు జారీ చేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్... వంద గ్రాములు అధిక బరువు కారణంగా అనర్హతకు గురైంది. ఆ తర్వాత కెరీర్‌కు వీడ్కోలు పలికి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన వినేశ్... హరియాణాలోని జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచింది. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్న వినేశ్ హరియాణాలో విస్తృతంగా పర్యటిస్తోంది. ఈ నేపథ్యంలో 'ఎప్పుడు ఎక్కడ ఉన్నారనే వివరాలు అందించనందుకు గానూ వినేశ్‌కు నోటీసులు అందించాం. డోప్ నిరోధక అధికారి హాజరైన సమయంలో వినేశ్ అందుబాటులో లేదు. అందుకే ఈ నోటీసులు జారీ చేశాం' అని 'నాడా' నోటీసులు పేర్కొంది. నిబంధనల ప్రకారం ఏడాది కాలంలో మూడుసార్లు వివరాలు అందించడంలో విఫలమైన అథ్లెట్లపై 'నాడా' క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుంది.



ఢిల్లీ రంజీ ప్రాబబుల్స్‌లో ఏకంగా 84 మంది

న్యూఢిల్లీ: ఢిల్లీ జిల్లా క్రికెట్ సంఘం (డీడీసీఏ)లోని రాజకీయాలు రంజీ ప్రాబబుల్స్ జట్టును కాస్తా జంబో జట్టుగా మార్చేశాయి. కొత్త రంజీ సీజన్ కోసం ఏకంగా 84 మందితో ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయడం తారాస్థాయికి చేరిన రాజకీయ జోక్యాన్ని సూచిస్తోంది. సాధారణంగా క్రికెట్‌లో ప్రాబబుల్స్ అంటే 26 నుంచి 33 మందికి మించి ఉండనే ఉండదు. కానీ డీడీసీఏ బుధవారం ప్రకటించిన ప్రాబబుల్స్ జాబితా మూడు రెట్లకు మించి ఉంది. నిజానికి టీమిండియాకు బిజీ షెడ్యూల్ ఉంది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌తో, ఆ తర్వాత న్యూజిలాండ్‌తో అటుపై ఆస్ట్రేలియా పర్యటనతో నాలుగైదు నెలలు బిజీ బిజీగా గడపనుంది. అయినా సరే ఇవేవి పట్టించుకోని ఢిల్లీ క్రికెట్ సంఘం సెలక్టర్లు భారత స్టార్లు కోహ్లి, రిషభ్ పంత్‌లను కూడా పనిలో పనిగా ఎంపిక చేశారు. కోహ్లి చివరిసారి 2012లో ఉత్తర్‌ప్రదేశ్‌పై రంజీ మ్యాచ్ ఆడాడు. పంత్ కోవిడ్-19కు ముందు ఆడాడు. అసలే రోడ్డు ప్రమాదం, ప్రాణాపాయం నుంచి బయటపడిన పంత్ ఇప్పుడున్న పరిస్థితుల్లో టీమిండియాకు ఆడటమే ఎక్కువనుకుంటే రంజీలైతే ఆడే చాన్స్ లేదు. భారత సీమర్ ఇషాంత్ శర్మకు ఈ జాబితాలో చోటు లేదు. కానీ పార్లమెంట్ సభ్యుడు పప్పు యాదవ్ కుమారుడు సార్థక్ రంజన్ మాత్రం ఎంపికయ్యాడు. దేశంలోనే అత్యంత ఫాస్టెస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్, హర్షిత్ రాణాలు ఈ జంబో ప్రాబబుల్స్‌లో ఉన్నారు.

తడబాటు నుంచి తారాస్థాయికి...

- తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ప్రస్థానం
- చెస్ ఒలింపియాడ్‌లో భారత్ 'స్వర్ణ' ప్రదర్శనలో కీలకపాత్ర
- ప్రపంచ చెస్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి భారత స్టార్

స్వీయ అంచనాలతో పాటు... ఫలితాల ఒత్తిడితో సతమతమై కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్... వాటిని పక్కన పెట్టడం వల్లే విజయవంతం అయ్యానని వెల్లడించాడు. ఇటీవల హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరిగిన ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్టు తొలిసారి చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించిన ఈ ఓరుగల్లు కుర్రాడు ఇక మీదట కూడా ఇదే జోరు కొనసాగిస్తానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. వందేళ్ల చరిత్ర ఉన్న చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు తొలిసారి స్వర్ణాలు సాధించి రికార్డు సృష్టించగా... అందులో తన వంతు పాత్ర ఉండటం ఆనందంగా ఉందని 21 ఏళ్ల అర్జున్ అన్నాడు. ఒలింపియాడ్‌లో ఆడిన 11 గేమ్‌ల్లో తొమ్మిదింట నెగ్గిన అర్జున్... వ్యక్తిగత విభాగంలోనూ స్వర్ణం సాధించడంతో పాటు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో అత్యుత్తమంగా మూడో స్థానానికి దూసుకెళ్లాడు. చెస్ ఒలింపియాడ్ ప్రదర్శన, కెరీర్ లక్ష్యాలు, భవిష్యత్తు ప్రణాళికలపై అర్జున్ చెప్పిన వివరాలు అతడి మాటల్లోనే...



అతిగా ఆలోచించి...

ఒత్తిడిని అధిగమించడం వల్లే ఈ విజయం సాధ్యమైంది. కెరీర్ ఆరంభంలో పెద్దగా ఆందోళన చెందలేదు. అయితే 2021లో నా ఎలో రేటింగ్ పాయింట్లు 2500 ఉండేవి. కానీ నా సామర్థ్యం కచ్చితంగా అంతకన్నా ఎక్కువే అని నమ్మేవాడిని. ఇక రెండేళ్లు తిరిగేసరికి 2023లో ఎలో రేటింగ్ 2700కు చేరింది. కానీ ఆ సంవత్సరం చాలా కష్టంగా గడించింది. కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. అందులో ముఖ్యమైంది క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపిక కాకపోవడం. చాన్నాళ్లుగా ఆ టోర్నీలో ఆడాలని అనుకుంటూ వచ్చా. అయితే గత ఏడాది దానికి అర్హత సాధించలేకపోవడం బాధించింది. ఒకప్పుడు సొంత అంచనాలతో సతమతమయ్యేవాడిని. ఎక్కువ ఊహించేసుకొని గందరగోళానికి గురయ్యేవాడిని. ఫలితాల గురించి అతిగా ఆలోచించడం నా ఆటతీరుపై ప్రభావం చూపింది. దాన్ని మార్చుకోవడం అంత సులువుకాదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నా. ఫలితాలను పట్టించుకోవడం మానేశా. ఏదో సాధించాలని తీవ్రంగా కోరుకుంటూ నాపై నేనే ఒత్తిడి పెంచుకుంటున్నానని అర్థం చేసుకున్నా. వాటిపై దృష్టి పెట్టడం వదిలేశాక మెరుగైన ఫలితాలు రావడం ప్రారంభమైంది.

అదే అతిపెద్ద లక్ష్యం!

ప్రపంచ చాంపియన్‌గా నిలవడమే నా అతిపెద్ద లక్ష్యం. అయితే ఒకేసారి పెద్ద లక్ష్యాలను కాకుండా ఎప్పటికప్పుడు చిన్న చిన్న గమ్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకుంటూ ముందుకు సాగుతున్నా. ఒక టోర్నమెంట్‌లో బరిలోకి దిగితే దాని గురించే ఆలోచిస్తా. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి సానుకూల ఫలితం సాధించాలనుకుంటా. ప్రస్తుతం మన ప్లేయర్లు అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నారు. దీన్ని చదరంగంలో మన 'గోల్డెన్ ఎరా'గా చెప్పుకొవచ్చు. నాతో పాటు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నారు.

మేమంతా స్నేహితులం

గుకేశ్, ప్రజ్ఞానందతో మంచి అనుబంధం ఉంది. చాన్నాళ్లుగా కలిసి ఆడుతుండటంతో మా మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటుంది. ఒకరి విజయాన్ని మరొకరం ఆస్వాదిస్తాం. వాటి నుంచి స్ఫూర్తి పొందుతాం. ఒకరికి ఒకరం అండగా నిలుస్తాం. మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ఇది ఎంతగానో దోహద పడుతుంది. 2003 నుంచి 2006 మధ్య జన్మించిన వాళ్లమే జట్టులో ఎక్కువ మంది ఉన్నాం. అందులో నేనే పెద్దవాడిని. ప్రస్తుతం మన దశ నడుస్తోంది. స్వతహాగా నేను టీమ్ ఈవెంట్‌లు ఆడేందుకు ఎక్కువ ఇష్టపడతా. గ్లోబల్ చెస్ లీగ్ (జీఎస్ఎల్) కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా.

చెస్ ఐపీఎల్

గ్లోబల్ చెస్ లీగ్‌ను చదరంగ ఐపీఎల్ అని భావిస్తా. సమష్టి ప్రదర్శనలు అంటే నాకు చాలా ఇష్టం. ర్యాపిడ్ ఫార్మాట్‌లో జరగనున్న గ్లోబల్ చెస్ లీగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఉన్నా. ఈ లీగ్‌లో ప్రత్యేక నిబంధనలు ఉంటాయి. నల్ల పావులతో ఆడి విజయం సాధిస్తే నాలుగు పాయింట్లు... తెల్ల పావులతో గెలిస్తే మూడు పాయింట్లు కేటాయిస్తారు. అంటే తెల్ల పావులతో ఆడిన సహచరుడు పరాజయం పాలైతే... ప్రత్యర్థి జట్టు పాయింట్లను అందుకునేందుకు ఇద్దరు ఆటగాళ్లు విజయాలు సాధించాల్సి ఉంటుంది. దీనివల్ల 'డ్రా'ల సంఖ్య బాగా తగ్గుతుంది. అందుకే ఈ ఫార్మాట్ నన్ను బాగా ఆకర్షించింది. గత జీఎస్ఎల్‌లో ప్రపంచ నంబర్‌వన్ నార్వే గ్రాండ్‌మాస్టర్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో కలిసి ఒకే జట్టు తరఫున బరిలోకి దిగడం చాలా సంతోషంగా అనిపించింది. కార్ల్‌సన్ సహచర్యంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఈ ఏడాది భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ జట్టు తరఫున ఆడనున్నా. నా ఆటపై ఎంతో ప్రభావం చూపిన గురువు లాంటి విశ్వనాథన్ ఆనంద్‌తో సమయం గడిపేందుకు ఎదురుచూస్తున్నా.

మానసికంగా సిద్ధమయ్యా...

ప్రయత్న లోపం లేకుండా చూసుకోవడం ప్రారంభించిన తర్వాత ప్రశాంతంగా ఉన్నా. ఫలానా టోర్నీలో ఫలానా ఆటగాడిపై తప్పక గెలవాలని అనుకున్నప్పుడు ఆశించిన ఫలితాలు వచ్చేవి కావు. ఆ తర్వాత అత్యుత్తమ ఆటతీరు కనబరిస్తే ఫలితం కూడా అందుకు తగ్గట్లే ఉంటుందనే విషయం గ్రహించా. ఇది చెప్పినంత సులభం కాదు. ఒత్తిడి నుంచి బయటపడి మెరుగైన ప్రదర్శన చేయడం అంటే కత్తిమీద సాములాంటిదే. దానికి మానసికంగా సిద్ధంగా ఉండాలి. గత ఏడాది క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించలేకపోవడం చాలా బాధించింది. ఈ ఏడాది చాలా బాగా గడిచింది. ఇదే జోరు మున్ముందు కూడా కొనసాగించాలనుకుంటున్నా.



బ్రూక్ సెంచరీ... ఇంగ్లండ్ విక్టరీ

వన్డేల్లో ఆసీస్ జైత్రయాత్రకు బ్రేక్

చెస్టర్ లీ స్ట్రీట్: సిరీస్‌లో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆకట్టుకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతిలో 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (94 బంతుల్లో 110 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ సెంచరీతో ఇంగ్లండ్ జట్టును విజయతీరాలకు చేర్చాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆసీస్ విజయం సాధించగా... ఇంగ్లండ్ తొలి గెలుపు నమోదు చేసుకుంది. ఈ ఫార్మాట్‌లో వరుసగా 14 విజయాల తర్వాత ఆసీస్‌కు ఇదే తొలి ఓటమి కావడం గమనార్హం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. వికెట్ కీపర్ అలెక్స్ కారీ (65 బంతుల్లో 77 నాటౌట్; 7 ఫోర్లు, ఒక సిక్సర్), స్టీవ్ స్మిత్ (82 బంతుల్లో 60; 5 ఫోర్లు) అర్ధశతకాలు సాధించగా.. ఆరోన్ హార్డీ (26 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కామెరూన్ గ్రీన్ (49 బంతుల్లో 42; 4 ఫోర్లు), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (25 బంతుల్లో 30; 5 ఫోర్లు) ఫర్వాలేదనపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 37.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసింది. బ్రూక్ అజేయ శతకంతో చెలరేగగా... విల్ జాక్స్ (82 బంతుల్లో 84; 9 ఫోర్లు, ఒక సిక్సర్) అతడికి చక్కటి సహకారం అందించాడు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, కామెరూన్ గ్రీన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ దశలో భారీ వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. వాన తెరిపినివ్వకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ లక్ష్యాన్ని 37.4 ఓవర్లలో 209 పరుగులుగా నిర్ణయించారు. అప్పటికే 46 పరుగులు ముందున్న ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు. బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం నాలుగో వన్డే జరగనుంది.

మళ్లీ టాప్-10లోకి పంత్



దుబాయ్: చాన్నాళ్ల తర్వాత పునరాగమనం చేసి టెస్టుల్లో శతకంతో కదం తొక్కిన భారత వికెట్‌కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ మళ్లీ టాప్-10 ర్యాంకుల్లోకి ఎగబాకాడు. అయితే భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల ర్యాంకులు దిగజారాయి. రెండేళ్ల క్రితం ఘోర కారు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన పంత్ పరిమిత ఓవర్ల క్రికెట్‌ను ఎప్పుడో మొదలుపెట్టాడు. కానీ సంప్రదాయ ఫార్మాట్‌ను తాజా బంగ్లాదేశ్ సిరీస్‌లో ఆరంభించిన పంత్ చెన్నైలో జరిగిన తొలిటెస్టులో సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన తాజా బ్యాటింగ్ ర్యాంకుల్లో అతను 731 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి ఎగబాకాడు. అర్ధసెంచరీ సాధించిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ (751) ఐదో ర్యాంకుకు చేరుకున్నాడు. కాగా కెప్టెన్ రోహిత్ ఐదు స్థానాలు కోల్పోయి పదోర్యాంకుకు, కోహ్లి కూడా ఐదు స్థానాలు దిగజారి 12వ ర్యాంకుకు పడిపోయారు. ఈ బ్యాటింగ్ విభాగంలో రూట్ (ఇంగ్లండ్; 899) అగ్రస్థానంలో ఉన్నాడు. బౌలర్ల జాబితాలో భారత వెటరన్ స్పిన్నర్ అశ్విన్ (870) టాప్ ర్యాంకులో కొనసాగుతుండగా, బుమ్రా (847) రెండో ర్యాంకులో ఉన్నాడు. టాప్-10లో మరో భారత స్పిన్నర్ జడేజా ఏడో ర్యాంకులో ఉన్నాడు.

మెకల్లమ్ ఆదేశిస్తే... వన్డేల్లో ఆడతా



ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్య

చెస్టర్ లీ స్ట్రీట్: పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఆడాలని కొత్త హెడ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ నుంచి పిలుపు వస్తే తప్పక అంగీకరిస్తానని ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అన్నాడు. గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో చివరిసారిగా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 33 ఏళ్ల స్టోక్స్ ఆ తర్వాత కేవలం టెస్టుల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ తరఫున స్టోక్స్ టి20 మ్యాచ్ ఆడి దాదాపు రెండేళ్లు అవుతోంది. అయితే ప్రస్తుతం ఇంగ్లండ్ టెస్టు జట్టు కోచ్‌గా పనిచేస్తున్న మెకల్లమ్... త్వరలో వన్డే, టి20ల కోచ్ బాధ్యతలు కూడా అందుకోనున్న నేపథ్యంలో స్టోక్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. స్టోక్స్ సారథ్యం మెకల్లమ్ మార్గనిర్దేశకత్వంలో ఇంగ్లండ్ జట్టు టెస్టు క్రికెట్‌లో 'బజ్‌బాల్' ఆటతీరుతో సంచలన ప్రదర్శనలు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం స్టోక్స్ మాట్లాడుతూ... 'పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడతావా... అని మెకల్లమ్ అడిగితే కచ్చితంగా ఔననే సమాధానం చెబుతా. ఒకవేళ పిలుపు రాకపోయినా అసంతృప్తి చెందను. ఇంగ్లండ్ తరఫున చాలా వన్డేలు, టి20లు ఆడా. ఆ రెండు ఫార్మాట్లలో సాధించిన విజయాలతో సంతోషంగా ఉన్నా. ఇప్పటి వరకు అలాంటి చర్చేం జరగలేదు' అని అన్నాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టు ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతుండగా... ఆ తర్వాత పాకిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. దీని కోసం సాధన చేస్తున్నట్లు స్టోక్స్ వెల్లడించాడు. మెకల్లమ్ ఆలోచన ధోరణి ప్రత్యేకంగా ఉంటుందని... అతడి వల్లే జట్టు మొత్తం దూకుడు పెంచిందని పేర్కొన్నాడు. ఇంగ్లండ్ చీఫ్ సెలెక్టర్ ల్యూక్ రైట్ ఇటీవల మాట్లాడుతూ... వచ్చే ఏడాది పాకిస్తాన్ వేదికగా జరగనున్న చాంపియన్స్ ట్రోఫీ కోసం స్టోక్స్, జో రూట్ వన్డే జట్టు పోటీలోనే ఉన్నారని ప్రకటించడంతో ఈ చర్చకు తెరతీసినట్లయింది.



మరో పదేళ్లు...

భారత్ నుంచి గ్రాండ్‌స్లామ్ విజేత రావడంపై పేస్ వ్యాఖ్య

ముంబై: భారత్ నుంచి మరో గ్రాండ్‌స్లామ్ చాంపియన్ తయారు అయ్యేందుకు పదేళ్లు పడుతుందని టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ అన్నాడు. దేశంలో క్రీడా సంస్కృతి పెరుగుతోందని... 2036 ఒలింపిక్స్‌కు మనదేశం ఆతిథ్యమివ్వడంతో పాటు పతకాల పట్టిక టాప్-10లో నిలిచే దిశగా అడుగులు ముందుకు వేస్తోందని పేర్కొన్నాడు. ముంబైలో బుధవారం జరిగిన టెన్నిస్ ప్రీమియర్ లీగ్ వేలం సందర్భంగా పేస్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ కార్యక్రమంలో పేస్‌తో పాటు మహేశ్ భూపతి, సానియా మీర్జా, సోనాలీ బెంద్రే, రకుల్‌ప్రీత్ పాల్గొన్నారు. 'దేశంలో నైపుణ్యానికి కొదవ లేదు. వారిని గుర్తించి సానపెట్టాల్సిన అవసరముంది. రాబోయే రోజుల్లో భారత్ స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా ఎదుగుతుంది' అని పేస్ ఆశాభావం వ్యక్తంచేశాడు.



బొద్దు సూపర్‌స్టార్

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ సీ లైఫ్ ఎక్వేరియంలో డజన్ల కొద్దీ నలుపు, తెలుపు పెంగ్విన్ల మధ్య చాలా పెద్దగా, బొద్దుగా ఉన్న ఏకైక పెంగ్విన్ ఇప్పుడు హాట్‌ఫేవరెట్‌గా మారింది. దాని పేరు పెస్టో. జనవరి 31వ తేదీన పుట్టినపుడు కేవలం 200 గ్రాములున్న ఈ పిల్ల పెంగ్విన్ ఈ 7 నెలల్లో విపరీతంగా పెరిగి ఇప్పుడు ఏకంగా 22 కేజీలు తూగుతూ అటూ ఇటూ తల ఎగరేస్తోంది. తల్లిదండ్రులు టాంగో, హడ్సన్‌ల మొత్తం బరువుకు దీని బరువు ఇది సమానం. చాక్లెట్ రంగు వెంట్రుకలు, పనస పండులాంటి నిలువెత్తు శరీరంతో ఎక్వేరియం అంతా కలియ తిరుగుతూ ఎంతో బొద్దుగా, ముద్దుగా ఉన్న దీనిని నేరుగా చూసేందుకు ఎక్వేరియం ఎన్‌క్లోజర్‌కు జనం తండోపతండాలుగా వస్తున్నారు. సోషల్ మీడియా రికార్డులను బద్దలుకొడుతూ ఆన్‌లైన్‌లో దీని ఫొటోలు, వీడియోలు చూసిన వారి సంఖ్య ఏకంగా 190 కోట్లు దాటిందని ఒక అనధికార అంచనా. సాధారణ జనం దగ్గర్నుంచి కేటీ పెర్రీ వంటి హాలీవుడ్ సెలబ్రిటీల దాకా అందరూ దీని ఫ్యాన్సే. ఇప్పటికే బ్రిటన్, అమెరికా సహా చాలా దేశాల్లో దీనిపై ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. ఇది రోజూ 30 చేపలను గుటకాయస్వాహా చేస్తోంది. అయితే ఇంతటి బరువుతో దీనికి ఎలాంటి సమస్యలు లేకపోవడం విశేషం. ''మరికొద్ది వారాల్లో ఇది యుక్త వయసులోకి వచ్చి 15 కేజీలకు పైగా బరువు సహజంగా కోల్పోనుంది. అప్పుడు మరింత అందంగా తయారవుతుంది'అని ఎక్వేరియంలో దీని బాగోగులు చూసే జసింటా ఎర్లీ చెప్పారు.

– మెల్‌బోర్న్



అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మెలోనీ, మస్క్

మెలోనీతో మస్క్ డేటింగ్‌లో ఉన్నారా?

- వైరల్‌గా మారిన వారి భేటీ ఫొటో
- వదంతులంటూ కొట్టిపారేసిన మస్క్

న్యూయార్క్: టెస్లా కార్ల సంస్థ సీఈఓ ఎలాన్ మస్క్, ఇటలీ మహిళా ప్రధాని జార్జియా మెలోనీలు డేటింగ్‌లో ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో ఒక ఫొటో తెగ చక్కర్లు కొడుతోంది. అయితే ఈ వార్తలను మస్క్ కొట్టిపారేశారు. ఒక కార్యక్రమంలో పాల్గొనప్పుడు తీసిన ఫొటో అది వివరణ ఇచ్చారు. ''వీళ్లు డేటింగ్‌కు వెళ్తారని మీరు భావిస్తున్నారా?''అన్న క్యాప్షన్‌తో మస్క్ అభిమానుల సంఘం తమ సోషల్‌మీడియా ఖాతాలో ఈ ఫొటోను పోస్ట్‌చేయడంతో అక్కడి నుంచి ఈ పుకార్ల వరద మొదలైంది. సెప్టెంబర్ 24న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరిగిన ఒక అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మెలోనీ, మస్క్ కలిసిన సందర్భంగా ఆమెను మస్క్ పొగడ్తల్లో ముంచెత్తారు. ఆ కార్యక్రమంలో మెలోనీకి అట్లాంటిక్ కౌన్సిల్ గ్లోబల్ సిటిజెన్ అవార్డ్‌ను మస్క్ తన చేతులమీదుగా అందించారు. ఇటలీకి తొలి మహిళా ప్రధానిగా ఎన్నికై చరిత్ర సృష్టించడంతోపాటు ఐరోపా సమాఖ్యకు సంపూర్ణ మద్దతు పలుకుతున్న మెలోనీకి కృతజ్ఞతలు తెలుపుతూ అట్లాంటిక్ కౌన్సిల్ ఈ అవార్డ్‌ను ప్రకటించడం తెల్సిందే. అవార్డ్‌ను ఆమెకు అందించాక మస్క్ మాట్లాడారు. ''బాహ్య సౌందర్యం కన్నా అంతః సౌదర్యం గొప్పది. అలాంటి వ్యక్తి మెలోనీ. బయటకు ఎంత అందంగా ఉంటారో అంతకంటే అందమైన మనసు ఆమె సొంతం. ఇలాంటి వ్యక్తికి అవార్డ్ అందజేయడం నాకు కూడా గర్వంగా ఉంది. రాజకీయనేతల గురించి పెద్దగా చెప్పడానికి ఏమీ ఉండదు. కానీ మెలోనీ అలాంటి నాయకురాలు కాదు. మెలోనీ ఎంతో నిజాయతీతో, నమ్మదగిన, విశ్వసనీయమైన నాయకురాలు''అని పొగడ్తల జల్లు కురిపించారు. దీంతో మెలోనీ సైతం ఎంతో మురిసిపోయారు. మస్క్ పొగుడుతున్న వీడియోను మెలోనీ తన 'ఎక్స్'ఖాతాలో షేర్ చూస్తూ 'థాంక్యూ మస్క్' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. అయితే ''డేటింగ్ లాంటిది ఏమీ లేదు. ఆ కార్యక్రమానికి నేను మా అమ్మతో కలిసి వెళ్లాను. రొమాంటిక్ బంధమేమీ లేదు''అని ఆ తర్వాత మస్క్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో వివరణ ఇచ్చారు.

మెడల్ తిరిగిచ్చెయ్.. కావాలంటే నేను పోయాక ఇస్తా

ఒలింపిక్ పతకాన్ని దోచేసిన దొంగకు అథ్లెట్ వెరైటీ ఆఫర్

ఒలింపిక్ పతకం సాధించిన క్రీడాకారులకు అదంటే ఎంతో ప్రత్యేకం. ఘన విజయం తాలూకు జ్ఞాపకాలకు ప్రత్యక్ష సాక్ష్యంగా కలకాలం కళ్లముందే ఉంటుంది. అలాంటి ప్రతిష్టాత్మక, ప్రీతిపాత్రమైన గోల్డ్ మెడల్ కనిపించకుండా పోతే ఏ క్రీడాకారులకైనా మనసు అల్లాడిపోతుంది. నిద్ర కూడా పట్టదు. అదెక్కడ ఉందా అని ఇల్లంతా వెతుకుతారు. హంగేరీకి చెందిన ఫెన్సింగ్ క్రీడాకారుడు లాజ్లో కాంగ్రేడీ ప్రస్తుతం ఇదే వేదనను అనుభవిస్తున్నారు. 1988 దక్షిణకొరియాలోని సియోల్ నగరంలో సమ్మర్ ఒలింపిక్స్ జరిగాయి. ఆనాడు ఫెన్సింగ్ క్రీడలో లాజ్లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. అది ఈనెల పదో తేదీన చోరీకి గురైంది. లాజ్లో నిద్రిస్తుండగా ఇంట్లో చొరబడి ఒక దొంగ దానిని దోచుకెళ్లాడు. 65 ఏళ్ల వయసులో నాకెందుకీ కష్టాలు అంటూ లాజ్లో వాపోయాడు.



''రెండు వారాలుగా స్థిమితంగా ఉండలేకపోతున్నా. గెలుపు జ్ఞాపకాలన్నీ దానితోనే ఉన్నాయి. దొంగకు ఎందుకూ పనికిరాని ఆ వస్తువుతో ఏం చేసుకుంటాడు?. అతనికి అడిగినంత డబ్బిస్తా. తిరిగి ఇచ్చేయనండి. అతడిపై ఎలాంటి కేసు పెట్టను. భద్రంగా తీసుకొచ్చి పోస్ట్‌బాక్స్ డబ్బాలో వేస్తే తీసుకుంటా. కావాలంటే నా మరణానంతరం వీలునామాలో ఆ పతకం మళ్లీ ఆ దొంగకే చెందేలా విల్లు రాస్తా''అని గొప్ప ఆఫర్ ప్రకటించారు. ''హాల్‌లో దానిని కప్‌బోర్డ్ పక్కనే పెట్టా. దొంగ వచ్చాడన్న అనుమానంతో గట్టిగా అరిచా. నేను గది నుంచి బయటకు వచ్చేలోపు అతను పోతూ పోతూ ఈ ఒక్క దానినే తీసుకెళ్లాడు. ఇక్కడున్న ఏ ఇతర విలువైన వస్తువులను పట్టుకుపోలేదు. దానికి మాత్రమే తీసుకెళ్లడానిక ఇంకేదో కారణం ఉందేమో. ఎన్నో వస్తువులపై అతడు తడిమిచూశాడు. అన్నింటిపై అతడి వేలిముద్రలున్నాయి''అని వివరించారు. ''నేను నీకు ఎలాంటి హానీ తలపెట్టను. దానిని నాకు తిరిగి ఇచ్చేయడానికి ఏమైనా షరతులు పెడితే పెట్టుకో. నీతో చర్చలు జరపడానికి కూడా నేను సిద్ధమే'అని **దొంగతో మంతనాలకు ఈయన సిద్ధమైపోయారు. కానీ ఆ దొంగ ఎక్కడున్నాడో, ఇప్పుడు ఆ పతకం అతని దగ్గర ఉందో, ఎవరికైనా అమ్మేశాడో ఎవరికీ తెలీదు.**

– బుడాపెస్ట్

హెజ్బొల్లా తీవ్రవాదులే లక్ష్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ తాజా దాడుల్లో ఏకంగా ఆరు వందల మంది దాకా మరణించారు. ఆ దేశంపై ఇజ్రాయెల్ ఇంతటి తీవ్ర దాడులకు దిగడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. అయితే హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య కొత్తేమీ కాదు. ఇది నాలుగు దశాబ్దాల రక్తచరిత్ర...

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్ వర్సెస్ హెజ్‌బొల్లా

రక్తచరిత్ర

1982: ఇజ్రాయిల్ ఆక్రమణ -హెజ్‌బొల్లా పుట్టుక

హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్ సంఘర్షణకు 1982లో బీజం పడింది. పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్ఓ) దాడులకు ప్రతిస్పందనగా లెబనాన్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించింది. బీరుట్ నడిబొడ్డులో పీఎల్‌ఓను ముట్టడించింది. ఈ మారణకాండలో 2,000 మంది పాలస్తీనా శరణార్థులు, 3,500 మంది లెబనాన్ పౌరులు మరణించారు. దీనికి ప్రతిస్పందనగా పుట్టుకొచ్చిందే హెజ్బొల్లా. ఇరాన్ మద్దతుతో షియా ముస్లిం నేతలు దీన్ని ఏర్పాటు చేశారు. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలు, బెకా లోయలో అసంతృప్త యువతను భారీగా చేర్చుకుంటూ చూస్తుండగానే శక్తివంతమైన మిలీషియాగా ఎదిగింది.

1983-1985: రక్తపాతం-ప్రతిఘటన

హెజ్‌బొల్లా, దాని గ్రూపులు లెబనాన్‌లోని విదేశీ దళాలపై 1982–1986 మధ్య పలు దాడులు చేశాయి. 1983లో బీరుట్‌లోని ఫ్రెంచ్, అమెరికా సైనిక శిబిరాలపై బాంబు దాడిలో 300 మందికి పైగా శాంతి పరిరక్షకులు మరణించారు. ఇది తమ పనేనని ఇస్లామిక్ జిహాద్ గ్రూప్ ప్రకటించినా, దాడి వెనుక హెజ్‌బొల్లా హస్తముందని ప్రచారం జరిగింది. 1985 నాటికి దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనుదిరిగేంతగా హెజ్బొల్లా బలపడింది.

1992-1996: రాజకీయ ఎదుగుదల

1992లో లెబనాన్ అంతర్యుద్ధం అనంతరం హెజ్‌బొల్లా రాజకీయ శక్తిగా ఎదిగింది. 128 మంది సభ్యులున్న పార్లమెంటులో 8 సీట్లు గెలుచుకుంది. షియా ప్రాబల్య ప్రాంతాల్లో సామాజిక సేవలతో రాజకీయంగా, సైనికంగా ప్రభావం పెంచుకుంది. ఇజ్రాయెల్ దళాలపై ప్రతిఘటననూ కొనసాగించింది. ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడులకు దిగింది. ప్రతీకారంగా ఇజ్రాయెల్ చేపట్టిన 'ఆపరేషన్ అకౌంటబిలిటీ'లో 118 మంది లెబనాన్ పౌరులు మరణించారు. 1996లో హెజ్‌బొల్లాపై ఇజ్రాయిల్ ప్రారంభించిన 'ఆపరేషన్ గ్రేప్స్ ఆఫ్ రాత్'తో హింస పరాకాష్టకు చేరింది.

2000-2006: ఇజ్రాయెల్ వెనుకంజ- జులై యుద్ధం

రెండు దశాబ్దాల ఆక్రమణ తరువాత 2000 మేలో దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ ఏకపక్షంగా వైదొలిగింది. హెజ్‌బొల్లా ప్రతిఘటనే దీనికి కారణమంటారు. ఈ విజయం ఆ సంస్థను లెబనాన్‌లో ప్రబల రాజకీయ శక్తిగా, ఇజ్రాయెల్‌పై అరబ్ ప్రతిఘటనకు కేంద్రంగా మార్చింది. 2006లో ఇద్దరు ఇజ్రాయెల్ సైనికులను హెజ్‌బొల్లా బంధించడంతో తీవ్ర ఉద్రిక్తతలకు, చివరికి యుద్ధానికి దారితీసింది. 34 రోజుల పాటు సాగిన ఈ 'జూలై'ఘర్షణలో 1,200 మంది లెబనాన్ పౌరులు, 158 మంది ఇజ్రాయెలీలు మరణించారు.

2009-2024: ప్రాంతీయ సంఘర్షణ

2009 నాటికి హెజ్బొల్లా లెబనాన్‌లో పూర్తిస్థాయి సైనిక, రాజకీయ శక్తిగా మారింది. సిరియా అంతర్యుద్ధం సందర్భంగా ఇది కొట్టొచ్చినట్టు కన్పించింది. 2012లో అసద్ ప్రభుత్వం తరఫున హెజ్‌బొల్లా జోక్యం చేసుకోవడంతో అరబ్బుల మద్దతును కోల్పోవాల్సి వచ్చింది. కానీ అనంతరం ఇరాన్ మద్దతు హెజ్‌బొల్లాకు కొత్త శక్తినిచ్చింది. 2023లో గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆ దేశంతో మరోసారి హెజ్‌బొల్లా ప్రత్యక్ష ఘర్షణకు కారణమయ్యాయి. దాంతో ఉద్రిక్తతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి.



బుధవారం దక్షిణ లెబనాన్‌లోని సుజూద్ గ్రామంపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల దృశ్యం

హారిస్‌కు బైడెన్‌ను మించిన సమస్యలున్నాయ్

- మానసిక స్థితిపై ట్రంప్ ఆరోపణలు

వాషింగ్టన్: వృద్ధాప్యం, మతిమరుపు, తడబాటు సమస్యలతో సతమతమవుతూ అధ్యక్ష రేసు నుంచి తప్పుకున్న జో బైడెన్‌తో కమలా హారిస్‌ను పోలుస్తూ రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆరోపణలు గుప్పించారు. జార్జియా రాష్ట్రంలో బుధవారం జరిగిన రిపబ్లికన్ పార్టీ ప్రచార సభలో కార్యకర్తలనుద్దేశించి ట్రంప్ మాట్లాడారు. ''ఉపాధ్యక్షురాలు హారిస్‌ను చూసి ప్రపంచమే నవ్వుతోంది. ఎందుకో తెలుసా?. ఆమె అధ్యక్షురాలు కాబోయే ఛాన్సుందని తెల్సి నమ్మశక్యంకాక నవ్వుతున్నారు. ఇక ఆలోచనా శక్తి గురించి మాట్లాడితే ఈమెకు బైడెన్‌ను మించిన సమస్యలున్నాయి. అధిక ధరలు, గందరగోళ పాలనకు మనం తెరదించబోతున్నాం. కమల, అసమర్థ బైడెన్ కారణంగానే ఈ దుస్థితి దాపురించింది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాల కారణంగా మనకు ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం''అని అన్నారు.

సొంత డబ్బా కొట్టుకున్న ట్రంప్

హంగేరి ప్రధాని విక్టర్ అర్బాన్ గురించి ట్రంప్ మాట్లాడుతూ పనిలోపనిగా ట్రంప్ సొంత గొప్పలు చెప్పుకున్నారు. ''విక్టర్ సమర్థవంతమైన నేత. విదేశీయులు ఎవరినీ తన దేశంలోకి రానివ్వడు. ప్రపంచంలో ఎందుకు ఇన్ని సమస్యలు?. మధ్యప్రాచ్యంలో యుద్ధాలెందు జరుగుతున్నాయి. మూడో ప్రపంచయుద్ధం దిశగా రష్యా ఎందుకు పయనిస్తోందని విక్టర్‌ను అంతా అడిగితే ఆయన ఒక్కటే సులువైన పరిష్కారం చెప్పారు. ట్రంప్ దేశాధ్యక్ష పీఠంపై లేకపోవడం వల్లే. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నపుడు అంతా అతడిని చూసి భయపడ్డారు. చైనా, రష్యా.. అందరికీ భయమే. నేను అధికారంలో ఉన్నప్పుడు ఉక్రెయిన్‌లోకి రష్యా అడుగుపెట్టలేకపోయింది. నేను దిగిపోగానే ఉక్రెయిన్ గడ్డపై రష్యా దురాక్రమణ జెండా ఎగరేసింది. ఇక హారిస్ నాలుగేళ్లు అధ్యక్ష పీఠంపై కూర్చుంటే అమెరికాలో పరిశ్రమలు లేకుండా చేస్తుంది. దేశాన్ని నాశనం చేస్తుంది. అప్పుడు మన ప్రజాస్వామ్యం మనుగడలో ఉండదు. మన పని అయిపోతుంది. డెమొక్రాట్ల విధాన నిర్ణయాలు చాలా దారుణంగా ఉంటాయి''అని ఆరోపించారు.

ఇరాన్ నుంచి హత్యాయత్నం ముప్పు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ నుంచి ప్రాణహాని పొంచి ఉందని అమెరికా నిఘా వర్గాలు వెల్లడించాయి. నిఘా వర్గాలు ఈ మేరకు తమకు సమాచారం అందించాయని ట్రంప్ ప్రచార బృందం తాజాగా ప్రకటించింది. వివరాలను ట్రంప్ ప్రచార విభాగ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చియంగ్ వెల్లడించారు. ''అమెరికాలో అస్థిరత, గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా మిమ్మల్ని హత్య చేయడానికి ఇరాన్ కుట్ర పన్నుతోందని మంగళవారం ఉదయం భేటీ సందర్భంగా ట్రంప్‌కు జాతీయ నిఘా విభాగ డైరెక్టర్ వివరించారు.



సవన్నాలో సభా వేదికపై డ్యాన్స్ చేస్తున్న ట్రంప్

నిరంతరం సమన్వయంతో హత్య కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే ట్రంప్‌ను కాపాడేందుకు అన్ని నిఘా, భద్రతా సంస్థలు పనిచేస్తున్నాయి. ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా స్వేచ్ఛగా దేశంలో ఎన్నికలు జరిపేందుకు సంస్థలు కృషిచేస్తున్నాయి''అని స్టీవెన్ అన్నారు. జూలై 13న పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బట్లర్ పట్టణంలో సభలో ఒక ఆగంతకుడు ట్రంప్‌పైకి బుల్లెట్ల వర్షం కురిపించగా ఒక బుల్లెట్ ట్రంప్ కుడి చెవి సమీపంగా దూసుకుపోవడం, వెనక కూర్చున్న ఒక వ్యక్తి మరణించడం తెల్సిందే. వెస్ట్ పామ్‌బీచ్ క్లబ్‌లో గోల్ఫ్ ఆడుతున్న ట్రంప్‌ను చంపేందుకు రౌత్ అనే వ్యక్తి ప్రయత్నించడం తెల్సిందే.

హారిస్ ప్రచార కార్యాలయంపై కాల్పులు

వాషింగ్టన్: డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ ప్రచార కార్యాలయంపై దాడి జరిగింది. అరిజోనాలో ఫీనిక్స్ శివార్లలో ఉన్న కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు పెల్లెట్ గన్‌తో కిటికీలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన జరిగింది. దాంతో కార్యాలయ తలుపుకు, కిటికీలకు రంధ్రాలు పడ్డాయి. ''ఆ సమయంలో కార్యాలయంలో ఎవరూ లేరు. దాంతో ఎవరికీ ఏ హానీ జరగలేదు''అని పోలీసు లు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యాలయంపై ఈ నెలలోనే ఇది రెండో దాడి. సెప్టెంబర్ 16న కూడా ఇలాగే పెలెట్ గన్‌తో కాల్పులు జరిగాయి. దాంతో ప్రచార కార్యాలయంతో పాటు పరిసర ప్రాంతాలకు భద్రత పెంచారు. హారిస్ శుక్రవారం అరిజోనాలో మెక్సికో సరిహద్దును సందర్శించనున్న నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. ఈ ముప్పును తీవ్రంగా పరిగణిస్తున్నట్టు అరిజోనా డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు యోలాండా బెజరానో చెప్పారు. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై ఇప్పటికే రెండుసార్లు హత్యాయత్నం జరగడం తెలిసిందే.

స్వలింగ వివాహాలకు థాయ్‌లాండ్ చట్టబద్ధత

బ్యాంకాక్: స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేయాలని థాయ్‌లాండ్ నిర్ణయించింది. ఇందుకు వీలు కల్పించే చరిత్రాత్మక వివాహ సమానత్వ బిల్లుపై థాయ్‌లాండ్ రాజు మహా వజ్రలాంగ్‌కర్ణ్ తాజాగా సంతకం చేశారు. దీంతో ఆగ్నేయాసియాలో స్వలింగ సంబంధాలకు అధికారిక గుర్తింపు ఇచ్చిన తొలి దేశంగా థాయ్‌లాండ్ నిలిచింది. 2025 జనవరి 22 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. దీని ప్రకారం వివాహ చట్టంలో భార్య, భర్త వంటి పదాలకు బదులుగా ఇకపై వ్యక్తి, స్త్రీ, పురుషుడు అనే పదాలు వాడతారు. స్వలింగ జంటకు దత్తత, వారసత్వంతో పాటు పూర్తిస్థాయి ఆర్థిక, వైద్య, చట్టపరమైన హక్కులు లభిస్తాయి. ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే స్వలింగ సంపర్కు(ఎల్జీబీటీక్యూ)లకు థాయ్‌లాండ్‌లో మొదటినుంచీ స్వేచ్ఛ ఎక్కువే. అయితే పూర్తిస్థాయి హక్కుల కోసం వాళ్లు 20 ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత బిల్లు జూన్‌లో సెనేట్ ఆమోదం పొందింది. రాజు ఆమోదంతో మంగళవారం చట్టరూపు దాల్చింది. ఇది చరిత్రాత్మకమంటూ ఎల్జీబీటీక్యూ ఉద్యమకారులు ప్రశంసించారు. ''చరిత్రలో చెరిగిపోని ఒక పేజీని లిఖించుకున్నాం. సమానత్వానికి, మానవ గౌరవానికి దక్కిన విజయమిది''అని ఎల్జీబీటిక్యూ హక్కుల కోసం దీర్ఘకాలంగా పని చేస్తున్న చుమాపోన్ అన్నారు. చట్టం అమల్లోకి రానున్న జనవరి 22న 1,000కి పైగా ఎల్జీబీటీక్యూ జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించే యోచన ఉన్నట్టు ఆమె తెలిపారు.

ఆసియాలో మూడో దేశం

తైవాన్, నేపాల్ తర్వాత ఆసియాలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించిన మూడో దేశంగా థాయ్‌లాండ్ నిలిచింది. తైవాన్ 2019లో తొలిసారి ఈ చర్య తీసుకుంది. అనంతరం నేపాల్ సుప్రీంకోర్టు కూడా ఎల్జీబీటీక్యూ బంధాల చట్టబద్ధతకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

ఆర్‌ఎస్‌ఎస్ ఎలుకలు జార్ఖండ్‌పై దండెత్తాయి

- సీఎం హేమంత్ సోరెన్

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను ఎలుకలతో పోల్చారు. బోగ్నాదిహ్‌లో బుధవారం ఒక ర్యాలీని ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగిస్తూ..రాష్ట్రంలో హిందువులు, ముస్లింల మధ్య బీజేపీ విభేదాలను సృష్టిస్తోందని హేమంత్ అన్నారు. 'జార్ఖండ్‌పై ఆర్‌ఎస్‌ఎస్ ఎలుకల్లా దండెత్తి నాశనం చేస్తోంది. మీ గ్రామాల్లోకి అలాంటి శక్తులు వస్తే వెంటపడి తరమండి'అని ప్రజలను కోరారు. బీజేపీని ప్రారిశ్రామికవేత్తలు, వ్యాపారుల పార్టీగా అభివర్ణించారు.

'ఎంబీఏ టాప్ 100' లో మన సంస్థలు

న్యూఢిల్లీ: ఈ ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ఎంబీఏ కోర్సులను అందిస్తున్న తొలి 100 విద్యాసంస్థలకు సంబంధించిన క్వాక్వారెల్లీ సైమండ్స్(క్యూఎస్) విడుదలచేసిన జాబితాలో మూడు భారతీయ విద్యాసంస్థలకు చోటు దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) బెంగళూరు, ఐఐఎం అహ్మదాబాద్, ఐఐఎం కలకత్తా, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్,హైదరాబాద్ ఈ జాబితాలో స్థానం సంపాదించాయి. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అగ్రస్థానంలో నిలిచింది.

గుజరాత్‌లో తప్పిన రైలు ప్రమాదం

గాంధీనగర్: గుజరాత్‌లోని బోతాడ్ జిల్లాలో రైలు ప్రమాదం సృష్టించేందుకు దుండగులు ప్రయత్నించారు. అదృష్టవశాత్తూ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. రణ్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో కుండ్లీ రైల్వేస్టేషన్‌కు కిలోమీటర్ల దూరంలో రైల్వే ట్రాక్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు 4 అడుగుల పొడవైన ఇనుప రాడ్డును నిలువుగా అమర్చారు. బుధవారం తెల్లవారుజామున ఓఖా-భావ్‌నగర్ ప్యాసింజర్ ట్రైన్(19210) ఈ రాడ్డును ఢీకొట్టింది. కొన్ని గంటలపాటు రైలు నిలిచిపోయింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఉదయం 7.30 గంటలకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు ప్రారంభించారు.



సోపోర్ జిల్లాలో ప్రచార సభలో మాట్లాడుతున్న రాహుల్

రాష్ట్ర హోదా జమ్మూకశ్మీర్ ప్రజల హక్కు

ఎన్నికలయ్యాక రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి: రాహుల్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం ఇక్కడి ప్రజల హక్కు అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. జమ్మూ సిటీలో, సోపోర్‌లో బహిరంగ సభల్లో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న జమ్మూకశ్మీర్‌ను 2019లో రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టారని, దీనివల్ల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర హోదాను రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడం దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ జరగలేదని చెప్పారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) తీరుపై రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. స్థానికులను పక్కనపెట్టి, బయటినుంచి వచ్చినవారికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. స్థానికుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు. ఎల్జీ ఇక్కడున్నంత కాలం స్థానికులకు న్యాయం జరగదని, బయటి వ్యక్తులే పెత్తనం చెలాయిస్తారని తేల్చిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో స్థానికేతరులకు అధికారం కట్టబెట్టడానికి రాష్ట్ర హోదా రద్దు చేశారని విమర్శించారు.

భారతదేశం.. రాష్ట్రాల యూనియన్

భారత భూభాగం – భారత యూనియన్

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

రాష్ట్రాల ఏర్పాటు-పునర్ వ్యవస్థీకరణ

భారత దేశంలో సమాఖ్య వ్యవస్థ ఉంది. కేంద్ర, రాష్ట్రాలు రాజ్యాంగ పరంగా అధికార విభజన సూత్రం ఆధారంగా పనిచేస్తాయి. సమాఖ్య, రాష్ట్రాల ఏర్పాటు, పునర్ వ్యవస్థీకరణ తదితర అంశాలను ఒకటో భాగంలో ప్రకరణలు 1 నుంచి 4 వరకు ప్రస్తావించారు.

భారత భూభాగం

ప్రకరణ-1

ఈ ప్రకరణ ప్రకారం, భారత భూభాగం అంటే రాష్ట్రాల సరిహద్దులు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం సముపార్జించిన ఇతర భూభాగాలు ఉంటాయి.

భారత భూభాగం అనే భావన విస్తృతమైంది. భారత సార్వభౌమాధికారం ఏ విధంగా విస్తరించి ఉంటుందో తెలుపుతుంది. భారత సార్వభౌమాధికారం భౌగోళిక ప్రాంతాలకే పరిమితం కాదు. భారత సముద్ర ప్రాదేశిక జలాలు 12 నాటికల్ మైళ్ల వరకు, విశిష్ట ఆర్థిక మండళ్లు 200 నాటికల్ మైళ్ల వరకు, అలాగే భారత అంతరిక్ష సరిహద్దులకూ సార్వభౌమాధికారం వర్తిస్తుంది.

భారత యూనియన్

ఇందులో రాష్ట్రాలు మాత్రమే ఉంటాయి. రాష్ట్రాలు సమాఖ్యలో అంతర్భాగంగా ఉంటూ నిర్ణీత అధికారాలను కలిగి ఉంటాయి. ఈ పదం కేంద్ర రాష్ట్ర సంబంధాలను సూచిస్తుంది.

రాష్ట్రాల సమ్మేళనం

భారత రాజ్యాంగం, ఒకటో ప్రకరణలో భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. సమాఖ్య అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. కెనడా సమాఖ్యను స్ఫూర్తిగా తీసుకుని యూనియన్ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చారు.

భారత సమాఖ్య అమెరికాలా రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడలేదు. అలాగే కెనడా మాదిరిగా ఏకకేంద్ర రాజ్యం సమాఖ్యగా విభజితమవలేదు. భారత సమాఖ్య ఒక ప్రత్యేక పద్ధతిలో ఏర్పడింది.

కేంద్ర రాష్ట్రాల మధ్య ఒప్పందం లేదు. కాబట్టి యూనియన్ నుంచి రాష్ట్రాలు విడిపోలేదు. అమెరికా సమాఖ్యలో ప్రారంభంలో రాష్ట్రాలకు కేంద్రం నుంచి విడిపోయే హక్కు ఉండేది. అయితే ఆ హక్కును తర్వాత రద్దు చేశారు.

కాబట్టి భారత సమాఖ్యను విచ్ఛిన్నం కాగల రాష్ట్రాల, అవిచ్ఛిన్న యూనియన్ (ఇన్ డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ డెస్ట్రక్టిబుల్ స్టేట్స్)గా పేర్కొంటారు. అమెరికాను ఇన్‌డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ ఇన్‌డెస్ట్రక్టిబుల్ స్టేట్స్‌గా పేర్కొంటారు.

ప్రకరణ-2

ఈ ప్రకరణ ప్రకారం పార్లమెంటు ఒక చట్టం ద్వారా కొత్త ప్రాంతాలను చేర్చుకోవచ్చు. ఇతర దేశాలకు బదిలీ చేయవచ్చు. ఈ అధికారం భారత భూభాగంలో లేని అంశాలకు వర్తిస్తుంది. ఈ అధికారం పార్లమెంటుకు సంబంధించినదైనా అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి ఉంటుంది.

వివరణ..

విదేశీ భూభాగాలను భారతదేశంలో చేర్చుకున్నప్పుడు పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలి.

ఉదాహరణ: 1961లో గోవాను భారత్‌లో కలిపినప్పుడు 12వ రాజ్యాంగ సవరణ చేశారు. అలాగే పాండిచ్చేరికి సంబంధించి 1962లో 14వ రాజ్యాంగ సవరణ చేశారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను భారత రాష్ట్రంగా చేర్చుకున్నారు.

ప్రకరణ-3

ఇందులో కింది అంశాలు ఉన్నాయి.

- కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం.
- రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలను కలిపి నూతన రాష్ట్రం ఏర్పాటు.(ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ కలయికతో 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు). అలాగే రాష్ట్రాన్ని విడగొట్టి కొత్త రాష్ట్రం ఏర్పాటు చేయడం. (2014 జూన్‌లో ఏర్పడిన తెలంగాణ)
- రాష్ట్ర విస్తీర్ణాన్ని పెంచవచ్చు.
- రాష్ట్ర విస్తీర్ణాన్ని తగ్గించవచ్చు.
- రాష్ట్ర సరిహద్దులను సవరించవచ్చు.
- రాష్ట్రాల పేర్లను మార్చవచ్చు.

రాష్ట్రాల ఏర్పాటు - ప్రక్రియ- పద్ధతి

ప్రకరణ 3లో పేర్కొన్న అన్ని అంశాలకు ఒకే ప్రక్రియ ఉంటుంది.

- పై అంశాలకు సంబంధించిన బిల్లును పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

వివరణ..

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లులో ఆర్థిక వనరుల పంపకాలు ఉంటే అది స్పెషల్ కేటగిరీ బిల్లు అవుతుంది. అలాంటి సందర్భాల్లో బిల్లును లోక్‌సభలోనే ప్రతిపాదించాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఈ వివాదాన్ని గమనించవచ్చు.

- పై బిల్లులను రాష్ట్రపతి పూర్వ అనుమతితోనే ప్రవేశపెట్టాలి.
- ఈ షరతును 1955లో అయిదో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
- సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే ప్రభావితమవుతున్న రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని రాష్ట్రపతి కోరతారు.
- సంబంధిత రాష్ట్ర శాసనసభ రాష్ట్రపతి సూచించిన నిర్ణీత సమయంలోనే తమ అభిప్రాయాన్ని తెలపాలి.
- రాష్ట్ర శాసనసభలు వ్యక్తీకరించిన అభిప్రాయాలను పార్లమెంటు పరిగణలోకి తీసుకోవచ్చు లేదా తీసుకోకపోవచ్చు.

వివరణ..

1966లో పంజాబ్ నుంచి హర్యానా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పుడు పంజాబ్‌లో రాష్ట్రపతి పాలన, విధానసభ సుప్తచేతనావస్థలో ఉండటం వల్ల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి నివేదించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును శాసనసభ తిరస్కరించింది.

- పార్లమెంటు ఉభయసభలు సంబంధిత బిల్లును సాధారణ మెజారిటీతో వేర్వేరుగా ఆమోదించాలి. ఉభయసభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే, సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. బిల్లు వీగిపోతుంది.
- బిల్లును రాష్ట్రపతి తప్పని సరిగా ఆమోదించాలి. పునఃపరిశీలనకు అవకాశం లేదు.
- రాష్ట్రపతి ఆమోదం తెలిపితే బిల్లు చట్టంగా మారుతుంది. దీంతో ప్రక్రియ పూర్తి అవుతుంది.
- కొత్త రాష్ట్రం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనేది కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. దీన్ని అపాయింటెడ్ డేట్ అంటారు.

ప్రకరణ-4

ఈ ప్రకరణ సంబంధిత తదుపరి పరిణామాలను వివరిస్తుంది. ప్రకరణ 2, 3 ప్రకారం ఏదైనా సవరణ చేసినప్పుడు 1, 4 షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలను కూడా తదనుగుణంగా మార్చాలి. దీనికోసం పార్లమెంటు ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం లేదు. ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా, తదనుగుణంగా 1, 4 షెడ్యూల్‌లోని అంశాలు కూడా మార్పునకు గురవుతాయి.

వివరణ

ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా దాన్ని రాజ్యాంగ సవరణగా పరిగణించరు. ఈ అంశాన్ని ప్రకరణ 4(2)లో స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్రాల ఏర్పాటు, పునర్‌వ్యవస్థీకరణ, ఇతర అంశాలకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి కాదు.



ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి	- టంగుటూరి ప్రకాశం
మొదటి ఉప ముఖ్యమంత్రి	- నీలం సంజీవరెడ్డి
ఆంధ్రరాష్ట్ర మొదటి గవర్నర్	- సి.ఎం.త్రివేది
హైకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి	- జస్టిస్ కోకా సుబ్బారావు
ఆంధ్ర రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి	- బెజవాడ గోపాలరెడ్డి

వివాదాలు- సుప్రీంకోర్టు తీర్పులు

బెరుబారి యూనియన్ వివాదం-1960

ప్రకరణ 3 ప్రకారం, రాష్ట్రాల సరిహద్దును కుదించే అధికారం పార్లమెంటుకు ఉంది. అయితే ఒక రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేసే అధికారం ఉందా? అనే వివాదం తలెత్తింది. దీనికి సంబంధించి రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరారు. ఈ వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేయాలంటే ప్రకరణ 368 ప్రకారం పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలని పేర్కొంది. అయితే, అంతర్గతంగా బదిలీ చేసేందుకు సాధారణ మెజారిటీ సరిపోతుంది.

గమనిక: బెరుబారి అనేది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఒక ప్రాంతం. 9 చదరపు మైళ్ల విస్తీర్ణంతో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా పాకిస్తాన్‌కు కొంత భాగాన్ని బదిలీ చేసింది.

బాబూలాల్ మారాండి వర్సెస్ ముంబై స్టేట్ కేస్ (1960)

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును ఒక్క పర్యాయం మాత్రమే సంబంధిత రాష్ట్ర శాసనసభల అభిప్రాయానికి నివేదిస్తారు. ఒక వేళ ఆ బిల్లులో తర్వాత చేసిన మార్పులకు సంబంధించి మరోసారి రాష్ట్ర పరిశీలనకు పంపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. **ఉదాహరణ:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లాలోని పోలవరం కింది 7 ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించడం.

స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1982)

భారత రాజ్యాంగం నిర్ణీతమైన సమాఖ్య వ్యవస్థను ఏర్పరచలేదు. నిర్మాణపరంగా సమాఖ్య అయినప్పటికీ ఇది సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాల మిశ్రమంగా పేర్కొంది.

ముల్ల పెరియార్ పర్యావరణ వివాదం (2006)

నదీజలాల పంపిణీ విషయంపై చట్టాలను చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు ఉండదు. ఈ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి రెండు రకాల రాజకీయ భాగాలు ఉండేవి.

1. నేరుగా బ్రిటిష్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న భాగాలు.
2. బ్రిటిష్ సార్వభౌమాధికారం కింద పనిచేసే సంస్థానాలు (స్వదేశీ సంస్థానాలు).

ఆనాడు దేశంలో 552 స్వదేశీ సంస్థానాలు ఉండేవి. బ్రిటిషువారు ప్రకటించిన విలీన ఒప్పందం ప్రకారం 549 స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనం అయ్యాయి కానీ హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాలు విలీనాన్ని వ్యతిరేకించాయి. కశ్మీర్ భారత్‌లో విలీన ఒప్పందం ద్వారా అంతర్భాగం అయింది. ప్రజాభిప్రాయం ద్వారా జునాగఢ్ భారత్‌లో కలిసిపోయింది. ప్రజాభిప్రాయం ద్వారా కలిసిన మొదటి, చివరి సంస్థానం ఇదే. హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో అనే పోలీసు చర్య (సైనిక చర్య) ద్వారా విలీనం చేశారు.

1950 నాటికి రాజ్యాంగం ప్రకారం నాలుగు రకాల రాష్ట్రాలు అమలులో ఉండేవి. వీటిని పార్ట్-ఎ, బి, సి, డిగా వర్గీకరించారు. పార్ట్-ఎలో బ్రిటిష్ పాలిత గవర్నర్ ప్రావిన్స్‌లు 9 ఉండేవి. పార్ట్-బిలో శాసనసభ కలిగిన స్వదేశీ సంస్థానాలు 9, పార్ట్-సిలో చీఫ్ కమిషనర్ ప్రాంతాలు 10, పార్ట్-డిలో అండమాన్ నికోబార్ దీవులు ఉండేవి.

నేపథ్యం..

భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ఉండేది. ఈ డిమాండు మొట్టమొదటి సారి తెరపైకి తెచ్చింది తెలుగువారే.

గమనిక: స్వాతంత్ర్యం రాక ముందు భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొదటి రాష్ట్రం ఒడిశా.

- 1913లో బాపట్లలో జరిగిన ఆంధ్రమహాసభ ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు డిమాండ్ చేసింది.
- 1927లో కాంగ్రెస్ సమావేశం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థిస్తూ తీర్మానం చేసింది.
- 1931లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీ హాజరైన సందర్భంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండుపై చర్చించాలని భోగరాజు పట్టాభి సీతారామయ్య ప్రతిపాదించారు.

1937లో రాయలసీమ, ఆంధ్ర నాయకుల మధ్య కాశీనాథుని నాగేశ్వరరావు నివాసంలో ఒక ఒప్పందం కుదిరింది. కాశీనాథుని నివాసం పేరు శ్రీభాగ్ కాబట్టి దీన్ని శ్రీభాగ్ ఒప్పందం అంటారు. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సందర్భంలో మద్రాసు, ఆంధ్ర నాయకుల మధ్య తలెత్తిన వివాదాలు ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు బలమైన కారణాలుగా చెప్పొచ్చు.

థార్ కమిషన్ -1948

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై పరిశీలనకు రాజ్యాంగ పరిషత్తు 1948లో ఉత్తరప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.కె.థార్ నాయకత్వంలో ఇద్దరు సభ్యులతో (పన్నాలాల్, జగత్ నారాయణ్‌లాల్) ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ కేవలం భాషా ప్రాతిపదిక పైన రాష్ట్రాలు ఏర్పాటు చేయడాన్ని తిరస్కరించింది. పరిపాలనా సౌలభ్య ప్రాతిపదికపైనే రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

జె.వి.పి. కమిటీ

థార్ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళనను విరమింపజేయడానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1948 డిసెంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ కూడా దేశం మొత్తం మీద రాష్ట్రాల పునర్‌నిర్మాణాన్ని వాయిదా వేయాలని, ఆంధ్ర రాష్ట్రాన్ని మాత్రం దానికి మినహాయింపుగా భావించాలని నివేదించింది.

1952 ఆగస్టు 15 నుంచి 35 రోజుల పాటు గొల్లపూడి సీతారామయ్య శాస్త్రి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 35 రోజుల తర్వాత ఆచార్య వినోబా భావే అతడి నిరాహారదీక్షను విరమింపజేశారు.

1952 అక్టోబర్ 19 నుంచి మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. దీక్ష 50వ రోజుకు చేరుకున్న సందర్భంగా మద్రాసును సందర్శించిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కానీ పొట్టి శ్రీరాములు తన దీక్షను కొనసాగించారు. 58వ రోజున డిసెంబర్ 15న ఆయన అమరుడయ్యారు. పొట్టి శ్రీరాములు మృతితో హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. దీంతో 1952 డిసెంబర్ 19న పార్లమెంటులో నెహ్రూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ప్రకటించారు.

ప్రాజెక్ట్ పద్ధతిలో చివరి సోపానం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ మెథడాలజీ

1. 'ఒక పరిశోధకుడు ప్రజ్ఞ ఎక్కువ ఉన్న వారిలో నైతిక విలువలు ఎక్కువ, ప్రజ్ఞ తక్కువ ఉన్న వారిలో నైతిక విలువలు తక్కువ అని పేర్కొన్నాడు'
   పై పరిశోధనలో ప్రజ్ఞ?
   ఎ) స్వతంత్ర చరాన్ని ప్రభావితం చేసే మధ్యస్థ చరం
   బి) పరతంత్ర చరాన్ని ప్రభావితం చేసే స్వతంత్ర చరం
   సి) మధ్యస్థ చరాన్ని ప్రభావితం చేసే స్వతంత్ర చరం
   డి) పరతంత్ర చరాన్ని ప్రభావితం చేసే మధ్యస్థ చరం
2. బహుముఖ కోణాల్లో ఆలోచించగల శిశువు పియాజే సంజ్ఞానాత్మక వికాస దశల్లో ఏ దశకు చెందుతాడు?
   ఎ) సంవేదన చాలక దశ
   బి) పూర్వ ప్రచాలక దశ
   సి) మూర్త ప్రచాలక దశ
   డి) నియత ప్రచాలక దశ
3. ఒక ఉపాధ్యాయుడు ముందు లేఖనం తర్వాత పఠనం తర్వాత భాషణం ఆ తర్వాత శ్రవణం అనే భాషా సూత్రాలను అనుసరించాడు. ఆ ఉపాధ్యాయుడు అనుసరించని వికాస నియమం?
   ఎ) వికాసం క్రమానుగతమైంది
   బి) వికాసం సాధారణ అంశాల నుంచి నిర్దిష్ట అంశాలకు దారితీస్తుంది
   సి) వికాసం సంచితమైంది
   డి) వికాసం ఏకీకృత మొత్తం
4. రాము బొమ్మలకు స్నానం చేయిస్తాడు. ఆ బొమ్మకు సీసాతో పాలు తాగిస్తాడు. జోలపాడి నిద్రపుచ్చుతాడు. రాము పియాజే సంజ్ఞానాత్మక వికాసంలో ఏ దశలో ఉంటాడు?
   ఎ) జ్ఞానేంద్రియ చాలక దశ
   బి) పూర్వ ప్రచాలక దశ
   సి) మూర్త ప్రచాలక దశ
   డి) అమూర్త ప్రచాలక దశ
5. రాజు ఒక సగటు విద్యార్థి. తాను పాఠశాల్లో బంగారు పతకం సాధించుకున్నట్లు ఊహించుకుంటూ ఉంటాడు. రాజు దశ?
   ఎ) శైవ దశ బి) బాల్య దశ
   సి) కౌమార దశ డి) వయోజన దశ
6. కింది వాటిలో శాబ్ది కేతర సామూహిక పరీక్ష?
   ఎ) బీనేసైమన్ పరీక్ష
   బి) ఆర్మీ అల్ఫా పరీక్ష
   సి) ఆర్మీ బీటా పరీక్ష
   డి) బాలియా నిష్పాదన పరీక్ష
7. కింది వాటిలో అంతర వ్యక్తిగత విభేదాలను సూచించేది?
   ఎ) రాజు శారీరకంగా బలవంతుడు, ఉద్వేగంగా అస్థిరుడు
   బి) రాజు స్నేహితులకంటే వ్యవహారిక దక్షత గలవాడు
   సి) రాజు చదవడం, రాయడం రెండూ ఇష్టపడతాడు
   డి) రాజు గణితం కంటే, సాంఘిక శాస్త్రాన్ని ఇష్టపడతాడు
8. మానసిక ఆరోగ్యం ఉండే ఉపాధ్యా యుడిలో ఉండని లక్షణం?
   ఎ) విషయ యోజనం బి) ఉద్వేగ స్థిరత్వం
   సి) సర్దుబాటు తత్వం
   డి) అనుకూల దృక్పథం
9. ప్రతిభావంతుడికి అనుసరించవలసిన పద్ధతి?
   ఎ) అంతఃపరీక్ష బి) కేస్ స్టడీ
   సి) పరిశీలనా పద్ధతి డి) ప్రయోగ పద్ధతి
10. ఏ రకమైన రక్షక తంత్రంలో వ్యక్తి తన కంట్లో దూలము నుంచి ఎదుటి వ్యక్తి కంట్లో నలుసును ఎత్తి చూపుతాడు?
    ఎ) హేతుకి కారణం బి) విస్థాపనం
    సి) ప్రక్షేపణం డి) ప్రతిగమనం
11. రాజు కంప్యూటర్ కోర్సులో చేరి విజయ వంతంగా పూర్తి చేశాడు. కోర్సు సమయంలో అతని నిష్పాదనలో ఎన్నో మార్పులు జరిగాయి. ఈ నిష్పాదనను గ్రాఫ్ రూపంలో చూపించే అభ్యసన రేఖ?
    ఎ) పుటాకార వక్ర రేఖ
    బి) కుంభాకార వక్ర రేఖ
    సి) లాక్షణిక అభ్యసన రేఖ
    డి) అవరోహణ వక్ర రేఖ
12. థారన్‌డైక్ ప్రాథమిక నియమాల ప్రకారం కింది అంశాల్లో ముఖ్యమైంది?
    ఎ) అవధానం కొనసాగేలా ప్రశ్నలు వేయడం
    బి) అభ్యసన ప్రక్రియలో ప్రోత్సాహకాలు ఇస్తూ ఉండడం
    సి) అభ్యసనాంశంపై మౌఖికంగా ప్రశ్నలు అడగడం
    డి) చదివే అలవాటును పెంపొందించడం
13. వాట్సన్ ప్రయోగంలో ఆల్‌బర్ట్ అనే బాలుడు పునర్బలనం (ఊచశబ్దం) చెందిన ఎలుకకు మాత్రమే స్పందించి తెల్లని కుక్కపిల్లకు, పక్షి ఈకకు ప్రతిస్పందించక పోవడం ఏ నియమం?
    ఎ) ఉద్దీపన సామాన్యీకరణం
    బి) ఉద్దీపన విచక్షణ
    సి) ఉన్నత స్థాయి నిబంధనం
    డి) విలుప్తీకరణం
14. పెన్ అనే పదానికి పెన్స్ అని నేర్చుకున్న విద్యార్థి బుక్ అనే పదానికి బుక్స్ అని రాయడం ఏ రకమైన బదలాయింపు?
    ఎ) అనుకూల బదలాయింపు
    బి) ప్రతికూల బదలాయింపు
    సి) శూన్య బదలాయింపు
    డి) ద్విపార్శ్వ బదలాయింపు
15. రాజు తరగతిలో తెలివైన విద్యార్థి. కానీ రాజుకు స్టేజ్‌ఫియర్ ఎక్కువ ఈ బలహీనతను తగ్గించడానికి ఉపాధ్యా యుడు ఉపయోగించే నియమం?
    ఎ) పునర్బలన నియమం
    బి) ఆయత్న సిద్ధస్వాస్థ్యం
    సి) విరమణ నియమం
    డి) విచక్షణా నియమం
16. బహిర్గత ప్రేరణకు సంబంధించనిది?
    ఎ) గుంజీలు తీయించడం
    బి) పొగడ్త సి) దండన
    డి) అభిరుచి
17. ఆహా నేను కనుగొన్నాను అని అభ్యాసకుడు ఏ సిద్ధాంతం ఆధారంగా అభ్యసిస్తాడు?
    ఎ) యత్నదోష అభ్యసనం
    బి) కార్య సాధక నిబంధనం
    సి) శాస్త్రీయ నిబంధనం
    డి) అంతర్ దృష్టి అభ్యసనం
18. కింది వాటిలో సంకల్పిత అవధానం?
    ఎ) కదిలే సర్కస్ లైట్ చూడడం
    బి) బడిగంట మోగగానే చూడడం
    సి) ఉపాధ్యాయుడు బోధించే పాఠం వినడం
    డి) అలారం మోగిన వెంటనే చూడడం
19. హైస్కూల్ విద్యార్థి క్రికెట్‌లో ప్రతిభ చూపడం, కంప్యూటర్‌లో కూడా ప్రతిభ చూపడం ఏ రకమైన అభ్యసన బదలాయింపు?
    ఎ) శూన్య బదలాయింపు
    బి) అనుకూల బదలాయింపు
    సి) ప్రతికూల బదలాయింపు
    డి) ద్విపార్శ్వ బదలాయింపు
20. ZOK,TUX ఒక?
    ఎ) అర్థసహిత పదాలు
    బి) అర్థరహిత పదాలు
    సి) ద్వంద్వ సంసర్గాలు
    డి) కొండ గుర్తులు
21. కింది వాటిలో లోపం - వైకల్యతకు సంబంధించి సరైన ప్రవచనాన్ని గుర్తించండి?
    ఎ) లోపం కృత్యం చేసేటప్పుడు కనిపిస్తుంది, వైకల్యత కృత్యం చేయడంలో అశక్తత
    బి) లోపం అవయవాలకు సంబంధించి, వైకల్యత కృత్యం చేయడంలో అశక్తత
    సి) లోపం ఉన్న పిల్లలందరూ, వైకల్యత కలిగి ఉంటారు
    డి) వైకల్యత కలిగిన పిల్లలందరిలో తప్పని సరిగా లోపం కలిగి ఉండాలని లేదు
22. కింది వాటిలో అభ్యసన వైకల్యతకు సంబంధించి పఠన వైకల్యానికి సంబంధించినది?
    ఎ) డిస్ గ్రాఫియా బి) డిస్ లెక్సియా
    సి) డిస్ ఫేసియా డి) డిస్ కాల్క్యులియా
23. ఉపాధ్యాయుడు ప్రజాస్వామ్య విలువలను ఏ రకమైన నాయకత్వంలో పెంపొం దిస్తాడు?
    ఎ) నిర్దేశిత నాయకత్వం
    బి) అనుజ్ఞ నాయకత్వం
    సి) సహభాగి నాయకత్వం
    డి) సాధనోన్ముఖ నాయకత్వం
24. 302ను 32 అని చదివే గణితపరమైన అసామర్థ్యం?
    ఎ) డిస్ ఫేసియా
    బి) డిస్ కాల్కులియా
    సి) డిస్ గ్రాఫియా డి) డిస్ లెక్సియా
25. ప్రాజెక్ట్ పద్ధతిలో చివరి సోపానం?
    ఎ) ప్రాజెక్ట్ మూల్యాంకనం చేయడం
    బి) ప్రాజెక్ట్ నివేదించడం
    సి) ప్రాజెక్ట్ లక్ష్యాలు పరిశీలించడం
    డి) కార్యకలాపాలు సమీక్షించడం
26. బ్లూప్రింట్ పరిధిలోలేని అంశం?
    ఎ) విలువ బి) లక్ష్యం
    సి) ప్రశ్నలు డి) విషయం
27. హెర్బర్ట్ రూపొందించిన బోధనా ప్రణాళి కలో వరుస క్రమం?
    ఎ) సన్నాహం – సంసర్గం – ప్రదర్శనం – సాధారణీకరణం – అన్వయం – సింహావలోకనం
    బి) సన్నాహం – ప్రదర్శనం – సాధారణీకరం – సంసర్గం – అన్వయం – సింహావలోకనం
    సి) సన్నాహం – ప్రదర్శనం – సంసర్గం – సాధారణీకరణం – అన్వయం – సింహావలోకనం
    డి) సన్నాహం – ప్రదర్శనం – సాధారణీకరణం – అన్వయం – సంసర్గం – సింహావలోకనం
28. ప్రణాళిక బోధన పరిపుష్టి తర్వాత సూక్ష్మ బోధనా వలయంలో వచ్చే సోపానం?
    ఎ) పునఃబోధన బి) పునఃపరిపుష్టి
    సి) పునఃప్రణాళిక డి) సమీక్ష
29. అకస్మాత్తుగా జరిగే సంఘటనలు ఉన్నది ఉన్నట్లుగా నమోదు చేసి వ్యక్తి ప్రవర్తనను అంచనావేసే రికార్డు?
    ఎ) కేస్‌స్టడీ రికార్డ్
    బి) క్యుములేటివ్ రికార్డ్
    సి) ఎనక్డోటల్ రికార్డ్
    డి) ప్రాజెక్ట్ రికార్డ్
30. బహుళైచ్ఛిక ప్రశ్నలు ప్రధానంగా?
    ఎ) జ్ఞానం-పునఃస్మరణకు సంబంధించింది
    బి) జ్ఞానం గుర్తించడానికి సంబంధించింది
    సి) అవగాహన-వర్గీకరణకు సంబంధించింది
    డి) వినియోగం - ఊహించడానికి సంబంధించింది

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) బి; 5) సి;
6) సి; 7) బి; 8) ఎ; 9) బి; 10) సి;
11) సి; 12) బి; 13) బి; 14) ఎ; 15) సి;
16) డి; 17) డి; 18) సి; 19) ఎ; 20) బి;
21) బి; 22) బి; 23) సి; 24) సి; 25) బి;
26) ఎ; 27) సి; 28) సి; 29) సి; 30) బి.

అడ్మిషన్స్

క్లాట్-2025

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ.. యూజీ, పీజీ డిగ్రీ(ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) నోటిఫికేషన్ విడుదల చేసింది. నేషనల్ లా స్కూల్స్, యూనివర్శిటీలు ఆలిండియా స్థాయిలో ఏటా ఈ పరీక్షను నిర్వహిస్తాయి. ఇందులో ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సులు:** అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు (ఏడాది ఎల్‌ఎల్‌ఎం డిగ్రీ).

» **ప్రవేశాలు కల్పించే యూనివర్శిటీలు:** ఎన్ఎస్ఐయూ(బెంగళూరు), నల్సార్ (హైదరాబాద్), ఎన్ఎల్ఐయూ(భోపాల్), డబ్ల్యూబీఎన్‌యూజేఎస్(కోల్‌కతా), ఎన్ఎల్‌యూ(జోధ్‌పూర్), హెచ్ఎన్ఎల్‌యూ(రాయ్‌పూర్), జీఎన్ఎల్‌యూ (గాంధీనగర్), ఆర్ఎంఎల్ ఎన్ఎల్‌యూ(లక్నో), ఆర్‌జీఎన్‌యూఎల్ (పంజాబ్), సీఎన్ఎల్‌యూ(పాట్నా), ఎన్‌యూఏఎల్ఎస్(కొచ్చి), ఎన్ఎల్‌యూవో(ఒడిశా), ఎన్‌యూఎస్ఆర్ఎల్(రాంచీ), ఎన్ఎల్‌యూజేఏ(అసోం), డీఎస్ఎన్ఎల్‌యూ (విశాఖపట్నం), టీఎన్ ఎన్ఎల్‌యూ(తిరుచిరాపల్లి), ఎంఎన్ఎల్‌యూ(ముంబై), ఎంఎన్ఎల్‌యూ(నాగ్‌పూర్), ఎంఎన్ఎల్‌యూ(ఔరంగాబాద్), హెచ్‌పీఎన్ఎల్‌యూ (షిమ్లా), డీఎన్ఎల్‌యూ(జబల్‌పూర్), డీబీఆర్ఏఎన్ఎల్‌యూ (హర్యానా), ఎన్ఎల్‌యూటీ(అగర్తలా), జీఎన్ఎల్‌యూ(సిల్వస్సా).

» **అర్హత:** యూజీ కోర్సులకు కనీసం 45 శాతం మార్కులతో 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. పీజీ కోర్సులకు కనీసం 50 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2024.

» **క్లాట్–2025 పరీక్ష తేది:** 01.12.2024.

» **వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

‘వాతావరణ కాలుష్య సూచికలు’ అని వేటిని పిలుస్తారు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పోలియో వ్యాధి లక్షణం ఏది?
   1) తలనొప్పి 2) జలుబు
   3) ఒళ్లునొప్పులు 4) కండరాల పక్షవాతం
2. కింది వాటిలో వైరస్ ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులేవి?
   1) పోలియో, తట్టు
   2) గవదబిళ్లలు, జలుబు
   3) కలరా, టైఫాయిడ్ 4) 1, 2
3. పెన్సిలిన్ అనేది ఒక:
   1) సూక్ష్మ జీవి నాశకం 2) కీటక నాశకం
   3) బయోఫెర్టిలైజర్ 4) పైవేవీకాదు
4. మానవుడిలో ఆల్కహాల్ దేనిపై ప్రభావం చూపుతుంది?
   1) హృదయం 2) కండరాలు
   3) చర్మం 4) నాడీ మండలం
5. అయోడిన్ ఎక్కువ మొత్తంలో దేనిలో లభిస్తుంది?
   1) పాలు 2) మాంసం
   3) సముద్ర చేపలు 4) కూరగాయలు
6. సెల్యూలోజ్‌కు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఆహారానికి బరువునిస్తుంది
   2) ఖనిజ లవణం
   3) ఆహార నాళంలో ఆహారం సులువుగా కదలడానికి తోడ్పడుతుంది
   4) ఆహారంలో సెల్యూలోజ్ లేకపోతే పూర్తిగా జీర్ణం కాదు
7. ఆహార వాహికలోని కండరాలు..?
   1) నియంత్రిత కండరాలు
   2) అనియంత్రిత కండరాలు
   3) హృదయ కండరాలు
   4) నియంత్రిత - అనియంత్రిత కండరాలు
8. కింది వాటిలో ఇనుము, ఇతర ఖనిజ మూలకాలు అధికంగా కలిగి ఉండేవి ఏవి?
   1) పప్పు ధాన్యాలు 2) ఆకుకూరలు
   3) మాంసం 4) బంగాళాదుంప
9. శ్వాసక్రియ కింది వాటిలో దేని సమక్షంలో జరుగుతుంది?
   1) కాంతి 2) పత్రహరితం
   3) సరైన ఉష్ణోగ్రత 4) తేమ
10. మానవుడి దేహంలో ఉండే కేంద్రక రహిత సజీవకణాలు ఏవి?
    1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్త కణాలు
    3) నాడీకణాలు 4) కండర కణాలు
11. ఊపిరితిత్తులకు ఆమ్లజని రహిత రక్తాన్ని తీసుకొని వెళ్లే రక్తనాళం?
    1) పుపుససిర 2) పుపుస ధమని
    3) పూర్వ మహాసిర 4) దైహిక ధమని
12. దేనిలో అడ్డంకి ఏర్పడినప్పుడు గుండెపోటు సంభవిస్తుంది?
    1) పుపుస ధమని
    2) హృదయ/కరోనరీ ధమని
    3) హృదయ సిర 4) పుపుస సిర
13. కింది వాటిలో సరికానిది ఏది?
    1) రక్తం గడ్డకట్టకుండా ప్లాస్మా సేకరించవచ్చు
    2) రక్తం గడ్డకట్టిన తరువాతే సీరమ్‌ను సేకరిస్తారు
    3) ప్లాస్మాలో ఉండే కొన్ని ప్రోటీన్లు సీరమ్‌లో ఉండవు
    4) ప్లాస్మా నీలం రంగులో ఉండే ద్రవం
14. రక్త వర్గాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) రక్త వర్గాలను మొదట గుర్తించిన శాస్త్రవేత్త - కార్ల్ లాండ్ స్టీనర్
    2) ఆర్‌బీసీలపై ఉండే ప్రతిజనకాలు ఎ, బి ఆధారంగా ఎ, బి, ఎబి, ఒ అనే నాలుగు రకాల వర్గాలను గుర్తించారు
    3) ప్రతిజనకాలు లేని రక్త వర్గం - ‘ఒ’, ప్రతి రక్షకాలు లేని వర్గం - ‘ఎబి’
    4) పైవన్నీ సరైనవే
15. కింది వాటిలో కొంత మంది శిశువులు పుట్టిన వెంటనే మరణించడానికి కారణం ఏది?
    1) ఆర్‌హెచ్ కారకానికి ప్రతిరక్షకాలు ఏర్పడడం
    2) ఆర్‌హెచ్ కారకానికి ప్రతి జనకాలు ఏర్పడడం
    3) పైరెండూ 4) ఏదీకాదు
16. డయాలసిస్ యంత్రం ఒక:
    1) కృత్రిమ గుండె
    2) కృత్రిమ ఊపిరితిత్తులు
    3) కృత్రిమ కాలేయం
    4) కృత్రిమ మూత్రపిండం
17. శరీరంలో యూరియా ఏ భాగంలో ఉత్పత్తి అవుతుంది?
    1) మూత్రపిండాలు 2) ఊపిరితిత్తులు
    3) కాలేయం 4) పెద్దపేగు
18. హృదయ కండరం ఏ ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది?
    1) గ్లానీ 2) లయ బద్ధత
    3) సార్కొలెమ్మా 4) ఆకారం
19. అరేఖిత (నునుపు) కండరాలు ఏ భాగంలో ఉంటాయి?
    1) మెడ 2) కాళ్లు-చేతులు
    3) జీర్ణాశయం-మూత్రాశయం
    4) వేళ్లు
20. వరి నారు మొక్కలో ‘తెలివి తక్కువ మొలక’ (Foolish Seedling Disease) వ్యాధికి కారణమయ్యేది?
    1) వైరస్ 2) బ్యాక్టీరియా
    3) శైవలం 4) శిలీంద్రం
21. ఆల్ఫా, బీటా-ఇంటర్ ఫెరాన్‌లను ఉత్పత్తి చేసేవి ఏవి?
    1) వైరల్ సాంక్రమిక కణాలు
    2) మైక్రోఫేజ్‌లు 3) వైరస్‌లు
    4) టి-కణాలు
22. పారిశ్రామికంగా ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పదార్థాలు?
    1) కార్న్‌స్టార్చ్, మొలాసిస్
    2) షుగర్ బీట్‌లు, దుంపలు
    3) ద్రాక్ష 4) పైవన్నీ
23. చమురు కాలుష్యాన్ని నివారించడానికి ఉపయోగించే బ్యాక్టీరియా?
    1) ట్రైకోమోనాస్ 2) సుడోమోనాస్
    3) రైనోసీరాస్ 4) జాంతోమోనాస్
24. కింది వాటిలో సరికాని జత?
    1) గ్లియోబ్లాస్టోమా - మెదడు
    2) ఏంజియోసార్కోమా - రక్తం
    3) లింఫోమా - ప్లీహం
    4) ఎడినో సార్కోమా - గ్రంథి కణజాలం
25. ప్రకృతి వరణాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించిన వారెవరు?
    1) డార్విన్ 2) వీజ్‌మన్
    3) బెర్నార్డ్ కెటిల్‌వెల్ 4) సింప్సన్
26. మొక్కలతో సంశ్లేషణ చేయని విటమిన్?
    1) బి$_{12}$ 2) బి$_{6}$ 3) బి$_{1}$ 4) ఇ
27. కింది వాటిలో అత్యధిక జీవ వైవిధ్యాన్ని ప్రదర్శించే ఆవాసం ఏది?
    1) ఎడారులు 2) సమశీతోష్ణ అడవులు
    3) ఉష్ణమండల వర్షారణ్యాలు
    4) గడ్డి మైదానాలు
28. జీవ అనుఘటకాలు అంటే..?
    1) వినియోగదారులు మాత్రమే
    2) వినియోగదారులు, ఉత్పత్తిదారులు, విచ్ఛిత్తికారులు
    3) ఉత్పత్తి, వినియోగదారులు
    4) ఉత్పత్తి దారులు మాత్రమే
29. ‘జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం -కణం’ అని పేర్కొన్న శాస్త్రవేత్త?
    1) అరిస్టాటిల్ 2) రాబర్ట్ హుక్
    3) ష్లైడన్-ష్వాన్ 4) జార్జ్ మెండల్
30. కేంద్రక పూర్వ జీవుల కణంలో లోపించిన కణాంగాలు ఏవి?
    1) క్రోమోజోమ్స్ 2) మైటోకాండ్రియా
    3) ప్లాస్మామెంబ్రేన్ 4) రైబోజోమ్స్
31. ‘అల్లం’ మనం ఆహారంగా ఉపయోగించే భూగర్భకాండ రూపాంతరం. దీన్ని శాస్త్రీయంగా ఏమని పిలుస్తారు?
    1) రైజోమ్ 2) కందం
    3) దుంప 4) లశునం
32. జలగల పోషణ విధానం ఏది?
    1) హెర్బివోరస్ 2) ఇన్‌సెక్టివోరస్
    3) కార్నివోరస్ 4) సాంగ్వివోరస్
33. లివర్ సిర్రోసిస్‌కి కారణం?
    1) కొకైన్ 2) ఎల్‌ఎస్‌డీ
    3) ఆల్కహాల్ 4) మార్ఫిన్
34. జనటిక్ ఇంజనీరింగ్ ప్రయోగాల్లో చాలా ఎక్కువగా ఉపయోగించే రెండు బ్యాక్టీరియాలు?
    1) నైట్రసోమోనాస్, క్లెబ్సియెల్లా
    2) ఎశ్చరీషియా, అగ్రోబ్యాక్టీరియమ్
    3) నైట్రోబాక్టర్, అజటో బాక్టర్
    4) రైజోబియం, డిప్లోకోకస్
35. జతపరచండి.

శాస్త్రవేత్త	సిద్ధాంతం
i) డార్విన్	a) ఉపయుక్త- నిరుపయుక్త సూత్రం
ii) లామార్క్	b) జాతుల ఉత్పత్తి
iii) హ్యూగోడీవ్రీస్	c) జీవం ఆవిర్భావం
iv) ఎ.ఐ. ఒపారిన్	d) ఉత్పరివర్తన సిద్ధాంతం

    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-c, ii-a, iii-b, iv-d
    3) i-b, ii-a, iii-d, iv-c
    4) i-d, ii-c, iii-b, iv-a
36. కింది వాటిలో సరైంది?
    ఎ) అధిక కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం ఉండటం వల్ల క్లోరెల్లా శైవలాన్ని వ్యోమగాములు ఆక్సిజన్ కోసం అంతరిక్షానికి తీసుకెళతారు
    బి) శైవలాలన్నీ స్వయం పోషకాలే కానీ, సిఫాల్యురాస్ పరాన్న జీవి శైవలం
    సి) కణజాల వర్ధనంలో పోషక యానకాన్ని అర్ధ-ఘనస్థితికి మార్చడానికి ఉపయోగించే అగార్-అగార్ శైవలాల నుంచి సంగ్రహిస్తారు
    1) ఎ, సి 2) బి, సి
    3) ఎ, బి 4) ఎ, బి, సి
37. మిగతా జీవులతో పోల్చినప్పుడు మానవ మెదడులో ఏ భాగం బాగా అభివృద్ధి చెందింది?
    1) మెడుల్లా అబ్లాంగేటా
    2) అనుమస్తిష్కం 3) మస్తిష్కం
    4) దృష్టి లంబికలు
38. శ్వాసక్రియ, హృదయ స్పందన, పెరిస్టాలిక్ చలనం మెదడులో ఏ భాగం అధీనంలో ఉంటుంది?
    1) మెడుల్లా అబ్లాంగేటా
    2) మెడుల్లా అబ్లాంగేట, మస్తిష్కం
    3) మెడుల్లా అబ్లాంగేటా, అనుమస్తిష్కం
    4) అనుమస్తిష్కం
39. సాధారణంగా వార్షిక వలయాలను లెక్కించి వృక్షాల వయసు చెప్పవచ్చు. కానీ, కింది ఏ వృక్షాల్లో వార్షిక వలయాలు ఏర్పడకపోవడం వల్ల వయసు లెక్కించలేం?
    1) సమశీతోష్ణ ఆకురాల్చు అడవులు
    2) సమశీతోష్ణ సతత హరిత అడవులు
    3) ఉష్ణమండల ఆకురాల్చు అడవులు
    4) ఉష్ణమండల సతత హరిత అడవులు
40. అసురక్షిత లైంగిక సంపర్కం వల్ల సంక్రమించే వ్యాధులు ఏవి?
    1) సిఫిలిస్, గనేరియా
    2) హెర్పిస్, ఎయిడ్స్
    3) వైజైనెటిస్, ట్రైకోమోనియాసిస్
    4) పైవన్నీ
41. కింది వాటిలో తెల్ల రక్త కణాలు కానివి?
    1) న్యూట్రోఫిల్ 2) బెసోఫిల్
    3) త్రాంబోసైట్ 4) ఇసినోఫిల్
42. వివృత రక్త ప్రసరణ వ్యవస్థ దేనిలో ఉంటుంది?
    1) చేప 2) బొద్దింక
    3) ఆక్టోపస్ 4) నాటిలస్
43. వినత్రీకరణ బ్యాక్టీరియా ఏది?
    1) రైజోబియం 2) అనబీనా
    3) నాస్టాక్ 4) సూడోమోనాస్
44. జతపరచండి.
    కల్చర్స్
    i) ఆర్బోరికల్చర్ ii) టిష్యూకల్చర్
    iii) పోమీకల్చర్ iv) ఒలెరికల్చర్
    వివిధ రకాల మొక్కల పెంపకం
    a) కూరగాయలు
    b) కలపనిచ్చే మొక్కలు
    d) ఉద్యానవన మొక్కలు
    c) ఫలాలిచ్చే మొక్కలు
    e) పరీక్ష నాళికలో మొక్కలు
    1) i-b, ii-e, iii-c, iv-a
    2) i-b, ii-e, iii-a, iv-c
    3) i-e, ii-b, iii-a, iv-c
    4) i-a, ii-b, iii-c, iv-d
45. గ్లూకోజ్‌ను ఏమని పిలుస్తారు?
    1) గ్రేప్ షుగర్ 2) ఫ్రూట్ షుగర్
    3) లెవ్యూలోజ్ 4) ఫ్రక్టోజ్
46. ద్వివార దంత విన్యాసం, థీకోడాంట్, విషమ దంతస్థితి సాధారణంగా ఏ జీవుల్లో ఉంటుంది?
    1) చేపలు 2) సరీసృపాలు
    3) ఉభయచరాలు 4) క్షీరదాలు
47. శరీర జీవ క్రియారేటును నియంత్రించే ముఖ్యమైన అంతస్రావ గ్రంథి ఏది?
    1) పీనియల్ గ్రంథి 2) థైరాయిడ్ గ్రంథి
    3) పిట్యూటరీ గ్రంథి
    4) ఎడ్రినల్ గ్రంథి
48. ప్రోకారియేట్ జీవుల్లో ఉండే 70S రైబోసోమ్‌ల ఉపప్రమాణాలు?
    1) 40S - 40S 2) 60S - 40S
    3) 50S - 30S 4) 50S - 50S
49. అవయవదానం చేసే సమయంలో గ్రహీతకు ఇచ్చే సైక్లోస్పోరిన్ ఔషధాన్ని దేని నుంచి తయారు చేస్తారు?
    1) బ్యాక్టీరియా 2) ఫంగస్
    3) వైరస్ 4) మొక్కలు
50. కింది గృహ సంబంధ కాలుష్య కారణాల్లో ఎక్కువ రసాయన కాలుష్యాన్ని కలుగజేసేది ఏది?
    1) బొగ్గును మండించడం
    2) వంటగ్యాస్ మండించడం
    3) మస్కిటోకాయల్స్‌ను మండించడం
    4) రూమ్ స్ప్రేలు
51. ప్రపంచవ్యాప్తంగా ధ్వని కాలుష్యానికి అతి ముఖ్యమైన కారణం?
    1) సంస్థల పరికరాలు
    2) రవాణా వ్యవస్థ
    3) చెరుకు, వస్త్రాలు, పేపర్ మిల్లులు
    4) నూనె శుద్ధి కర్మాగారాలు, థర్మల్ పవర్ ప్లాంట్స్
52. సిగరెట్ పొగలోని పాలిసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?
    1) ఆక్సిజన్ రవాణాను తగ్గిస్తాయి
    2) రక్తపీడనం పెంచుతాయి
    3) కేన్సర్‌కు కారకమవుతాయి
    4) పిండం పెరుగుదల తగ్గిస్తాయి
53. ‘వాతావరణ కాలుష్య సూచికలు’ అని వేటిని పిలుస్తారు?
    1) లైకెన్లు, మాస్ మొక్కలు
    2) డాఫ్నియా 3) ఖైరోనోమస్ లార్వా
    4) పైవన్నీ
54. ఆహారంగా ఉపయోగపడే మొక్కలోని భాగాలకు సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) క్యారెట్ - భూగర్భకాండం
    బి) అల్లం - ఫలం
    సి) కాఫీ - పరిచ్ఛదం
    డి) శాఫ్రాన్ (కుంకుమ పువ్వు)- కీలాగ్రం
    1) ఎ, డి 2) ఎ, బి
    3) సి, డి 4) ఎ, బి, సి, డి
55. కింది వాటిలో సరికాని జత?

ఎముక పేరు	ఉండే భాగం
ఎ) హ్యూమరస్	- భుజాస్థి
బి) రేడియస్ అల్నా	- మోకాలు
సి) పాలింజెస్	- కపాలం
డి) ఫీమర్	- తొడ ఎముక

    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
    3) బి, డి 4) బి, సి
56. కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) పేలినాలజీ - పరాగ రేణువుల అధ్యయన శాస్త్రం
    బి) పేలియెంటాలజీ - శిలాజాల అధ్యయన శాస్త్రం
    సి) డెండ్రాలజీ - వృక్షాల అధ్యయన శాస్త్రం
    డి) డెండ్రోక్రోనాలజీ - వృక్షాల వయసు నిర్ధారించే శాస్త్రం
    1) ఎ, డి 2) బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి


సమాధానాలు

1) 4	2) 4	3) 1	4) 4	5) 3
6) 2	7) 4	8) 2	9) 3	10) 1
11) 2	12) 2	13) 4	14) 4	15) 1
16) 4	17) 3	18) 2	19) 3	20) 4
21) 1	22) 4	23) 2	24) 4	25) 3
26) 1	27) 3	28) 2	29) 3	30) 2
31) 1	32) 4	33) 3	34) 2	35) 3
36) 4	37) 3	38) 1	39) 4	40) 4
41) 3	42) 2	43) 4	44) 1	45) 1
46) 4	47) 2	48) 3	49) 2	50) 1
51) 2	52) 3	53) 4	54) 3	55) 4
56) 4				

At least some pens are books

BANK EXAMS

REASONING



Model Questions


Directions (Q. No. 1-10): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts. Read the following statements and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.

Give answer
1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or II follows.
4) If neither conclusion I nor II follows.
5) If both conclusions I and II follow.

1. **Statements:** No bird is a crow. Some crows are black.
   Conclusions:
   I) At least some birds are black.
   II) Some black which are crows are definitely not birds.
2. **Statements:** No pastry is a cake. No cake is tasty.
   Conclusions:
   I) All pastries are tasty.
   II) Some pastries being tasty is a possibility.
3. **Statements:** All towns are cities. Some cities are urban.
   Conclusions:
   I) At least some towns are urban.
   II) No town is urban.
4. **Statements:** All cars are black. All blacks are beautiful.
   Conclusions:
   I) All cars are beautiful.
   II) At least some beautiful things are black.
5. **Statements:** Some parrots are green. Some birds are parrots.
   Conclusions:
   I) At least some birds are green.
   II) All parrots being bird is a possibility.
6. **Statements:** Some cats are dogs. All dogs are foxes.
   Conclusions:
   I) At least some cats are foxes.
   II) All foxes being cats is a possibility.
7. **Statements:** All books are pens. No pen is a pencil.
   Conclusions:
   I) Some books being pencils is a possibility.
   II) At least some pens are books.
8. **Statements:** All students are teachers. All teachers are readers.
   Conclusions:
   I) All readers may be teachers.
   II) Some readers can never be teachers.
9. **Statements:** No cup is a plate. No plate is a coin.
   Conclusions:
   I) No cup is a coin.
   II) Some coins are cups.
10. **Statements:** Some boys are honest. Some intelligent are boys.
    Conclusions:
    I) All honest being intelligent is a possibility.
    II) All boys are not intelligent.
11. If 'R' denotes '–'; 'Q' denotes '×'; 'W' denotes '÷'; and 'A' denotes '+', then
    42 W 7 R 8 A 6 Q 4 = ?
    1) –22 2) –168 3) 22
    4) 28 5) None of these
12. Mohan walked 30 metres towards South, took a left turn and walked 15 metres. He then took a right turn and walked 20 metres. He again took a right turn and walked 15 metres. How far is he from the starting point?
    1) 95 metres 2) 50 metres
    3) 70 metres
    4) Cannot be determined
    5) None of these
13. What should come next in the following letter series based on English alphabet?
    CEA IKG OQM ?
    1) STW 2) WUS 3) SWU
    4) UWS 5) None of these
14. The positions of how many digits in the number 59164823 will remain unchanged after the digits are rearranged in descending order within the number?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
15. What should come next in the following letter series?
    P Q R S T A B C D E P Q R S A B C D E P Q R S A B C D P Q
    1) R 2) T 3) A
    4) B 5) None of these
16. In a certain code language, 'how can you go' is written as 'ja da ka pa', 'can you come here' is written as 'na ka sa ja' and 'come and go' is written as 'ra pa sa'. How is 'here' written in that code language?
    1) ja 2) na 3) pa
    4) Data inadequate
    5) None of these
17. How many such pairs of letters are there in the word TRIBUNAL each of which has as many letters between them in the word as in the English alphabet?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
18. In a certain code DOWN is written as '5@9#' and NAME is written as '#6%3'. How is MODE written in that code?
    1) %653 2) %@63
    3) %5@3 4) %@53
    5) None of these
19. How many meaningful English words can be formed with the letters 'LGEU' using each letter only once in each word?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
20. In a certain code THRIVES is written as SIUHRDU. How is SOULFUL written in that code?
    1) VPTKKTE 2) VPTKETK
    3) TPVKKTE 4) TNRKMVG
    5) None of these


Explanation

1. 2;



Only II follows.

2. 2; Possible Venn-diagram is




Thus only II follows.

3. 3; Possible Venn-diagrams are




Thus, either I or II follows.

4. 5;




Thus, both I and II follow.

5. 2; Possible Venn-diagram are




Thus, only II follows.

6. 5; A possible venn-diagram is




Both I and II follow.

7. 2; A possible venn-diagram is




Only II follows.

8. 1; A possible venn-diagram is




Thus, only I follows.

9. 3;



Thus, either I or II follows.

10. 1; A possible Venn-diagram is



Thus, I follows.

11. 3; 42÷7–8+6×4 = 6–8+24 = 22
12. 2;
13. 4; Move six letters forward respectively.
14. 3; digits 4 and 2
    The number: 5 9 1 6 4 8 2 3
    In descending Order: 9 8 6 5 4 3 2 1
15. 1; PQRST/ABCDE/PQRS/ ABCDE/PQRS /ABCD/PQR
16. 2; how can you go = ja da ka pa ... (i)
    can you come here = na ka sa ja ... (ii)
    come and go = ra pa sa ... (iii)
    From (i) and (ii), can you = ja ka .... (iv)
    From (ii) and (iii), come = sa ... (v)
    Using (iv) and (v) in (ii), we get here = na.
17. 5;
    T R I B U N A L
18. 4;
    D O W N A M E
    5 @ 9 # 6 % 3
    ∴ MODE ⇒ % @ 5 3
19. 2; GLUE
20. 1;